


ఉషోదేవి

చిత్రకారుడు: శ్రీ హెచ్. వి. రామగోపాల్.

విరోధి సం. భారతి. సంపుటము-26
ఆశ్వయుజ మాసం. సంచిక-10.



విరోధి సం.
ఆశ్వయుజము

భారతి

సంపుటము 26
సంచిక 10

బాపూజీ

౧

ఏ రాజయోగియాస్యేందుమండలముపై నమృతదీధితు లజస్రము నటించు
నే శాంతిదూతసందేశమార్గమునందు వలపుటచ్చరకన్నెకలు చరింతు
రే విశ్వజీవి కాలిడిన-చోటుల దరిద్రత కన్నుమోడ్చి నిద్రను వహించు,
నే మహాత్ముని పూర్ణశేముషీమహిమచే మతము రాజరిక మైక్యతను పొందు
నే విశారదు పాదరాజీవములను - తాకి హర్షించి గర్వించు లోకవితతి
అతడు శ్రీగాంధిమౌని ప్రత్యహము మనకు-నఖిలళోత్సాహదాయకుం డగునుగాక!
సిలువ రెండవ పంటగా, చేయ మిగిలి-నట్టి కార్యమ్ము దీర్పగా నవతరించి
తనువు చాలించినట్టి తథాగతునిగ - దలచి బాపూజి నెల్ల వేళల స్మరింతు.

—కోమరవోలు వెంకటసుబ్బారావు

౨

త్రిపురాసురులఁ గూల్చి దేశముల్ ప్రోచిన దేవుఁడే తగు మహాదేవుఁ డనఁగఁ
గొడుకుసృష్టినిఁ దాను గోమ రొప్ప నేలెడు విష్ణువే తగు మహావిష్ణు వనఁగఁ
బూని సుధర్మాన ముదమున భాసిల్లు నింద్రుఁడే తగును మహేంద్రుఁ డనఁగ
ముగురుమూర్తులకును మోదంబుఁ జేకూర్చు శక్తియే తగు మహాశక్తి యనఁగ
పరమమునిబుధనిలయమౌ భారతీయ-దేశమునకే తగును మహాదేశమనఁగ
మాతృసేవాపరాయణమానసుండ-వయ్య! నీకే తగును బో మహాత్ముఁ డనఁగ.

—పాతాళభేది సుబ్రహ్మణ్యకవి

కవిమూర్ధన్యాభినందనము*

శ్రీ మోచర్ల రామకృష్ణయ్య

నవమందారసుమావళిఁ వరమరున్నారీగణ మ్మో మహో
త్సవవేళఁ దివినుండి యాంధ్రకవిమూర్ధన్యోత్తమాంగంబుపై
జివురుం జేరల జల్లుచుందు రని తోఁచెన్- సత్యమా - కాని వో
గవియుం గల్గునె యియ్యెడన్ మనల నీ కల్యాణసౌరభ్యముల్ !

ప్రతిభావృద్ధుడు చెళ్లపిళ్లకవిమూర్ధన్యుండు త్రైలింగవా
క్పతి కాస్థానకవీంద్రు డయ్యెనని యుత్సాహించి కావించు మా
జతనంబుల్ దివినుండి చూచెదు సురాచార్యుండు కల్యావచ
స్తతి వర్షించుచు నున్నవాడు సుమనస్సౌభాగ్య మిల్లేర్పడఁ !

"కవి యంచుం మఱి కావ్యుడంచు బడయంగా గల్గితిఁ బేరు - ని
క్కువమే - మామకశిష్యవర్గముల నొక్కండేని నాపేరు గా
రవముం నిల్పకపోయె నాంధ్రకవిమూర్ధన్యా, భవచ్ఛిష్యు ల
గ్గువగా సత్కృతులైరిగా" యనుచు శుక్రుం డల్లదే మ్రొక్కెడిఁ !

భరతక్షోణి కహర్ముఖం బిది - శుభస్వాతంత్ర్య కాసారమం
దరవిందంబులు విచ్చుచున్న విపుడే - యామోద మీవంక కి
ట్లరుదేరఁ దయివాఱె హాయి మన కాహా, దేశభాషాకవీ
శ్వరు డొందెఁగద రాష్ట్రమంత్రికృతపూజల్ తొంటిచందంబునఁ !

ప్రథమం దుర్మదకింకవిద్విరదహర్యక్షుండుగా వెల్గి ని
ర్మథితారాతిగ దెల్గునాట గవితారాజ్యంబు శాసించి, తా
ప్రథమాస్థానకవీంద్రు డయ్యె నిపు డాంధ్రబ్రహ్మ, కబ్రంబె ! త
త్పృథుమేధానిధి కేను సింహపురవర్తిఁ జోత లర్పించెదఁ.

---

* బెజవాడయందు గడచిన నెలలో జరిగిన మహాసభలో చదివినవి.

నన్నయ్యగారి ప్రసన్న కథా కలితార్థయుక్తి

(ప్రధాన కథ ౪. ద్యూతము-పరిశిష్టము)

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ

మరియు నీ ద్యూతము జరిగినన్నాళ్లు పాండవు లెందుండిరి? పాండవులు దుర్యోధనునకు దాసులయిరి. ఈ దాసకృత్యము చేసిరా? చేయవలయు నని నియమింపబడిరా? నామకః దాసులే గాని యట్టి నియమము లేదు. నిజముగా దాసకృత్యము చేయవలయునని యాజ్ఞాపింపబడినచో యుద్ధ మప్పుడే జరిగెడిది. వారిని పరాభవించి తేజోవిహీనులుగా జేసి యూరకుండుటయే దుర్యోధనాదులు చేయగల్గిన పని. జూదమాడబడినది. వారి సంపదయు, రాజ్యమును తీసికొనబడినది. ద్రౌపదీ మానభంగము జరిగినది. దుర్యోధనునకు గావలసిన దింతియే. నిజముగా వారిచేత దాస్యము చేయింపడు. చేయించుట సాధ్యము గాదు. దానికి వేరే ప్రయత్నము చేయవలయును. చేసినచో నది దీనికంటె నెక్కువ యపాయకరము.

పాండవులు హస్తినలో నున్నప్పుడు వా రైదుగురకు నైదు మేడలు. ద్రౌపదికి నంతఃపురములో వేరే నివసనము. ఇది యేర్పాటు చేయబడియుండును. వారు తమ మేడలలో నుందురు. ధృతరాష్ట్రుడు ద్రౌపదిని రావించి వర మిచ్చెను. ఈ ద్రౌపదిని రావించినప్పుడు ద్రౌపదివచ్చుచున్నదని పాండవులకు దెలియదు. తెలిసినచో నెందు కని తర్జనభర్జనలు జరిగియుండును.

ఆమె రెండువరము లడిగినది. ధృతరాష్ట్రుడు వాని నిచ్చెను. మూడవవర మడుగు మనెను. క్షత్రియసతి మూడవవర మడుగగూడదని ద్రౌపది చెప్పెను. "అనిన ధృతరాష్ట్రుండు కోడలిగుణంబులకు, ధర్మం బెరుంగుటకు సంతసిల్లి, యనుజసహితుండైన యుధిష్ఠిరు రావించి, ధర్మరాజునకు పాండురాజ్యంబునందు సమర్పించిన" "దానినంతయు భీమసేనుండు విని" "మృగమధ్యంబున నున్న సింహంబునుంబోలె ననుజమధ్యంబున నున్న యాతని కరతలంబున వారించి ధర్మరాజు."

"ఇట దుశ్శాసనుచేత నంత వృత్తాంతంబును విని దుర్యోధనుండు కర్ణశకునిసైంధవులతో విచారించి ధృతరాష్ట్రుపాలికిం జని."

—ఈ యీవాక్యములు కించిత్కించిద్వ్యవహితములుగా గ్రంథమునం దున్నవి.

అనుజసహితుండయిన యుధిష్ఠిరు రావించి— ఈ అనుజులలో భీము డున్నాడా? లేడా? యని ప్రశ్న. ఉన్నచో "దానినంతయు భీమసేనుండు విని" యన్న ప్రసక్తి లేదు. ఇందుచేత ధృతరాష్ట్రుడు రమ్మనగా భీముడు రాలేదు. నేను రా ననెను. ధర్మరాజునకు ధృతరాష్ట్రుడు తిరిగి రాజ్య మిచ్చెనన్న విషయము భీమునకు దరువాత దెలిసెను. అప్పు డతనికి గోపము వచ్చెను. ఇట్టి యర్థము పొసగుటకు నన్నయ్యగారు కథ చెప్పుచు భిన్నవిషయములను వ్యవహితము చేయుట హేతు వగుచున్నది.

పాండవులకు దిరిగి రాజ్య మిచ్చెనన్న సంగతి, వారింద్రప్రస్థమునకు దిరిగిపోయిన సంగతి దుశ్శాసనుడు చెప్పగా దుర్యోధనునకు దెలిసెను.

ఈ పరిస్థితులచేత నొకటి యవగత మగుచున్నది. ఆ రాజగృహము లుండు ప్రదేశము బహువిశాలమయినది. ఒకచోట జరిగిన సంగతి మరి యింకొకచోట దెలియదు.

ధృతరాష్ట్రుడు ద్రౌపదికి వరము లిచ్చిన స్థలము మహాసభలో గాదు. ఇది యాయనగృహములో జరిగిన ట్లుండెను. సకలబాంధవహితంబు సేయందలంచి యిట్లు చేసెను. అనగా నప్పుడు బంధువుల నందరను బిలిపించియుండకలదును. అందరును రాచవారే. వేరి గృహములు వారివి. పిలిపింపబడక యెవ్వరును బోరు.

ఇది యొక విచిత్రమయిన రాజగృహము. రాజ రాజనరేంద్రుని కోటలో నిట్లుండెడిదేమో! దాని నంతయు నన్నయ్యగారు చిత్రవిచిత్రములుగా వ్యంగ్య భూతముగా దిన కావ్యమునందు విరచించెను.

నన్నయ్యగారి కావ్యము నిట్లు చూడవలసిన యవసర మున్నది. నన్నయ్యభారతములో క్షత్రియు లెవ్వరు మాటాడినను మిక్కిలి స్వల్పముగా మాట్లాడు దురు; విస్తరించి మాటాడరు. ఇది యొక రాచశీవి. దీనికి నన్నయ్యగారి యందు బహూదాహరణములు గలవు. ఆయన ధర్మరాజాదిపాత్రములను తీర్చిన తీర్పే యిది. అందరు నభిమానవంతులు. ఎంత యవసరమో యంతియే మాటాడుదురు.

నాల్గయిదుమాటలలో ననంతమయిన యర్థమును జెప్పుట మహాశిల్పమని కొంద రందురు. న్యాయమే. అట్టి శిల్పము నన్నయ్యగారియందు పొందిన యవధిని మరి యెచ్చటను బొందలేదు. నా వ్రాసిన యీ సర్వోప న్యాసములు దీనికే యుదాహరణములు.

ద్రౌపదిని దుశ్శాసనుడు పట్టుకొని లాగబోయి నపుడు "కృష్ణ పంకజాక్షి కడు భయంబు నొంది గాంధారియొద్దకు నరిగె" ఇట్లు తల్లి దగ్గర దాగియున్న ద్రౌపదిని దుశ్శాసనుడు జుట్టుపట్టుకొని సభకు లాగికొని వచ్చెను. పసిపిల్ల లయాటలలోగూడ తల్లిదగ్గర దాగిన వానిని దాకి యాడించరు. ఇంక నీ దుశ్శాసనుని దౌర్జన్యము నేమని చెప్పవలయును? ఈ యొక్క మాటతో దుశ్శాసనుని దౌర్జన్యము, క్రూరత్వము, పశుత్వము వెల్లడించబడెను.

ద్రౌపది కట్టుపుట్టము లొలిచిరి.

"ఇది సేయగా దని మది విచారింపక
సద్గర్హితుండు దుశ్శాసనుండు
నెట్టన ద్రౌపదికట్టినపుట్టంబు
సభలోన విడ్చె నాశంక లేక
యుడుగక యొలువంగబడియును మున్నపనీత
మైన తద్వస్త్రంబునట్టి వలువ
లలితాంగిజఘనమండలమున బాయక
యెప్పుచు నున్న నయ్యవిధ జూచి
సభ్యు లెల్ల నద్భుతసమ్మదు లయిరి దు
శ్శాసనుండు వస్త్రచయము పర్వ
తోపమానమయిన నొలువంగనోపక
యుండెగ లజ్జబొంది యుక్కు దక్కి."

ఈ పద్య మొక యాశ్చర్యమైన విషయము. మహాకవిని చదువుట కొంచెము కష్టము. స్థూలముగా జదువుచుబోయినచో నత డేమి చేసెనో యెప్పుడును దెలియదు. సూక్ష్మముగా జూచినగాని యాయన హృదయము గోచరించదు. ఇచట ద్రౌపదీమానభంగము చేయవలయు నని దుర్యోధనాదుల సంకల్పము. అనగా నామె నిండుసభలో వివస్త్రగా నిలిచియుండవల యును. కాదయేని యామెశరీరావయవము లనాచ్ఛాది తములై కొంతకు గొంతయయిన గనిపించవలయును.

ఈ భారతమున రెండే విషయము లద్భుతము లున్నవి. అవి శ్రీకృష్ణదేవుని పరమేశ్వరత్వసూచక ములు. ఒకటి ద్రౌపదీవస్త్రాపహరణము. రెండవది రాయబారపు ఘట్టమున విశ్వరూపప్రదర్శనము. ఈ రెంటిలో మొదటిది నన్నయ్యగారిచేతిలో బడినది. ఈ సందర్భమున నన్నయ్యగారు కృష్ణుని ప్రసక్తి చేయలేదు. ద్రౌపదీదేవియొక్క వస్త్రచయము "పర్వ తోపమానమయిన నొలువంగనోపక, దుశ్శాసనుండు లజ్జ పొంది యుక్కు దక్కి యుండెగాన,"

ఒకటి మొదట లజ్జపడెను. రెం డుక్కు దక్కెను. తా నేదో మహాఘనకార్యము చేయవలయు ననుకొనెను. అట్టి దుష్టులయొక్క యూహలు ఫలింప నప్పుడు సిగ్గుపడుట తప్ప మరి యేమియు జేయలేరు. ఉక్కుదక్కుట యెందులకు? ఇం త కు మిం చి యేమియు జేయలేడు. ద్రౌపది దానికనుక నామెకట్టిన చీరయు వెలగల ధనముగనుక నది తమ సొమ్ము. తాము తీసికొనవచ్చు నన్న మిషచే నీ దురుద్యోగమున

కుపక్రమించెను. ఇంతకుమించి యేమి చేసినను ప్రాణాపాయము. అసలు లజ్జచే క్రుంగుడుపడెడువానికి మరి యే యితరమయిన యూహయు రానేరాదు. వా డంత నిస్తబ్ధు డయిపోయెను.

ఒలువబడిన వస్త్రములు పర్వతోపమానములై యుండెను. ఎందు కున్నవి ? కారణ మేమి ? ఇది ప్రకృతిలో జరుగు పని కాదు. ఈ మహైశ్వర్యమునకు హేతు వేమో తాను చెప్పడు. చెప్పినచో వ్యంగ్య వైభవమంతయు నశించిపోవును. ఆయన చెప్పనేలేదు. ఈ గ్రంథము చదువుచుండగా నన్నయ్యగారు దీనిని చెప్పలే దని యెవ్వరు ననుకొనరు. చెప్పలేదని తెలిసి కొనుటకు ప్రయత్నము కావలసియున్నది. ఇక్కడ చెప్పుట మిక్కిలి యనవసరము. సర్వమానవులకు, సర్వ పాఠకులకు ద్రౌపది తత్కాలమున శ్రీకృష్ణధ్యానము చేసెను. పరమేశ్వరు డామె ని ట్లనుగ్రహించె నని తెలియును. ఇది యందరి మనస్సులలో నిండియున్న భావమే. నన్నయ్యగారికంటె నే త్రసరేణు మాత్రమయినను దక్కువయయిన కవి యయినచో ద్రౌపదిచేత కృష్ణస్తోత్రము చేయించియుండును. ఇది భగవన్మహిమ యని విస్తరముగా నుపన్యసించి యుండును. అట్లు చేసినచో రసభంగ మయితీరును. ఒక మహాదుర్వ్యవసాయము జరుగుచున్నది. పాఠకుని మనస్సు దానియందు లగ్నమయియున్నది. లౌకికపరిస్థితులు రసహేతువులయినట్లు దైవికవిషయములు గావు. కావ్యప్రపంచమున భక్త్యాదుల ప్రసక్తి తక్కువ. పరమేశ్వరమహిమాభివర్ణనము, తన్మహిమజనితమహైశ్వర్యములు పతితయొక్క మనస్సును వ్యభిచారిసాత్త్వికాది భావములనుండి మరలించి భగవంతునిగూర్చి యూహింప జేయును. అపుడు కావ్యత్వము నశించును. కావ్యము చర్వణశీల మయినది. భక్తి తద్భిన్నమయిన మననశీల మయినది. కావ్యార్థమననమునకు, భగవత్సంబంధమయిన మననమునకు భేద మున్నది. కావ్యార్థమననము రసహేతువు. భగవత్సంబంధమయిన మననము వైరాగ్యహేతువు.

ఈ సందర్భమున భక్తికి గూడ రసత్వపట్టాభిషేకము చేయవచ్చు నను కొందరు లాక్షణికుల ప్రసక్తిని నే నెత్తుటలేదు. నన్నయ్యగారు దానికి వ్యతిరేకు లని తెలియుచున్నది. ఇదియు గాక నన్నయ్యగారి కిచట శ్రీకృష్ణదేవుని ప్రసక్తి మరియొకదృష్టితో గూడ నదలి యుండవచ్చును. అది రసమే కావచ్చును. అయినచో నీ ద్రౌపదీవస్త్రాపహరణసందర్భమున నున్న రసభావమున కది యంగ మగునా ? భక్తి యెప్పుడును తక్కిన రసములను విరచును. ఒకవేళ నది రసమయినచో దానిని గూర్చి ప్రస్తావించినంతనే యది రాజయి కూర్చుండి ప్రధానరసమును సేవకుని జేయును. భక్తి యెప్పుడు నంగము కాదు. అది యంగిగా భాసించును. భాసించినచో ప్రధానరసము భంగమగును. ఈ రసవిషయము నిట్లు వదలి వస్త్రాపహరణసందర్భమున మానభంగము జరుగకపోవుటయందలి యౌచిత్యమును విచారింతము.

వివస్త్రత్వము పేరు నగ్నత్వముగా నాధునిక ప్రపంచమున సమృద్ధిగా ప్రచారము జరిగియున్నది. ఈ నగ్నత్వ మన నేమి ? అచ్చముగా వివస్త్రత్వమే నగ్నత్వమా ? శరీరాంచలములు కనిపించుటయు నగ్నత్వమే. పెనుగాలికి వసనము తొలగినచో లోకులు పరిహసింతురు. పాశ్చాత్యస్త్రీలు కొందరు నగ్ననృత్యము చేయుదురట. అపుడు వారు నిజముగా నగ్నలు కారు. శరీరవర్ణమువంటి వర్ణము గలిగిన దుస్తు లొడలి కంటుకొనినవి ధరింతురట. మరి యింక నగ్నత్వ మేమి ? ఊరు, కటి, జఘనప్రదేశములు వివస్త్రముగా గన్పించుటయే నగ్నత్వమా ? శరీరాంచలరేఖలు కన్పించుట నగ్నత్వమా ? శరీరాంచలరేఖలు కన్పించుట నగ్నత్వము. అట్లు కన్పించునట్లు వస్త్రములు ధరించుట యనాగరకత. అందుకని యొడలి నంటుకొను లాగూ ధరించుట యనాగరకత. అది యొకవిధమయిన యనాగరకత. ఆధునికపాశ్చాత్యస్త్రీల దుస్తులు శరీరాంచలరేఖలు తెలియజేయున ట్లుండును. ఇది యొకవిధమయిన నగ్నత. అందుచే ననాగరకత. భారతదేశమునందలి స్త్రీపురుషులు ధరించు దుస్తులు కుచ్చెళ్ళతో, ముడుతలతో గటిప్రదేశాదులను సుపరామృష్టముగ గోపనము చేయును.

ఈ పై పద్యమున "మున్న పనీతమయిన తద్వస్త్రమ్ము నట్టి వలువ లలితాంగిజఘనమండలమున

బాయక యొప్పుచున్న"యని నన్నయ్యగారు వ్రాసిరి. ఇదివర కొలువబడిన యా చీరవంటి చీర యా జఘనమండలము బాయక ప్రకాశించుచుండెను. గాలిచేత దొలగి మరల పిహితమయిన రొండములో లిప్తకంటె దక్కువకాలమున గూడ పరిహాసము జరుగుచున్నది. అంత రొండము కూడ లేదు. దుశ్శాసనుడు చీర లాగెను. ఈ చీర లాగబడకముందే యచట వేరొక చీర యుండెను. మానభంగ మేమియు జరుగలే దని యర్థము. ఇది యింతకంటె నధికముగా నున్నది. ఏ చీర యొలువ బడెనో యా చీరవంటిదే మరియొక డచట నుండెను. అచట నున్న చీర మరియొకవిధమయిన చీర యయినచో నీ చీర తొలగింపబడుట, మరియొక చీర వచ్చుట యన్న వ్యవధానము మనసులోనయిన గలుగును. ఇచట నది కూడ లేదు.

ఇచట జఘనమండలమనుటచేత జఘనమే కాదు; కటిప్రదేశాదులకు గూడ నిది యుపలక్షకమయిన శబ్దము. ద్రౌపదీమానభంగ మనునది కించిత్తయినను జరుగలేదు. చూచుచున్నవారికి కా యూహయే కలుగ లేదు. దుశ్శాసను డామెచీర యొలిచినట్లే లేదు. గాలిలో చేతు లాడించిన ట్లున్నవి. ఒక్కటియే భేదము. అతని చేతు లాడినప్పుడెల్ల నతని చేతిలో నొక క్రొత్త చీర కన్పించుచుండెను. అది ద్రౌపదిశరీరముమీదనుండి లాగినట్లు గన్పించుచుండెను. ఇది దీని పరమార్థము.

ఈ మహారహస్యమును నన్నయ్యగారు సాధించుట కేమి చేసెను? "ము న్నపనీతమయిన తద్వస్త్రమ్మునట్టి వలువ లలితాంగిజఘనమండలమున బాయక" యన్న నాల్గుమాటలచేత నీ మహార్థమంతయు బుట్టుచున్నది. నన్నయ్యగారు నగ్నత్వమునగా విచారణ చేసినాడు. ఆ నగ్నత్వమే యంశమునందును రేఖామాత్రముగ నయిన పట్టకుండ నీ మాటల నుపయోగించెను.

మఱియొక విశేషము. ద్రౌపదీమానభంగము చేయ సమకట్టిన దుశ్శాసనుని జూచి భీముడు చేసిన ప్రతిజ్ఞ యిది:—

"కురువృద్ధుల్ గురువృద్ధబాంధవు లనే
కుల్ సూచుచుండగ మదో
ద్ధురుడై ద్రౌపది నిట్లు చేసిన ఖలున్
దుశ్శాసనున్ లోకభీ
కరలీలన్ వధియించి తద్విపులవ
క్షశ్శైలరక్తౌఘని
ర్ఝర ముర్వీపతి చూచుచుండ వని నా
స్వాదింతు నుగ్రాకృతిన్."

మఱియు దుర్యోధనుడు ద్రౌపదిని తన యూరు తలము నెక్కగా రమ్మని సంజ్ఞ చేసినపుడు—

"ధారుణీరాజ్యసంపద
దంబున కోమలి కృష్ణ జూచి రం
భోరు నిజోరుదేశమున
నుండగ బిల్చిన యి ద్దురాత్ము దు
ర్వారమదీయబాహుపరి
వర్తితచండగదాభిఘాతభ
గ్నోరుతరోరు చేయుదు సు
యోధను నుగ్రరణాంతరంబునన్."

ఈ రెండు ప్రతిజ్ఞలు విచిత్రముగా నున్నవి. వీని రొమ్ము నెత్తురు త్రావెదను. వీని తొడలు విరుగ గొట్టెదను. ఇంతవరకు న్యాయమే. ఎప్పుడు? మొదటి పద్యములో 'అనిన్'—అనగా యుద్ధమునం దనియు, రెండవ పద్యములో 'ఉగ్రరణాంతరంబునన్' అనియు నున్నది. ఈ యుద్ధప్రసక్తి యెట్లు? పాండవులు కౌరవులకు దాసు లయిరి. ఈ ప్రతిజ్ఞలు రెండును చేసి నప్పుడు యుద్ధప్రసక్తి లేదు. యుద్ధము జరుగుటకే వీలులేదు. వారి రాజ్య మొడ్డుకొన్నారు. జీవితాంతము పాండవులు దాసులుగా నుండవలసినదే. రెండవసారి ద్యూతమునకు వరణ్యాజ్ఞాతవాసముల నిబంధన యున్నదిగాని మొదటి జూదమునకు లేదు. అప్పుడీ యుద్ధము, తొడలు విరుగగొట్టుట వ్యర్థప్రలాపములుగా గన్పించుచున్నవి. మొదటి ప్రతిజ్ఞ చేసిన తర్వాత "అతని యతిమానుషంబయిన మహోగ్రవ్యవసాయంబున కద్భుతంబంది దిక్కులు సూడక ధిక్ఛబ్దముఖరితముఖు లగుచు సభాజనులు" ఉండిరి.

రెండవసారి ప్రతిజ్ఞ చేసినతర్వాత భీముడు "సర్వజనభయానకక్రోధావేశవివశుండై యాయుధమ్ము లున్న వలనికి దృష్టులు సలుపుచు నగ్రజు మొగంబు సూచుచున్న భీమసేనుని"అని యున్నది. మొదటి

దెట్లయినను రెండవ ప్రతిజ్ఞలోని స్థైర్యము భీముని యొక్క క్రోధావేశవివశత్వ మని నన్నయ్యగారే చెప్పిరి.

నన్నయ్యగారిలోని యర్థములు మన మెంతో విచారించినను వాని నాయన మనకంటె పూర్వమే విచారించియుండును. భారతకథలో నున్న సర్వరహస్యములు పరిస్థితులలో నున్న మర్మములు నన్నయ్యగారాలోచించిరే యెచ్చట నే రహస్యము నిక్షేపింపబడియున్నదియో తెలిసికొనియే వ్రాయును.

ఇది వట్టి కోపావేశమయినను జరిగిన పరిస్థితిని బట్టి వారికి వీరికి యుద్ధము కాక తప్పదను నొక మహాశంక—నిశ్చయప్రాయమైనది సర్వజనుల హృదయాంతరాళములయం దుండియేయున్నది. ప్రత్యేకముగా భీముడు కౌరవులతో మరల పొత్తుకలిగించుకొనుటకు నిష్టపడడు. అట్టి భీముని మాట లివి. అందుకనియే మరల ధృతరాష్ట్రుకు రాజ్యము నిచ్చివేయగా "రాజ్యసంప్రాప్తి పాండవసత్తములకు సతికారణంబున ధృతమయ్యె నను నింతకంటెను కష్టమ్ము కలదె యొండు" అని "శత్రువరుల నుగ్రసంగరమ్మున జంపి కుతలరాజ్యమెల్ల గొందు ననుచు మృగమధ్యంబున నున్న సింహంబునుంబోలె మనుజమధ్యంబున నున్న" అని వ్రాయబడెను. సేవకులయియున్న వీరికి యుద్ధము సేయు నర్హత లేదు. ధర్మరా జతనిని వారించెను. మొదటిసారి ప్రతిజ్ఞలు చేసినపుడు భీముడు యుద్ధమున కింత సిద్ధపడలేదు. దుర్యోధనుని తొడలు విరుగగొట్టెదనని యాయుధమ్ములున్న వలనికి దృష్టులు సలుపుచు నగ్రజుమొగంబు చూచెను. అపుడు భీష్మ, విదుర, ద్రోణాదు లాపిరి. మొదటిసారి ప్రతిజ్ఞ చేసి యూరకుండెను. ధృతరాష్ట్రుకు రాజ్య మిచ్చినతర్వాత కౌరవులను చంపుదు నని వాచ్యముగా చెప్పెను. ఈ మూడుభేదములు చమత్కారముగా నున్నవి. మనకు చూచినచో ద్రౌపది వస్త్రము లొలుచుట మిక్కిలి దుర్భరము. తన తొడ మీద గూర్చుండర మ్మనుట దానికంటె తక్కువది. ద్రౌపదివలన రాజ్యము మరల వచ్చుట తత్పూర్వము గల రెంటికంటె దక్కువది. కాని భీము డొకదాని కంటె నొకదానికి నుత్తరోత్తర మధికాధికకోపము పొందుచున్నట్లు కాన్పించుచున్నాడు. అతని కోప ముత్తరోత్తరబలీయ మని చెప్పుటకు గారణము-మొదటి ప్రతిజ్ఞ చేసి యూరకుండెను. రెండవ ప్రతిజ్ఞ చేసి యాయుధాగారమువంక జూచెను. మూడవసారి వాచ్యముగా చెప్పి వెంటనే యుద్ధముచేయుటకు బయలు దేరబోవుచుండెను. ఇవి కారణములు. మొదటిసారి తాను ప్రతిజ్ఞ చేసెనుగాని వెంటనే కౌరవులను చంపు నూహ వెలిపరుచనే లేదు. అప్పు డతని కా యూహ లేదు. ఆ యూహ రెండవసారి కలిగెను. దానిని భీష్మద్రోణవిదురులు వారించినమాత్రతో సరిపోయినది. మూడవది అన్నగారే వారించెను. ధర్మరాజు కరతలంబున వారించెను. చేయి వల దన్నట్లు పైకెత్తెను. ధర్మరాజు చేసిన దింతమాత్రమే. తొడలు విరుగగొట్టెద నన్నప్పు డన్నగారి యంగీకార మున్నదో లేదో యని తెలిసికొనుట కతనివంక చూచుచుండెను. శత్రువు లంతటి యపకృతి చేసినప్పుడు, తన కంతటి కోపము వచ్చినపు డన్నగా రంగీకరించునా లేదా యన్న విచారణ విచిత్రముగా నున్నది. ఆ యన్నయందు పెట్టిదో? అతని నాయకత్వ మెట్టిదో? ఈ తమ్ముల యనుయాయిత్వ మెట్టిదో? మనసుపట్టని యొక శైష్యోపాధ్యాయిక వ్యంగ్య మగుచున్నది.

ఇప్పు డీ మూడుపరిస్థితులలో నుత్తరోత్తర మధికాధిక మగుటకు కారణ మేమి? ఇందులోని ధర్మసూక్ష్మము విచారించినచో నాధునికులకు తెలియదు. ఒక భావమునకు, నొక కార్యమునకు నాటి వెల వేరు; నేడు మనము కట్టెడు వెల వేరు. ద్రౌపదీవస్త్రాపహరణము పట్టి పరాభవదృష్టితో జేయబడినది. పాండవులకు బరాభవము చేయవలయు ననియే దుర్యోధనుని యుద్దేశ్యము. ఒక దృష్టితో జూచిన నది యధర్మము గాదు. వీరి కవమానముచేయుట తల గొరిగించి గాడిద మీద నూరేగించినచో నది పట్టుకోరాని యవమానము. ఆ పరాభవాగ్నిచేత నీ వాత్మహత్య చేసికొనవచ్చును. ద్రౌపదిచీర లొలుచుట నిజముగా విచారించినచో నాగరకభావమునకు ద్రోహము చేయుటకాని తక్కిన యే భావము ద్రోహముచేయబడలేదు. సర్వజనులు

వస్త్రములు ధరించుచున్నారు. దేనికి ? ఒక సభ్యత లోకమున వృద్ధిబొంది యా సభ్యతాభావము మఱొక ప్రదేశగోపనముగా వృద్ధిబొందినది. ఒక యోగి, లేదా యోగిని దిగంబరులై గ్రామములవెంట సంచరించుట చూచుచున్నాము. ఎవరి దారిని వారు తలలు వంచుకొని పోవుదురు. ఉన్మత్తుడు వివస్త్రుడై కన్పించును. మన యిండ్లలో మహావ్యాధిగ్రస్తులు గుడ్డ తొలగినది తెలియక పడియుందురు. ఈ యే పరిస్థితులయందు నవమానము జరుగుట లేదు. బుద్ధిపూర్వకముగా నొక వ్యక్తిని వివస్త్రముగా చేయుటయం దవమాన మున్నది. అవమానమునకు మించిన యే భావమును లేదు. పైగా నీ చీర లాలిపించుటయందు పాండవులను గౌరవించుట యున్నది. మీరు మహాపౌరుషవంతులుగదా! బలశాలురు గదా ! సభలో మీ కీ పరాభవము చేసెదము. మీ రేమి చేసెదరో చేయు డన్నట్లున్నది. ఈ కౌర్యమువలన పాండవులకు తాత్కాలికపరాభవమే కాని వారి వ్యక్తి గౌరవమునకు భంగము వాటిల్లుటయే గాని మరి యేమియు లేదు. రెండవది దీనికంటె పెద్దది. తమ భార్యను దుర్యోధనుడు తొడమీద గూర్చుండు మనెను. పూర్వము చేసిన యవమానము జంతుభావ సంబంధ మయినది. ఇది స్త్రీపురుషభావసంబంధ మయినది. పారలౌకిక మయినది. మొదటి పరాభవ మిహ సంబంధమై దేహసంబంధ మయినది. ఈ పరాభవము భార్యాభర్తృభావసంబంధమయి, పౌరుషముతో గూడిన శృంగారభావసంబంధమయి సంతానమును తగులుచుండుటచేత నముత్రభావవిషయమయినది. ఈ రెంటియం దింత భేద మున్నది. మొదటిది జంతుత్వ మాత్రసంబంధమయినది; రెండవది నరత్వసంబంధ మయినది.

మూడవది స్త్రీసంబంధమున మరల రాజ్యము సమకూరుట. పట్టి ధర్మవిషయము. పాండవులు ధర్మనిష్ఠులు. ధర్మముమీద నాధారపడి మోక్ష మున్నది. తా నార్జించిన విత్త ముత్తమము. పిత్రార్జితము మధ్యమము. భ్రాతృవిత్త మధమము. స్త్రీవిత్త మధమాధమము. అందుచేత భీముడు మిక్కిలియు కోపించెను. ధర్మరాజు వారించెను.

ద్రౌపదీసంపాదితమయిన రాజ్యానుభూతి యందు ధర్మరాజునకుమాత్ర మీ యధమాధమబుద్ధి లేదా ? ఎందుకు వారించెను ? ధర్మజునియొక్క ధర్మస్వరూపము చాల నిగూఢమయినది. ధృతరాష్ట్రుడిచ్చుటచేత రాజ్య మిప్పుడు వచ్చినది. పాండవులకు మరల స్వాతంత్ర్యము వచ్చినది. వీరికి తత్పూర్వము నందు తమమీద తమకు, తమ యాయుధములమీద తమకు, తమ వర్మవరూథమ్ములమీద తమకు నధికారము లేదు. అందుకనియే ద్రౌపది యడిగిన రెండవ వరము "నెమ్మిని ధర్మజు నలువురు, తమ్ములు తమ యాయుధముల తమ వర్మవరూథమ్ములయుంగూడ సకల హితమ్ముగ బాయంగవలయు దాస్యమువలనన్" అని యున్నది. అందుచేత నిప్పటి భీముని పౌరుషము, ఆయుధప్రయోగము చేయగల సామర్థ్యముకూడ స్త్రీవిత్తముక్రింద లెక్కగట్టబడవలయును. రాజ్యసంపద ననుభవించుటకు స్త్రీవిత్తదోష మెంత యున్నదో తమ పరాక్రమము ప్రకటించుటకు స్త్రీప్రసాదకృతసామర్థ్య మను దోష మంతియే యున్నది. ఇందుచేత ధర్మజుడు కరతలమ్మున వారించెను. తొడలు విరుగగొట్టెద నన్నప్పుడు పరాక్రమము ప్రదర్శించుటకు వీలే లేదు. వారి పరాక్రమ మన్న గుణము వారిదే కాదు. అందుచేత ధర్మరాజతనివంక నే చూడలేదు. ఇవి నన్నయ్యగారి రచనాంతర్నిగూఢ మహార్థములు.

దుర్యోధనుని తొడలు విరుగగొట్టెద నన్నప్పుడు భీము డాయుధము లున్న వలనికి దృష్టిం బలుపుచుండె నని వ్రాయబడియున్నది. ఈ యాయుధము లున్న దెక్కడి ? వీ రెచ్చట నుండిరి ? ఆయుధము లెచట నుంచబడినవి ? దీనినిగూర్చి కొంత విచారించినచో నాటి యాచారము తెల్లమగును. రాజసభలోనికి సాయుధులై యెవ్వరును బోరాదు. సభలో ప్రవేశింప బోవునపుడు ప్రస్తుతకాలమున పాదరక్షలు, ఛత్రములు వెలి వదలివచ్చినట్లు, పాశ్చాత్యులు పైకోట్లు వాకిలివద్ద నున్న సేవకునిపరముగా నప్పగించి వచ్చినట్లు, సభలోని కాయుధములు తేరాదు. సభలో ప్రవేశించు నందరును తమతమ యాయుధము లొకచోట పెట్టి రావలయును. ఆ స్థలము సభలోననే యొక మూల, లేదా యొక ప్రత్యేక ప్రదేశము. "ఆయుధము లున్న వలనికి" నని వ్రాయబడినది కాని "యాయుధాగారమువంక" నని లేదు. సభలోనుంచి వెడలిపోవునపుడు వారు తమతమ యాయుధములను తీసికొనిపోవుదురు.

కొన్ని పాతమాటలు

శ్రీ నేలటూరి వెంకటరమణయ్య

౧. ౹బ్రాతి:—నన్నెచోడని కుమారసంభవము (౧౦-౨౧౦) వ దీక్రిందిపద్యమున దారకాసురుడు కుమారు నిట్లు తిరస్కరించుచున్నాడు :

"నన్ను నాకేశ్వరుం డెఱుఁగుఁ
నాకపకాంతల దేరబంచెనే !
పన్నగయక్షసిద్ధసుర
పాలకులాదిగఁ జేల్పులెల్ల నే
నన్న భయంబు బొంది కల
హంబున కెక్కరు ; నిన్నుబట్టి తా
నెన్నఁడు బ్రాతియయ్యె ? మఱి
యెన్నఁడు నేర్చెనొ వెక్కిరింపఁగాఁ."

ఇందు చతుర్థపాదమందలి 'బ్రాతి' కేమి యర్థము ? శబ్దరత్నాకరమున సీతారామాచార్యులవారు దీనికి 'ప్రేమ, అధికము, దుర్లభము, ప్రియము' అను నాల్గర్థములను వ్రాసియున్నారు. ఇందు రెండవయర్థ మిచ్చుట గ్రాహ్యమని తోచుచున్నది. 'బ్రాతి యయ్యె= అధికు డయ్యె'నని యర్థము చేసికొనవలయును. కాని 'బ్రాతి' యగుటకును 'వెక్కిరించు'టకును గల సంబంధ మేమో తెలియుటలేదు. అధికుని స్వభావము వెక్కిరించుటయా ? 'బ్రాతి' యనునది వ్రాతప్రతిచే సంరక్షితమైనను అపపాఠ మని తలచెదను. కవి చతుర్థపాదమున నొక లోకోక్తి నిముడ్చియున్నాడు. దీని సరియైన రూపము పాల్కురికి సోమనాథుని బసవపురాణమున (ఆ. ౪—పుట ౧౦౭) గలదు. మాచయ్య బసవ డాన తిచ్చిన గీతమును విని కోపించి—

" 'శివశివ' యని చేలు సెవులఁజేర్చుచును
నవినీతుం డిట్టుండె మాకల్లినాథ !
యెల్లలో ! దీనుల జేసి కిరణుల
కెల్లను దా నొక యిచ్చువాడయ్యె
ఎన్నఁడు గ్రోతి యయ్యెను వెక్కిరింప
నెన్నఁడు గఱచె నింకెక్కడి భక్తి"

యని గర్హించెనట. వెక్కిరించుట గ్రోతి స్వభావము. కావున పైకుమారసంభవపద్యచతుర్థపాదమున 'బ్రాతి'కి బదులు 'గ్రోతి' యని యుండిన నెక్కువ సందర్భోచితముగ నుండును.

౨. వాతపూరణము:—కు. సం. ౭ : ౪౨వ పద్యమున హిమవంతు డీశ్వరు రాక యెఱిగి యోషధిప్రస్థపురంబు నలంకరింప జేసిన సందర్భమున,—

"వాతపూరణములు కేతనానీకంబు
గలుపడగలు నెల్లకడల వెలసె"

నని కలదు. మఱియు ౧౦ : ౪౩౧ వ పద్యమున కుమారుని దేవసేనాధిపతిగ నభిషేకము సేయ నిర్ణయించిన హేమమంటపమును వర్ణించు పట్టున,

"వరకాలితోపితాంకురపాలికలు వాత
పూరణనికరవిస్ఫురణ దనర"

అనియు, ౧౧ : ౫౭౨ వ పద్యమున కుమారుని శిబిరమును వర్ణించుచోట—

"ఆతపత్రధ్వజవాతపూరణములు
దనరి బ్రహ్మాండంబు దాకి తూల"

అనియు గలదు.

శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారు తముచే ప్రకటితమైన కుమారసంభవమున కనుబంధముగ జేర్చిన లఘుటీకయందు, 'గాలితో నిండి తలగడలవలె సౌధాగ్రముల గట్టబడిన ధ్వజ విశేషములు' అని వివరించి తమ వివరణకు ప్రోద్బలముగ, 'వాతపూరణంగళింనొందం తె దెసెదెసెగ పొంగువగోగగళిం' అను 'శూద్రకము' అను కన్నడ గ్రంథమునుండి యుదాహరించియున్నారు. కాని యుదాహృతవాక్యమునవలన వాతపూరణ మిట్టి

దని తెలియవచ్చుటలేదు; కావున వీరి వివరణ సరియైన దని యంగీకరించుటకు వీలులేదు.

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిల వారు తాము విరచించిన బసవపురాణపీఠికలో (పుట ౧౨౧) 'వాత పూరణములు = గాలిగుమ్మటములు' అని వ్రాసి యున్నారు. 'వాత', 'పూరణ' శబ్దార్థముల నాధార పఱచుకొని వీరద్దానిని తమతమ వివరణలను వ్రాసిన ట్లున్నది. కుమారసంభవము ౧౧ : ౬౨౦ వ చేర్కొనబడిన 'గాలిపడగ' యు, నీ 'వాతపూరణము' ను నే నను కొను నట్లు సమానార్థకపదము లగుచేని 'వాతపూరణములు' గాలితో నింపబడిన ధ్వజవిశేషము లనియే చెప్పవలసి యున్నది. కాని శ్రీ ప్రభాకరశాస్త్రిలవారు చెప్పినట్లు 'గాలిగుమ్మటము' గాజాలదు. ధ్వజవిశేషమైనను, శ్రీ రామకృష్ణకవిగారు రూహించినట్లు దాని స్వరూపము 'తల గడ' వంటిది కాదు. వాతపూరణముల చలనము 'శాలిరో పితాంకురపాళికల' తో బోల్పబడియుండుటవలన వాని యాకృతి తలగడలకంటెను, గాలిగుమ్మటములకంటెను భిన్నమైనదని తోచుచున్నది. 'వాతపూరణము' లను పాల్కురికి సోమనాథుడు పెక్కు పర్యాయములు చేర్కొనియున్నాడు. బసవపురాణము ద్వితీయా శ్వాసమున,

"అతతవ్యాసహస్తాకృతినున్న
వాతపూరణములు వడి గ్రాలియాడ"

అని 'వాతపూరణము' 'వ్యాసహస్తాకృతి' గల దని తెల్పియున్నాడు. ఇట్లే పండితారాధ్యచరిత్ర పర్వత ప్రకరణమున,

"ఖ్యాతిగా వ్యాసహస్తాంకమై పొలుచు
వాతపూరణముల వడి నొప్పనదియు."

వని చెప్పియున్నాడు. ఈ వాతపూరణము పతాకవిశేష మనియు, బట్టణాదుల కలంకారచిహ్న మనియు నీక్రింది ద్వపదలవల్ల విశదపడుచున్నది:

"మకరశపల్ల వమణిము క్తాఫలాది
మకరతోరణములు మార్గపార్శ్వముల
నుప్పరపట్టంబు లొగి కల్పడములు
నుప్పరగుల్ల మహోత్కపతాక
ములు వాతపూరణంబులు వాతపత్రి
ములు నలంకొరించి......"

(పండి. చరి. మహి. ప్రక)

వాతపూరణము లాకృతియందు వ్యాసహస్తము వలె నుండుననికదా చెప్పినాడు సోమనాథుడు. వ్యాస హస్త మన నేమి? శబ్దరత్నాకరమున 'వాతపూరణము' గాని, 'వ్యాసహస్తము' గాని కానరావు. కాని కిట్టెలు యొక్క కర్ణాటాంగ్ల నిఘంటువునందు రెండుపదములును గలవు. వాతపూరణ = *A Flag* (ఒక ధ్వజము) అని యర్థము వ్రాసి కన్నడ బసవపురాణమున (౬ : ౨౧) ప్రయోగము గలదని సూచించియున్నాడు. వ్యాసహస్త= ***Vyasa's hand cut off by Nandi and its image*** (నందిచే ఖండింపబడిన వ్యాసుని హస్తము, దాని ప్రతిమ) అని యర్థము వివరించియున్నాడు. మఱియు 'నన్దికమ్బ' మను పదమున కర్థము చెప్పుచు, ***A large bamboo pole with a metal Nandi attached to its middle, and a Vyasahasta on the top*** (లోహాకృతి నందిబింబము మధ్యను, వ్యాస హస్తము చివరను గలిగిన నిడుపైన వెదురుగడ) అని వ్యాసహస్తమునకును నందికంబమునకును గల సంబంధ మును దెల్పినాడు. కాని, నంది వ్యాసుని హస్తము నేల ఖండించెనో తెలుపలేదు. నిరంకుశోపాఖ్యానము ౨ : ౧౦౯ వ పద్యమునందలి

"..........వ్యాసమాని వల్లభుడు 'సత్యం శివాత్పరం' బటంచు నెత్తిన హస్తారు ణాబ్జ మనగ..."

నను వాక్యమువలన నొకప్పుడు వ్యాసుడు విష్ణుని మించిన దైవ మెవ్వడును లేడని చాటించి చెప్పుటకు చేయి పైకెత్తినట్లు తెలియవచ్చుచున్నది. నందికేశ్వరు డిందుల కొప్పుకొనక యట్లు పైకెత్తిన వ్యాసుని హస్తమును ఖండించినట్లున్నది. నందిని చేర్కొనకపోయినను వ్యాసహస్తఖండనమును పాల్కు రికిసోమనాథుడు దన పండితారాధ్యచరిత్రయందు రెండుతావుల బ్రస్తావించియున్నాడు.

దీక్షాప్రకరణమున [(ఆంధ్రగ్రంథమాల పుట ౧౫౬)

"పేడువో రుద్రుండు విశ్వాధిపుండు
గాడను వ్యాసుని కరము గొన్నతడు"

వాదప్రకరణమున (పుట ౫౭౪)—

"క్రాలుచు వ్యాసుని కర మత్రిపీఠి
దూలియాడగ గూర్పబాలని విధము"

పై ద్విపదల వల్ల శివుడు విశ్వాధికుడని స్థాపించుటకొఱకు 'న దైవం కేశవాత్పరం' అని చాటించుటకు వ్యాసుడు పైకెత్తిన హస్తములను నందికేశ్వరుడు ఖండించెనని తెల్లమగుచున్నది. కావున వ్యాసహస్తాకృతులందు వాతపూరణములు (అనగా గాలితో బూరింపబడిన వ్యాసహస్తచిహ్నములు) శివాధిక్యతను బ్రకటించు లాంఛనములై శైవుల మన్ననకు బాత్రములైనవి.

పైచర్చవలన దేలిన యంశము లేవనగా—

౧. వాతపూరణ మనగా ధ్వజవిశేషము.

౨. దాని రూపము తలగడవంటిదియు గాదు, గాలిగుమ్మటమువంటిదియు గాదు.

౩. అది వ్యాసహస్తాకృతి గల్గిన వాతపూరిత చిహ్నము.

౪. శివాధిక్యమును వెలకొల్పుటకు శైవులు ప్రదర్శించు మతచిహ్నము.

౩. సంబెరము:—శ్రీనాథుని హరవిలాసము (౩ : ౯౨, ౯౩ లో) 'సంబెరము' అను మాట యొకటి కానవచ్చుచున్నది. కామదహనానంతరము విలపించుచుండిన రతి నూరార్ప వసంతుడు వచ్చుపట్టున నీక్రింది పద్యమునను వచనమునను నీ పదము రెండుపర్యాయములు వాడబడియున్నది.

"క్రొమ్ముడి జై పెక్కు కుసుమంబు లుమియుచు
నవటు ప్రదేశంబునందు బొరల
జేవురించిన లేతచెక్కుటద్దంబుల
దాటంకయుగళంబు తన్నియాడ
నాక్రోశపరిదేవనాతురవ్రాతంబు
కంఠగద్గదికచే గ్రక్కుపడగ
హరినీలముల చాయ నక్షిగోళమ్ముల
సొబగుగాటుకనీరు సోనగురియ
ముత్తియంబుల పేరులు ముడిచిపడగ
హస్తముల మీగ జనుదోయి యడచికొనుచు
సంబెరం బిచ్చె రతిదేవి శంబరారి
కప్పుడు వసంతు నెదుట దుఃఖార్త యగుచు."

"ఇవ్విధంబున నా రామ పేరామనియెదుట నెమ్మనంబున బేరామనిరై వర్తిల్లు నార్తి సంబెరం బిచ్చి..."

వసంతుడు దోదార్చుటకు రాగా రతిదేవి తలవెండ్రుకలు విరియబోసికొని, చెక్కులు జేవురించుచుండ, తడబడుమాటలతో, బొమ్మపై మోదుకొనుచు మన్మథునికి 'సంబెర' మిచ్చె ననియు, వసంతుని యెదుట దన మనస్సున మిక్కుటమై యుండు 'నార్తి సంబెర' మిచ్చె ననియు జెప్పియున్నది. 'సంబెర' మిచ్చుట యన నేమి?

నన్నెచోడని కుమారసంభవమునను రతివిలాప ఘట్టమున నీమాట కానవచ్చుచున్నది. వనములోని చెట్లు మన్మథమరణమునకు దుఃఖించు రతితోడ 'సంబెరము చూపె'నని (కు. సం. ౫ : ౫౬) చెప్పియున్నవి.

"అనిశము గ్రమ్మ పుష్పమధు
వశ్రుజలంబుగ గొమ్మలెక్కు భో
రన వెలరేగ పక్షిరవ
మార్తరవంబుగ మీదనోరి మా
గిన యళిమాలికల్ వివృత
కేశధరంబుగ జుట్టునుండి చే
ర్పున రతితోడ సంబెరము
చూపువిధంబున బొల్చె భూజముల్."

ఆ వనములోని చెట్లు రతితోడ సంబెరము చూపినవి. ఎట్లన—కన్నుల నీరు గ్రమ్మగా భోరన నేడ్చుచు, తలలు విరియబోసికొని, రతిని చుట్టుకొని నిలిచి. హరవిలాస కుమారసంభవములలోని వర్ణనల ననుసరించి చూడగా 'సంబెర మిచ్చు' వారికిని, 'సంబెరము' చూపు వారికిని కన్నుల నీరుపెట్టుకొనుట, తలవెండ్రుకలను విరియబోసికొనుట, పరిదేవనము సేయుట యను నివి సామాన్యలక్షణములు. హరవిలాసమున సంబెర మిచ్చునపుడు రతి హస్తములతో నురముపై నడచుకొన్నట్లు చెప్పియున్నది. కుమారసంభవమునం దీపట్టున బొమ్మపై మోదుకొన్నట్లు చెప్పలేదు ; కాని యంత మాత్రముచే నిది యొక ముఖ్యభేదమని గణింపరాదు.

మృతులైనవారికై దుఃఖించువా రురస్తాడన చేసి కొనుట సామాన్యమే. కుమారసంభవమందు గూడ (౫ : ౫౭౨) దుఃఖితు లురస్తాడన గావించుకొనుట చెప్పబడి యున్నది.

"ఉలియు నిట్టూర్పుల కలకలంబులతోన
యార్తిరవంబు మిన్నద్రువ జెలగ
దండడి దొరుగు జేర్పిందులతోడన
కన్నీరు తారల గడలుకొనగ
నిరుగడ పాదివిచ్చి విరియు వేనలితోన
మోహాంధతమసంబు ముంచుకొనగ
వెడబీటవాతి నెక్వడవడు మోవితో
ముడిగి వాడిన యొల్గు వడకుజావ
తలము లెదమోద జెరిగిన తారహార
భాతితో మోముదెస్నెల పలకబాఱ
బిట్టు వెసదాకు చిచ్చుటపిడుగువోలె
నడలు రతిదాకు మెయి ముచ్చుముడిగిపడగ".

కావున చేతులతో ఱొమ్మును మోదుకొనుట దుఃఖనిమగ్నుల చేష్టలలో నొక్కటి యని చెప్పవలసి యున్నది. మఱియు, కు. సం. ౫ : ౫౬౨ లో నెట్లు రతి 'చుట్టు నండి' సంబెరము చూపినట్లున్నది. ఈవర్ణనాంశముల నన్నిటిని చక్కగా నాలోచించి చూడగా 'సంబెర' మన మరణానంతర మెవ్వరేనియు బరామర్శించుటకు వచ్చినపుడు గతించినవారి కుటుంబమును దత్సంబంధికులును, ముఖ్యముగ, పతిమరణానంతర మతని సతియు, నాచరింపవలసిన సాంఘికమర్యాద యనియు దోచెడిని. ఆంధ్రదేశమునం దిప్పు డీయాచారము జరగక పోయినను, ద్రావిడదేశమున నిది యింకను వాడుకలో నున్నది. దీనికి 'పల్లాక్కాణము' అని చెప్పుదురు. పురుషుడు మృతినొందినపిమ్మట నతని కుత్తరక్రియలు నడచు దినములలో కొన్ని నియమితసమయముల నతనిభార్యను, విరిసిన వెండ్రుకలు గలదానిని, మధ్య నిలిపి బంధువులుగాని యన్యులుగాని స్త్రీలు వీడిన కొప్పులతో నామె చుట్టును మండలాకృతిగ నిలిచి ఱొమ్ముపై చేతులతో మోదుకొనుచు వలయాకారముగ దిరుగుచు నేడ్చుచు బాడెదరు. ఈ యేడ్పుపాటకే 'పల్లాక్కాణ'మని పేరు.

హరవిలాసము ౩ : ౬౨ వ పద్యమునను, కుమారసంభవము ౫ : ౫౬౨ వ పద్యమునను నీ సాంగ్యము స్పష్టముగ సూచింపబడినది.

'సంబెర' మను మాటకు అర్థమేమి? 'సంబెర' శబ్దము సంస్కృత 'సంభ్రమ' యొక్క తద్భవము. సంభ్రమ శబ్దమునకు అర్థములు పెక్కు గలవు. మోనియరు విల్లియంసు తన సంస్కృతాంగ్లనిఘంటువు నందు (పుట ౧౧౮౦, కలం. ౨) ఈ క్రింది యర్థములను వ్రాసియున్నాడు. *Sambhrama. as. m. moving about, moving or going round, turning round, whirling about, revolving, haste, hurry; flurry, confusion; agitation; up-roar, tumult; fear, terror, alarm; error; mistake, ignorance; bustling activity, zeal, respect, reverence.* (చలనము, తిరుగుట, గుండ్రముగా దిరుగుట; తొందర, తడబాటు, కళవళము; అల్లరి; భయము; తప్పు; అజ్ఞానము; వేగిరిపడి చేయుపని; భక్తి, గౌరవము ఇత్యాది).

సంబెరమున కిచట గుండ్రముగ చుట్టుట యని గాని, యఱచుచు గుండ్రముగ జుట్టుట యనిగాని ప్రధానార్థమై క్రమక్రమముగ పైవివరించిన సాంఘిక మర్యాదకు రూఢినామ మైనట్లు తోచుచున్నది.

'సంబెరం బిచ్చు'టకును, 'సంబెరము చూపు'టకును భేదము గలదని తలచెదను. సంబెరమిచ్చుట మృతినందినవాని బంధుమిత్రాదులు పరామర్శించుటకు వచ్చినపు డతని భార్య చేయు కార్యము. మన్మథుడు మృతినందుట యెఱిగి తన్నారడింపవచ్చిన వసంతుని యెదుట 'కపోతకర్బుగంబగు భస్మంబైన' భర్తచుట్టును దిరుగుచు రతి ప్రలాపించినది. సంబెరముచూపుట పతిహీనయైన స్త్రీయెడ నన్యులు చేయుకార్యము. పుష్పములు, మధువు, అళులు ఇవి మన్మథునకు ప్రియతమములు. వీని కాకరమైన భూజము లతని కాప్తజనము వంటివి. కావున మన్మథుని చావున కేడ్చుచుండు రతిచుట్టును అవి నిలిచి యేడ్చుచు ఆమెకు సంబెరము చూపిన ట్లుండెనని కవి యుత్ప్రేక్షించినాడు.

౮. గాలిపడగ, పెందగడి, వలిడియ, వీరసన్యాసములు, వీరమద్దెల:— నన్నెచోడని కుమారసంభవము ౧౧: ౨౦ పద్యమునం దీమాటలు గన్పించుచున్నవి.

"సన్నుత త్యాగధ్వజంబులతోడన
సంధిల్లి వీరధ్వజములు గ్రాలె
బటుగతి జను గాలిపడగలతోడన
కడువేగమున చెందగడియ లెగసె
జిలుతమెఱుంగుల కొలువివాటులతోన
నీరాజనద్యోతినికర మడరె
వలిడియల్ వెలువడు వరభటావలితోన
వీరసన్యాసముల్ వెడలి రుగ్ర
భటులు మంగళపాఠకపఠనరవము
తోన వీణాంకమాలికాగానరవము
నమరసంగీతవివిధవాద్యములతోన
కలయ వీటిలో వీరమద్దెలలు సలిసె."

ఇది శ్రీరామకృష్ణకవిగారిచే సంస్కరింపబడిన పాఠము. వ్రాతప్రతిపాఠమునకు దీనికి నచట నచట కొంత భేదము గలదు. సీసద్వితీయపాదము ఉత్తరార్థము వ్రాతప్రతియందు 'కడువేగమున చెందడిల్లెగసె' నని యున్నది. దీనిని 'కడువేగమున చెంద డీలు లెగసె' యని దిద్దవచ్చును. ప్రాసయతి—

"పెద్దకొకును దనకు నభేద మగుట
లకలకు నభేదమట్లన కలుగుకతన
ఖ్యాతిని మూడవ సరళంబు యతుల ప్రాస
ములను లఘ్వలఘులకారములక నిలుచు."

(అప్పకవీయము. ౩: ౩౭౪.)

అని యప్పకవి. కాని పై సీసపద్యముయొక్క యెత్తుగీతి ద్వితీయ చతుర్థపాదములందు దప్ప పద్యమందు మఱి యెచ్చటను ప్రాసయతి కానరాదు. ఈ కారణము వల్ల నేమో రామకృష్ణకవిగారు 'చెందగడియలెగసె' యని సంస్కరించినారు. మఱియు వ్రాతప్రతియందు ఎత్తుగీతి చతుర్థచరణమున 'కలయవిడిలో వీరమద్దియ లలిసె' అని యున్నది. దీనిని 'కలయవిడిదిలో వీరమద్దెలలు సలిసె' అని సంస్కరించినారు. 'విడిలో' అనుదానిని 'వీటిలో' అని దిద్దవచ్చును. 'వీడు' అన్నను 'విడిది' యన్నను అర్థభేదమేమియు లేదు. రెండుమాటలకును శిబిర మను నర్థము చెల్లును. 'వీరమద్దియ' శబ్దము గలదు. కాని అది యిచట సరిపోవునేమో విచారించవలసియున్నది.

ఈ పద్యములోని పదముల కర్థవివరణము సేయుచు, శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారు తమ కుమారసంభవానుబంధలఘుటీక ౧౧౯ వ పుటలో 'గాలిపడగలు = వీరధ్వజములు' అని యర్థము చెప్పినారు. 'కలిపడగ' వీరధ్వజమగునుగాని, 'గాలిపడగ' కాజాలదు. 'గాలి' యనుమాటకు 'వీర' యను నర్థము గలదని తెలుచుట కాధారమేమియు గానరాదు. 'గాలిపడగ' అనుమాటకు 'గాలిపటము' అని శబ్దరత్నాకరకారు లర్థము చెప్పి, 'గాలిపటము' అనగా 'బాలక్రీడావిశేషము' అని వివరించినారు. సూర్యరాయాంధ్రనిఘంటుకర్తలును సీతారామాచార్యులవారి యభిప్రాయముతో నేకీభవించినారు. ఈయర్థము నిచట నంగీకరించుటకు వీలు గాదు. దీనికి ప్రబలమైన యాక్షేపములు గలవు. (౧) కుమారుని స్కంధావారములో శూరులు యుద్ధయాత్రచేయుచు బాలక్రీడాసక్తులై గాలిపటముల నెగురవేయుగడగి రనుట సమంజసము గాదు. (౨) ఒకవేళ వారు కుజ్జవాండ్రవలె ఆటలాడ దొడగిరని తలచినను గాలిపటము నెగురవేయుట కప్పుడు వలనుపడియుండదు. ఏలనగా నది రాత్రి. ప్రొద్దుక్రుంకినది (కు. సం. ౧౧: ౨౦౨); చీకటి పడుటచే కుమారుని కొలువుగమున గరదీపికాసహస్రంబులను వెలిగింపవలసివచ్చినది (౨౦౩); అప్పుడు సైనికు లెవ్వరి విడిదులయందు వారు కుదురుకొని వీరాలాపములాడగడగిరి (౨౦౪ - ౨౦౫); అప్పటి స్కంధావారస్థితి వర్ణింపబడినది ప్రస్తుతము చర్చయందుండు సీసపద్యమునందు (౨౨౦). తరువాత నిశీథిరైనది, భటులు నిదురవోయిరి (౨౨౨); అటుపిమ్మట చంద్రోదయ మైనది (౨౩౧). కావున ౨౨౦వ పద్యములో గాలిపడగ లెగిరించినది రాత్రి చీకటిలో నని తేలుచున్నది. చీకటిలో గాలిపడగల నెగురవేయుట దుస్సాధ్యము. కావున గాలిపడగ కిచట బాల్యక్రీడాసాధన

విశేషమని యర్థము చెప్పుటకు వీలు గాదు. ఇందువల్ల నేమో శ్రీ రామకృష్ణకవిగారు 'వీరధ్వజము' లని యూహించినది. మఱి ఇచట 'గాలిపడగ' కర్థమేమో తెలియదు. భాషాపరిశోధనవల్ల దాని యర్థము నిర్ణయము గావలసియున్నది.

౫. పెండడీలు:—'పెండడీల' ను 'పెండగడియ'లని కవిగారు దిద్ది 'ఆకాశబాణము' లని యర్థము చెప్పిరి. ఇది కేవలము కవిగారి యూహపై నాధారపడి యున్నది; పెండడీ లను శబ్దము నిఘంటువులయందు గానరాదు; ప్రయోగాంతర మేగ్రంథమునను లేదు. ఇదియే సరియైన రూపమైయుండిన దీని కర్థనిర్ణయము సేయుటకు వీలుగాదు. కవిగారి సంస్కరణ సరియైనదని యంగీకరించినను, నది యర్థనిర్ణయమునకు దోడ్పడదు. 'పెండగడియ' యను మాట యెచ్చటను గానరాదు. 'వలిమిడియ' కూడ ఈ తరగతికి జేరినదే. 'కరదీపికలు' అని కవిగారే యాధారమునుబట్టి యర్థముచెప్పిరో తెలియదు.

వీరసన్న్యాసములు :—ఈమాటకుగూడ నిశ్చయమైన యర్థము తెలియదు. కాని, దురూహ్యము గాదు. దీనితో గూడ కు. సం. ౧౧ : ౬౨౩ లోని 'వీరసన్న్యాసవిధి' యొక్క యర్థమును విచారించుట యుక్తము.

"పాలు సేయును గూడిన భంగివోలె
నొసరి తెయ్యంబుతో గూడియున్న భటుడు
వీరసన్న్యాసవిధి దన్ను విడుచు టెఱిగి
వనిత నిట్టూర్పుతోన జీవంబు [విడుచు]."

'సన్న్యాస' మనగా 'విసర్జనము, వదలిపెట్టుట, ఐహికసంబంధవిసర్జన, కామ్యకర్మల విడుపు; తురీయాశ్రమము' అని యర్థము. సన్న్యాసు లనగా ప్రపంచమును వదలి మతధర్మముల నుపదేశించుచు కేవల పారమార్థికచింతయందే నిరంతరము కాలముగడపు యతులు. సన్న్యాసు లనుష్ఠింపవలసిన పద్ధతికి సన్న్యాసధర్మమని పేరు. ఇట్టి ధర్మమును నిర్ణయించు గ్రంథములు గలవు. 'సన్న్యాసధర్మసంగ్రహ' మను గ్రంథము ఈ సందర్భమున స్మరింపదగినది.

వీరసన్న్యాస మందలి సన్న్యాసమునకుగూడ నై చెప్పిన యర్థములు చెల్లును. యతులు సర్వప్రాపంచిక సంబంధములను విసర్జించిన, వీరసన్న్యాసులు శౌర్యప్రకటనయు, దన్మూలమున వీరస్వర్గగమనమును బరమావధులుగ గ్రహించి యన్యవిషయములతో సంబంధమును ద్రెంచుకొందురు. వీ రనుష్ఠింపవలసిన పద్ధతి వీరసన్న్యాసపద్ధతి, లేక వీరసన్న్యాసవిధి యని చెప్పబడును. వీరసన్న్యాసప్రస్తావము గన్నడవాఙ్మయమందును గలదు.

"అసురమాగళ్ళైయుక్తదొ
గళ్‌ తవువన్నెగమెచ్చుబిట్టు శా
జాసనమంకరు త్తిజిదు
కట్టిదగేణుడివన్నమన్యర
ట్టాసురమాగళుగళాగ
లిందిసెయుందడియిట్టువీరసం
న్యాసదొళప్పరోగణమ
నల్లికెలర్ బసదాగెమాడిదర్."
(పంప. రామా. ౧౩ : ౫౧.)

ఈ వీరసన్న్యాసవిధిప్రకారము భటులు విసర్జింపవలసినవానిలో నొక్కటి భార్య యని పై నుదాహరింపబడిన కు. సం. ౧౧ : ౬౨౩ పద్యమువలన దెలియవచ్చుచున్నది. ౧౧ : ౬౨౮ లో "విరోధాన్వితులైన సుభటోత్తములు "కః కేనార్థీ కో దరిద్ర" యని ఘోషణంబులు పుచ్చి సర్వస్వదానము లనుచుండి రట్టియెడ" యను మాటలను స్మరణకు దెచ్చుకొనవలయును. కు. సం. ౧౧ : ౬౨౮, ౬౩౦ కూడ నీసందర్భమున విచారింపవలసినవే. శౌర్యము జూపి శత్రువుతో బోరి చచ్చిన వీరస్వర్గము సంప్రాప్తమగును. ఇదియే వీరు దృష్టియం దుంచుకొనవలసిన పరమార్థము. 'అని మొనసిల్గి వీరగతి నందు ఫలం బిది యెల్ల దేవతాంగనల ముదంబునం గవయ గాన్న నిజంబు' (కు. సం. ౧౧ : ౬౨౫). 'హతోవా ప్రాప్స్యసి స్వర్గం' అను గీతావాక్యార్థ మిదియే.

ప్రాచీనగ్రంథములలో 'ఏకాంగు' లను నొక తెగవారలు పేర్కొనబడియున్నారు. కాఅవి గోపరాజకృతసింహాసనద్వాత్రింశిక (౫ : ౨౩—౨౮) లో నేకాంగివీరుని వృత్తాంతముగలదు.

ఏకాంగి వీరుం డను వంగపటి తెంక తనదు దురభిమానంబున గవలి,

"ఏరా ముండల గాసక
చేరమి పైదిచ్చు కొనుచు మీసాలు నా
చేరువ వడిపెట్టెద విది
యోరీ యేకాంగివీరు డుంట యెఱుంగవే."

స్థూలముగ జూచిన ఏకాంగివీరు డనునది యంగపటి తెంకయొక్క పేరని తోచవచ్చును; కాని ౫౧౨వ పద్యము 'ఏకాంగు' లన నొకతరగతివారు లనియు, వా రొండొరులతో జేయుయుద్ధమున నేకాంగివీ రని పే రనియు దెలియవచ్చుచున్నది.

"పసుల తయ్యిగాదు బ్రాహ్మణాలు గాదు
స్వామిహితము గాదు వ్రతము గాదు
లోకహితము గాని యేకాంగి పోరున
జచ్చువాని కేమి స్వర్గమౌను?"

తిరువెంగళనాథుని పరమయోగివిలాస ద్విపద (ఆ ౭. పుట ౫౧౯) పై దెల్పిన యభిప్రాయమును బలపఱచుచున్నది.

"అని తనయొద్ద డాయగ గొల్చియున్న
యనుపములైన యేకాంగివీరులను
రాయగొంగల శౌర్యరసిక శేఖరుల
వాయెడం బిల్చి............"

ఇందు గల్ల యేకాంగివీరు లొకతరగతియుద్ధవీరు లని తేలుచున్నది.

'ఏకాంగు'లను నొక తెగ సన్యాసులు గూడ గలరు. ఆముక్తమాల్యదలో విష్ణుచిత్తుని మధురాప్రయాణమును వర్ణించుసందర్భమున వీరి ప్రస్తావము గొంత గలదు (౨:౯౬).

"లావుగల యెద్దెగల్లుప
బావడములమీద మాత్రపంచలు దూలన్
గ్రేవల నేకాంగులు రా
వివధములు నడిచె లవని విభునకు గొనుచున్."

"ఏకాంగులు - పుత్రమిత్రకళత్రాదులం బరిత్యజించి కావివస్త్రములం గట్టి భగవత్కైంకర్యమే చేయుచుండు విరక్తులు" అని శ్రీ వేదం వేంకటరాయశాస్త్రిలవారి సంజీవనీవ్యాఖ్య. ఏకాంగులు నిరంతరము భగవత్సేవానిరతులై ఏదేవాలయమున సంచేసి యుండు దైవము నాశ్రయించియుందురో యా దేవాలయముల హక్కులను సంరక్షించుచు దత్కార్యనిర్వహణయం దవసరమైనప్పుడు దమ ప్రాణముల నైన నర్పింతురు. ఏకాంగులు కేవలము విష్ణ్వాలయములకు సంబంధించినవా రని తోచుచున్నది. శివాలయముల నిట్టి కార్యము నెఱవేర్చు వారికి వీరభద్రులని పేరు. శ్రీరంగదేవాలయచరిత్రను వర్ణించు కోయిలొలు గను నరవగ్రంథమున నీ యేకాంగుల సాహసకృత్యము లచటచట వర్ణింపబడియున్నవి. దేవాలయకైంకర్యనిరతులైన ఏకాంగులవలె ఏకాంగవీరులను కేవలయుద్ధలాలసతచే నితరవిషయములయం దపేక్షయుడిగి రణక్రీడయందే కాలము గడపువారు. వీరు మధ్యయుగయూరపుఖండములోని నైట్సు (*Knights*) వంటి వారని తోచుచున్నది. కుమారసంభవమునందు చెప్పియుండు వీరసన్యాసు లీయేకాంగులే కావలయును. లేదా, వారిని బోలిన మఱియొక తెగ యుద్ధవీరులైనను గావచ్చును. వీరసన్యాసవిధి యేకాంగుల వ్రతము వంటిది. దీని స్వరూపము భావిపరిశోధనవల్ల నిర్ణయము గావలసియున్నది.

౭. వీరమద్దెల:—"వీరమద్దెలలు-బిరుదందెలు" అని శ్రీ రామకృష్ణకవిగారి టీక. కాని శృంగారనైషధము (౬:౪౪)లో నివి రెండును భిన్నాభరణములుగ చెప్పబడి యున్నవి. "ఒక్క ఘాటోని పసిండిచుందెలు చరణారవిందంబులం దమర్చి;... మఱియు సాంగోపాంగంబుగా బ్రత్యంగంబునం గనలు ముత్యాల జల్లి, నెంకరంపు జేర్చుక్క, చిన్నపూసపులు, వాలికలు, మకరికాపత్రభంగంబులు, హారంబులు, కేయూరంబులు, కంకణంబులు, ముట్టియలు, వీరమద్దియలు, పాదకట్టంబు లాదిగాగల యలంకారంబుల నలంకరించిరి."

ఇవి రెండును ఒక్క యాభరణమునకు నామాంతరములు గావు. వేర్వేఱుభూషణముల పేర్లు.

'వీరమద్దెల' : ఈపదముయొక్క వాక్యస్వరూ

షమును మొదట నిశ్చయింపవలసియున్నది. వీరమద్దె, వీరమద్దియు, వీరమద్దియలను రూపము లాంధ్రకావ్యము లందు గానవచ్చెడిని. ఇందు వీరమద్దె వీరమద్దియకు రూపాంతరమని సీతారామాచార్యులవారు నుడివి యున్నారు. కావచ్చును. ఇది వీర మధ్యమునకు వైకృతి యనియు, నిదియు వీరముద్రిక యొక్కటే యనియు వీరు తలచిన ట్లున్నది. 'వీర మధ్యము' అను పేరు గల భూషణ మొకటి యుండెననుట సంశయాస్పదము. ఉత్తరహరి వంశమునుండి వీ రుదాహరించిన (౫ : ౧౯౨) 'మణి కిరీటకరోటిమంజీరములు రాయ వీరమధ్యంబులు క్రేయ లేదు' అను సీసపాదమందలి 'వీరమధ్యంబులు' భూష ణము లని తలచుటకు వీలులేదు. ఈ చరణము బాణుడు తనతో బోరువారు లేకపోగా నిజమనఃక్లేశమును శివునితో విన్నవించు పద్యములోనిది. పద్యమంతయు జదివిన నిం దాభరణప్రస్తావము లేదని తెల్లముకాగలదు.

"ఖురఖలీనాఘాతకోలాహలంబుతో
  నేమినిర్ఘోషంబు నెఱపలేదు
నఖపుంఖకోచులు నారితో సంధించి
  కర్ణావతంసంబు గడపలేదు
మణికిరీటకరోటిమంజీరములు రాయ
  వీరమధ్యంబులు క్రేయలేదు
దంతిదంతావళదంతంబు లొరయ డా
  కినులవాచవుల జొక్కింపలేదు
లేదు ప్రతిభటశౌర్యావలేపమహిమ
లేదు సంగ్రామభీమకేళీరసంబు
లేదు విక్రమక్రీడయు లేశమైన
లేదు రాజ్యంబు గలిగియు లేదు ఫలము."

ఇచట దన కాలి మంజీరములను వైరివీరమణి కిరీటకరోటులు లొరసికొనిపడునట్లు వారి నడుములు దగ నతికి క్రోయ లేదని యర్థము చేసికొనవలయును గాని వీరమధ్యము లను నాభరణవిశేషముల ధరింపలే దని యర్థము జెప్ప రాదు.

'వీరముద్రిక' అను మాటకుగూడ సీతారామా చార్యులవారు కొంచె మించుమించుగ 'వీరమధ్యము' నకు జెప్పిన యర్థమునే చెప్పినారు. రెంటికిని 'శూరులు బిరుదుగా కాలిపెద్దవ్రేలిని ధరించెడు ముద్రికా విశేషము' అనియు, 'శత్రువీరుల పేర్లు నడుమ చెక్కి శూరులు బిరుదుగా కాలిపెద్దవ్రేలిని ధరించెడు ముద్రి కలు' అనియు నర్థము నిర్ణయించియున్నారు. 'వీర ముద్రిక'కు సీతారామాచార్యులవారు చెప్పిన యర్థము చెల్లినను 'వీరమధ్యము'నకు జెల్లదు.

వీరమద్దెయు (అథవా, వీరమద్దియు), వీర ముద్దెయు నొక్క యాభరణవిశేషమునకు నామాంతరము లేమో కనుగొనవలసియున్నది. సీతారామాచార్యులవా రివి రెండు నొకశబ్దమునకు రూపాంతరము లని తలచిన ట్లున్నది. ఈ విషయమును వీరు స్పష్టముగ జెప్పక పోయినను, "స్త్రీలు కాలిపెద్దవ్రేలిని ధరించెడు ముద్రిక" లనియు "స్త్రీలు కాలిపెద్దవ్రేలిని ధరించెడు ముద్రికావిశేష" మనియు నీరెండుమాటలకును అర్థము వివరించియుండుటవలన, వీరి యభిప్రాయము తెల్లమగుచున్నది. వీరమద్దె స్త్రీపదాంగుళీముద్రికయే.

"వీరమద్దెనా మట్టె యనగ బిబ్బిలికాయనా బిల్లాణి యన జెటిబొద్దునాగ క్రమంబుగ పదాంగుళీ భూషలు..."

అని యాంధ్రభాషార్ణవము. 'క్రమంబుగ' ననుటవలన కాలిబొటనవ్రేలికి ధరించెడు భూషణమునకే వీరమద్దె యని పేరని నిశ్చయమగుచున్నది. సీతారామా చార్యులవారిచే నుదాహరింపబడిన యయాతిచరిత్ర పద్యమందు సైతము మట్టెలు పిల్లాండ్లతో గూడ పేర్కొనబడినంగున వీరముద్దియ గూడ నిట్టిదే యని చెప్పవచ్చును. కాని ఈ యాభరణములను స్త్రీలు దప్ప పురుషు లెచ్చటను ధరించినట్లు సాక్ష్యము లేదు. సంస్కృతమున 'వీరా' శబ్ద మొకటి కలదు. దీనికి 'వీరపత్ని', పత్ని, మాత, పతియు సుతులును గల స్త్రీ యను నర్థములు గలవు. తెలుగున స్త్రీలింగసూచకమైన దీర్ఘము హ్రస్వమగును. కావున వీరమద్దె స్త్రీపాదాంగుళీ భూషణ మని చెప్పుట యొప్పును; కాని కు. షం. ౧౧ : ౬౨౦ లోని 'వీరమద్దె' స్త్రీపాదాంగుళీ భూషణము గాదు; వీరమద్దె, లేక వీరముద్దె యొచటను రవము చేసినట్లు చెప్పియుండలేదు. అందెలరవళిని కవులు పలుమారు వర్ణించియున్నారు. అందె జేజు, వీర

మద్దె వేఱు అని పైనుదాహృతశృంగారనైషధవచనము స్పష్టపఱచుచున్నది. "అమరసంగీతవివిధవాద్యములతోన కలయఁదిటిలో వీరమద్దెలలు మెఱసె" అనియుండుటచే నన్నెచోడకవి ఇచట నుద్దేశించిన దొక వాద్యవిశేషమని తోఁచుచున్నది. ఈమాట కర్ణాటభాషయందు కలదు. ప్రాచీనకర్ణాటజైనకవులు దమ కావ్యములలో 'వీరవద్దల' లేక 'వీరమద్దల'ను పేర్కొనియున్నారు. అభినవపంపడు దన రామాయణము ౧౩ : ౩౪ తరువాతి వచనమున—

"అంతుధ్వనబలముం నెలనమాగసము పెడెనె అతుదంతు సముచితవ్యూహ ప్రతియూహ స్థాపనెగళం యథావిధియం ప్రయోగిసి తంతమ్మ మొనెయ నాయకర బిరుదిన వీరవద్దలెయ పదిరపఱెయ కహళెయ కళకళం కివి కిడ్డం గిడె దివమనెద్దు ఘళిర్దు ఘుల్లి సువ పెసర తుఱిపిన పళయిగెగళం."

ఇచట వీరవద్దళె పదిర పఱ కహళములతోఁగూడ పేర్కొనబడుటవలన నది వాద్యవిశేష, మనుటకు సంశయము లేదు. మఱియు నగ్గళదేవుడు దన చంద్రప్రభపురాణము ౬ : ౪౭ వ పద్యమున—

"అవిరళనాద మెఱ్వుగ
పచ్చెదిమిర్ తళిర్తుట్టపట్టె రెయ
ప్పువ తిళకం మధువ్రతమ
లరలగొంచ లెదం డెకోకిలా
రవమదు వీరవద్దళెయ
నిప్పన మాగిరి కట్టిబందకం
దాన బిరుదంకదం లెకర
మొప్పెదువందిన బందమావుగళ్."

ఈ యుదాహరణములవలన వీరవద్దళె, లేక వీరమద్దళె యొక వాద్యవిశేషమని తెలియవచ్చుచున్నది. కావుననే కిట్టెలివారు *A maddale fit for warriors*—శూరులకు దగిన మద్దెల యని యర్థనిర్ణయము గావించినారు.





ఆనరబుల్ జస్టిసు పి. వి. రాజమన్నారుగారి రూపప్రతిమ

శిల్పి : శ్రీ దేవీప్రసాదరాయచౌదరి.

మన మతములు

శ్రీ శ్రీవిక్రమదేవవర్మ

పూర్వకాలమునందు భారతదేశమున నేది 'ధర్మ'నామముతో వ్యవహరింపఁబడుచుండెనో, అదియే యిప్పుడు 'మత' మను పేరుతో వాడఁబడుచున్నది. ధర్మ మనఁగా ఆచరణీయకార్యము. మత మనఁగా నభిప్రాయము.

భారతీయధర్మమునకుఁగాని, మతమునకుఁగాని శ్రుతిస్మృతులే యాధారములు. శ్రుతియొక్క యపరనామములే వేదము, నామ్నాయమును. దానినుండి ధర్మాధర్మములు శ్రుతము లగుచుండుటవలన అది శ్రుతి యనఁబడుచున్నది. మఱియు నే మంత్రముయొక్క ఋషి యోగనిష్ఠాపరుఁడైయుండినపు డతనికి నా మంత్రము విననగుటవలన దానికి శ్రుతినామము గలిగెను. ఋషి మంత్రద్రష్టయె; కాని తద్రచయిత గాఁడు. కనుక శ్రుతి యపౌరుషేయము. దానినుండి ధర్మాధర్మములు దెలియుంబడుచుండుట వలన నది 'వేద' మనంబడెను. అది పారంపర్యముగా నభ్యసింపఁబడుచుండుటవలన అది 'ఆమ్నాయ' మనంబడెను. మహర్షులు వేదార్థమును స్మరించి రచించిన గ్రంథములు 'స్మృతులు'. శ్రుతి స్మృతి ప్రోక్తమతములె ఋషులవి. ఋషులు ఆర్యులు. వారి మతము 'ఆర్ష మతము'. ఆగమశాస్త్రోక్తమతము ఆగమమతము. అది శాక్తాగమ, శైవాగమ, వైష్ణవాగమాది భేదయుక్తము. తద్వివరణము నిచ్చట వివరించుట మాని, యార్యవంశజులు సాధారణముగా నిప్పు డవలంబించియుండు మతములను గూర్చియె ముచ్చటింతును.

ద్వైతము, అద్వైతము, విశిష్టాద్వైతము, అచింత్య భేదాభేదమతము అను నాలుగు మతములె ఈ దేశమునఁ బ్రబలియున్నవి. ద్వైతమతము జీవేశ్వర భేదము, జడేశ్వర భేదము, జీవజీవభేదము, జడజీవభేదము, జడజడభేదము అను నైదు భేదములు గలది. అద్వైతమతమునందు బ్రహ్మముమాత్రమె సత్యము. తదన్య మసత్య మనియు, జీవుఁడు ఈశ్వరుని ప్రతిబింబ మనియుఁ జెప్పఁబడి యున్నది. అది శుద్ధాద్వైత మనియు, శాక్తాద్వైత మనియు ద్వివిధము. శుద్ధాద్వైతమునందు బ్రహ్మ మొకటియె నిత్యము. శాక్తాద్వైతమునందు శక్తితోఁ గూడిన బ్రహ్మమే నిత్యము. అందు బ్రహ్మశక్తులకు భేదము లేదు. విశిష్టాద్వైతమతమునందుఁ బ్రకృతి జీవేశ్వరుల కభేదము చెప్పఁబడుటయె కాక, ఈశ్వరుఁడు ప్రకృతిజీవుల అంతర్గతుఁడనియుఁ జెప్పంబడెను. అది విష్ణువిశిష్టాద్వైత మనియు, శివవిశిష్టాద్వైత మనియు ద్వివిధము. అచింత్య భేదాభేదమతమునందుఁ బ్రకృతిభేదము గలదియైనది ఈశ్వరశక్తివిశేష మనియు, జీవేశ్వరులకు వస్తుతః భేదము గలదనియు గుణతః అభేద మనియుఁ జెప్పఁబడెను.

పైని పేర్కొనఁ బడిన నాలుగు మతముల వారికి ముక్తిసాధనములు జ్ఞాన, భక్తి, కర్మ

ములే. అట్లయ్యును ద్వైతమతస్థులకు కర్మము ప్రధానమును, జ్ఞానభక్తులు తదంగములును. అద్వైతులకు జ్ఞానము ప్రధానమును, భక్తి కర్మములు తదంగములును. విశిష్టాద్వైతులకు, నచింత్యభేదాభేదమతస్థులకును భక్తి ప్రధానమును, జ్ఞానకర్మములు తదంగములును.

ద్వైతమతస్థులు లక్ష్మీనారాయణులను; అద్వైతమతస్థులు నారాయణ, మహాదేవ, కాత్యాయనీ, దివాకర, విఘ్నేశ్వరులను; విష్ణువిశిష్టాద్వైతమతస్థులు లక్ష్మీనారాయణులను, తన్మతాంతర్గతరామానందీయ మతస్థులు సీతారాములను; శివవిశిష్టాద్వైతమతస్థులు గౌరీశంకరులను; అచింత్యభేదాభేదమతస్థులు రాధాకృష్ణుల నుపాసింతురు.

అహింస, సత్యము, అస్తేయము, శౌచము, ఇంద్రియనిగ్రహము మొదలగు ధర్మములు పైని పేర్కొనంబడిన మతస్థులందఱకు నవశ్యాచరణీయములు. ఆ మతస్థులు పునర్జన్మమును బరలోకమును నమ్ముదురు.

దక్షిణాపథమందున్న యనార్యుల ప్రధానోపాస్యదేవుఁడు సుబ్రహ్మణ్యుఁడు. అతఁడు షడాననుఁడును శూలాయుధధరుఁడును. మాళవప్రదేశమందున్న యనార్యులకుఁ బ్రధానదేవతాద్వయము — భూమియును, సూర్యుఁడును.

సమస్తధర్మములకును, సమస్తమతములకును మూలము విశ్వాసమే.

ఈశ్వరోపాసనము ముక్తిలాభమునకుఁ బ్రధానసాధనము. అట్లైనను వివేకము, వైరాగ్యము, సత్యనిష్ఠ, సత్కర్మాచరణము మొదలగు లక్షణము లేని నరునకుఁ గేవలోపాసనము ఫలప్రదము గాదు.

అద్వైతం

శ్రీ బెళ్లూరి శ్రీనివాసమూర్తి

అలరులేదీవలో—ఇల రాలు నాకులో
అద్వైతసౌందర్య మలముకొనిపోయింది,
అమృతమయలావణ్య మాక్రమించెను స్వామి!
చావుపుట్టువు లొక్క చంటిబిడ్డలా యేమొ,
ఒక్కటే సౌందర్య మొలుకబోయునో ఏమొ.

సుఖము దుఃఖము నొక్కసూత్రాన గల మణులో
క్రోధశాంతము లొక్క కోనలో బెరిగినవా,
అద్వైతసౌందర్య మాక్రమించెను స్వామి,
అలరులేదీవలో-ఇల రాలు నాకులో!

నాటిక :

అహం

(దుర్యోధనుడు)

శ్రీ విశ్వనాథ వేంకటేశ్వర్లు

[భానుమతి, దుర్యోధనుడు ప్రవేశము]

దుర్యో—భానూ! ఆపూజ యెవ్వరినిగురించి?

భాను—శ్రీమన్నారాయణునిగురించి.

దుర్యో—ఎవ రా శ్రీమన్నారాయణుడు?

భాను—నవమావతారమైన శ్రీకృష్ణభగవానుడు!

దుర్యో—సతీ! నీవు పతివ్రతవేనా?

భాను—అనుట కీపంచభూతములు, సూర్య చంద్రులు సాక్షులు.

దుర్యో—మఱి నాకు ప్రత్యక్షవిరోధియైన శ్రీ కృష్ణునా నీవర్చించుట?

భాను—స్వామీ! శ్రీకృష్ణుడు మీ యాత్మ స్వరూపుడు. మీకు ప్రత్యక్షవిరోధి కాడు.

దుర్యో—తాతకు బట్టిన భ్రాంతియే నీకును బట్టినది.

భాను—ఆ భ్రాంతితోడనే యాయన మహా రాజైపోయినాడు.

దుర్యో—ఏమి మహారాజైపోయినాడు! అర్జునుని యంపరచేత ప్రత్యంగశకృతవ్రణపీడితుడై యంపశయ్య మీద మూల్గుచున్నాడు.

భాను—భీష్ములవారు దేవవ్రతుడు. ఆయన శరీరమునకు బాధ లేకుండ వసువుల యనుగ్రహ మున్నది.

దుర్యో—ఉండనిమ్ము. అంతమాత్రముచేత కృష్ణు డాయనపై చక్రధారియై దూకుటలోని యధర్మ మెక్కడికి పోవును?

భాను—అది భక్తానుగ్రహార్థము చేసిన పని.

దుర్యో—ఏమి వ్యాఖ్యానములోయి మీవి? కరచరణాద్యవయవవిశిష్టుడు దేవుడు; వా డొనర్చిన దుష్కృత్యములు లీలలు! ఇట్టి యున్మాదము మీకే సరిపోయినది.

భాను—స్వామీ! మీ యాత్మలో బరిశీలించుకొని చెప్పుడు. మాది నిజముగా నున్మాదమేనా?

దుర్యో—సభ్యజనుల తర్కవాదమునకు సరిపోని సమస్తము నున్మాదమే.

భాను—తర్కమున కతీతమైన పరమార్థము లేదా?

దుర్యో—అది యనుభవైకవేద్యము మాత్రమే.

భాను—ఆ యనుభూతి క్షేమమైన భూమికవఱకు వ్యాపింపరాదా?

దుర్యో—అందుచేతనే నీ దివ్యశరీరమును నేనిన్నాళ్లు నారాధించితిని.

భాను—ఇది సరి. ఇంత పరమానందప్రియులకు మీకు శ్రీకృష్ణదేవునియందు విశ్వాసము లేకపోవుటయే విచిత్రము.

దుర్యో—విశ్వాసము లేకయేమి? ఈ యుద్ధమేమి యగునో నాకు బూర్ణముగా దెలియును.

భాను—అయినచో నెందులకీ యుద్ధము చేయుట?

దుర్యో—అది నా క్షత్రియధర్మము.

భాను—క్షత్రియుల విశేషధర్మము సర్వ ప్రపంచసామాన్యధర్మమునకు లోచ్చు కాదా?

దుర్యో—కావచ్చును. కాని విశేషధర్మమే సామాన్యముగ మానవు లనుష్ఠింపవలసినది.

భాను—రాధ్యస్థానము చేరిట నాత్మ స్వామిని వదలుకొందురా?

దుర్యో—ఇందు బహిగ్రహణము, పరిత్యాగము ననునవి లేవు. అది నిత్యసిద్ధమే.

భాను—అయినచో నీ నాటక మెందులకు?

దుర్యో—ఆ ప్రశ్న శ్రీకృష్ణు నడుగుము.

భాను—శ్రీకృష్ణదేవు డాడుచున్న నాటక మేమి?

దుర్యో—అది చిట్టచివరకు జెప్పెదను.

భాను—అంతయు ముగించుకొనివచ్చినతరు వాత చెప్పి నేమి, చెప్పక యేమి?

దుర్యో—వెఱ్ఱిదానా! ఈ ప్రపంచమున ముగిం పనునది యెప్పుడు? ఇది శాశ్వతలీల.

భాను—స్వామీ! మీరు శ్రీకృష్ణదేవుని శర ణొందవలయును.

దుర్యో—నేను శర ణొందని దెప్పుడు? సమరం బునకు దోడుగమ్మని పోగా నారాయణగోపాలుర నీయ లేదా? తుదకు రాయబారపు సభలో గట్టివైచి నావాని గా జేసికొన నెంచితిని. అప్పుడు నాకు జిక్కియు న్నచో నాతరఫున గత్తిబట్టి యుద్ధము చేయవలయు నని తప్పించుకొని పోయినాడు.

భాను—ఆత్మనీయుడైనవానియెడల శాక్యతం త్రమా?

దుర్యో—ఆత్మనీయుడైనవాని కన్యత్వమా?

భాను—ఈ యన్యత్వము నారోపించుచున్నది మీరు.

దుర్యో—అనన్యనియం దన్యత్వ మె ట్లారో పింపవచ్చును?

భాను—నాకు దెలియుట లేదు. అనన్యమైన భక్తి కలదు వచ్చుడు.

దుర్యో—అనన్యత్వము, భక్తి—ఈ రెండును వ్యతిరేకపదార్థములు.

భాను—అయినచో భక్తులనే భగవంతుడు పాలించును.

దుర్యో—ఆ భక్తికొరకు పాండవులయొద్దకు బొమ్ము—వారు కౌంతేయులు, నేను ధార్తరాష్ట్రు డను.

భాను—జగజ్జేత భార్గవరాముని జయించిన తాతయు స్త్రీప్రకృతియేనా?

దుర్యో—కానిచో నా సుదర్శనమును దాచి నంతనే యీ పాగిలబడుట యేమి?

భాను—సుదర్శన మైనంతనే తాత యొడలు మఱచెను.

దుర్యో—బాహ్యమునందైన దర్శన మేమి సుద ర్శనము?

భాను—తాతను బాహ్యదర్శను డనుట న్యాయముకాదు.

దుర్యో—కాదుగాని యది యొక దివ్యభ్రాంతి.

భాను—ఆ భ్రాంతి మీరును పొందవలయు నని నా ప్రార్థనము.

దుర్యో—ఇహమా, పరమా?

భాను—ఇహసాధనకైన నది పనికివచ్చునుగదా!

దుర్యో—భ్రాంతిమూలకమైన ఇహసాధన నా కక్కరలేదు.

భాను—ఇహ మక్కరలేనిదానికి యుద్ధ మెం దుకు?

దుర్యో—ఇది వ్యవహారము. భ్రాంతిమూలమైన దీనియందు దైవమును జొరవలదని ప్రకటించెదను, అనృతమైనదానిలో ఋతస్వరూపుడైన భగవచ్ఛక్తి ప్రకటన మనృతమే యగును.

భాను—అయినచో కర్మసిద్ధాంత మేమగును?

దుర్యో—కర్మకు గాళ్లు చేతులు లేవు.

భాను—నిరీశ్వరవాదమా?

దుర్యో—సేశ్వరవాదమే. ఇంద్రియాతీతు డీశ్వరుడు.

భాను—స్వామీ! నిన్న భగదత్తుని యంకుశ మాయన మెడలో బూలమాలిక యయ్యెనుగదా!

దుర్యో—రేపు భీముని గదాప్రహారము నా యొడిలో పూలబంతి యగును.

భాను—ఇది దైవతిరస్కారము. దైవపౌరుష ములలో దైవము బలీయమైనది.

దుర్యో—పౌరుషమును జిలికి దైవమును బయటికి దీయుచున్నాను.

భాను—పౌరుషమంతటను దైవము దధి యందలి నవనీతమువలె నున్నప్పు డా దైవమును బరిహరించుట యెందులకు?

దుర్యో—పరిహరించుట లేదు. ఆదైవము ప్రత్యగభిన్న మనియు, ప్రత్యేక భౌతికస్వరూపము దానికి లేదనియు బ్రకటించెదను.

భాను—అది సర్వజగత్సాక్షి యయ్యు బది యంగుళములం బైనున్నది.

దుర్యో—అదియే నాకు బట్టినది. సాక్షిగా నుండువాడు సాక్షిగానే యుండవలయును. ఈ పక్షము లెందులకు?

భాను—దుష్టశిక్షణ శిష్టరక్షణార్థము.

దుర్యో—ఇక్కడ దుష్టు లెవ్వరు?

భాను—ఎవరు పరమేశ్వరుని సర్వజగద్రూపిత్వ మొప్పుకొనరో వారు.

దుర్యో—పిచ్చిదానా! నేను సర్వజగద్రూపిత్వము నంగీకరించుచున్నాను, అనుభవించుచున్నాను. నేను, నీవు, ఈ హస్తినాపురము సర్వమును బరమేశ్వరుడే.

భాను—అహంకార మమకారములు వీడినచో—

దుర్యో—అహం మమకారము లాదిశక్తిస్వరూపములు. వానిని గాదని పరమేశ్వరున కే స్థితి యుండదు. ఉన్నను బరిగణనలోనికి రాదు.

భాను—అయినచో మీ తాత్పర్య మేమి?

దుర్యో—తుదివఱకు బెనగులాడుటయే.

భాను—దేనికొఱకు?

దుర్యో—ఆత్మసిద్ధికొఱకు.

భాను—ఆత్మసిద్ధి యస్త్రశస్త్రములతోడనా?

దుర్యో—అవును. మహాస్త్రము లన్నియు బరమేశ్వరస్వరూపములు.

భాను—అవి యన్నియు బరమేశ్వరుని యందును దద్భక్తులయందును వృథయగును.

దుర్యో—ఓసీ! అగణితాగతవేదినీ! నీమాట సత్యమే యగుగాక! నాయస్త్రము లన్నియు బరిక్షీణములైనతరువాత నే నుందునుగదా! ఏకాకినై యాత్మయజ్ఞము నొనర్చెదను. ఆయజ్ఞమునందు నా శరీరము, నా యస్త్రములు, నా సైన్యము, నా సేనాపతులు సర్వమును హవీరూప మగును. అప్పుడుగాని పరమేశ్వరునకు నే ననిన నేమియో తెలిసిరాదు.

౨

[భానుమతి: దుర్యోధనుడు]

భాను—అయ్యో! నాథా! మన కాకులాంకురమైన మీసులకుండ బోయెనుగదా!

దుర్యో—క్షత్రియపత్నీ! నీవు లక్ష్మణునికై దుఃఖించుచుంటివా? నే నభిమన్యునికొఱకు దుఃఖించుచున్నాను.

భాను—స్వామీ! బంగారమువంటి బిడ్డ. వాడు కూడ నాకడుపున జిచ్చుపెట్టియేపోయినాడు.

దుర్యో—నీ కడుపున గాదు. ఒక్క శ్రీకృష్ణునికి దక్క దక్కిన యందఱి కడుపుల జిచ్చుపెట్టిపోయినాడు. అంత పౌరుషశాలిని వాని నెందులకు బ్రదుక నిచ్చునతే!

భాను—స్వామీ! శ్రీకృష్ణుని నిందింతురేమి? మీరును గర్ణుకునుగదా వానిని జంపించినది!

దుర్యో—మేమే—మఱి శ్రీకృష్ణ శేమైనాడు? ధర్మరాజును బట్టుకొందుమని గురుడు పరవశము చేసినప్పుడున్న తొందర, నుక్కుపచ్చులారని కసిగందు ప్రాణాపాయస్థితిలో లేదేమి? ఆవేళకు రథాశ్వములు నడువలేదు కాబోలు.

భాను—సంశప్తకులు రానిచ్చిరి కాదు కాబోలు.

దుర్యో—వెఱ్ఱిదానా! సంశప్తకులు కాదు, సర్వలోకము లడ్డుకొన్నను నతని కిచ్ఛ యున్నచో రాగలడు. వచ్చును.

భాను—దానియం దేదో రహస్య మున్నది.

దుర్యో—ఉన్నది. అభిమన్యుడు పౌరుషమూర్తీభవించిన బిడ్డ. వాడు భవిష్యత్సమ్రాట్టగునని

యనుకొంటిని. వాడు బ్రదికియున్నచో నీ యనాథ రక్షకుడు మఱియొక యవతార మెత్తవలయును.

భాను—అట్లని మేనల్లుని జంపుకొనువా?

దుర్యో—మేనమామను జంపినవాడు మేనల్లుని జంపలేడా! లోకములో బారువము నెగ్గకూడదు. దైవము, తదాభాసయును తాను నెగ్గవలయును.

భాను—ఆయన సర్వనియంత కదా!

దుర్యో—కానిమ్ము; తాను స్వయముగా నియంతృత్వము సాగింపు మనుము. అవాస్తవులద్వారా తన సర్వాతిశాయిత్వమును జూపుట యెందులకు! నిన్న చూడలేదా? ప్రొద్దుగ్రుంకకమున్న సైంధవుని తల బడ నేయుదునన్న యనాథకు దోడై ప్రొద్దుగ్రుంకిన దన్న భ్రాంతికల్పనమున సుదర్శనము నుపయోగించెను. ఇట్టివాని నాశ్రయించుటవలన బంచాయతనముల పరువు కూడ బోవుచున్నది. ఆ పసివాడు చచ్చినవాడుగాని వీడు చచ్చిన బాగుగ నుండియుండును.

భాను—ఇతడు నరుడు. నరనారాయణు లొక్కటే తేజము.

దుర్యో—ఆ యాదిఋషికి స్త్రీత్వము, నీ పేడితనము వ్రాసిపెట్టిన దేమి?

భాను—అది వారి లీల.

దుర్యో—అన్నియు వారి లీలలే. 'నేను' అను పదార్థమునందలి మహిమను వీటిబుచ్చు నికృష్టజీవుల సృష్టి మితిమీఱిపోవుచున్నది.

భాను—స్వామీ! మన పురుషకార మెంత తలుముకొన్నను పాదమాత్రమే కదా! తక్కిన మూడు పాదములు పురుషుడే వ్యాపించియుండును.

దుర్యో—పురుషత్వ మెప్పుడును బూర్ణస్వరూపముతోడనే యుండును. దాని యాభాసమే పాదమాత్రమై యుండును.

సేవకుడు—(ప్రవేశించి) దుర్యోధనమహారాజులకు జయము జయము. ఘటోత్కచుడు మరణించినాడు. ఈ శుభవార్త మీకు దెల్పుమని కర్ణమహారాజులుంగా రాజ్ఞాపింపగా వచ్చితిని.

దుర్యో—ఘటోత్కచకుమారు డెట్లు మృతి జెందెనురా?

సేవ—కర్ణమహారాజులుంగారు ప్రయోగించిన యింద్రదత్తశక్తివలన.

భాను—స్వామీ! అది యిన్నాళ్లు నర్జునునిమీద బ్రయోగించుటకు దాచియుంచిరి కదా!

దుర్యో—పాండవసేనాశిబిరములో విశేషము లేమి?

సేవ—ఘటోత్కచుడు పడిపోవగనే శ్రీకృష్ణుడు పాంచజన్యమును బూరించి, చేతికోల నైచిపోయి యర్జునుని కౌగలించికొని సంతసించెనట.

భాను—పరమేశ్వరుని కరుణాశీల మెంత ప్రశంసనీయము!

దుర్యో!—(సేవకునితో) సరే, నీవు పోయి మిగిలిన రాక్షససైన్యమును జెల్లాచెదరు సేయుమని నా మాటలుగా గర్ణునితో జెప్పుము.

(సేవకుడు నిష్క్రమించును)

భాను—పాపము, హిడింబ కెంత పాటు వచ్చినది!

దుర్యో—నీకంటెనా? ఉత్తరాసుభద్రలకంటెనా?

భాను—దేనికి దానికే - ఆ కుఱ్ఱవా డెప్పుడుగా కురువంశకేతనమువలె నుండెడివాడు.

దుర్యో—వాని చావునకు శ్రీకృష్ణుడు సంతసించెనట వింటివా?

భాను—ఆ సంతోషము తన భక్తుని రక్షింపగల్గితిమిగదా యని.

దుర్యో—అవును. ఇన్నాళ్లును గర్ణుడా శక్తి నర్జునునిపై ప్రయోగింప మఱచిపోవుచుండెను.

భాను—అది శ్రీకృష్ణదేవుని మాయయే.

దుర్యో—కాదని నే ననుట లేదు. మెతియుల వంటివారిని జూచి యేరుచున్నాడు. ఈ భూమిని తుదకా పుంస్త్వవిహీనుల కీయవలయు నని సంకల్పము.

భాను—ఘటోత్కచుడు పాండవపక్షీయుడు కదా!

దుర్యో—పిచ్చివాడా! అభిమన్యుడు కాడా? వానికొఱకు నే నెందులకు దుఃఖించితినో వీనికొఱకును నే నందులకే దుఃఖించుచున్నాను.

భాను—అతడు రాక్షసీసంజాతుడు.

దుర్యో—అందుచేత హంతవ్యుడా? మగటిమి కల బిడ్డ కావున హంతవ్యుడా? ఆ యింద్రదత్తశక్తికి నర్జునుని బలిసేత యిష్టములేనివాడు దానిని మఱియొక మాదిరిగా బరిహరింపలేడా? ఆ కుఱ్ఱవాని ప్రాణమే కావలసివచ్చెనా?

భాను—ఎవ్వరు పోయినను నాయైదుగురాయనకు బంచప్రాణములు, పంచేంద్రియములు, పంచభూతములు.

దుర్యో—నే నా పంచభూతములను సంహరించి యాయన నొక్కనినే మిగిల్చెదను.

3

[భానుమతి : దుర్యోధనుడు]

దుర్యో—అశ్రవ్యమైనదానిని వినినంతమాత్రమున బ్రాయోపవేశమున బ్రాణపరిత్యాగము చేయవలయునా?

భాను—ఆ మహనీయుని మనోమార్దవ మట్టిది.

దుర్యో—కాదు, ఆ మనస్సునకున్న సంసార కాపీన మట్టిది.

భాను—ఆ తల గోయుటకు వాని చేతు లెట్లాడెనో!

దుర్యో—శవహంతకులతో నాకు పోరు - నా యదృష్ట మెట్టిదో చూడుము.

భాను—గురుపుత్రుని నారాయణము విఫలమయ్యెనుగదా!

దుర్యో—విఫలము గాక యేమగును? మెలద్రాడు గట్టిన మగవా డెదురులేనప్పు డా యస్త్ర మేమియును జేయదు. పైగా వారెల్లరు నమస్కారము చేసిరి.

భాను—విష్ణుదేవుడు నమస్కారప్రియుడు.

దుర్యో—సర్వకర్మపరిత్యాగము చేసినవాడు స్వయంభువే యగును. అప్పు డొకనికి శరణనవలసిన యగత్యమే మున్నది?

భాను—ఉపాధిభేద ముండునుగదా?

దుర్యో—ఉపాధి కల్పితము. పరిత్యాగము చేసినవాడు శరణన్నచో రెంటిలో నేదియో యొకటి మిథ్య కావలయును.

భాను—అందఱును నమస్కరించిరా?

దుర్యో—ఒక్క భీముడుమాత్రము చేయనని తిరుగబడినాడు. వా డొక్కడే నాకు సరిజోడు.

భాను—పాశుపతధారియు నమస్కరించెనా?

దుర్యో—వాని మొగము! అహంప్రత్యయము వానిలో జీవికి జీర్ణమైపోయినది. తాత శిఖండిమొగము జూచినను గాని వీని మొగము నసలు చూడ గూడదు.

భాను—అశ్వత్థామయు గొప్ప పాశుపతవ్రతియే. ఆయన యస్త్ర మిట్లగుటకు హేతువేమో?

దుర్యో—ఆయన పాశుపతుడుగాని వైష్ణవుడు కాడుగదా! కుబ్జమొదలు కుంతికొడుకులవఱకు గల యనాథుల రక్షించుట కెత్తిన యవతారమాయెను.

భాను—స్వామీ! ఆ దేవదేవునితో మీ కేందుకు? అహంకారుల నాయన క్షమింపడు. భక్తులను బరిత్యజింపడు.

దుర్యో—ఆయనతో నా కేందుకు? అహంప్రత్యయమే తానై దానికే మూలచ్ఛేదము చేయుచున్నా డన్న జిజ్ఞాసయే నాకు బట్టినది.

భాను—అది యావరణవిశిష్టమైనప్పు డాయన యేమిచేయగలడు?

దుర్యో—ఆవరణవిశిష్ట మగుట స్వభావజన్యము.

భాను—స్వభావము జడము. ఆయన ప్రకాశస్వరూపుడు.

దుర్యో—ప్రకాశమున కావరణలేక స్థితి లేదు.

భాను—ఇక మీ రేమి చేయుదురు?

దుర్యో—ఏమి చేయుదునా? అశ్వత్థామరూపమైన యహంకారము నుద్దీపింపజేయుదును. అది పాండవేయదారగర్భములవఱకు వ్యాపించునట్లు చేసెదను.

భాను—గురుపుత్రుడు బ్రహ్మశిరమును సుదర్శనమున కొడ్డిపెట్టెనుగదా!

దుర్యో—అప్పుడు మాయచేసి యతనిని బంపివైచెను.

భాను—గురుపుత్రు డిప్పుడు సుదర్శనము నెత్తనేరక పోయెను.

దుర్యో—ఎందుచేత?

భాను—అది సాత్త్వికశక్తి. ఇతడు తమోగుణ ప్రధానుడు.

దుర్యో—గుణభేదము కల్పితము. మిథ్యయైన దానిని విభాగించి యింకను మిథ్యచేయుట.

భాను—గురుపుత్రు డెట్లును కృతార్థుడు కాజాలడు.

దుర్యో—సత్త్వము తమస్సును బూర్తిగా నశింపజేయును. తమస్సు సత్త్వమును బూర్తిగా నశింపజేయును.

భాను—అప్పుడు మిగులునది యేమి?

దుర్యో—నీవు, నేను.

భాను—శ్రీమన్నారాయణుడు.

దుర్యో—సుయోధనపత్నీ! నే నెవ్వరు?

భాను—మీరు సుయోధనమహారాజులు.

దుర్యో—కాదు. అవును, నేను సుయోధనుడనే.

భాను—స్వామీ! నా కిది యంతయు నగమ్యముగా నున్నది.

[తెరలో]

"అశ్వత్థామ కోత్తలల కాగలేక కిరీటి సమరరంగమున మఱొకయెడ కేగినాడు."

దుర్యో—భానుమతీ! వింటివా? పురుషకారముముందు దైవ మెట్లు తూగాడుచున్నదో?

భాను—స్వామీ! ఆ తూగాడుచున్నది దైవము కాదుగదా!

దుర్యో—దైవము కా దందువేమి? పురుషకారాభావమే దైవము. తాత వెఱ్ఱిభక్తి, ఆచార్యుని మనోమార్దవము, అశ్వత్థామ యతివిశ్వాసము దైవముగా మారినవి. అట్లుగాక పొఱపొచ్చె మింతయేని లేని పురుషకారము బ్రహ్మత్వము. అశ్వత్థామ యిప్పుడు ప్రమాదరహితమైన స్థితిలో నున్నాడు. అందుచేత నతనిముందు దైవసాధనభూతు డల్లాడుచున్నాడు.

భాను—స్వామీ! కేవలపురుషకార మనునది సాధ్యమా?

దుర్యో—సాధ్యమే. దానిని స్థాపించుటకే నా జీవితము నాత్మార్పణము జేయుచున్నాను.

భాను—పురుషకార మహంకారాత్మకము కదా!

దుర్యో—నేను సర్వప్రపంచము, సర్వప్రపంచమును నేనను నహంకారము పరతత్త్వరూపము.

భాను—ఆ పరతత్త్వసిద్ధి భౌతికములైన యుపకరణములతో సమకూడునా?

దుర్యో—ఉపకరణములలో నే మున్నది? సాధకుని మెలకువలో నున్నదిగాని.

౪

[దుర్యోధనుడు—రాధేయుడు]

దుర్యో—రాధేయా! కృష్ణుడు దైవమా?

రాధే—ఎప్పటినుండి?

దుర్యో—నీవు మీ తల్లిని గంగాకూలమున దర్శించినది మొదలు.

రాధే—మిత్రమా! రాధేయదుర్యోధనుల మైత్రినిగూడ శంకించుచుంటివా?

దుర్యో—మఱి నిన్ను నీవు చేతికిజిక్కిన పాండవుల నేల వదలిపెట్టితివి?

రాధే—దీనికిని కృష్ణుడు దైవమా యనుటకు నేమి సంబంధము?

దుర్యో—ఏమియు సంబంధము లేదు. చేతికి జిక్కినవారి నెల్ల వదలి నీమైత్రి నెట్లు పాలించెదవు?

రాధే—దుర్యోధనమహారాజా! పాండవమధ్యముడైన యర్జునుని హరిహరాదు లడ్డినను వధించి తీరెదను.

దుర్యో—అప్పుడు నీ తల్లి జ్ఞాపకమురాదా?

రాధే—మిత్రమా! ఈ నిష్ఠురము లెందులకు?

దుర్యో—యాథార్థ్యము నిష్ఠురముగనే యుండును. నీయొద్ద భార్గవాదిమహాస్త్రము లున్నవి. అర్జునుని

మీది పగతో నాగాస్త్రము నిన్నాశ్రయించియున్నది. నీవు నీయంతరు వెలుంగక యిట్లు మనసు మెత్తపడినచో దుర్యోధను కార్యము నేల గలసిపోవును.

రాధే—సుయోధన మహారాజా! దైవము, కాలము వీని సంయోగ మదృష్టమని చెప్పబడును. అది చాలనప్పుడు పురుషుడు వ్యర్థుడగును.

దుర్యో—ఇది రాధేయునివంటి పౌరుషశాలికి దగిన మాటయేనా?

రాధే—రాధేయుడైనను దుర్యోధనుడైనను దుశ్శాసనుని బ్రదికించుకొనలేకపోయిరిగదా!

దుర్యో—దుశ్శాసనుని చావు నేను సమాధిలో నుండగా జరిగినది.

రాధే—ద్రోణుడుగూడ సమాధియందుండగనే దుష్టసేనుడు తల నఱికెను. ఆ సమాధియే యదృష్టము.

దుర్యో—ఇక మనము యుద్ధము సేయు టెందులకు? కానలకు బోయి తపస్సు చేసికొనవచ్చును.

రాధే—మనము తపస్సు చేయుచునే యున్నాము. శస్త్రధారాతీర్థనిమజ్జనము చేయుచు నిత్యము దైవాదృష్టముల పరిణామమును శస్త్రాస్త్రములచే గొలతవేసికొనుచున్నాము.

దుర్యో—ఎందులకయ్యా! నిక్కమైన కర్మవీరునివలె నభినయించెదవు. నీమనస్సులో, నీయాత్మలో శ్రీకృష్ణునిమీద భక్తి యున్నదా లేదా? నిజము చెప్పుము.

రాధే—ఉన్నది.

దుర్యో—అయినచో యుద్ధ మెందులకు?

రాధే—ఎందులకా? దుర్యోధనునికి నేను బడియున్న ఋణము తీర్చుకొనుటకు.

దుర్యో—నీవు నా కప్పుపడిలేవు. ఒకవేళ నున్నను నది యీనాటితో విముక్తమైనది. నీవు పోయి పాండవపక్షమున జేరుము.

రాధే—నాయప్పు ప్రాణములతో దీరునది కాని మాటలతో దీరునది కాదు.

దుర్యో—నీ వొకండవు, రుక్మి యొకడు—మీ యిద్దరును విచిత్రవ్యక్తులు.

రాధే—రుక్మితో నన్ను జేర్పకుము. వాడు వట్టి యహంకారి. నేను ఫలాభిలాష లేకుండ గర్మయోగసిద్ధినొందుటకై తంటాలుపడుచున్నవాడను.

దుర్యో—నీ కర్మఫలమంతయు శ్రీకృష్ణునకు దారవోసెదవు కాబోలు.

రాధే—అవును. బ్రహ్మర్షివాదికములన్నియు నాహీరూపము నొందును.

దుర్యో—ఇది కర్మమార్గమా? భక్తిమార్గమా?

రాధే—రెండింటి సమష్టి.

దుర్యో—ఎందులకయ్యా మీరెల్లరు నిట్లు భక్తి నభినయించెదరు? ఇది మీ పౌరుషమునకు ఆత్మధర్మమూర్తికి—మీ యుపాధియందున్న పరంజ్యోతికి—మచ్చయగునా కాదా?

రాధే—సుయోధనమహారాజా! నీవు కేవలాద్వైతివి. నీమార్గము సర్వజనసులభమైనది కాదు—ఉపాధిబద్ధులకు భక్తిరహితమైన కర్మమార్గ మగమ్యము. ఉపాధివిహీనమైన పరంజ్యోతి యస్మాదృశుల కనుభూతివిషయమైనది కాదు.

దుర్యో—అయినచో బాండవుల నెందులకు వదలిపెట్టితివి?

రాధే—నన్ను నీ వర్జునున కుద్దిపెట్టితివి. అర్జునునిచేత నేనో, నాచేత నతడో యంత మొందవలయును.

దుర్యో—నీ వర్జునుని జంపలేవు.

రాధే—లేనని నాకు జిన్ననాడే తెలియును. వానిని జంపలేక యసమర్థులైన వాని యన్నదమ్ముల జంపుట హింసయగును. నే నది చేయ దలపెట్టలేదు.

దుర్యో—నీవు పూనిన దహింసావ్రతమా? మాతృవాక్యపరిపాలనవ్రతమా?

రాధే—వెఱ్ఱివాడా! నాకు మాతృసోదరప్రేమ యున్నచో నభిమన్యు ఘటోత్కచుల నెందులకు జంపింతును? వృషసేను నెందులకు జంపుకొందును?

దుర్యో—భక్తి, భక్తి యనుచు నుపాధులమీద నున్న మమకారమును, మీయాత్మలలో నావరణ

రూపమున నున్న ప్రకృతివైకల్యమును బోషించు కొనుచున్నారు.

రాధే—కావచ్చును. ప్రకృతి సాయము లేనిది ప్రకృతిని జయించుట కష్టము.

దుర్యో—అంగపతీ! నీవు ప్రకృతి కతీతుడ వైన పౌరుషపరంజ్యోతివని నమ్మి మోసపోయితిని.

రాధే—మిత్రమా! నిన్ను నేను నూదిమొన మోపినంతయు మోసగింపలేదు. నా తనువు, నా యసువులు, నా పుత్త్రమిత్త్రాదుల యసువులు నీవి.

దుర్యో—నీ యాత్మ నాది కాదు. తక్కిన వానితో నాకు బనిలేదు.

రాధే—అద్వైతచక్రవర్తీ! నా యాత్మ నీది కాదనుటలో యాథార్థ్యము కలదా?

దుర్యో—నీ నా సాధర్మ్య ముపాధిబద్ధమైనది. అది నాకు ద్రోణాదులతో గూడ నున్నది. మా యశ్వత్థామవలె నీవును నాకు సధర్ముడ వనుకొంటిని.

అశ్వత్థామ— (ప్రవేశించి) మహారాజా! జయము జయము. నేడు కర్ణార్జునుల ద్వంద్వయుద్ధము జరుగును. కర్ణుడు పార్థు నోడింపలేడు. నే నతనికి సాయమురాల్యెదను.

రాధే—(నవ్వి) బ్రాహ్మణుల సాయము నా కక్కరలేదు.

అశ్వ—ఓయీ! బ్రహ్మవేత్తా! భీష్మాచార్యులవలె శ్రీకృష్ణుని చక్రమున కెఱ గానుంటివి కాబోలు. అంత యదృష్టము నీకు బట్టదు. నీవు పార్థుని వాడికోలల జావవలసినదే.

రాధే—గురుపుత్రుడా! అట్లే యగుగాక! నర నారాయణు లేకమూర్తియే!

అశ్వ—అబ్బో! ఏమి పురాణజ్ఞానము! తమ్ముని జంపలేని పిఱికిపంద యిట్లనక యేమనును?

రాధే—పిఱికిపందనై తండ్రి నొకడు తలగోయ మిన్నకుంటినా?

దుర్యో—మిత్రమా!

అశ్వ—మఱల జెప్పుచున్నాను. దుర్యోధన ప్రీతికరముగ నీకు బ్రహ్మశిర మిచ్చెదను. దానితో బాండవేయుల పిల్లపిల్లతరమున జంపుము.

రాధే—ఓయీ బ్రాహ్మణవంశసంజాతుడా! ఆపని నీవు చేసి మూడువేలేండ్లు కుష్ఠవ్యాధిగ్రస్తుడవై భూలోకమున బడియుండుము. నే నస్త్రజ్వాలాముఖమున నూర్ధ్వలోకములు చూఱగొందును.

శల్యుడు—(ప్రవేశించి) రాధేయా! రథము సజ్జితమైనది. నీ వూర్ధ్వలోకమున కేగుటకు సర్వమును సిద్ధపఱచితిని.

రాధే—ఛీ! ధర్మదూరుడ వగు నీ మొగము చూడరాదు.

శల్య—నా మొగము చూడకపోయినను పార్థుని మొగము నేడు చూడక తప్పదు.

రాధే—కర్మయోగినై కైవల్యము నొందగోరు నా కెట్టులైనను బాధలేదు. నీవు విల్లు పట్టనేరని ధర్మజునిచేత బడనున్న నీ సంగతి చూచుకొమ్ము.

శల్య—భావన యెట్టిదైనను మృతిమాత్రము తప్పదు.

దుర్యో—ఓయీ! అనాత్మవేదీ-మృతి యెవ్వరికి?

శల్య—కర్ణభావనకు, దుర్యోధనమిత్ర భావనకు, కురువంశ రక్షణభావనకు, పాండవనాశభావనకు.

దుర్యో—ఈ సంగరము జడచైతన్యములకా, చైతన్యయుగ్మమునకా జరుగుచున్నది?

శల్య—అది యధికారిభేదమునుబట్టి నిర్ణయింప బడును.

దుర్యో—రాధేయా! నీవు పోయిరమ్ము. నీకు జయమగుగాక! శివోఽహం.

ఓం

[భానుమతి : దుర్యోధనుడు]

భాను—నాథా! నేను మొదటనే చెప్పితిని గదా!

దుర్యో—ఏమని?

భాను—ఈ యుద్ధములో మీకు జయము లేదని.

దుర్యో—వెఱ్ఱిదానా! ఈ యుద్ధములో జయించినది నేనే. శ్రీకృష్ణుడు మాయలు పన్ని పాండవులు జయించినట్లు లోకమునకు జూపించెను.

భాను—ఎక్కడను వారు సేనలతో, బిడ్డపాపలతో సుఖముగ నున్నారు. మీ రొంటరిరై జలస్తంభనవిద్యచేత నిందు దాగియున్నారు.

దుర్యో—నే నిందు దాగియున్నది భయముచేత గాదు. స్వామియొక్క ప్రత్యక్షరూపమును నా మహాప్రస్థానమునం దొక్కరూలు ప్రత్యక్షానుభవములోనికి దెచ్చుకొనుటకై యిం దుంటిని.

భాను—లోక మట్లనుకొనవలదా?

దుర్యో—లోకముతో నా కేమి పని?

భాను—స్వామీ! నాకుగూడ నవజ్ఞ యిండు.

దుర్యో—దేనికి?

భాను—మీతో ననుగమనమునకు.

దుర్యో—ఏ లోకమునకు?

భాను—పతి ననుగమించు సతి కే లోకమునకు వెల వున్నదో యా లోకమునకు.

దుర్యో—సతీ! తక్కిన యందఱును నన్ను వదలిపోయినారు. నీ వొక్కర్తుకవు నన్ను బట్టుకొని వ్రేలాడుచున్నావు.

భాను—స్వామీ! ఏమీరు, నేనేగదా శాశ్వతము.

దుర్యో—అవును.

భాను—ఇప్పుడు పాండవులు వచ్చినచో మీ రేమి చేయుదురు?

దుర్యో—గదాయుద్ధము.

భాను—శ్రీకృష్ణదేవుడు కామోదకి నావాహ్వానించునేమో?

దుర్యో—అంతకంటె గావలసిన దేమున్నది? నా గదారూపమైన పౌరుషమునకు గూడ వైఫల్య మాపాదింపగలడేమో చూచెదను.

భాను—ఇంకను సందియ మున్నదా స్వామీ!

దుర్యో—అప్పుడు నే నీ శమంతపంచకమునందే కైవల్యము నొందెదను.

భాను—మీకు శ్రీకృష్ణదేవునిపై భక్తి పొంగి వచ్చుచున్నది.

దుర్యో—ఇది భక్తి కాదు, ఎఱుక.

భాను—భక్తియు నెఱుకయు నొకటి యనియే గదా గీతాపురుషుని యాదేశము.

దుర్యో—ఓహో! స్మృతికి దెచ్చితివి. "కాలోస్మి లోకక్షయకృత్ప్రవృద్ధః" అని యాయన చెప్పినది. కాలపురుషు నతిక్రమించు పౌరుషజ్యోతి నాలో వెలయుగాక! నీ వింక పొమ్ము.

౬

[భానుమతి : దుర్యోధనుడు]

దుర్యో—అది సరే, ఆ దొంగపోటుతన మెందుకు? ఆ కామోదకిని విడిచి నన్ను మర్దింప రాదా! ఎంతమో సంతసించియుందు నే—తాత కొఱకు జక్రమును బట్టెనుగదా! సైంధవవధ నా డవసరమగునేమో యని దారుకునిచేత దన రథమును దెప్పించెనుగదా! నన్నుమాత్ర మా లద్దపురుగుచేత నధర్మముగా జంపించెను.

భాను—స్వామీ! ఎట్లైన నేమి? కావలసిన కార్యము జరిగినదికదా!

దుర్యో—నేను నేనని, నేను దాను నొకటి యని యిన్నాళ్లు గూర్చొనియుంటిగదా! నేను దాను వేఱని నికృష్టునివలె దన్ను సేవింపలేదనియే కదా యీ ద్రోహము. ఇప్పుడు మాత్ర మేమైనది? నేను నేను గాకుండ నితడు చేయగలడా!

భాను—ఆయనకరుణ లేనిదే మన మేమి చేయగలము?

దుర్యో—కరుణ—కర్మఫలప్రదాతయైనవానికి గరుణ యెట్లుండును? నా కీయనకరుణతోడి పని యేమి? నేనార్జించిన సత్కర్మమునకు దగిన ఫల మిచ్చుటలో నింత పక్షపాత మెందుల కంటిని. వాని రథము మహాస్త్రవహ్నులపాలు గాకుండ వానిని ముందు దించి తాను దరువాత దిగెనట. ఈ పదునెన్మిది నాళ్లలో దాను లేనిచో వాడు ప్రతిక్షణమ్మృతి నొంది యుండును. అట్టి యనవకు దన ప్రాపు లేనికి?

భాను—మార్జాలకిశోరములకు దల్లిప్రాపు విశేషముకదా!

దుర్యో—తన్నెఱుగనివా డంధుడు. సత్త్వమును పీఠి దిగివచ్చి యావరణవిశిష్టుడైన వాడు పంగువు. పంగుని భుజములపై నంధు డధిరోహించగా నా వ్యవహార మెంత చక్కగా నైన నడుచును. నాకేమి? ఈనికృష్టప్రపంచమునకు అహంపదార్థ విశిష్టత ప్రకటించుటకు పాటుపడితిని. నా శాఖలనే సంహరింపగల్గెనుగాని నన్ను సంహరింపలేదుగదా! 'నైనం ఛిందంతి శస్త్రాణి' యని తానే చెప్పెను. ఇదుగో, గురుపుత్రుడు వచ్చుచున్నాడు.

అశ్వత్థామ—(ప్రవేశించి) సుయోధన మహారాజా! బ్రదికియుంటివా? పాండవసేనావారమునంతను సంహరించితిని. ధృష్టద్యుమ్నుని, ఉపపాండవులను సంహరించితిని. పాండవు లేవురును, శ్రీకృష్ణుడును మాత్రము కానరాలేదు.

దుర్యో—మిత్రమా! నేను బ్రదికియేయుంటిని. ఇంక శాశ్వతముగా జీవింపగల్గుదునుగూడ. పౌరుషమూర్తివి, నీవంటివానిని మిత్రునిగా బడసి నిక్కముగ బ్రహ్మానందము నొందితిని.

అశ్వ—నీవు పరలోకమున మేలు గలుగుగాక!

దుర్యో—పిచ్చివాడా! పరలోక మెక్కడ నయ్యా! నేను సదాకృతినై సర్వలోకాతీతాయిరైన బ్రహ్మత్వము నొందితిని. అహంపదార్థలక్షితమైన పరవస్తువు నేనే యైతిని. నా మిత్రకోటిలోని కెల్ల నీవే పరమార్థవేదివి.

అశ్వ—ఏమిరైనను సమయమునకు నీ కక్కరకు రాకపోతినిగదా!

దుర్యో—ప్రాపంచిక మెల్ల తుచ్ఛము. అది కావలయు ననుకొన్నచో వాడే శ్రీకృష్ణుని ప్రాపు నొందియుండును.

అశ్వ—అతని ప్రాపు గన్నవా రిట్టిరిగదా!

దుర్యో—ఆ యసమర్థగర్జనలతో మన కేమి పని? కాని నీవు జాగ్రత గలిగియుండవలయును. ఱేపు వారు నీమీదికి దండెత్తివత్తురు.

అశ్వ—రానిమ్ము. బ్రహ్మశిరము లేదా? పాండవేయదారగర్భపర్యంత మపాండవముగా దానిని ప్రయోగించెదను.

భాను—పాండవేయదార గర్భములలో నొకటి మాత్రము మిగులును.

దుర్యో—ఉత్తరాగర్భము కాబోలు. సరే మిగులనిమ్ము. ఆ యస్త్ర మర్జునుఁడు నెఱుగును. అందుచేత నపాండవము కాదు. భానుమతీ! ఇప్పటికి గోచరమైనదా? తన యతీతమాయావిలాసముచే నన్నెట్లు చేసెనో, నా యకుంఠితపౌరుషప్రభావముచే దాని నట్లయ్యెను. ఇక మిగిలినది మే మిగువురమే. నీవు సహగమనమున కనుజ్ఞ నిచ్చితిని. అదిగో దేవతలు పూలసోనలు గురియించుచున్నారు. పంచభూతములో, పంచేంద్రియములో, పంచతన్మాత్రలో, యా రైదుగురితోడనే యూరేగనిమ్ము. ఆయనయే శాశ్వతుడు. తనతో పాటారైదింటిని శాశ్వతముగ నిలుపవలయునని యాయన యిచ్ఛ. కాని యవి కాలవశంగతములై యూరు పేరు లేని చావు చచ్చును. నా కేమి? ప్రకృతిస్వరూపిణివి, నీ ప్రేమభారముతో, పౌరుషప్రభావశౌర్యమూర్తి గురుపుత్రుని మైత్రీసంపదతో నేను సచ్చిదానందమయుడనై ప్రకాశించెదను. అహం బ్రహ్మాస్మి-బ్రహ్మైవాహం. (తెర)

ఆరంభవాదము

శ్రీ వేలూరి శివరామశాస్త్రి

ఆందరకును జగద్రూపమగు కార్యము కనిపించుచున్నది. దీనిని సృజించిన వా డెవడు? లేక దేనివలన నిది యగుచున్నది? అనగా, ఈ కార్యమునకు కారణ మేమి? ఆ కారణముతో ఈ కార్యమునకు గల సంబంధ మేమి?

ఈ సంబంధము ప్రాయికముగా మనకు కానరానిది. మానవుడు కార్యకారణ సంబంధమును కనుగొనక ఒక అడుగేని ముందుల కిడజాలడు. ఈ సంబంధము నాలోచించి యాలోచించి అనాదికాలమునుండియు మానవు డెన్ని తత్త్వములను మనస్సను ద్రవమునుండి ఎగబోసెనో దాని కెవరేని లెక్క వేయగలరా? వైద్య పదార్థ రసాయన ఖగోళగణితాదు లగు మహాశాస్త్రముల మెరుగ మెటులు కలిగెను? ఈ మెరుగ మానవసభ్యత కెంతగౌరవము! భూతకాల భావనయే యీ విజ్ఞానమునకు దూరవీక్షణ యంత్రము కాదా? అది యటుండగా భవిష్యత్కాలపు నూతులలోనికి దృష్టి సారింతము. అదియు ఈ కార్యకారణభావనా రూపమగు జ్ఞానసాహాయ్యముచేత నేకదా కనబడును! భవిష్యద్భావన లేని మానవులకు అభ్యుదయమార్గము కానబడదు. అడుగు సాగదు.

కార్యము భవిష్యత్తు. కారణము భూతము. తిరిగి కార్యము వర్తమానము. కారణము భూతము. కావున కార్యకారణములే మనకు భూతభవిష్యద్వర్తమానములు.

ఈ కార్యకారణముల పరామర్శమే దర్శనము. ఈరీతిగా దర్శనమే మానవుని సకలవిజ్ఞానమునకు పునాది. ఉపనిషత్తు, అవెస్తా, బైబిల్, కొరాన్ మొదలగు వేదాంతము లన్నియు అచలమగు ఈ భిత్తిపైనే నిలిచియున్నవి. కార్యకారణసంబంధమును సమగ్రముగా నెరుగజెప్పుటయే దర్శనముల యుద్దేశము. దర్శనము లన్నియు ముత్తెరగుల సిద్ధాంతముల నవలంబించి యున్నవని అనవచ్చును. అవి ఆరంభవాదము[1], పరిణామవాదము[2], మాయావాదము, లేక వివర్తవాదము.[3]

ఆరంభవాదము

కణాదుడును, గౌతముడును ఈ *యారంభవాదమునకు ప్రవర్తకులు. ఉత్ప

1. పరమాణ్వాద్యసమవాయి నిమిత్తకారణములు తమకంటె వేరగు కార్యమును పుట్టించునను ఆరంభవాదము నైయాయికులు వైశేషికులు మొదలగువారిది.

2. ఉపాదానకారణమే మారి కార్యమగు ననుపరిణామవాదము సాంఖ్యులు పాతంజలులు రామానుజీయులు మొదలగు వారిది.

3. శంకరానుయాయులగు అద్వైతులది వివర్తవాదము. అతాత్త్వికమగు కారణాన్యథాభావము వివర్తము.

*"ఆరంభవాదః కణభక్షపక్షః
సంఘాతవాదస్తు భదన్తపక్షః
సాంఖ్యాదిపక్షః పరిణామవాదో
వేదాన్తపక్షస్తు వివర్తవాదః."

త్తికి పూర్వము కార్యము లేదు. కారణ సామగ్రి యెల్లయు కలిసిన ఉత్తరక్షణముననే కార్య ముత్పన్నమగును. కారణముకంటె కార్యము పూర్తిగా వే రని వీ రందురు.

సమవాయి కారణము

కుమ్మరి ఒక కుండ చేయబోవుచున్నా డనుకొందము. అతడు మొదట నేమి చేయును? మన్ను నీరు బూడిద సారెకోల మొదలగువానిని చేతికింద ఉంచుకొనును. కుండ కివి యన్నియు కారణములే. ఆరంభ వాదు లీ కారణములలో మట్టిమాత్రము సమవాయికారణ మని అందురు. ఏదేని కార్యము దేని యవలంబమున పుట్టి దేని యవలంబమున మెట్టి మఱి దేన గిట్టునో ఆ కారణము సమవాయికారణము. లేక ఉపాదానకారణము. కుండ మట్టివలననే అగును. ఉన్నంతవట్టు ఆ మట్టి చిదురలనే ఆశ్రయించుకొని యుండును. వినాశకాల మున ఈ మట్టి మట్టిలోనే కలిసిపోవును. కావున కుండకు మట్టి సమవాయికారణము. లేక ఉపాదానకారణము.

నిమిత్తకారణము

కుండ కీ సమవాయికారణమే కాక సారెకోల మరికొన్ని కారణములు కానబడు చున్నవి. కార్యముత్పన్నమగు పూర్వక్షణము వరకు ఇవి యన్నియు నుండవలయును. ఉత్పత్తియగు పిదప కార్యమునకు వీనితో పని లేదు. ఇట్టికారణము లన్నియు నిమిత్త కారణములు. కుమ్మరి సారె కోల మొద లగున వన్నియు నిమిత్తకారణములు. కుండ యగు పూర్వక్షణమువరకు వీని యపేక్ష యుండునుగాని ఉత్పన్నమయినతరువాత నివి యేవియు లేకున్నను కుండకు ధోకా లేదు. కావున కుమ్మరి మొదలగు కారణములు నిమిత్తకారణములు.

అసమవాయి కారణము

ఇది సమవాయికారణము నాశ్రయించు కొనియుండును. ఈ అసమవాయికారణము నశించు నేని కార్యముగూడ నశించును. ఇట్టి కారణమును ఆరంభవాదులు అసమవాయి కారణ మని యందురు. కుండకు ఈవలి యావలి రెండు పెంకుల కలయికయు, కోకకు నూలుపోగుల కలయికయు అసమవాయి కారణము.

ఒక కార్యమునకు సమవాయికారణము లనేకము లుండవలయును. ఒక కుండ చేయుటకు దానికి తగినన్ని మట్టియణువు లుండవలయునుగదా! ఈ సమవాయికారణము లన్నియు నొండొండ కలిసికొననిచో కుండ కాదు. కాన పుట్టబోవుముందు సమ వాయికారణము లుండవలసిన చందముగనే ఆ సమవాయికారణముల కలయికయు నుండ వలయును. ఆ కలయిక లేనిచో కార్య ముత్పన్నము కాదు. కావున ఏదేని కార్య మగుటకు సమవాయికారణములతోపాటు వాని కలయికగూడ కారణమని అంగీకరింప వలయును.

ఈ కలయికను నిమిత్తకారణములలో నొకటిగా ఏల చేర్పరాదు?

నిమిత్తకారణములు నశించుచో కార్యము నశింపదు. అసమవాయికారణము అనగా

సమవాయికారణముల కలయిక. విడివడుచో దానితోపాటు కార్యముగూడ విడివడును. అనగా నశించును. కావున నిమిత్తకారణముల స్వభావము వేరు; అసమవాయికారణముల స్వభావము వేరు. ఉదాహరణమున కొక కుండను చేకొందము. కుండకు నిమిత్త కారణములగు కుమ్మరి సారె కోల మొదలగువానిలో కుమ్మరి చచ్చినను సారె పగిలినను కోల విరిగినను కుండ పగిలి చెక్కలయిపోదు. రెండుపెంకుల కలయిక అసమవాయి కారణము. కుండ కావలి యీవలి కపాలముల కలయిక విచ్చుచో కుండయు విచ్చిపోవును. కావున నిమిత్తకారణములకంటె భిన్నముగా అసమవాయికారణమును అంగీకరింపవలయును.

ఓయీ! మట్టిచిదురలు నశించుచో కుండయు నశించును. కాన సమవాయి కారణనాశమే కార్యనాశమునకు కారణము. ఇటు లయియుండగా మరల నొక కొత్త కారణమును ఏల నెత్తి కెత్తుకొనవలెను? ఇది బరువు కాదా?

అగును. ఇది తప్పని బరువు. కార్యపు సమవాయికారణము లనిత్యము లయిన యెడల కార్యనాశమునకు కారణమగుట నిక్కమే. కాని కార్యద్రవ్యము లన్నిటియు సమవాయికారణములు అనిత్యములు కావు. ఎటులనిన రెండు పరమాణువులు కలిసి ద్వ్యణుక మను కార్యము కలిగె ననుకొందము. ఆరంభవాదుల మతమున పరమాణువులు నిత్యములు. కాబట్టి ద్వ్యణుకరూపమగు ఈ కార్యము నశించుటకు కారణ మేమి యని యాలోచింపవలసియున్నది. రెండు పరమాణువులును నశించిననే ద్వ్యణుకరూపమగు కార్యము నశించునని యనరాదు. ఏలన, పరమాణువులు నిత్యములు. వానికి నాశము లేదు. కాన ఈ రెండణువులయు కలయిక చీలిపోవుటవలననే యీ ద్వ్యణుక రూపమగు కార్యము నశించు నని అనవలయును. ఏలన ఈ పరమాణువుల కలయికయే అసమవాయి కారణము. ఆ కలయిక ధ్వస్త మగుటచేసియే ద్వ్యణుకరూపమగు కార్యము ధ్వస్తమాయెను. కావున అసమవాయి కారణము వేరుగా సిద్ధించుచున్నది.

కార్యము వేరు, కారణము వేరు

ఏ మట్టి యణువులు కలిసి కుండ యాయెనో ఆ మట్టియణువులే కుండ యని మనకు తోచునుగాని ఆ యణువులే కుండ కాదు. మృత్పరమాణువులు కుండకు కారణము. కుండ మృత్ పరమాణువుల కార్యము. కారణము కంటె కార్యము వేరు. మట్టిచిదురల ప్రోవే కదా కుండ యని యన చెల్లదు. కారణమే కార్య మగునెడల శిల్పులు కార్యము నిర్మింప ప్రయాసపడవలసిన పని లేదు. కారణము కంటె కార్యము వేరుకానియెడల కారణముతోపాటు కార్యముగూడ పూర్వసిద్ధమయి యుండవలయును. ఈరీతిగా పూర్వమే కార్యము సిద్ధించుచో దానికి వేర ప్రయత్నమెవరు చేయుదురు?

ఇంతియ కాక కారణముచే ననుకూలపడు పనులు కార్యముచే సానుకూలములు కావు. అటులే కార్యముచే కాదగిన పనులన్నియు కారణముచే కావు. మట్టితో ఇల్లు మేగుకొనవగునుగాని కుండతో నెవరును మేగిజాలరుకదా! కుండతో నీరు తెచ్చుకొనవచ్చునుగాని కోట్లకొలది మృత్

పరమాణువులతో నయినను నీరు తెచ్చుటకు వలను పడదుగదా. మట్టియు కుండయు నొక టియే యగునెడల మట్టిపని కుండవలనను కుండపని మట్టివలనను జరగవలయును. అటులు జరగుటలేదు. కావున 'మట్టి వేరు, కుండ వేరు' అని అనితీరవలయును. ఈరీతిగా పెక్కు ఉదాహరణములు చూపి ఆరంభ వాదులు కారణముకంటె కార్యము నిక్క చ్చిగా వేరని నిరూపించిరి.

విశ్వము

ఒక పరమాణువు మరియొక పరమాణువుతో కలిసి రెండణువులు కల ఒక ద్రవ్యమగును. అది ఇంకొకదానితో గలిసి మూడణువులు కల ఒక ద్రవ్య మగును. ఇటులు క్రమక్రమముగా అనేకపరమాణువులు కలిసి యీ విశ్వమంతయు నగుచున్నదని ఆరంభ వాదు లందురు. మరణ సమయమున ఈ ప్రపంచమునకు కారణమేమి ? అని కణాదు నడుగగా 'పీలవః పీలవః పీలవః' అని చెప్పె నని ఒక ఆభాణకముగలదు. పీలువనగా పరమాణువు. సృష్టి కవ్యవహితపూర్వము రెండుమ్యృత్ పరమాణువులతో ఆరంభించి అనేకపరమాణువులతో కలిసి క్రమముగా స్థూలమును స్థూలతరమును స్థూలతమమును అయి యీ భూమి ఆయెను. ఆచందము గనే అతిసూక్ష్మములగు జలీయపరమాణువులును ఒండొండ కలిసి స్థూలమును స్థూలతరమును స్థూలతమము నగు రూపొంది సముద్రముగా నాయెను. ఇటులే అగ్నిపరమాణువులును వాయుపరమాణువులును కలిసి స్థూలాగ్నిగను స్థూలవాయువుగను ఆయెను. ఈరీతిగా ఈ విశ్వ మెల్లయు నలు తెరగు లగు పరమాణువుల సమిష్టిస్వరూపము.

ఈ సృష్టికి పూర్వము ప్రత్యక్షముగా కానిపించు వస్తు వేదియు లేదు. నిత్యములగు గాలి నిప్పు నీరు మన్నుల పరమాణువులును దిక్కాలాకాశములును ఈశ్వరుడును లెక్కలేని జీవాత్మలును ఈసృష్టికి పూర్వమున్నవి.



పెంపకపు మమకారము

శ్రీ కాశీపట్నపు రామారావు

(గతసంచిక తరువాయి)

సుదర్శనం మళ్లా సాయంకాలం అయిదింటికి ఇంటికి వచ్చాడు. నూతివద్ద కాళ్లూచేతులూ కడుక్కొని ఇంట్లోకి పోతుంటే సుబ్బులు ఎదురై అడిగింది.

"మధ్యాహ్నం భోజనానికి రాలేదేం అన్నయ్యా!"

ప్రక్కనే తల్లి ఉండడం చూచి సుదర్శనం ఓవిధమైన తత్తరపాటుతోనే ప్రక్కగదిలోనికి వెళ్లి పోయాడు. కాని సుబ్బు లిది గ్రహించకుండా వెంటాడింది.

"ఎందుచేతంటే మాటాడేవేమీ?"

ఈసారి తల్లి కాస్త కనుచాటవడంతో సుదర్శనం చెల్లి ముఖంలోకి తీక్ష్ణంగా చూశాడు. సరిగ్గా ఆదేసమయంలో వట్టింటిలోంచి ఒక ఉచ్చస్వరంతో జవాబొచ్చింది.

"ఎందుచేతా? ఇవాళ మీయమ్మ శ్రాద్ధపుదినం. అందుచేతే తండ్రీకొడుకులిద్దరూ రోజల్లా భోజనం మానుకు కూర్చున్నారు."

సుదర్శనం ఒక్కసారి ఉగ్రుడైపోయాడు. ఆ మంటంతా చెల్లెలిమీద రాలుస్తూ హుంకరించి తల జోరుగా విసురుతూ అన్నాడు—

"హుం, విను. కడుపునిండిందా?" తీక్ష్ణంగానే అయినా మందస్వరంలోనే అడిగాడు.

సుబ్బులుకు తల్లి పెట్టినవాటితో కడుపు నిండినా నిండకపోయినా అన్న పెట్టినవాటితో పూర్తిగా నిండి పోయి ఉంటుంది. అందుచేతే విక్కసంగా కదిలి బైటికి వెళ్లిపోయింది.

తర్వాత రాత్రి మళ్లా వడ్డనవేళవరకూ సుబ్బులు పెదవి కదిపితే ఒట్టు. ఒడ్డిస్తూ ఒడ్డిస్తూ తండ్రికి అన్నం వేసేటప్పుడు అంది:

"మరికొంచెం వేయించుకోండి, మధ్యాహ్నం భోజనం చెయ్యలేదు కూడా."

దానికి తండ్రి నవ్వుతూ జవాబిచ్చాడు:

"అదా సంగతి? నేను మధ్యాహ్నం భోజనం చెయ్యలేదనుకుంటున్నారా? నాకు అలాటి అలకలూ అవీ చాతకావు. అలాటివన్నీ మీ అమ్మవంతు. నేను హాయిగా అక్కయ్యగారి ఇంట భోజనం చేశాను. ఇవాళ నేను వాళ్లింట మొదటి చుట్టాన్ని."

దానిమీద సుబ్బులు అంది:

"ఏమో మరి! మాకేం తెలుసు?"

"అదే! మీకు చెప్పలేనుమరి! వెళ్లేటప్పుడు చెపుదామనుకుంటూనే మరిచిపోయాను."

తర్వాత ఎవరూ మాటాడలేదు. కాని సుదర్శనం ఈ లఘుసంవాదనకు ఆదిని భయపడ్డాడు. తర్వాత ఆశ్చర్యపోయాడు. తల్లి ఈ సందర్భంలో మౌనంగా ఊరుకోవడం అతనికి ఆశ్చర్యాన్నే కలిగిస్తూంది మరి.

౬

ఈ ఆకస్మిక అప్రియసంఘటన ఆ శిథిలసంసారంలోని తక్కిన వ్యక్తులను బాధించవలసినంతగా బాధించిందో లేదో తెలియదుకాని సుదర్శనాన్ని మాత్రం పెట్టవలసిన యాతనకన్నా ఎక్కువయాతనే పెట్టింది.

ఎందుచేతంటే ఆ విద్యాధికుడైన నవయువకునకు కుదురుగా కూర్చుని ఆలోచించి భవిష్యత్పరిణామాలు ఊహించి భయపడి బాధపడడానికి కావలసిన చురుకైన మెదడూ చాలా తీరికా ఎక్కువగా ఉన్నాయి.

అతడు తీరుబడిగా పుస్తకాలు ముందు వేసుకొనో, లేక పడకకుర్చీలో నిమీలితనేత్రుడుగా పండుకొనో ఈ గృహవిచ్ఛిత్తిగురించీ, దీన్ననుసరించే హృదయపరివర్తన గురించీ ఆలోచిస్తుండేవాడు.

అత డూహించుకునే భవిష్యచ్చిత్రం ఒక్కొక్కసారి ఆలోచించేటప్పుడు ఒక్కొక్కరూపు మార్చుకుంటూండినా ప్రధానాంశం మాత్రం ఒక్కటే.

పెత్తల్లిని రైలెక్కించటానికి తోడ వెళ్ళినప్పుడు అతనా ఆలోచనల సారాంశాన్నే వెళ్లబుచ్చాడు.

రైలు కింకా 'లైన్ క్లియర్' కాలేదు. ప్లాటుఫారంనిండా మనుష్యులూ, మనుష్యులకు రెండుమూడురెట్లు సామానులూ చెదురుగా సవ్యాపసవ్యంగా పడి ఉన్నాయి. ఒక చివరగా కుంకుడుచెట్టుక్రింద నల్లని పెద్ద ట్రంకుపెట్టెమీద పెదతల్లీ ఒక గోనెసంచిమూట మీద సుదర్శనం మాట్లాడుకుంటూ కూర్చున్నారు. సుదర్శనం ఉండి ఉండి అన్నాడు—

"నాకు ఒక్కదానికి కష్టమనిపిస్తుంది దొడ్డమ్మా! యింతా చేసి చివరకు ఆమెకు మాట దక్కకుండా పోయింది. విడిపోవటంలో పెద్ద అసంగత మేమీ లేదు. కాని అదే మంచి పరిస్థితుల్లో విడిపోయివుంటే నాకు కష్టమనిపించకపోను. చివరకు కొట్లాడుకొని విడిపోయారని నలుగురూ అనుకోటానికి వచ్చింది. మళ్లా ముఖాలు చూసుకోకుండా చేశారు. అదే కష్టమనిపిస్తూంది."

సుదర్శనం ఆగిపోయాడు. విషాదం అతని మాటల్లో నే కాక ముఖంలో కూడ స్పష్టంగా చూస్తోంది పెత్తల్లి.

నిజమే; సుదర్శనం అన్నట్టు మనుష్యులు విడిపోవటంలో పెద్ద అసంగత మేమీ లేదనటం సత్యమే. కాని ఆ మంచిపరిస్థితుల విషయమే ఒక సందేహం. మంచిపరిస్థితులే ఏర్పడితే అసలు విడిపోవలసిన అవసరమే ముందీ? లేక మంచిపరిస్థితులు కలిగినదాకా కాచుకొని ఉండి అప్పుడు విడిపోవటం అనే గత్యంతరం తీసుకొన్నా రెండుపార్టీలమధ్య ఘర్షణ అంటూ ప్రారంభించాక ఆ ఘర్షణ ఆగటం అంటూ ఎప్పుడు సమకూరుతుందీ? ఇంతకూ అసలు జరిగినది కూడా కాస్త రూపం మార్చుకున్నా—సుదర్శనం ఎలా జరిగితే బాగుంటుందనుకున్నాడో అలానే జరిగిందేమో?

అయితే బేచులర్ ఆఫ్ ఆర్ట్సు విద్యార్థికి ఇలాటి ప్రశ్నలు తట్టకపోవటంలో అతని లోప మేమీ లేదనుకుంటాను.

సుదర్శనం విషాదపూరితస్వరంతో అన్నాడు:

"అమ్మతత్వం నీకు తెలుసు! బహు పట్టుదల మనిషి! మళ్లా వాళ్ల ముఖం చూస్తుం దనుకోను. యింకే మేమైనా ఆమెను కష్టపెట్టలేం కదా!......"

సుదర్శనం ఈవిధంగా మూడు ముక్కలతో తమ చిరకాలసంబంధం తెగగొట్టేశాడు. కాని నిజంగా అత నన్నట్టు ఈ సంబంధమే తెగిపోతే, అత డూహించలేదు కాని, సరస్వతి ఎక్కడ వెళ్లి పడుతుందీ? ఆమె జీవనరంగంలో ఏకింట అయిదుపాళ్లూ ఈ మూడుమాటలతో శుద్ధఎడారిగా మారిపోయిందన్న మాట.

ఈ చిత్రమే పెత్తల్లిని భయపెట్టి మాట్లాడించింది. ఆమె అంది—

"పోనిద్దుబ్బాయ్! చిన్న పిల్ల ఏదో తెలివితక్కువగా ప్రవర్తిస్తే పెద్దవాళ్లు గడుపుకోవాలి! చదువుకున్నవాడివి—నువ్వూ అలా అంటే ఎలా!

"కాని, అమ్మమాట దొడ్డమ్మా అమ్మ మనసెలా కష్టపెడతాం?"

దానికి క్షణకాలంవరకూ పెత్తల్లి జవాబివ్వలేదు. తర్వాత సందేహంగా అంది:

"ప్రతీదీ అమ్మకు తెలుస్తుందా ఏమిటి? ఏదో విధంగా చెయ్యాలి. అసలే మీరుతప్ప దానికి నా అనే వా ళ్లెవరూ లేరు. ఇప్పుడు మీరు కూడా ఎడపెట్టేస్తే ఏమౌతుందీ?"

సుదర్శనం జవాబుకోసరం వెదుకుతుంటే లయిన్‌క్లియర్ గంట కొట్టారు. దృష్టి అటుతిరిగేసరికి రెండేళ్లయి కలుసుకోనని దగ్గరస్నేహితు డొకడు అయిదారుగజాలదూరంలో తనవంకే చూస్తూ నిలుచుని ఉన్నాడు. త్వరలోనే వస్తానని పెత్తల్లితో చెప్పి స్నేహితుణ్ణి కలుసుకొని బాతాఖానీలో పడ్డాడు.

౮

ఒకనాడు సాయంకాలం కళాశాల విడువగానే సుదర్శనం ఒక స్నేహితునితో మాట్లాడుతూ వస్తున్నాడు. మెయిన్‌రోడ్డు జంక్షన్లో అకస్మాత్తుగా చిరపరిచితమైన స్వరం వినిపించింది. ఎవరో కాదు శ్రీపతి.

శ్రీపతి తన చిన్నగొంతుతో అరుస్తున్నాడు.

"నూమస్కోర్యయ్ మామయ్యా!"

సుదర్శనం ఒకసారి వెనుతిరిగి చూశాడు. తండ్రీ కొడుకులు!

ఒకసారి వెనక్కు తిరిగి చూచాక చూడనట్లు ముఖం తిప్పేసుకొని వెళ్లిపోవటం సుదర్శనానికి చాతనయిందికాదు. స్నేహితునివద్ద శెలవుతీసుకొని చిరునవ్వుతో మేనల్లుని ఎదుర్కొనడానికి వెళ్లాడు.

ఒకరినొకరు సమీపించగానే శ్రీపతి మామ రెండుకాళ్లూ పట్టుకొని కావలించేసుకున్నాడు. సుదర్శనంలో కూడా వాత్సల్యతకు కొరత లేదు. కాని అతడికి పిల్లల్ని ఎత్తుకోవడం అలవాటు లేదు. పైగా వేసుకున్న సూటూ, నడిబజారూ అందుకు చాలా అననుకూలంగా ఉన్నాయి. అందుచేత అలానే ఓసారి అల్లుని లేతతనువును కాళ్లకు అదుముకొని తర్వాత పట్టు విడిపించుకుంటూ అడిగాడు.

"ఎక్కణ్ణుంచిరా మామా?"

"బదారుకి—బదారుకి—బిసకత్తులు కొనుక్కోలాంకి వచ్చాం."

ఆ నాలుగుమాటలూ త్రోయగా త్రోయగా చివరకు ఊడి బయటపడ్డాయి.

అల్లునిచేత ఇటువంటి ఫీట్సు చేయించి సంతోషించడం మామకు అలవాటు. అందుచేత మరోక ఫీటు పురమాయించే ఉద్దేశంతో అన్నాడు:

"మరైతే కొన్నావా?"

శ్రీపతి అంగీకారసూచకంగా తలతోపాటు శరీరమంతా ఊపుతూ జవాబిచ్చాడు.

"ఊఁ...ఊఁ...కొన్నాను. యి యిగో....."

అంటూ జేబుమీద చెయ్యివేశాడు.

సుదర్శనానికి యింకా తృప్తి కలుగలేదు. అందుచేత అన్నాడు.

"మరి నాకో!"

శ్రీపతి భద్రంగా ఓ బిస్కత్తుముక్క పైకితీసి యివ్వబోయాడు.

కాని సుదర్శనం చిన్నపిల్లల మారాంను అనుకరిస్తూ అన్నాడు—

ఊఁ....ఊఁ......నాకవి వద్దు. ఇంతకన్నా మం...చిది కావాలి."

శ్రీపతి స్నిగ్ధహృదయంలో ద్వంద్వభేద రోగం ప్రవేశించలేదు—కనీసం ఇలాటి పదార్థాల విషయంలో. కారణం యింట్లో వాడికి యింకో పోటీ లేకపోవడం. అందుచేత వాడికి మామమాట బోధపడలేదు. వాడలా తెల్లబోయి చూస్తుంటే తండ్రి దూసి కర్తవ్యం ఉపదేశించాడు.

"అయితే మంచివి కొని యిమ్మనురా...... అను! 'మామా, ఆ మంచివేవో ఒకసారి కొని చూపించు. ఈసారి అలాటివే పెట్టుకుంటాను' అను."

తండ్రి బోధింపవచ్చిన కర్తవ్యం కూడా కుమారునితల కెక్కలేదు. చివరకు సుదర్శనం తెల్లబోయి చూస్తున్న అల్లుణ్ణి కాళ్లకు అదుముకుంటూ నవ్వాడు.

తర్వాత అకస్మాత్తుగా సంభాషణ స్తంభించిపోయింది. ఘర్షణలకు వెనుకంజవేసే సుదర్శనమే కదిలాడు.

"యిలా యెక్కణ్ణుంచి?"

యెందుచేతో మూర్తి సరిగా జవాబివ్వలేదు. 'యిక్కణ్ణుంచే' అంటూ నసిగేశాడు. ఈ పరాఙ్ముఖత

సుదర్శనానికి చుర్రు మనిపించింది. కాని మాత్రే సర్దుకున్నాడు.

"యెక్కడా అగపడ్డం లేదేం ?"

దాని కేం జవాబు చెప్పాలి ? సుదర్శనం ఏదో చెప్పాడు.

"సరే, రేపు శనివారం శెలవు కదూ! అలా ఓసారి రా!"

సుదర్శనం మంత్రితుడిలా జవాబిచ్చాడు:

"అలాగే"

"ఇల్లు తెలుసు కదూ—కలెక్టరేట్ కు పడమటి రోడ్డున. పద్మాబిల్డింగ్స్ దాటాక ఆ మలుపులో మొదటి యిల్లే."

యింతలో శ్రీపతి అందుకున్నాడు.

"మామయ్యా, యిప్పుడే లా మామయ్యా !"

"కాదులే మామా ! రేపు వస్తాను."

"కాదు ఇప్పుడే"

"కాదు—రేపు"

శ్రీపతి టిక్కమొహం వేసేశాడు.

"అది కాదురా నాన్నా ! రేపు వస్తాడు; ఇప్పుడు మామయ్య కాలేజీకి వెళ్తున్నాడు. రేపు వస్తాడు."

మామ కూడా యీ అబద్ధానికి సాక్ష్యం యిచ్చాడు. చివరి కెలాగో ఆ పెద్దమనుష్యులిద్దరూ తోడై పసివాణ్ణి మోసం చెయ్యగలిగారు.

సుదర్శనం దారికడాకా ఆలోచిస్తూనే ఉన్నాడు. 'మర్నాడు వెళ్లటమా మానటమా' అని, తర్వాత రాత్రి నిద్రపోయేముందుకూడా మళ్లా యీ విషయమే జ్ఞాపకం తెచ్చుకున్నాడు. వెళ్లకూడదనే ప్రాతిపదికతో ఆలోచిస్తూ ఉంటే అతని అంతరంగంలో వెళ్లటమే ధర్మమనే వ్యతిరేక ప్రాతిపదికను బలపరిచే యుక్తులు ఒకదానివెంబడి ఒకటి స్ఫురించసాగాయి.

చిన్నప్పుడు చదువుకున్న 'ఉపకారికి నుపకారము' అనే పద్యంలోని సుమతినీతీ, మహాత్మునిబోధనలూ ఒకటేమిటి—చాలాచాలా యుక్తులు అగపడ్డాయి. అందులో ముఖ్యంగా రెండు—తండ్రి తనకు చాలాసార్లు చెపుతూవచ్చిన పాఠాలూ, పోతూపోతూ పెత్తల్లి అన్న మాటలూ. ఈ రెండు మూసాలయి సరస్వతి ఒంటరిజీవితం ఎలా గడిపి ఉంటుందో ఊహించుకుంటుంటే ఎప్పుడు పట్టేసిందో నిద్ర పట్టేసింది.

౮

అనుకున్ననాడు వెళ్లలేదు కాని—చివరకు ఒకనాడు బయలుదేరాడు. ముహూర్తం మిడిసరిలగ్నం అవడంచేత కలెక్టరాఫీసురోడ్డు కూడా నిర్మానుష్యంగానే ఉంది.

సుదర్శనం యిల్లు సుళువుగానే గుర్తుపట్టగలిగాడు.. కాని మెట్లెక్కుతుంటే ఆ ఆరవశత్రువును మరోకసారి ఎదుర్కోవలసివచ్చింది. ఎలాగో శత్రువును ప్రక్కకు నెట్టి తలుపు తట్టగలిగాడు. లోనుండి 'ఎవరూ ?' అంటూ కేక వినవచ్చింది. కాని సుదర్శనం జవాబివ్వకుండానే మళ్లా తలుపు తట్టాడు. తలుపు తెరువబడింది. కుడిచెయ్యి వెనుక్కు దాచుకొని సరస్వతి ఎదురుపడింది.

సరస్వతి తనను చూడగానే కొత్త త్రుళ్లిపడడం సుదర్శనం గుర్తించాడు. క్షణకాలం యిద్దరూ అలాగే నిలుచున్నాక ఆమె లోనికి తప్పుకుంటూ శ్రీపతిని పిలిచి మామరాకను తెలియజేసింది. శ్రీపతి గజేంద్రుణ్ణి రక్షింపవేగే సంరంభంతో నగ్నరూపంలో మూతినిండా మెతుకులూ, చేతిలో కొబ్బరికాయ ముక్కలతో దర్శనమిచ్చాడు అల్లుడూ మామా ఇద్దరూ నవ్వూచిరునవ్వులతో పలకరించుకున్నారు. తర్వాత ముగ్గురూ ఎవరిస్థానాల్లో వారే మౌనంగా ఉండుకున్నారు. సుదర్శనం లోనికి వెళ్లటమా మానటమా అనే సందేహంతో అలాగే నిలిచిపోయాడు. కొద్దిసేపట్లో నే తన పొరపాటు గుర్తించిన సరస్వతి కొట్టుకునే గుండెలతో అంది—

"లోపలికి రా అన్నయ్యా! అవతల ఉండిపోయావేం ?"

సుదర్శనం లోనికి వెళ్లాడు. కాని మళ్లా

అతణ్ణి సంశయచిత్తుణ్ణి చేస్తూ సరస్వతి లోనికి వెళ్లిపోయింది. సుదర్శనం 'ఏదీ చప్పుడూ లేకుండా వెళ్లిపోదామా ?' అనుకున్నాడు. కాని యెలా ?

సరిగా ఈసమయంలోనే సరస్వతి చేయి చీరచెరగుతో తుడుచుకుంటూ ప్రవేశించి నూల సన్నచాప తెచ్చింది. సుదర్శనం కూర్చుంటూ తన తప్పు గుర్తించాడు. తరవాత సరస్వతి కొడుకువంక తిరిగి అంది—

"నువ్వు భోంచేసి రారా నాన్నా ! మామ యిక్కడే వుంటాడు. వెళ్లు !"

శ్రీపతి ప్రశ్నార్థకంగా బుర్ర తిప్పుతూ మామను ఉద్దేశించి అడిగాడు :

"ఉంటావా మరి ?"

మామవాగ్దానం గ్రహించాక వంటయింట్లోకి వెళ్లిపోయాడు.

శ్రీపతివెళ్లగానే సుదర్శనం చెల్లెలివంక తిరిగి అడిగాడు —

"నువ్వు కూడా సగంభోజనంలో లేచిపోయినట్టుంది ?"

"లేదు. నా భోజనం అయిపోయింది."

"కాదు. నీ భోజనం కాకపోతే వెళ్లి భోజనం చేసి రా !"

ఈ బరువసా గ్రహించి కాస్తసేపు పోయాక జవాబిచ్చింది:

"సరే అల్లుడురానీ, వెళ్తాను."

సుదర్శనానికి ఎవర్నీ బతిమాలడం అలవాటు లేదు. మరికొంతసేపు గడిచాక సరస్వతే అడిగింది—

"దొడ్డమ్మ యిక్కడే ఉందా ?"

సుదర్శనం జవాబిచ్చాడు. మళ్లా కొంతసేపు నిశ్శబ్దం. సరస్వతే మాట్లాడుతూ మళ్లా అడిగింది—

"నాన్నగారూ, సుబ్బులూ అంతా కులాసాగా ఉన్నారా ?"

జవాబిస్తూ, ప్రశ్న ఆలోచనాపూర్వకంగా చేసిన దవునా కాదా అని ఆలోచించసాగాడు. తర్వాత సరస్వతి వెల్లడించిన విషయం ఆలోచనా విషయాన్ని మార్చేసింది.

"నాన్నగారు ఆమధ్య పదిహేనురోజులక్రిందట ఒకసారి వచ్చారు. మళ్లా రాలేదు."

ఈవిషయం సుదర్శనానికి పెద్ద ఆశ్చర్యాన్ని కలిగించలేదు. ఆలోచనకుమాత్రం ప్రేరేపించింది.

ఇంతలో అల్లుడు పరుగెత్తుకుంటూ వచ్చి మామమీద వ్రాలబోయాడు. తల్లి తుళ్లిపడి ఒక్క అంగలో పట్టుకుని కసురుతూ వారించింది. శ్రీపతి నివ్వెరపోయాడు. మామ కూడా ఆలాటిముఖమే చేశాడు. సరస్వతి సౌమ్యస్వరూపంతో కొడుకుతడి ఒళ్లు తుడుస్తూ అంది—

"అలా వెళ్లి మీదపడితే మామయ్యబట్టలు పాడవవూ—"

అంటూ ఒళ్లంతా తుడిచి మామకు అప్పజెప్పింది. అల్లుడూమామలిద్దరూ ఒకర్నొకరు కౌగలించుకొని ముచ్చట్లుపడ్డారు. సరస్వతి భోజనం ముగించుకోవడానికి వెళ్లింది.

కొంతసేపయాక సుదర్శనం అల్లుణ్ణి ఒళ్లోంచి లేవనెత్తి నిలవబెడుతూ మంచినీళ్లు తెమ్మని పురమాయించాడు.

శ్రీపతి అక్కణ్ణుంచే కేకలువేస్తూ వెళ్లి కొద్దిసేపట్లోనే అతిప్రయత్నంమీద నీళ్లు తొణకనీకండా తెచ్చి మామ కందిస్తూ అన్నాడు—

"అమ్మ ! ఎప్పులా ఏలవలమే మామయ్యా ! ఎప్పులూనూ !"

శ్రీపతి ఈమాటలు అభినయపూర్వకంగా చెప్పాడు. కాని మామను ఆ అభినయం ఆకర్షించలేదు. అతను పెదవులముందు పెట్టుకున్న గ్లాసును అలానే ఉంచేశాడు. పావునిముషం, అరనిముషం, నిముషం గడిచినా గ్లాసు అలానే ఉండిపోయింది. శ్రీపతిబుర్రలో ఏం మెదిలిందో ఏమో, అన్నాడు—

"నీల్లు మంచివే మామయ్యా, అమ్మ బిందెలోంచి తీచి యిచ్చింది."

సుదర్శనం యీ హెచ్చరికతో నీళ్లు తాగేశాడు. తర్వాత గ్లాసు ఎడంగా పెట్టి అల్లుణ్ణి దగ్గరకి లాక్కుంటూ రహస్యంగా అడిగాడు—

"ఇప్పు డేడుస్తోం దా ఏమిరా ?"

"ఆఁ. నన్ను చూలగానే కళ్లు తుడిచీసుకుంది"

తర్వాత సుదర్శనం మళ్లా ఏప్రశ్నా వెయ్య లేదు. కొంతసేపటికి సరస్వతి వచ్చింది. సుదర్శనం ఆమెముఖంలోకి చూడగానే అల్లుని మాటల్లోని సత్యం గోచరించింది.

సుదర్శనం అలానే విడవకండా చెల్లెలిముఖం లోకి చూడసాగాడు. సరస్వతి ఆ చూపులను ఎదు ర్కో లేక ముఖం వంచేసింది. తర్వాత ఏదోపని జ్ఞాపకంవచ్చినదానిలా అక్కణ్ణుంచి కదిలిపోయింది.

ఈసారి ఆమె తిరిగివచ్చేసరికి సుదర్శనం లేచి నిల్చునివున్నాడు. ఆమె రాగానే వెళ్లివస్తానమ్మా అన్నాడు నెమ్మదిగా. సరస్వతి తత్తరపాటుతో మరి కొంతసేపు ఉండమని బలవంతం చేయబోయింది. చివరికి సుదర్శనం ఏవో అబద్ధాలు చెప్పి తప్పించుకో గలిగాడు. కాని ఏడుస్తూ ఏడుస్తూ ఓచిన్న సరదాకు పోయాడు.

వాళ్ల సంసారం సాగరంగా మారకముందు— ఆ అన్నా చెల్లెళ్లమధ్య అటువంటి హాస్యాలు అప్పు డప్పుడూ ఉండేవి. మళ్లా నేటికి సుదర్శనానికి ధైర్యం కలిగింది. సరస్వతిముఖంలోకి పరిశీలనాదృష్టి నటిస్తూ చూసి అడిగాడు—

"అదేమమ్మా, కళ్లు యెర్రగా ఉన్నాయ్!"

సరస్వతి గతుక్కుమంది. కాని కాస్త అలస్య మైనా జవాబిచ్చింది.

"అన్నే! ఉరికేనే! ఏదో పడిందేమో ఇందాకా పొయ్యి ఊదుతుంటే..."

సుదర్శనం చిరునవ్వుతో మధ్యలోనే అటకా యించాడు:

"బొగ్గుల పొయ్యి!"

సరస్వతి చిరునవ్వుముసుగులో సిగ్గును దాచ బోతూ తల వంచేసింది.

సుదర్శనం వెళ్లివస్తానంటూ బయటకు నడి చాడు. అల్లునిదగ్గర శెలవు తీసుకొని అల్లంతదూరం వెళ్లాక సరస్వతి గుమ్మంలోంచి కాస్త ఉచ్చస్వరంలో అడిగింది:

"మళ్లా వస్తావుకదూ?"

సుదర్శనం ఓసారి వెనుతిరిగి, తల అంగీకార సూచకంగా ఆడిస్తూ కదిలిపోయాడు.

సుదర్శనానికి దారిపొడుగునా ఆ తల్లీకొడుకుల మాటలు జ్ఞాపకం వస్తూనే ఉన్నాయి.

౬

మరి ఒక నెలదినాలు కాలగర్భంలో కలిసి పోయాయి. ఒకనాడు తండ్రి ఊర్లో లేరు. ఎక్క డికో క్యాంపుకు వెళ్లారు. నాడు సుదర్శనం ఆశ్చర్య కరంగా ప్రవర్తించసాగాడు.

సుదర్శనం ఆడవాళ్లను వెంటబెట్టుకొని ఎక్కడికైనా వెళ్లవలసివస్తే అర్థనగ్నంగా వీధిలోకి వెళ్లవలసివస్తే కష్టపడేటట్టు కష్టపడతాడు. అటు వంటిది ఆవాళ తానై సినీమాకు వెళ్దామంటూ ఆరం భించాడు.

పోనీ సినీమా మంచిదేమో అంటే అరవసినీమా. నాలుగోజులక్రిందటే "అబ్బే, బాగులేదట"అని తన నోటితో తానే అన్నాడు.

సుబ్బులు యీ అయాచితకారుణ్యం గుర్తించి కొంతసేపు కారణంగురించి చర్చించింది. 'కాని తెగిందాకా తాడు లాగకూడదు'అనే పెద్దలవాక్కును జ్ఞాపకంచేసుకొని ఆ చర్చను అట్టే పొడిగించలేదు.

అయితే తీరా బయలుదేరేవేళకు ఒక అవాం తరం వచ్చిపడింది. తను కొంప యేదో మునిగిపో నున్నట్టు అకస్మాత్తుగా నాలుగుమూలలనుంచీ మేఘాలు కమ్ముకవచ్చి ఆకాశమంతా అలము కున్నాయి. సుబ్బులుగుండెల్లో రాయి పడింది. తుణతుణానికి పెరటివాకిలిలోకి పోయి ఆకాశంవంక

చూడసాగింది. ఆకాశంనుండి మేఘాలుకూడా సుబ్బులువంక చూస్తుంటేవి. సుబ్బులు వాటిచూపులను సుళువుగానే చదువుకోగలిగింది.

"ఏం సిద్ధం! మీరు బయటకు అడుగుపెట్టడమే తరవాయి" అన్నట్టున్నాయవి.

అయితే సుగుణమేమంటే అన్నీ కూడా తనలానే ఆతృతపడుతున్నట్టుంది. ఈ తృప్తి అయినా ఆమె కెంతోసేపు దక్కలేదు. తల్లి మేఘాలను చూస్తూ—

"మేఘాలేమిట్రా యిలా వచ్చిపడ్డాయిగా" అంటూ కదలవేశా రామె.

ఆ మేఘాలు ఉత్తుత్తమేఘాలేననీ, అవి భయపెట్టడంతప్ప యింకేమీ చెయ్యవనీ యెన్ని చెప్పినా ఆ ముసలిపిల్ల నమ్మదు. చివరకు ఈసందర్భంలో కోపం తెచ్చుకొని కసురుకున్నాడు కూడా. ఈ చిన్న విషయంగురించి యేల కోపం తెచ్చుకొని కసురుకో వలసివచ్చిందో గుర్తించకుండానే పార్వతమ్మగారన్నారు—

"పోనీ, నీకెందు కంత కోపం? వస్తానులేరా!" అంటూ బయలుదేరారు.

హాలుదగ్గరకు వెళ్లాక వాళ్లిద్దర్నీ ఒకదగ్గర నిలబడమని సుదర్శనం యెటో వెళ్లిపోయాడు.

సుమారు పావుగంట గడిచాక చాలా తొందరగా వచ్చి తల్లిచేతికి టిక్కెట్లందిస్తూ చెప్పసాగాడు— ఎవరో స్నేహితుడట. తనని కదలకండా గట్టిగా పట్టుకొని ఎంతకీ పోనివ్వడట. ఎలాగో వదిలించుకొని వచ్చాడట. తర్వాత వెధవస్నేహితుల ఇంగితజ్ఞానరాహిత్యం గురించి క్లుప్తంగానే తన అభిప్రాయం తెలిపాడు.

సుదర్శనం తను చెప్పుకొనిపోవటమేగాని అంత వివరంగా చెప్పవలసిన ఆవశ్యకత లేదేమో అని సందేహించలేదు.

తల్లీ కూతుళ్లు హాల్లోకి వెళ్లేసరికే లైట్లు ఆర్పేశారు. ఆట అప్పుడే ఆరంభమయింది. ఆ చీకట్లోనే తడుముకుంటూ వెళ్లి ఒకచోట కూర్చున్నారు.

కొండపిటిచాంతాళ్లను పోలే పాటలతోనూ, అనవసరపు కామిక్ ఉపాఖ్యానాలతోనూ కథ చాలా పెద్దది.

చివరి కలాసైతేనేం యింటర్వల్ ఇచ్చారు.

పార్వతమ్మగారు అప్పటికప్పుడే పరిచయం చేసుకొని సిద్ధంగా ఉంచిన పొరుగమ్మతో బాతాఖానీ ఆరంభించింది. ఆ యమ్మకు యెంతమంది పిల్లలో, ఆమె మొగుడికి యేం ఉద్యోగమో, జీత మెంతో, పైన సంపాదన యెంతో మొదలైన అత్యవసర విషయాలు భోగట్టాచెయ్యడంలో నిమగ్నులై పోయారు. సుబ్బులు యింకా స్త్రీ కాదు—కిశోరి. అందుచేత కూర్చున్న స్థలం యిబ్బందిపెడుతున్నట్టు ఏదో గొడవకు త్రుళ్లిపడ్డట్టు మధ్యమధ్య లేచి పైట సవరించుకుంటూ నాలుగువైపులా కలయజూస్తోంది.

ఒకసారి అలా చూస్తూ చూస్తూ అలానే ఉండిపోయింది. గేటుదగ్గర—బజాన నిద్రిస్తున్న శ్రీపతితో సరస్వతి నిల్చునివుంది. ఆమెకళ్లు తల్లివంకే ఉన్నాయి. ఒకసారి చలించటంలో తనవంక చూడ్డం తటస్థించింది. ఇద్దరూ ఒకరిదర్శనాన్ని ఒకరు గుర్తించారు. సరస్వతి కుడిచేతిచూపుడువేలును ఒకసారి ముక్కుమీద వేసుకొని చేయి అడ్డంగా ఊపింది. సుబ్బులు గ్రహించి ఊరుకుంది. తర్వాత కూర్చోమనీ, తనవంక చూడవద్దనీ, చూస్తే తల్లి గ్రహించేస్తుందనీ అభినయం ద్వారా చెప్పింది. సుబ్బులు అలానే చేసింది. కాని క్రీగంట అక్కను గమనిస్తూనే ఉంది. అక్క తల్లివంకే చూస్తోంది.

సుబ్బులు ఆలోచిస్తూఉంటే ఆమెకు అకస్మాత్తుగా ఓవిషయం తట్టింది. పూర్వాపరాలు చర్చించి చూస్తే సందేహం నిజమే అనిపించింది. ఇంతలో ఆట మళ్లా ప్రారంభించేశారు.

ఆట వదిలాక సుబ్బులు అక్కకోసరం చూసింది. కాని ఎక్కడా కానరాలేదు.

ఇంటికి వచ్చాక తల్లి నూతివద్ద కాళ్లూ,చేతులూ కడుక్కుంటూ ఉంటే సుబ్బులు ఈవలి గదిలో బట్టలు మారుస్తున్న అన్నదగ్గరకు వెళ్లి అంది—రహస్యంగా.

"నాకు తెలిసిందిలే"

సుదర్శనం త్రుళ్లిపడ్డాడు. అప్పుడప్పుడే పేంటు జేబులోని సిగరెట్ పెట్టె తీసి సూట్ కేసులో భద్ర పరిచిఉన్నాడు తను. అయినా దబాయించాడు.

"ఏమిటి తెలుసు ?"

"నువ్వు అక్కయ్యగారింటికి వెళ్తున్నావు కదూ ?"

సుదర్శనంగుండెలు తేలికపడ్డాయి. అందుచేత అతడు కాస్త నెమ్మదిమీద జవాబిచ్చాడు.

"ఎవరన్నారు ?"

"ఎవరవాలేమిటి ? ఎన్నడూ లేంది నువ్వు బల వంతంచేసి సినీమాకు తీసికెళ్లడం, ఆవిడగారు కూడా సరిగ్గా ఆ ఆటకే రావడం..."

సుదర్శనం మధ్యలోనే ఆపేశాడు.

"అమ్మ చూసిందా ?"

"లేదులే. కాని నేను చెప్తాను."

"చెప్పుకో—." నిబ్బరంగా అన్నాడు. కాని ఆ నిబ్బరం అరక్షణమైనా నిలవలేదు. తల్లి మెట్టెల చప్పుడు వినిపించసాగింది.

సుదర్శనం తత్తరపాటులో గొణుక్కున్నాడు. "వస్తోంది ! జాగ్రత ! పిచ్చిచేష్టలు చేయకు !" తర్వాత గుప్‌చుప్ ! సుబ్బులుకూడా తల్లి వచ్చేసరికి పాగా కొయ్యవద్ద యీ కొయ్య నున్న లాల్చీ ఆ కొయ్యకు తగిలిస్తోంది.

కాని ఈవిధమైన మోసం ఎంతో కాలం సాగిరాలేదు. కనీసం కొన్ని సార్లయినా అనిపోలేదు. నెల్లాళ్లయాక రెండవసారి మళ్లా సినీమాకు వెళ్లి నప్పుడు బయలుపడిపోయింది.

జరిగిన పొరపాటేమంటే యీసారి యింటర్‌వల్‌లో శ్రీపతి తెలివితోనే ఉన్నాడు. వాడు అమ్మమ్మఅర్ధపలితకేశాల అనాగరికబంధనాన్ని ఎంత దూరంనుండయినా పోల్చుకోగలడు. వాడు ఒకసారి తల్లితో చెప్పి ఆమెఒడిలోంచి జారిపోతూ "అమ్మ మ్మాయ్ ! అమ్మమ్మా!" అంటూ కేకలు వెయ్యడం ఆరంభించాడు. సరస్వతి రాబోయే ప్రమాదాన్ని ఆకస్మికంగా గుర్తించి చప్పున ఒకచేత్తో చేయి పట్టు కొని ఒకచేత్తో నోరు మూస్తూ అదిమిపట్టుకుంది.

సరిగా యీ స్థితిలోనే అమ్మమ్మ వెనుదిరిగి చూసింది. ఈ దురదృష్టసంఘటనకుతోడు యింకొకటి కూడా జరిగింది. ఆట వదిలాక ముగ్గురూ మెయిన్ రోడ్డుమీదికి వచ్చారు. సుదర్శనం కాస్త వెనుక పడ్డాడు. ముందు మగవాళ్లు అడ్డురావడంచేత పార్వ తమ్మగారు ఆగిపోయి కొడుకో్కసరం వెనక్కు చూశారు. వెనకనే గజందూరంలో నున్న సుదర్శనం ఎవరికో వెళ్లివస్తానన్నట్టు తల వూపుతున్నాడు.

ఏమూ అని చూస్తే భుజంమీద నిద్రపోతున్న కొడుకుతో సరస్వతీ, అల్లుడూ !

మెయిన్ రోడ్ విడిచి సందులోకి మళ్లాక ఆరంభించారు ! కొంతవరకూ అడ్డుప్రశ్నలయాక తర్వాత—

"......మనుష్యులకు ఒకర్ని చూశాకయినా బుద్ధి రావాలి. సిగ్గూ లజ్జా విడియం పౌరుషం— అన్నీ విడిచిపెట్టేసిన బ్రతుకు ఏంబ్రతుకు ! యేం ? దాని కొడుకు నది మాటాడనిచ్చిందా! నోరు అడ్డంగా నొక్కేసిందే! చేయిపట్టుకొని గుంజేసిందే !! వెలెడు విధవఅయితే అవుగాక! తర్వాత మళ్లా 'అమ్మమ్మా' అన్నాడా ? ఇంగితజ్ఞానం లేకపోయాక మెన్నెళ్లొస్తే యేమి లాభం ?......"

ఇంతలో యిల్లు సమీపించడంతో ఆగిపోయింది. సుదర్శనం ఒక్క అంగలో వెళ్లి తలుపు దబదబ కొట్టాడు. తండ్రిజవాబు కూడా వెంటనే రావటం వల్ల పార్వతమ్మగారి నోటినుండి మరొక్కమాట కూడా వినవలసిన బాధ లేకపోయింది—సుదర్శనానికి.

౧౦

మర్నాడు ఉదయం ఒకసారి కూడా సుదర్శ నం తల్లితో మాట్లాడలేదు. అంతగా మాట్లాడక విధి లేని అవసరం కూడా రాలేదు. సాయంకాలం తను యింటికి రాగానే తల్లి వీథిలోకి ఎక్కడికో బయలు దేరింది. ఆమె అవతలికి వెళ్లగానే పెరట్లో వండుతుం టున్న చెల్లెల్ని సమీపించి మెల్లిగా కదలేశాడు.

"యేమి టంటుందే అమ్మ ?"

చిబ్బిఅడుగుభాగం శుభ్రంగా తుడిచి పొయ్యి మీద రొసరుకు మూతపెడుతూ అంది :

"అమ్మకు నీమీద బాగా కోపం వచ్చింది."

దీనికి సుదర్శనం కొంతసేపుండి జవాబిచ్చాడు.

"రానీ !"

మళ్లా ఒకనిమిషంవరకూ ఎవరూ మాట్లాడలేదు. తర్వాత సుబ్బులు అంది—

"ఇంతకూ ఆ చిన్న వెధవనుంచి వచ్చింది"

"అన్నట్లు అడుగుదా మనుకుంటూ మరచి పోయాను; యెలా తెలిసిందీ ?"

సుబ్బులు చెప్పింది.

సుదర్శనం అంతా విని నోటితో భగ్న ప్రయత్నాన్ని వ్యక్తీకరించే విలక్షణధ్వని చేస్తూ అన్నాడు—

"—! యీ చిన్నపిల్లలుంటే యింతే ! యిలానే జట్టీలు తెచ్చిపెడుతూ వుంటారు ! వాళ్లకు తెలిసిన గొడవా కాదు తెలియని గొడవా కాదు !"

సుదర్శనం వ్యథితహృదయం ప్రకటించి ఊరుకున్నాడు. సుబ్బులు కూడా అవునన్నట్టుగా మాట్లాడలేదు.

యిద్దరూ కూడా యెవరిమట్టుకు వారు చిన్న పిల్లల అజ్ఞానంగురించే తలపోస్తున్నారు.

మానవుల రీతే యిలా వుంటుంది. యెక్కడో ఏసందర్భంలోనో ఎవరో అన్నమాటలను పట్టుకొని అవే సిద్ధాంతాలుగా—ప్రాతిపదికలుగా—తీసుకొని విమర్శిస్తూవుంటారు—కాని ప్రస్తుత సందర్భాన్ని దృష్టిలో పెట్టుకోరు. అందుచేతే తరుచు యీ ఏకోదరులులా శుద్ధపొరపాట్లు చేస్తూ వుంటారు.

సుదర్శనం రెండు ప్రశ్నలు వేసుకుని వుంటే సత్యం గ్రహించగలిగేవాడు.

"ప్రవర్తనామర్యాదలు బాగుగా తెలుసుకొని యుక్తాయుక్తజ్ఞానం పూర్తిగా సంపాదించిన సరస్వతి ప్రవర్త—"

అన్నట్టు యీ ప్రశ్న అక్కరలేదు; రెండో ప్రశ్న ఒక్కటే చాలు.

నాడు తొలిసారి సరస్వతియింటికి వెళ్లిననాడు శ్రీపతి తెలిసీ తెలియని . గొడవగా తల్లికన్నీళ్ల రహస్యాన్ని బహిరంగం చేయటంవల్ల కలిగిన ఫలితం ఎటువంటిది?

ఈ ప్రశ్న వేసుకుంటే పార్వతమ్మగారి పునరుజ్జ్వలితకోపానికి శ్రీపతిఅజ్ఞానం ఎంతవరకూ బాధ్యత వహిస్తుందో తెలిసేది.

కాని దురదృష్టవశాత్తూ చాలామందికి కార్యకారణసంబంధంగురించి సమగ్రంగా ఆలోచించే జ్ఞానం లేదు. సుదర్శనం అందులో ఒకడు.

కొంతసేపయాక సుబ్బు లంది—

"—మధ్యాహ్నం భోజనాలవేళ ఏదో మాట మీద మాట వచ్చి అందుకుంది. మనమందరమూ ఒకటిట. నాన్నగారేమో వాళ్లను పట్టుక వెళ్లి వేరు పెట్టారట. అప్పుడప్పుడు డబ్బుకూడా యిస్తున్నారట. నువ్వేమో వాళ్లలో కలిసిపోయావుట. నే నీసంగతులన్నీ తెలిసి కూడా తనతో యేమీ చెప్పలేదు కాబట్టి నేను కూడా మీలోనే జమట. యింక యెటువచ్చీ తనను ఒక్కర్తినీ వేరుచేసేశామట. ఇలా అంటూ ఏడవడం ఆరంభించింది. చెప్పకేం—నే నా గొడవలో ఉన్నదంతా ఉన్నట్టు చెప్పేశాను—నువ్వు చాలా కాలమయి వాళ్లింటికి వెళ్లివస్తున్నావనీ, అవాళ అక్కయ్యకు కల రావటం, అమర్నాడు ఉదయం బావ బజారులో అగపడి అక్క ఉదయంనుంచీ ఏడుస్తోందని చెప్పడం, నువ్వు వెళ్లటం, తర్వాత సినిమా నెపంతో తనను తీసుకువెళ్లి చూపించటం—అంతా పూసగ్రుచ్చినట్లు చెప్పేశాను.

అంతా మాటాడకుండా వింది. తర్వాతైనా చాలాసేపటివరకూ మాటాడలేదు. ఏమిటో తనలో తనే తలపోసుకుంది. ఇంక ఏడుపేమనుకున్నాక—చెప్పలేను. అక్కర్లు బుక్కర్లు ఏడ్చేసింది. మరి వాళ్ల చెల్లెలే జ్ఞాపకం వచ్చిందో ఇంకేమిటో ! నేనుమాత్రం చచ్చాను. మాట్లాడలేను—ఊరుకోలేను. అక్కణ్ణుంచి లేచి పారిపోయాను. కాని బయటమాత్రం స్థిమిత మేదీ ? అబ్బా ! తెగగొడవ అయిపోయింది."

సుదర్శనం అంతా ఆశ్చర్యంతో విన్నాడు. అత డాలోచిస్తూఉంటే సుబ్బులు పొయ్యివంక తిరిగింది. చక్కగా మండుతున్న పొయ్యి యెప్పుడారిపోయిందో ఆరిపోయింది. అప్పటికప్పుడే పొగలు గదల్లా ఆక్రమించి వాతావరణాన్ని దుర్భరం చేసి

విడిచిపెట్టింది. సుబ్బులు పొయ్యి చిమ్మే పొగల జాడలనుండి ముఖాన్ని తప్పిస్తూ తల బాగా క్రిందికి వంచి గట్టిగా ఊదింది. రెండుమూడు ప్రయత్నాలతో పొయ్యి మళ్లా కులాసాగా మండ నారంభించింది. పొగ కూడా—ఎలా వచ్చింది అలానే మాయ మయింది.

సుబ్బులు ముఖం వికృతంగా పెట్టి, కళ్లు తుడుచు కుంటూ, ముక్కుతో ఎగపీలుస్తూ అంది—

"యేమో సుమీ, చేసింది మంచి పని అవునో కాదో ఏ మాటా చెప్పలేను. ఆ గొడవలో అలా చెప్ప వలసివచ్చింది. చెప్పేశాను. దానివల్ల మంచే రానీ చెడ్డే రానీ!"

సుదర్శనం చప్పున ఏమీ మాటాడలేదు. మాటాడే లోగా తల్లిఅలుకు డయింది. ఆమె వస్తూనే సుదర్శనాన్ని ఉద్దేశిస్తూ అంది—

"ఎవరో అబ్బాయి నీకోసరం అవతల నిలు చున్నాడయ్యా!"

సుదర్శనం లేచి బయటకు వెళ్లిపొయ్యాడు.

౧౧

సుబ్బులు చేసిన ప్రయోగఫలితం పదిరోజుల నాడు తెలిసింది. అది ప్రయోగం అనటానికి వల్ల కాదు. సుబ్బులు ఆలోచించి ఒక ఫలితాన్ని సుమా రుగా ఊహించి చేసినపని కాదది. కనీసం ఫలితం బయలుపడినప్పుడు దానిని గమనించనైనా గమనించ లేదు. అందుచేతే అది ప్రయోగ మనిపించుకోదు. అప్పటి కలా చెయ్యవలసివచ్చింది—చేసేసింది. అప్రయ త్నంగా అది ప్రయోగమైపోయింది.

సుబ్బులు ఒక సాయంకాలం డాబామీద నీరెం డలో పచారుచేస్తున్న అన్నను సమీపించింది. ప్రకృతీ, ఆ పెద్దపట్టణం డాబా, డాబామీది సుదర్శనం, అప్పుడే వచ్చిన సుబ్బులూ అరుణకాంతుల్లో మునిగి తేలుతున్నారు. ఆ వింతవాతావరణంలో సుబ్బులు అన్నను సమీపించి అంది—

"ఇవాళ అమ్మ నిన్ను పడచీవాట్లు వేసింది."

సుదర్శనం అకస్మాత్తుగా నిలబడిపోయి చెల్లెలిముఖంలోకి శూన్యంగా చూస్తూ ఊరు కున్నాడు.

సుబ్బులు అర్థయుక్తమైన చిరునవ్వుతో చెప్ప నారంభించింది:

"నువ్వేమో కర్కోటకుడవుట. అచ్చం నాన్న గారి గుణాలన్నీ నీ కబ్బాయిట. మీ రిద్దరూ కూడా యెంతసేపూ మీ స్వార్థమేగాని ఇంకేమీ చూడరుట ......"

సుబ్బులు ఆగిపోయింది. ఆ మాట్లాడే వైఖరినీ, ఆ చిరునవ్వునూ చూచి మొదట వేళాకోళ మను కున్నాడు. కాని మధ్యాహ్నంనుంచీ తల్లి ప్రదర్శి స్తున్న వైఖరి చూస్తే నిజమే అయివుండవచ్చనిపించింది. ఏవిషయం తేలేవరకూ తనూ బయటపడరాదు అను కుంటూ తాను కూడా అదే ధోరణిలో అన్నాడు.

"ఊఁ. చెప్పు!"

"యేమిటి చెప్పడం?"

"ఇంతకూ యిప్పుడు స్వార్థపరులమై మేం చేసిన మహాదోష మేమిటి?"

"యేమిటా—ఆవిడగారి మనస్సెఱ్ఱి తీసుకరాక పోవడం!"

సుదర్శనానికి బోధపడినట్టు లేదు. తెల్ల మొహం వేసుక నిల్చున్నాడు. సుబ్బులు విడమర్చింది.

"—అక్కయ్య అభిమానాలగురించి వాదన వచ్చింది. అక్కయ్యకు తనమీద అభిమానం ఉందని నేనూ— తను నామాట పడనివ్వదు— తనకు దాని మీద ఉన్న అభిమానం తనమీద దానికి లేదంటుంది. అది నిజమే. తనకైతే పెంచినందువల్ల ఏర్పడ్డ మమ కారం. దానికూడా ఉండాలంటే ఎక్కణ్ణుంచి వస్తుందీ?"

సుబ్బులు ప్రశ్న వేసి ఆగింది. కాని సుదర్శనం తన అభిప్రాయం వెలిబుచ్చలేదు.

ఆ మౌనం తన మానవమన స్తత్వపరిశోధనా జ్ఞానానికి అంగీకారంగానే తీసుకొని సుబ్బులు చెప్ప నారంభించింది.

"—అలా అని యిప్పుడు యిన్నాళ్లుచేసి మాట దక్కించుకోకపోవడ మేం? అంటాను."

సుబ్బులు ఈప్రశ్న వేసి మళ్లా ఆగింది. సుద ర్శనం దీనికూడా జవాబివ్వలేదు. చెల్లెలు చెప్ప నారంభించింది—

"—యిలా అని చాలాసేపు వాదించుకున్నాం. చివరి కా వాదనలో నిన్నటి విషయం చెప్పేశాను."

సుదర్శనం ఈసారి మాట్లాడాడు. ఆతృతగా అడిగాడు—

"ఏమిటి ?"

"నిన్న జరిగినది. శ్రీపతి బజారులో అగ పడటం."

సుదర్శనం చిరాగ్గా మధ్యలోనే అడ్డుతగిలాడు.

"ఎందుకు చెప్పావ్ ? ఈ ఆడవాళ్ల నోట్లో నువ్వుగింజ నానదు !"

సుబ్బులు జంకకుండా రెట్టిస్తూ అడిగింది :

"ఇప్పుడు చెప్పినందువల్ల వచ్చిన నష్ట మేమిటి?"

"నువ్వే చెప్పావ్—చీవాట్లు వేసిందని ?"

"పాపం ! అబ్బాయి వణికిపోతున్నాడు !..." గొంతుక తగ్గిస్తూ "ఏదో మాటవరస కంది. ఆమె తత్వమే అంత."

కాని సుదర్శనం ఉద్దేశం ప్రకారం—సుబ్బులు పొరపడుతోంది అనీ,ఆ లోకానుభవరహితకు మనుష్య హృదయం తెలుసుకునేపాటి జ్ఞానం ఉండదనీ సుదర్శనం నమ్మకం. నిజానికి సుదర్శనం చెల్లెలి కన్నా పదేండ్లు పెద్ద. కాగా చాలా చదువుకున్న వాడు. "ఇనుము విరిగ నేని" అన్న వేమనసూక్తి చిన్న నాడు చదువుకున్నా బాగా ఒంటబట్టిపోయింది. అందుచేతే విరిగిన మనస్సు మళ్లా అతుక్కుపోయిందని చెల్లెలు చెప్పబోతే నమ్మటం లేదు. పోనీ అని నమ్మక పోటానికీ వలనుపడకుండా ఉంది. దానికి తోడు సరీగా అదేసమయంలో తల్లి చేసుకవచ్చిన పని సుదర్శ నాన్ని సందేహంలో పడేసింది.

క్రిందనుంచి కొంపలంటుక పోతున్నప్పటి పెద్ద వారి గందరగోళంలా ఓ చిన్నకంఠం అరుస్తోంది.

"పిన్నోయి ! చుబ్బు పిన్నీ ! నే నొత్తాను ! ఇదుగో నే నొత్తాను !"

సుబ్బులు సంతోషంలో రెండే అంగల్లో క్రిందికి పారిపోయింది. వెనకనే సుదర్శనం కూడా దిగి వెళ్లాడు. తల్లీ కొడుకులిద్దరూ ఒకరిమెడ ఒకరు గట్టిగా కౌగలించుకొని ఉన్నారు. పార్వతమ్మగారు అప్పుడే ప్రవేశిస్తున్నారు. సుదర్శనాన్ని చూడగానే అల్లుడు మామవంక తిరిగి కలానికి అందని స్వరంతోనూ, సంతోషంతోనూ, పోజుతోనూ, ఒక అసంపూర్ణ వాక్యం వదిలాడు—

"మామయ్యోయ్ !..."

మామ కూడా అల్లుడి స్వరాన్ని అనుకరిస్తూ కళ్లు బాగావిప్పి, నోరు బాగా కుంచిస్తూ అన్నాడు—

"ఓ... హో !"

అల్లుడు ఒక నవ్వు నవ్వాడు. మామ జవా బిచ్చాడు. తర్వాత "ఒక్కడే ఎలా వచ్చాడూ !" అంటూ సుదర్శనం, "ఎక్కడ దొరికాడీ పెంకె నాన్న" అంటూ సుబ్బులూ కాస్త హెచ్చుతగ్గగా ఒకేసారి తల్లివంక తిరిగి అడిగారు. పార్వతమ్మగారు మెతిసేకళ్లను ప్రక్కకు మళ్లించుకుంటూ అన్నారు—

"ఏమో వెధవ ! కనకమహాలక్ష్మిగుడివద్ద కొబ్బరికాయకొడుతుంటే ఎక్కణ్ణుంచో వచ్చి కాళ్లు రెండూ కావలించుకున్నాడు. ఎవరా అని త్రుళ్లిపడి చూస్తే—వీడూ ! తర్వాత 'నీతో వస్తాను పద' అంటూ కూర్చున్నాడు. వాడలా అంటూంటే ఏమి టననూ ! సరే అని తీసుక వచ్చేశాను."

సరస్వతిసంగతి వాళ్లు అడగనూ లేదు. తల్లి చెప్పనూ లేదు. అన్నాచెల్లెలిద్దరూమాత్రం ఒకరిముఖం లోకి ఒకరు సాభిప్రాయంగా చూసుకున్నారు.

పార్వతమ్మగారు పెరట్లోకి వెళ్లిపోయిన తర్వాత సుబ్బులు రహస్యంలా అడిగింది—

"ఎవరెవర్రా బాబూ వచ్చారూ !"

"అమ్మ ! నాన్నగాలూ ! పొలుగు చాంత పిన్నీ ! అంతా వచ్చాలు..."

"అమ్మతో చెప్పావా—నువ్విలా వస్తున్నా వనీ !"

"ఆఁ...చప్పాను...నేనల్లంతదూలాన్ని అమ్మ మ్మను చూచి పలుగెత్తిక వెల్లాను. మే మిద్దలం వెలి పోవత్తున్నాం—అమ్మ కొబ్బలికాయలు కొంతోంది. నేను వెల్తున్నానని చెప్పాను. అమ్మా...అమ్మా... అమ్మ వూలుకుంది. అలా...చూత్తూ ఊలుకుంది."

చాలాచాలా అభినయంతో, బహుకష్టంమీద విషయాన్ని జ్ఞాపకం తెచ్చుకొని, ఒక పెద్దఉద్య మాన్ని నిర్వహించేంత శ్రమతో చెప్పాడు. అన్నా చెల్లెలిద్దరూ ఒకరివంక ఒకరు మరిఒకసారి చూసు కున్నారు. తర్వాత సుదర్శనం అడిగాడు.

"నాన్నగారేమీ అనలేదూ !"

"నాన్నగాలా ?...నాన్నగాలూ......నాన్న గాలు ఏమీ అనలేదు. అమ్మమ్మ అల్లక్కలున్నప్పులు నాన్నగాలే చూపించి వెల్లమన్నాలు."

సుదర్శనం ఈ చివరివాక్యాన్ని పట్టుకొని తలా తోకా అమర్చుకుంటూ నిర్ఘ్రక్కమించాడు.

౧౨

రాత్రి భోజనాలవుతున్నాయి. శ్రీపతిమహా నైవేద్యం ముందుగా అయిపోయింది. అందుచేత తాత గారిప్రక్కనే పీటమీద కూర్చుని కబుర్లు చెపుతూ తినిపిస్తున్నాడు. కొంతసేపయినతర్వాత ఏం బుద్ధి పుట్టిందో - లేచి "నే పలుకుంతాను !..." అని ప్రకటించాడు. మామ వర్జ్యమ్ ముందని వారించబోయాడు. కాని పిల్ల నిచ్చుకున్న మామల సలహాలనే పాటించే అంత ఆత్మగౌరవరహితులు తెలుగుగడ్డమీద ఇంత వరకూ పుట్టలేదు. అటువంటిది ఈ ఒంటిపొగు మేన మామ మాటలు ఖాతరుచేసే దెవరు ?

సుదర్శనం ముందుగా భోజనం చేసి ఇవతలకు వచ్చాడు. చీకటిగా ఉన్న నట్టింట్లోంచి శ్రీపతి గొంతు నెమ్మదిగా వినవస్తోంది.

"ఆఁ. లోఅా ఏలిచేది! నాన్నగాలూ, అమ్మా అప్పలప్పలూ దెబ్బలాలుకోలమే—నువ్వూ అమ్మా దెబ్బలాలుకో నేవాలూ—అలానే"

తర్వాత పార్వతమ్మగా రేదో ప్రశ్న వేసివుంటారు. దానికి శ్రీపతి కాస్త గట్టిగా జవాబుచెప్పడం ఆరంభించాడు.

"ఆఁ ! నే నలా...అంతే అమ్మమొత్తుందీ... తీసుకెల్తుందీ అనీది..." తర్వాత అమ్మమ్మ మందలించింది కాబోలు మెల్లిగా చెప్పసాగాడు. "...ఎప్పలంతే లోజా, లేపే అనేది. తాతయ్యా...తాతయ్యా అప్ప లొకసాలీ అల్లప్పలొకసాలీ...మల్లా అల్ లప్ప లొకసాలి... వచ్చాలు. తాతయ్య అన్నీ అబద్ధాలే అమ్మమ్మా ! నువ్వూల్లో లేవన్నాలు. ఊల్లో లేవమ్మమ్మా !"

బహుశా ఉన్నానని జవాబు వచ్చుంటుంది. శ్రీపతి హుంకరించి చెప్పసాగాడు.

"హుఁ ! అబద్ధాలే... అన్నీ అబద్ధాలే"

ఇంక బాగుండదని సుదర్శనం గదిలో ప్రవేశించాడు. మంతనాలు ఒకవిధంగా ఆగిపోయాయి. చీకటి గదిలోంచి మెల్లగా ప్రక్కగదిలోకి వెళ్లిపోయాడు.

సుదర్శనం బట్టలు మార్చుకుంటుంటే శ్రీపతి మళ్లా కువకువలాడసాగేడు.

"నేను నీదగ్గరే పలుకుంతా నమ్మమ్మా. పిన్ని దగ్గిల పలుకోను.

అమ్మదగ్గిల పలుకుంతే...అమ్మ మంచిది కాదమ్మమ్మా ! చగంలాతిల్లో నాదగ్గిల్నుంచి లేచిపోయి వెలిపోతుం దమ్మమ్మా. నాకు తెలివొత్తుందీ—చీకతీ బయ్యం ! అప్పలు అమ్మా...అమ్మా...అనిపిలుత్తే... అప్పలు వత్తుంది. నాకు చీకతీ, బయ్యం..."

తర్వాత మళ్లా ఏ గుసగుసలూ వినరాలేదు.

సుదర్శనం బట్టలుమార్చి వసారలో ఉన్న దీపం తీసుకొనిపోయి నట్టింటిమధ్యగా ఉంచాడు.

దీపంవెలుతురులో చీకట్లన్నీ మాయమయాయి. అంతకుముందు కానరాని వస్తువుల ఉనికి స్పష్టంగా కనుపించసాగింది. సుదర్శనం తల్లివంక చూశాడు. ఆమె గోడకభిముఖంగా ఉండడంచేత ఆమెముఖం మాత్రం కానరాలేదు.

మంచినీరుకోసరం వంటయింటివంక నడిచాడు. అంతకుముందు తండ్రీకూతుళ్లు ఏమిమాటాడుకుంటూ ఉండిరో తెలియదు—సుదర్శనం వెళ్లేసరికి తండ్రి ఉత్తరాపోసనం ముగిస్తూ అంటున్నాడు.

"—మాటలటమ్మా! పెంచిన మమకారం కన్న దానికన్నా ఘన మైనది. దాని పుర్రెలో ఏదో పురుగు పుట్టింది. కొన్నాళ్లు బాధపడింది. ఇప్పుడు ఏవిధంగానో అది మళ్లా పోయింది...అంతే..."

యిలా అంటూ ఆయన లేచిపోయాడు.

సుదర్శనం అక్కడి పాత్రలోని మంచినీరు తృప్తిగా త్రాగి బయటకు వచ్చేశాడు.

పార్వతమ్మగారి పుర్రెలో పుట్టిన పురుగేది— ఎప్పుడు పుట్టింది— ఎలా బాధించింది— చివరికెప్పు డెలా హరించిపోయిందీ—మొదలైన ప్రశ్నలను అతడు వేసుకోలేదు. ఇందులో కొన్ని తమంతతామే ప్రవేశించబోయినా ఓపిక లేకపోవడంవల్లనో, లేకయింకే సంతృప్తివల్లనో అతడు వాటికి ఎడ మివ్వాడు కాదు.

గంగాలహరి

[అనువృత్తము]

•

శ్రీ పింగళి లక్ష్మీకాంతం

దిక్కుతోఁచని పట్టి దీనాత్ముఁడను నేను, క్షేమమార్గప్రదర్శినివి నీవు
చింతాసమాకులితాంతరంగుఁడ నేను, చాంచల్యభంజనౌషధము నీవు
పరమతృష్ణాతురస్వాంతుండ నేను, సంపూర్ణదయామృతపూర మీవు
మారవికారాంధకారమగ్నుఁడ నేను, వైరాగ్యరత్నదీపంబ వీవు
తనయుఁడను నేను లోకైకజనని వీవు - అనదనై నిస్సహాయుఁడనై శరావ
లంబ మర్థించి "పాహి, పాలయ" యటంచుఁ-జెంత నిలచితి, నేమి చేసినను మేలె.

జీవితాంతమునందు, నన్ జెనకవచ్చు - శమనుదూతకు నుచ్చాటనముగ, వదన
రంగమునఁ దాండవించుత గంగ యనెడి - యద్వయానందనామాక్షరద్వయంబు.

పదియునాలుగు భువనాల భవనమైన - కమలజాండము నీతరంగముల నడుమ
దుమికి పండు విధమ్ముగా దొర్లుచుండు - వ్యోమకేశుని ఘనజటావ్యూహమందు.

శ్వపచులైనను సలుపఁ బాల్పడని ఘోర - పాపపుంజమ్మునకు నేకభవనమైన
నన్ను నీ వుద్ధరింపగా నడుముగట్టె - దమ్మరో! యెట్లు శ్లాఘింతునమ్మ నిన్ను?

"ఒక్కరుఁడేని లేఁడొకో దురుద్ధరపాపుఁడు, వానినే జగం
బక్కజమంద బ్రోవవలె" నన్నది నీ చిరకాలవాంఛ, నే
నొక్కఁడ నట్టివాఁడ నిదిగో! చనుదెంచితి, నన్ను బ్రోచి నీ
మక్కువ దీర్చికొ మ్మఖిలమానవలోకము విస్మయంపడన్.

నిలకడ లేని బుద్ధియును, నీతివిదూరచరిత్ర, పొట్టకై
తులువల నాశ్రయించుటయు, దుర్జనమైత్రియుఁ, గొండెముల్, మృషా
ప్రలపనముల్, కుతర్కములు, బాల్యమునుండియు నాకు నైజ మీ
ఖలుని ముఖ మ్మెవండు సుముఖమ్ముగఁ గన్గొను నీవు దక్కఁగన్!

కన్నులున్న ఫలం బేమి కాంచరేని - నిత్యనూత్నమ్ము నీ రామణీయకమ్ము?
వీనులున్న ఫలం బేమి వినరయేని - గమకమధురమ్ము నీ కలకలరవమ్ము?

పుణ్యులకు స్వర్గసుఖము, పాపులకు నరక - బాధ యనిమెడి ధర్మవిభాగ మఖిల
పాపహారిణి గంగాభవాని లేని - యశుభమయమైన దేశమ్మునందె చెల్లు.

వేదషడంగపారగుని విప్రుని ద్రుంచియుఁ, బుత్రనిర్విశే
షాదృతిఁ జూపు దేశికు గృహమ్మున కెగ్గు తలంచియున్, దురి
నీదరి దేహమూడ్చి జననీ! చనునమ్మ నరుండు, యజ్ఞసం
పాదితపుణ్యులైన యజమానులు పోవు మహాపథమ్మునన్.

విరహిణీప్రాణములను గ్రొవ్విరులసార-భమును హరియించు క్రూరస్వభావుఁడయ్యు
నీ జలస్పర్శశుద్ధుఁడై నిఖిలజగము - పావనము సేయుచున్నాఁడు పవనుఁ డంబ!

ఇహసుఖమ్మని పరసుఖమ్మని కోరి - పురుషకార మొనర్తురు నరులు సతము
నేను భువనద్వయభరమ్ము నిన్నె పూన్చి-యురక సుఖముగ నిదురించుచున్నవాఁడ.


నరకగహ్వరపతితసంత్రాణమందు - నీకు నెంతటి ప్రీతియో, నాకు నంతె
నరకపతనోన్ముఖంబైన నడకయందు-నైజ మెవ్వరికేని మానంగరాదు.

వాసుకిభూషణుండు రసవన్మతి దాండవకేళి సల్పు సం
ధ్యాసమయమ్మునన్, బ్రతిగఁ దాను నుకీర్ణతరంగహస్తవి
న్యాసములన్ భ్రమిభ్రమణనవ్యగతిస్ఫురణంబులన్ మహో
ల్లాసము దోప జహ్నుసుత లాస్యము సల్పుట ప్రస్తుతించెదన్.

నాసుఖమైనఁ గష్టమయినన్ భవదీయభరమ్ముగా, సమా
శ్వాసితబుద్ధినై బరవసమ్ము మెయిన్ మనుచుంటి; డెప్పరం
బీసమయమ్ము; నన్ను ద్యజియించెదవేని జగాన భక్తివి
శ్వాసము లస్తమించునో, యసారము లౌనో దయాస్వభావముల్.

అర్ధనారీశు జడల నీ వాడునపుడు-పౌరలి, గిరికన్యసీమంతమును స్పృశించు
చిఱుతరగ నామె కోపరంజితదృగంత-యగుచు విదిలించుటలు నవ్వులాట నీకు.

(సశేషము)



ప్లేటో అనుకరణవాదము

3. రామణీయక విచారణ

శ్రీ జి. వి. కృష్ణరావు

ప్లేటో ప్రతిపాదించిన జ్ఞానస్వరూపాన్ని బట్టి ౯ ఆధ్యాత్మికమనీ, భౌతికమనీ రెండు జగత్తు లేర్పడుతున్నాయి. భౌతికజగత్తుకు ఆధ్యాత్మిక జగత్తు మూలం. భౌతికజగత్తు వ్యక్తికము, సాపేక్షము, ఇంద్రియగోచరము. అభిప్రాయానికి విషయము. పరిణామి, నశ్వరము. విరుద్ధగుణభూయిష్ఠము. ఆధ్యాత్మిక జగత్తు అంటేనో అలా కాదు. స్వయంభువు. సంపూర్ణము. వివేకానికి విషయం. అతీంద్రియం. పరిణామ రహితం. పారమార్థికం. నిత్యం.

ఈ విభాగాన్ని పట్టి రామణీయకమనేదికూడా రెండు విభాగాలవుతున్నది. (౧)అలౌకికరామణీయకం, (౨) లౌకిక రామణీయకం.

అలౌకికరామణీయకం ఏకైకం, స్వయంభువు. సంపూర్ణము, అతీంద్రియము, వివేకైకవిషయం. మారేది కాదు. సాపేక్షం కాదు. నిత్యం.

ఈ రామణీయకం ఏకైకముఅంటే సత్యం, ధర్మం మొదలైన భావాలకంటె భిన్నమై స్వతంత్రంగా ఉంటుంది. దీనిలో తరతమ భావాలు లేవు.

స్వయంభువు. ఈ రామణీయకం మనఃకల్పితం కాదు. ఈశ్వరకల్పితమూ కాదు. అంటే ఏవిధంగాను ఉత్పాద్యం కాదు. దేశకాలబద్ధమూ కాదు.

రామణీయకం భౌతికం కాదు. అంటే ఇది ఆకృతిలోకాని, రూపంలోకాని, శబ్దంలోకాని, నాదంలోకాని లేదు. అందువల్ల ఇంద్రియగోచరం కాదు. ఇది అతీంద్రియం. రామణీయకం వివేకానికి విషయం. అంటే వివేకానికి ఒక్కదానికే గోచరిస్తుంది. ఇది నిరుపాధికం (*Nonhypothetical*). ఈ రామణీయకం మారేది కాదు. అన్ని దేశాలకూ, అందరువ్యక్తులకూ, అన్ని కాలాలకూ ఇది ఒకటే. ఒకప్పుడు తరిగేది కాదు, మరొకప్పుడు పెరిగేది కాదు.

రామణీయకం ధర్మంమీదకాని, సత్యంమీద కాని, మరొకభావంమీదకాని ఆధారపడటం లేదు. ఇది కేవలం నిరపేక్షము. స్వయంప్రకాశము.

లౌకికరామణీయకం ప్లేటోమతంప్రకారం రెండుభాగాలౌతుంది. ఒకటి ప్రకృతిసిద్ధరామణీయకం. రెండు మానవకల్పితరామణీయకం. ప్రకృతిసిద్ధరామణీయకం అలౌకికరామణీయకానికి అనుకరణం. ఈ అనుకృతికి కల్పితరామణీయకం అనుకృతి.

అయితే లౌకికరామణీయకలక్షణ మేమిటి? ఇది ౧ వ్యక్తికము. ౨ సాపేక్షము. 3 ఇంద్రియగోచరము. ౪ అభిప్రాయానికి విషయము. ౫ పరిణామి. ౬ అనశ్వరము. ౭ విరుద్ధగుణభూయిష్ఠము. ౮ అసంపూర్ణము. ౯ అవివేకము. ౧౦ సోపాధికము.

ఈ లౌకికరామణీయకం అనేకము. రమణీయ భవనాలు, రమణీయవిగ్రహాలు, రమణీయగానం, రమణీయకావ్యం, రమణీయచిత్రం ఇలా అనేకంగా ఉంటుంది. ఈ రామణీయకం చక్షుష్కర్ణగోచరం. సాపేక్షం. ఇందులో తరతమభావా లున్నాయి. ఇది పరిణామి. సత్యం, ధర్మం, వికారం మొదలైనవాటికి కూడా ఇందులో ప్రసక్తి ఉంటుంది. దీనికి ప్రయోజకతాప్రయోజకత లున్నాయి. ఈ రామణీయకం నశ్వరం.

మానవకల్పితరామణీయకానికి కూడ ఇవే లక్షణాలు. అయితే ప్రకృతిసిద్ధరామణీయకం దీనికంటె

ఉత్తమం. ఎందుకంటే ప్రకృతసిద్ధరామణీయకం యథార్థతరం, ప్రయోజనకారి. మానవకల్పితరామణీయకమంటేనో అనుకృతికి అనుకృతి. అందువల్ల అయథార్థ అవివేక ఉద్బోధకం. అందువల్ల మానవకల్పితరామణీయకం, అవివేక ఉద్బోధకం త్యాజ్యం అని ప్లేటో నిషేధిస్తాడు.

ఈ సిద్ధాంతాలను దృష్టిలో ఉంచుకొని ప్లేటో వాద మనుసరిస్తే తేలికగా అర్థమౌతుంది.

* ఏవి రమణీయవస్తువులు ? రామణీయకమంటే ఏమిటి ? వివేకం, కలిగినవారిని వివేకవంతు లంటున్నాము. మంచితనం ఉన్నవాళ్ళను మంచివాళ్లంటున్నాము. కాబట్టి వివేకం మంచితనం ఉన్నాయి. అలాగే రామణీయకం కలిగిన వస్తువులను రమణీయ వస్తువు లంటున్నాము. అంటే రామణీయకమనేది ఒకటి ఉన్నది. అయితే ఏమిటి యీ రామణీయకం? దేనిని రామణీయక మంటున్నాము ?

అందమైన కన్య రామణీయక మనవచ్చును. కాని కన్య ఒక్కటేనా రామణీయకం? అశ్వాలు, గోవులు, వీణలు, భాండాలు రమణీయాలు కావా ? రమణీయార్థాలు ఎన్నో ఉన్నాయి. కాని వీనిలో తరతమభావా లుంటున్నాయి. రమణీయకాంతలతోను, అశ్వాలతోను, వీణలతోను పోల్చిచూచినప్పుడు భాండాలు రమణీయాలు కావు. అత్యంతరమణీయమైన కోతిని మానవునితో పోల్చిచూచినప్పుడు వికారంగా ఉంటుంది. భాండాలను కాంతలతో పోల్చిచూచినప్పుడు వికారంగా ఉంటాయి. ఈ కాంతలనే దేవకన్యలతో పోల్చి చూచినప్పుడు చాలా వికృతంగా ఉంటారు.

ఇంతకూ అసలుప్రశ్న అలాగే ఉంది—ఏది పారమార్థికరామణీయకం ? దేని ఉనికివల్ల వస్తువులు రమణీయాలౌతున్నాయి? కన్య కావటంవల్లనా? లేక వీణ కావటంవల్లనా ? కాక అశ్వం కావటంవల్లనా ?

మెరిసేదీ, కగ్గనిదీ స్వర్ణం. దీనిని కోరనివాళ్లు ఉండరు. దీని సంయోగంతో ఎలాంటి వికారవస్తువైనా రమణీయమౌతుంది. వికారంగా కనిపించేది కూడా రమణీయంగా కనిపిస్తుంది అనవచ్చును.

ఆలెక్కలో శిల్పి ఫీడియస్ (*Phiedias*) తెలివితక్కువవాడు కావాలి. ఎందుకంటే అతడు "ఎథీనా" సుందరీప్రతిమకన్నులను బంగారంతో చేయలేదు. ముఖంకాని, కరచరణాలుకాని బంగారంతో చేయలేదు. కేవలం దంతంతో చేశాడు. దంతంకూడా రామణీయకమేనంటే, నేత్రగోళంకూడా ఆ దంతంతో చేసిఉండవలసింది. కాని అతడు అలా చేయలేదు. దంతచ్ఛాయ కలిగిన రాతితో చేశాడు. అతడు అలా ఎందుకు చేయాలి ? రమణీయశిలకూడా రామణీయకమేనా ?

ఔచితి ఉంటే, రాయికూడా రామణీయకమే అనవచ్చును. ఈ లెక్కలో అనౌచితి వికృతి అన్నమాట. కాబట్టి ఔచితిఉన్నప్పుడే స్వర్ణదంతములు వస్తువులను రామణీయకాలుగా చేస్తున్న వన్నమాట. అందువల్ల ఔచితి ఏ వస్తువునైనా రమణీయం చేయాలి.

సరే, బాగానే ఉంది. తొర్రిమొర్రికుండలో ఒకనిర్భాగ్యుడు వంట చేస్తుంటాడు. దానికి తగింది, ఉచితమైనది బంగారుతెడ్డా ? కొయ్యతెడ్డా ? కొయ్యతెడ్డుతో వంటకానికి కొంత రుచి రావచ్చును. బంగారుతెడ్డుతో అసలు కుండకే ముప్పు రావచ్చును. కాబట్టి తొర్రిమొర్రికుండకు కొయ్యతెడ్డు ఉంటే రమణీయ మౌతుంది. కాబట్టి వంగలేని అత్తకు లేవలేని కోడలు, కుంటివానికి గ్రుడ్డి పెళ్లాము ఉండటం రామణీయకం. అంతేనా ?

అది అలా ఉంచి మనకు ముఖ్యమైన విషయం విచారింతాము. మనకు కావలసింది ఏమిటి ? ఎవరికీ, ఎప్పుడూ వికారం కాని రమణీయవిషయం కావాలి.

ఈమాట అనగానే ఒకటి స్ఫురించవచ్చును.

"కీలారమునసుండి పాలింటి కేతేర
బహుధాన్యములు చేల బండి యొరగ

---

* *Hippias Major* ఈకృతి నిజంగా ప్లేటోదేనా అన్న విషయంలో సందేహాలు సూచించారు. కాని విషయాన్నిబట్టి చూస్తేమాత్రం ప్లేటో వాదమే కనిపిస్తున్నది. *A. B. Taylor* మొదలైనవారు ప్లేటోదిగా అంగీకరించారు.

వెడవెడ వెంట్లిండ్లు వడుగులు వోడము గృ
తార్థులై యర్థించు నరులలర
బరిచారికాకోటి పనిపాటు వాటింప
జుట్టంపు సందడి సెట్టుకొనగ
గ్రామ మెంతయు నిజప్రాభవమ్మున మన
సత్యనిష్ఠుదు దన్ను సాక్షిగోరి

పూర్ణాయుషం కలిగి గతించిన తల్లిదండ్రులకు కర్మలు చేస్తూ తుదికి కొడుకు చేతిమీదుగా వెళ్ళిపోవటం రమణీయం. ప్రతివాదూ దీనికి ఒప్పుకుంటాడు. ప్రతియుగం దీనికి హర్షిస్తుంది. అని అనుకోవచ్చును.

నిజంగా ఇది అందరికీ అన్ని కాలాలకూ రమణీయంగా ఉంటుందా? బ్రహ్మకూడా ఇదే కోరుకుంటాడా? తన తల్లిదండ్రులకు, అంటే లక్ష్మీనారాయణులకు తిలోదకాలు వదులుతూ, చివరికి వారవాది పుత్రులచేతిమీదుగా పోవాలనుకుంటాడా? ఇది ఘోరం. దేవతలపట్ల అపచారం. ఇది అందరికీ అన్ని కాలాలకూ రమణీయం కాదు. మనకు కావలసినది ఎలాంటి బాధాలేని రామణీయకం. అంటే దేని ఉనికివల్ల రాయి, రప్ప, చెట్టు, పుట్ట, కాడికర్ర, మనుష్యులు, దేవతలు, కర్మలు, జ్ఞానాలు సమస్తమైనవారికి సర్వకాలాలకు రమణీయమౌతున్నవి? ఏది పారమార్థిక రామణీయకం?

ఇంతకుముందు ఔచితివల్ల వస్తువులు రమణీయాలవుతున్నవన్న ప్రస్తావన వచ్చింది. అయితే ఈ ఔచితి వస్తువులను నిజంగా రమణీయం చేస్తుందా? లేక రమణీయాలవలె కనిపించేటట్లు చేస్తుందా? లేక ఈ రెండు పనులూ చేయదా? స్వభావానుసారంగా ఉన్న దానికంటె వస్తువులను ఔచితి ఎక్కువ రమణీయాలు చేస్తుందంటే అది ఒకవిధమైన రామణీయక ఆభాసమే కాని రామణీయకం కాదు. అలాంటి ఆభాసం మనకు అవసరం లేదు. విచార్యమూ కాదు. మనకు ముఖ్యం ఒక్కటే. దేనివల్ల రమణీయ వస్తువులు రమణీయంగా ఉంటున్నాయి? పెద్దవస్తువుల పెద్దతనం ఎందులో ఉన్నది? అంటే పరిమాణంలో ఇతరవస్తువులను అతిశయించి ఉన్నవి కాబట్టి పెద్దవంటున్నాము. అలాగే దేనివల్ల రమణీయవస్తువులు రమణీయంగా ఉంటున్నాయి? ఔచితివల్ల రమణీయ వస్తువులు రమణీయంగా ఉన్నాయి అనటానికి వీలు లేదు. ఎందుకంటే దానివల్ల వస్తువులు నిజంగా ఉన్న దానికంటె ఎక్కువ రమణీయాలు అవుతాయి.

అలా కాదు. ఔచితి వస్తువులను యథార్థంగాను, ఆభాసికంగాను రమణీయం చేస్తుందని అంటామే పో. ఆ పక్షంలో వివిధఆచారాలు, జీవితపథాలు మొదలైన యథార్థరమణీయవస్తువులను రమణీయాలని అన్ని కాలాలలోను అందరుమానవులూ భావిస్తున్నారా? వీని రామణీయకవిషయంలో వ్యక్తులు సంఘాలు వివాదపడటం లేదా? నిజానికి రమణీయవస్తువులను గుర్తించకపోవటం జరుగుతున్నది. వస్తువులు యథార్థంగా రమణీయాలై పైకికూడా అలా కనిపిస్తున్న పక్షంలో అలాంటి వివాదాలు రావటానికి వీలు లేదు. ఔచితియే రామణీయకమై వస్తువులను యథార్థంగా రమణీయాలను చేసి పైకికూడ రమణీయాలవలె కనిపించేటట్లు చేస్తే అంతా దానిని గుర్తించి ఉండేవారు. అప్పుడు వివాదాలు ఉండేవి కావు. కాని అలా జరగటం లేదు. పైగా ఒక్కటే అటు యథార్థరామణీయకానికి ఇటు తదాభాసకు కారణం కాజాలదు. కాబట్టి ఔచితి వస్తువులను యథార్థంగాను, అభాసికంగాను రమణీయం చేయజాలదు.

కాగా ఔచితి రామణీయకం కాదు.

వినియోగపడే వస్తువులను రమణీయాలందామా? ఆ పక్షంలో వినియోగమే రామణీయకమౌతుంది. ఇది కొంత బాగున్నదేమో? ఎందుకంటే, గ్రుడ్డికన్నును రమణీయ మనలేము. అలాగే రోగగ్రస్తమై పనిపాటలకు వినియోగపడని శరీరం కాని, పరుగెత్తలేని గుర్రాన్ని కాని రమణీయ మంటామా! లేదు. రమణీయాశ్వం, రమణీయకుక్కుటం, వస్తువులు, వాహనాలు, నౌకలు, వీణాదిపరికరాలు, రమణీయాలంటున్నాము. వినియోగపడనివాటి నంటున్నామా! ఇలాగే సంస్థలు, జీవితపథాలు, రమణీయాలంటున్నాము. వీటి పుట్టుపూర్వోత్తరాలు, ఒక్కొక్కస్థానం విచారించి

వినియోగపడేదైతే రమణీయ మంటున్నాము. వినియోగపడనిదైతే వికారమంటున్నాము.

ఈపక్షంలో వినియోగసామర్థ్యం రామణీయక మౌతున్నది; అసామర్థ్యం వికారమౌతున్నది. ఈపక్షంలో వివేకం అత్యంత రమణీయం, అవివేకం అత్యంతవికారం కావాలి.

దుష్కృత్యాలకు వినియోగపడే వస్తువులను రమణీయా లంటున్నామా? లేదు. అలా ఎప్పుడూ అన లేము. కేవలం సద్వినియోగసామర్థ్యమే రామణీయక మంటున్నాము. సామర్థ్యము వినియోగము ఉండి ప్రయోజనం లేదు. అది శ్రేయస్కరం కావాలి. దానికి తోడ్పడాలి. అప్పుడే అలాంటి వస్తువు రమణీయమౌతున్నది. రమణీయశరీరాలనీ, రమణీయపథాలనీ, రమణీయవివేక మనీ అంటున్నామంటే లాభదాయకాలు కాబట్టి అంటున్నాము. ఈ పక్షంలో లాభదాయకత్వము రామణీయకం కావాలి. అయితే లాభదాయక మనేది ఏదో ఒక శ్రేయస్సు కలిగించాలి. అప్పుడు రామణీయకం శ్రేయస్సుకు ధర్మానికి కారణం కావాలి. ధర్మం కార్యం అవుతుంది. ఋజుత్వం, సద్గుణపుంజం రమణీయా లంటున్నామంటే అవి ధర్మం శ్రేయం కలిగిస్తున్నాయికాబట్టి రమణీయా లంటున్నా మన్న మాట. వాటికి అందుకే అంతగా స్థానమిస్తున్నా మన్నమాట. ఇదే నిజమైతే, రమణీయవస్తువు ధార్మిక మైనదానికి జనకమౌతున్నది. ఆ పక్షంలో రామణీయకం కారణమై ధర్మం కార్యమౌతున్నది. అయితే తండ్రి తండ్రియేకాని కొడుకు కానట్లుగా, కారణము కారణమే కాని కార్యం కాజాలదు. కారణము కార్యము కాదు. కార్యము కారణము కాదు.

కాబట్టి రమణీయమైనది ధార్మికమూ కాదు. ధార్మికమైనది రమణీయమూ కాదు. కాగా ధర్మానికి కారణమైన లాభదాయకత్వంకాని, వినియోగత్వం కాని, సామర్థ్యంకాని రామణీయకం కాదు.

అలా కాదు చక్షువుద్వారాకాని, కర్ణము ద్వారాకాని సుఖం, లేక సంతోషం కలిగించే వస్తువును రామణీయక మందామా? అంటే నానలున్నాయా? ఉంటే అవి ఏమిటి? రమణీయపురుషులు. రంగుల నమూనాలు (*Colour Patterns*), చిత్రాలు, విగ్రహాలు చూచినప్పుడు మనకు సుఖం సంతోషం కలుగుతున్నది. రమణీయకంఠాలు, సంగీతం పద్యకవిత్వం, గద్యకవిత్వం, కథలు విన్నప్పుడుకూడా అలాగే సంతోషంకలుగుతున్నది కాబట్టి చక్షుష్కర్ణం ద్వారా సంతోషం లేక సుఖం కలిగించేదానిని రామణీయక మందామా?

కొందరు ఇలా అనవచ్చును. అనేక ఇంద్రియాల వల్ల సుఖం లేక సంతోషం కలుగుతున్నదికదా? అలా సుఖం కలిగించేవాటి అన్నిటిలోను కేవలం చక్షుష్కర్ణంద్వారా సుఖం కలిగించేవాటికే రామణీయక మని ఎందు కనాలి? ఆహారవిహారాదులవల్ల పానీయాల వల్ల, సంభోగాదికంవల్ల సుఖం, సంతోషం కలుగుతున్నదికదా? అలాంటప్పుడు దృశ్యతారమణీయాలు, శ్రవ్యతారమణీయాలుమాత్రమే రామణీయకమని తతిమ్మా వాటిని ఎందుకు విడిచేయాలి? ఆహారవిహారక్రీడలు సుగంధాలు మొదలైనవి సంతోషమిచ్చేవే. సుఖం కలిగించేవే. కాని వాటిని రామణీయకమంటే నవ్వు వస్తుంది. ఇలాంటివి సంతోషదాయకాలే, సుఖకరాలే. సంభోగసుఖం గొప్పదేనని అంతా ఒప్పుకొంటారు. కాని అది ఏకాంతంలో అనుభవించవలసినదే కాని బాహాటంగామాత్రం కాదు. బాహాటంగా జరిగితే చాలా అసభ్యంగా ఉంటుంది.

ఇలా సమాధానం చెబితే పృచ్ఛకుడు ఇలా అనవచ్చును. "అయితే మీ రింతసేపూ అధికసంఖ్యాకులు ఒప్పుకోక నవ్విపోతారన్న భయంతో కొన్ని ప్రత్యేక సుఖాలను, సంతోషాలను మాత్రమే రమణీయా లంటున్నారన్నమాట. లోకంలో ఎక్కువమంది ఏది రామణీయకమని భావిస్తున్నారో చెప్పమని నేను కోరటం లేదు. అసలు యథార్థంగా రమణీయమైనది ఏది?" అని అడుగుతున్నాను.

చక్షుష్కర్ణంద్వారా సుఖం కలిగించేదే నిజంగా రామణీయకమంటూ మనుకోండి. అప్పుడు ఒక సందేహం వస్తున్నది.

కేవలం చక్షుస్సుద్వారా సంతోషం కలిగించే వస్తువులు చక్షుష్కర్ణంద్వారా సంతోషం, సుఖం కలిగించే వస్తుకోటిలో చేరవుకదా? అప్పుడు అవి రామణీయకం కాదుకదా. అలాగే కేవలం కర్ణం ద్వారామాత్రమే సంతోషం, సుఖం కలిగించే వస్తువులు కూడా రామణీయకం కాదుగదా అన్న సందేహం వస్తుంది. ఈరెండింద్రియాలలో ఒక ఇంద్రియంద్వారా సుఖకరమైనది ఈ ఉభయఇంద్రియాలద్వారా సుఖకరం కాని మాట వాస్తవం. ఈ రెండుసుఖాలలో ప్రతి ఒక్కటీ తనకు తాను రామణీయకం కాబట్టి రెండూ రామణీయకమే.

సరే అంతవరకూ బాగానే ఉన్నదందాము. మీరు చెప్పినట్లుగా కంటిద్వారా సుఖం కలిగించేవీ ఉన్నవి. చెవిద్వారా సుఖంకలిగించేవీ ఉన్నవి. ఇలాగే తతిమ్మా ఇంద్రియాలద్వారా సుఖంకలిగించేవీ ఉన్నవి. అయితే ఈసుఖంలో తేడాలున్నాయి. అంటే విభిన్న ఇంద్రియాలద్వారా కలుగుతున్న సుఖంలో తారతమ్యాలు ఉన్నవా లేవా అని అడగటం లేదు. కాని ఒకటి సుఖమై మరొకటి కాకపోతున్నదా? లేదు. అన్నీ సుఖం కలిగించేవే.

దీనినిబట్టి ఒకటి తేలుతున్నది. దృశ్యతారమణీయాలు, శ్రవ్యతారమణీయాలు రామణీయక మంటున్నామంటే సుఖం కలిగిస్తున్నవికాబట్టి రామణీయక మనటంలేదు. వాటిని రామణీయక మంటున్నామంటే, తతిమ్మా సుఖకరాలనుంచి వేరుపరచే ప్రత్యేక లక్షణమేదో ఒకటి ఉండాలి. దృశ్యతాసుఖం కేవలం దృశ్యతవల్ల కలుగుతున్నది కాబట్టి రమణీయ మనటం లేదు. దృశ్యతవల్ల కలిగే సుఖము ఒక్కటే రామణీయక మనేటట్లయితే, శ్రవ్యత ద్వారా కలిగే సుఖం రామణీయకం కాకపోవాలి. ఎందుకంటే అది దృశ్యతద్వారా లభించటం లేదు. శ్రవ్యతాసుఖం రామణీయకమంటే పైవిధంగానే దృశ్యతాసుఖం రామణీయకం కాకపోవాలి. అయినా రెండూ రామణీయక మంటున్నాము. కాబట్టి రెంటినీ రమణీయంచేసే సామాన్యలక్షణం ఒకటి వాటిరెంటిలోను ఉండాలి. అలా కానిపక్షంలో ప్రతిఒకటీ కాని, రెండూకాని రామణీయకం కాజాలవు. . .

రమణీయవస్తువులలో దృశ్యతారమణీయాలు, శ్రవ్యతారమణీయాలుమాత్రమే రామణీయక మని వేరుచేస్తున్నాము. ఇలా వేరుచేస్తున్నా ఈ రెండుసుఖాలలోను ఉన్న రామణీయకాన్ని ఎలా నిర్వచించాలి? ఈ రెండుసుఖాలు నిరపాయాలు. సుఖాలన్నిటిలోను ఇవి ఉత్తమాలు. ఇది రెంటికీ, ప్రతిఒకదానికీ అన్వయిస్తుంది. అయితే యింతకూ రామణీయకమంటే లాభదాయకమైన సంతోషమనేనా నిర్వచనం? ఆ పక్షంలో ఇంతకుముందు చెప్పుకొన్నట్లు లాభదాయకమంటే ధర్మప్రతిపాదకమనీ, రామణీయకం కారణమై, ధర్మం కార్య మౌతుందనీ, కారణకార్యములు వేరనీ సిద్ధిస్తున్నవి కాబట్టి మళ్లీ మొదటికే వస్తున్నా మన్నమాట. ఎందుకంటే రామణీయకం ధర్మంకాదనీ, ఈ రెంటిలో ప్రతిఒక్కటీ రెండవదానికంటె భిన్నమనీ ఇదివరకే తేలిపోయింది.

ఈ పర్యాలోకనంతో ఏమి తేలింది? రామణీయకమంటే శిలావంతిసువర్ణాదికద్రవ్యం కాదు, ఔచితి కాదు. ప్రయోజనం కాదు. సామర్థ్యం కాదు. ప్రయోజనసామర్థ్యం అంతకన్నా కాదు. ధర్మం అసలే కాదు. సుఖసంతోషాలు అంతకన్నా కావు. అయితే ఇదీ ఒక నిర్వచనమేనా? రామణీయకమంటే ఏది కాదో చెప్పటం జరిగిందికాని, ఏమిటో నిర్వచించటం జరగలేదు. కాబట్టి ప్లేటోకు రామణీయకమంటే ఏమిటో తెలలేదు. అతడుకూడ సందిగ్ధావస్థలోనే ఉన్నా డనిపించవచ్చును. కాని అది పొరపాటు. అతనికి రామణీయకమంటే ఏమిటో ఒక నిర్దిష్టాభిప్రాయం ఉంది. ఆ అభిప్రాయాన్ని ప్రతిపాదించటానికే పైని పేర్కొన్న చర్చ సాగించాడు.

అతని మతంప్రకారం రామణీయకం భౌతిక పదార్థం కాదు. అది కేవలం ఒక భావం. ఈభావం స్వతంత్రం. ఇది మానవకల్పితమూ కాదు, ఈశ్వర కల్పితమూ కాదు. ఇది జీవాత్మ కాదు, పరమాత్మ కాదు. నిత్యమూ, తారతమ్యవిరహితమూ, స్వయంభువు అయిన భావం.

ఈ అర్థమే ప్లేటో సింపోజియంలో ఇలా వివరించాడు—"ఈ రామణీయకం నిత్యం. దీనికి ఆద్యం

తాలు లేవు. ఇది ఉత్పన్నం కాదు. నష్టం అంత కన్నా కాదు. ఈ రామణీయకం ఒకవిధంగా రమణీయమై మరొకవిధంగా వికారంగా కనిపించేది కాదు. ఇది ఒక కాలంలో, ఒకచోట, ఒకదృష్టికి రామణీయకమై మరొకకాలంలో, మరొక చోట, మరొకదృష్టికి, వికారంగా కనిపించేది కాదు. ఈ రామణీయకం ద్రష్టలమీద ఆధారపడి లేదు. ఈ రామణీయకం ముక్కు గాదు, ముఖం కాదు. రక్త మాంసాలతో కూడిన శరీరంకాదు. వాక్కు కాదు. విద్యా గ్రహణం కాదు. దాని సత్తా ప్రాణిలో కాని, పృథ్విలో కాని, ఆకాశంలో కాని లేదు. మరేజీవిలోను ఉండేది కాదు. దాని కేవలసత్తాఏకైకమై తనలో తానుఉంటుంది. ఈ రామణీయకంయొక్క లక్షణాలను పొంది వస్తువులు రమణీయా లవుతున్నవి. ఇలాంటి రమణీయవస్తువులు పుడుతూ గిడుతూ ఉంటాయి. అయితే, పారమార్థికమైన రామణీయకంమాత్రం తరగదు, పెరగదు. వికారం లేక పరిణతి అంతకన్నా పొందదు."

అయితే ఇలాంటి పారమార్థికరామణీయకం నుంచి లౌకికరామణీయకం ఎలా అవతరిస్తుందో చూదాము.

లౌకిక రామణీయకం

* భావం ఈశ్వరాభివ్యక్త మని చెప్పుకొన్నాము. దీనికి భౌతికప్రపంచంలో అనేకవిధాలైన ఆభాసా లున్నాయి. ఉదాహరణకు గృహం తీసికొందాము. గృహభావం ఈశ్వరాభివ్యక్తం. ఈ భావాన్ని అనుసరించి వాస్తుజ్ఞుడు ప్రయోజనంకోసం గృహం నిర్మిస్తున్నాడు. చిత్రకారుడు భౌతిక గృహాన్ని అనుసరించి గృహచిత్రం గీస్తున్నాడు. ఇక్కడొక విశేష ముంది. వాస్తుజ్ఞుడు వాస్తుశాస్త్ర నిర్దిష్టవిషయాలనుమాత్రమే నిర్మిస్తాడు. చిత్రకారుడు అలా కాదు. ఇతరవృత్తులవారు చేసే వస్తువులన్నీ సృష్టిస్తున్నాడు. అతడు మనుష్యులనే కాదు, తరులతాదులనే కాదు, ప్రాణికోటినే కాదు, సమస్తవిషయాలనూ సృష్టిస్తున్నాడు. మూడులోకాలను, తుదికి దేవతలనుకూడ సృష్టిస్తున్నాడు.

ఇలాంటి పని కష్టతమ మనిపించవచ్చును. కాని నిజానికి ఇలాంటిపని సులువుగా తొందరగా చేయటానికి అనేకమార్గా లున్నాయి. వాటన్నిటిలో మరీ సులువైనది మరొకటి ఉంది. అద్దం నలుమొగాల తిప్పివేసరి, భూమ్యాకాశాలను, సూర్యుణ్ణి, తరులతాదులను, మానవులను తేలికగా సృష్టించివేయవచ్చును. అయితే యిలా సృష్టమైనవన్నీ ఆభాసాలే. కవి, చిత్రకారుడు ఈ ఆభాసాలనే తయారుచేస్తారు. వీరిచే సృష్టమైన దంతా అయథార్థం.

ఇప్పటికి మూడురకాల సృష్టులు కనిపిస్తున్నాయి. ౧. ఈశ్వరాభివ్యక్తమైన గృహభావాదికం, ౨. వృత్తికారసృష్టి అయిన గృహాదికం, ౩. కళాస్రష్ట సృష్టి అయిన గృహచిత్రాదికం. మొదటిది యథార్థం. రెండవది మొదటిదాని ఆభాసము. మూడోది రెండవదానికి అనుకరణం. కాబట్టి మూడవదైన కళాసృష్టి యాథార్థ్యానికి మూడింతలు దూరమౌతున్నది.

వ్యావహారికజగత్తు-కళాసృష్టి

ఇంతకూ కలాస్రష్ట అనుకరణం సత్యాన్ని అనుకరించటంలేదు. కేవలం ఆభాసాన్ని అనుకరిస్తున్నది. వ్యావహారికశయ్య ఒకటి ఉన్న దనుకొండి. దానిని భిన్నభిన్న స్థానాలనుంచి, భిన్నభిన్నదూరాలలో ఉండి చూస్తే ఆ ఒకేశయ్య భిన్నభిన్న ఆకృతులతో గోచరిస్తుంది. (కళాస్రష్ట ఆ భిన్నత్వాలనే చిత్రిస్తున్నాడు. కాని ఏకంగా ఉన్న ఆ వ్యావహారికశయ్యను చిత్రించటం లేదు.) అందువల్లనే కళాస్రష్ట కేవలం ఆభాస మనుకరిస్తున్నాడని చెప్పాలి.†

---

* ***Republic, chap*** **: 10.**

† ఈ అర్థమే పండితరాయలుకూడా ప్రతిపాదించాడు:—

"విభావాదీనామపి స్వప్నతురగాదీనామివ,
రంగరజతాదీనామివ సాక్షిభాస్యత్వ మవిరుద్ధమ్."

(రసగంగాధరం, ప్రథమాననం ౨౬ పే.)

ఇది సిద్ధాంతమైతే బోశాంకో పేర్కొన్నట్లు సంగీతసాహిత్యకళల యాథార్థ్యంవిలువ పూర్తిగా అపకృష్టమౌతుంది.

అతడు ఇలా కేవలం ఆభాసాలను అనుకరిస్తూ ఉండటంవల్లనే అన్నివస్తువులను సృష్టించగలుగుతున్నాడు. కమ్మరిని, వడ్రంగిని మొదలైనవారినంతా సృష్టిస్తున్నాడు. కాని వారి వృత్తులలో ఒకటికూడా అతనికి తెలియదు. అయినా అతని బొమ్మలను చూచి పిల్లలు తెలియనివాళ్లు నిజంగా వడ్రంగిని కమ్మరిని చూస్తున్నామనుకొంటున్నారు. చిత్రకారుడు సర్వజ్ఞుడని భావిస్తున్నారు. కాని ఇలా అనుకొనే వారికి జ్ఞాన అజ్ఞాన అనుకరణాల స్వరూపం తెలియదు.

కవి చిత్రకారాదులు అనుకరిస్తున్నారే అనుకొన్నా, అలా అనుకరించటానికైనా జ్ఞానం కావాలి కదా అనవచ్చును. కాని బింబము, ప్రతిబింబమూ సృష్టించగలిగినవాడు ప్రతిబింబసృష్టిలో ఎందుకు నిమగ్నుడౌతాడు? జీవితానికి మరొక పరమార్థం లేనట్లుగా అనుకరణమే ప్రధానంగా ఎందుకు చూచుకొంటాడు?

అసలు అనుకరణస్వరూపం తేల్చుకొంటే కళాస్రష్టసృష్టిసంగతి తేలుతుంది. అనుకరణం రెండు విధాలు: (౧) దివ్యము, (౨) మానవము. ఈశ్వరసృష్టి దివ్యము. మనుజుడు చేసే సృష్టి మానవం. దివ్యసృష్టి భౌతికవస్తువులను అపేక్షించదు. మానవసృష్టి అలా కాదు. భౌతికవస్తువుల నూతనసంయోగంతో జరుగుతుంది. దివ్యమూ మానవమూ అయిన సృష్టి తిరిగి రెండు విధాలు. (౧) యథార్థం, (౨) అయథార్థం. ప్రకృతిసిద్ధవస్తువులు, భూ సముద్రాదులు, తరు లతాదులు, పశుపక్ష్యాదులు యథార్థదివ్యసృష్టిలోనివి. స్వప్నాలు, వెలుగువల్ల ఏర్పడే నీడలు, మణిదర్పణాదులందు గోచరించే ప్రతిబింబాలు అయథార్థదివ్యసృష్టిలోనివి. గృహారామాదికములు యథార్థమానవసృష్టిలోనివి. సంగీతసాహిత్యాదికసృష్టి అయథార్థమానవసృష్టిలోనిది.

అయథార్థమానవసృష్టి తిరిగి సదృశము, అసదృశము అని రెండువిధాలు. ఈ సదృశసృష్టిలోని ప్రతిబింబాలు బింబం ఏనిష్పత్తిలో, ఏరంగులో, ఎలా ఉంటుందో అలాగే ఉంటాయి. అసదృశసృష్టిలో అలా కాదు. ఉదాహరణకు శిల్పి చెక్కే బృహద్విగ్రహమే తీసికొందాము. ఈ విగ్రహము అవయవాలు ప్రకృతిసిద్ధంగా ఉండే పరిమాణంలో ఉండవు. అలా ఉండకపోగా ప్రకృతిసిద్ధమూర్తి అవయవాలు ఏ నిష్పత్తిలో ఉంటాయో ఆ నిష్పత్తిలోనైనా ఉండవు. విగ్రహంక్రింద నిలిచి తల పైకెత్తి చూస్తే ప్రకృతిసిద్ధనిష్పత్తి కనిపించేటట్లుగా అవయవపరిమాణం ఉంటుంది. అంటే విగ్రహశీర్ష భాగం ప్రకృతిలో ఉన్న నిష్పత్తికంటె అధికంగా ఉంటుంది. ఇది అసదృశం. ఈ అసదృశం ఉపకరణోత్పన్నమనీ, ఆత్మోత్పన్నమనీ రెండురకాలు. తూలికావీణాదికోత్పన్నాలైన చిత్రరాగసంచారాదికములు మొదటిదానిక్రిందికి వస్తవి. (౨) తన్నుతానే ఉపకరణంగా వాడుకొని చేసే సృష్టి నాట్యం (*mimicry*). ఈ నాట్యం రెండువిధాలు: ౧. తెలిసి చేసేది, ౨. తెలియకుండా చేసేది. న్యాయధర్మాదుల యథార్థరూపం తెలియనివాళ్లు తమ వాక్కర్మలద్వారా తా మనుకొనే న్యాయధర్మాదికముల ఆభాసను ప్రదర్శిస్తారు. ఇలా తమకున్న లక్ష్యాన్ని ప్రదర్శించటంలో కొందరు సఫలు లౌతారు. ఇలా తెలియకుండా చేసే నాట్యానికి ప్రత్యేకమైన పేరు లేదు. కాబట్టి ప్రస్తుతానికి దీనిని వంచకము (*Counterfeiting*) అందాము. ఇలాంటి వంచన చేసేవానికి తనకు యాథార్థ్యం తెలుసునన్న నమ్మకం ఉండవచ్చును. కాని నిజానికి అతనికి తెలియదు. మరొకరకమైన వారికి తమకు తెలియునని నటిస్తున్నది నిజంగా తమకు తెలియదన్న అనుమానం ఉండవచ్చును. ఇలా తెలియదని తెలిసికూడా చేసేవారు ***Imposters***.

మొత్తంమీద అనుకరణం ఇన్నిపోకలు పోతున్నది. ఇలాంటి అనుకరణంవల్ల ఏర్పడుతున్న కళాస్రష్టసృష్టిలో వినియోగానికి వచ్చేది ఏమీ లేదు. ఈ సృష్టిలో అనేకవిషయాలు ప్రసక్తాలవుతాయి. పురాదికవర్ణనలు, వైద్యం, సత్పరిపాలనం, జీవితపరమార్థం మొదలైనవి వర్ణితము లౌతాయి. అవి పురాదుల నిర్మాణానికి, రోగచికిత్సకు, జీవితలక్ష్యనిష్కర్షకు తోడ్పడవు. అసలు అది ఉపదేశకం కాదు.

కాబట్టి కవి చిత్రకారాదికళాస్రష్టలంతా పుణ్యాదిక ప్రతిబింబాలను అనుకరించేవారేకాని సత్యం చెప్పలేరు. చిత్రకారుడు వర్ణాలతో ఆయా ప్రతిబింబాలను అనుకరిస్తున్నట్లే కవి తన పదాలతో వాటిని అనుకరిస్తున్నాడు. అనుకరించటానికి అవసరమైనంత జ్ఞానముమాత్రమే అతనికి ఉంటున్నది. ఆ లయ (*Melody*), ఛందస్సు, నాదము, పదగతవైచిత్రి తీసివేసి వచనంలాగా చేస్తే అసలురూప మేమిటో బోధపడుతుంది. కవుల కథల బండారం బయటపడుతుంది. ముఖం వస్తుతః అందంగా లేకపోయినా యౌవనోదయంతో వికాసం పొందుతున్నట్లుగానే ఛందోలంకారాదికనిగడితమైన కవిత వికాసం కలిగిఉంటున్నది. యౌవననిర్గమనంతో ముఖం ముడతలుపడి వికారం పొందుతున్నట్లే ఛందోలంకారాదులను తీసివేసి తాత్పర్యైకప్రధానం చేసిన రచన వికారంగా ఉంటుంది.

పైగా అనుకారికి యథార్థసత్త తెలియదు. ఆభాసాలుమాత్రమే అతనికి తెలుసు.

ప్రతిదాని ఉత్తమత్వం, రామణీయకం, సత్యం అనేది వృత్తికారు డుద్దేశించిన ప్రయోజనంమీద ఆధారపడిఉంటుంది. ఉదాహరణకు వీణను తీసికొందాము. వీణయొక్క మంచిచెడ్డలు వైణికునికే తెలుసు. ఏ వీణ బాగున్నదో, ఏది బాగుగలేదో, ఎలా చేస్తే బాగుంటుందో అతడు వీణ చేసేవానికి చెబుతాడు. అతడు వైణికుని సలహో ననుసరించి వీణ తయారుచేస్తాడు.

వైణికుడు వీణమంచిచెడ్డలను చెప్పగలిగినట్లుగా కవి చిత్రకారాదులు ప్రయోజనాన్నిబట్టి తమ కృతులు సరిగా, అంటే రమణీయంగా ఉన్నవో లేవో చెప్పగలరా ? తాము ఏమి వ్రాయాలో దేశికునివద్ద ఉపదేశం పొందితే వారికి సరియైన అభిప్రాయం ఏర్పడుతుందా ? లేదు. తమ కృతుల బాగోగులు వారికి తెలియవు. వారికి సరియైన అభిప్రాయమూ ఉండదు.

బాగోగులు దేనివల్ల ఏర్పడుతున్నవో తెలియకుండానే చిత్రకారాదులు అనుకరిస్తున్నారు. దీనినిబట్టి అజ్ఞానంలో మునిగితేలే ప్రజాసామాన్యానికి మంచిదానివలె కనిపించేదానినే వా రనుకరిస్తున్నా రనుకోవాలి. "ఈ అనుకరణం ఒకవిధమైన క్రీడ, లేక ఆట."

ఈఅనుకరణం మనలోని అభిప్రాయానికి విషయమౌతున్నదేకాని, వివేకానికి మాత్రం కాదు. అనుకృతి నిజంగా అనుకృతిగా ఉంటే అది వివేకానికి విషయం కాదు, బుద్ధికీ విషయం కాదు. అభిప్రాయానికిమాత్రమే. అంతే కాదు. ఈ అనుకృతి వీక్షణ శ్రవణములకుమాత్రమే విషయ మౌతున్నది.[1] ఈ అనుకృతికి యథార్థం, లేక శివంకరమైన లక్ష్యం లేదు.

కళ అవివేకవతి.[2] ఈ అవివేకమే అనుకృతికి అనంతవస్తువైవిధ్యం ప్రసరిస్తున్నది. వివేకవంతము, ప్రశాంతము, ఉత్తమమైన వృత్తము ఎప్పుడూ ఒకటిగా సమంగా ఉంటుంది. ఇలాంటిది అనుకరణకుదుష్కరం. ఒకవేళ అనుకృతమైనా ఆస్వాదించటం కష్టం. అందులో నానావిధమన స్తత్త్వం కలిగిన జనసందోహం నాటకశాలలో సమావేశమైనప్పుడు మరీ కష్టం.

కవిస్వభావంకాని, అతని కళకాని, ఆత్మలోని వివేకాన్ని దుష్టం చేయటానికి ఉద్దిష్టం కాదు. అతడు ప్రజాసామాన్యం మెప్పుకోసం ప్రాకులాడుతాడు. అందువల్ల తేలికగా అనుకరించటానికి వీలైన ఆవేశాలను అనుకరించటానికి ఇష్టపడతాడు. ఇలాగే చిత్రకారుడు. వీరు మానవునిలోని మనోమాలిన్యాలను రెచ్చగొట్టి వివేకానికి భంగం కలిగిస్తారు. కవి తన రచనద్వారా మనలోని శోకాన్ని ఎంతగా పొంగించగలిగితే అంతగా సంతోషిస్తున్నాము. నిజానికి మన కొక కష్టం వచ్చి దుఃఖం కలుగుతున్నప్పుడు దానిని ఎంత ఆనచివేసికోగలిగితే అంత గర్వపడతాము.

1. *This imitation is confined to the sight and to the hearing relating in fact to what we term Poetry.*

2. *Art is irrational.*

ఇలా శోకం దిగమింగటానికి బదులుగా పైకి వెళ్లబోసి కొంటూ దానికి సంతోషించటం హేయంకాదా ?

కష్టాలు వచ్చినప్పుడు బావురుమని ఏడ్చి శోకవిముక్తి పొందాలన్న స్వాభావికవాంఛ మనలో ఉంటుంది. అయితే ఇది వివేకానికి కట్టుబడి అణిగిఉంటుంది. ఈ వాంఛే కవులవల్ల తుష్టిప్రాప్త మౌతుంది. ఈ వాంఛ వివేకంవల్ల సముచితశిక్షణ పొందకపోవటంవల్ల కాని, కలుగుతున్న దుఃఖం మరొకనిదికదా అన్న సానుభూతి వల్లకాని పొంగిపొర్లటానికి అవకాశ మేర్పడుతుంది. ఇతరుడు వచ్చి తన మంచితనం, తనకు వచ్చిన కష్టాలు చెప్పుకొన్నప్పుడు అతనిని ప్రశంసిస్తూ జాలిపడటంలో అవమానకరమైనది ఏమీ లేదని సామాజికుడు అపోహ పడుతున్నాడు. ఈ సుఖం ఒకలాభ మను కొంటున్నాడు. వైముఖ్యం అవలంబించి ఈ సుఖాన్ని కావ్యాన్ని ఎందుకు కోల్పోవాలి అనుకొంటు న్నాడు. ఇతరుల అనర్థాలవల్ల కొంత అనర్థం తనకు కూడా సంక్రమిస్తున్న దన్న పరామర్శం కొలది మందికికూడా కలగటం లేదు.

ఇదే హాస్యానికికూడా అన్వయిస్తుంది. కొన్ని చతురోక్తులు నీకు నీవు విసరటానికి సిగ్గుపడతావు. అయినా వాటినే రంగభూమినుంచో, మరొకరినోటి నుంచో విన్నప్పుడు వినోదిస్తావు. వాటి అసభ్యతకు అసహ్యించుకోవు. ఇదంతా సానుభూతి ఉన్నప్పుడే జరుగుతుంది. మానవుని తత్త్వంలోనే యీ హాస్యం వాసనారూపంగా వుంది. అయితే ఇతరులు విదూషకు డంటా రన్న భయంతో నవ్వం. ఈవిధంగా వాసన వివేకానికి లోనై లోలోనే ఉండిపోతుంది. ఈ వాసన నాటకశాలలో దోహదం పొంది నీకు తెలియకుండానే విదూషకుడ వైపోతున్నావు*.

ఇచ్ఛాసుఖదుఃఖవిశిష్టమైన రతిక్రోధాదులు మానవుని ప్రతివ్యాపారంలోను అవినాభావసంబంధం కలిగిఉంటున్నాయి. కవిత్వం, కళ ఈ ఆవేశాలను, మనోమాలిన్యాలను అణచివేయటానికి బదులుగా దోహదమిచ్చి పెంపొందిస్తుంది. వీటిని అదుపుఆజ్ఞలలో ఉంచక స్వేచ్ఛావిహారం చేయనిస్తుంది. మానవజాతి అభ్యుదయం పొందాలంటే, ఈ ఆవేశాలను కంట్రోలుచేయాలి. కాబట్టి దేవతాస్తోత్రాలు ఉత్తమ పురుషులప్రశంసలు తప్ప మరేలాంటి కవిత్వాన్ని రాజ్యంలోనికి అడుగుపెట్టనీ గూడదు. అడుగుపెట్ట నిస్తే, రాజ్యంలో పెత్తనంచేసేవి సుఖదుఃఖాలే కాని నీతినియమాలు, వివేకం కావు.

కాబట్టి కవిత్వం సత్యసాధకంగా పరిగణించ టానికి వీలు లేదు. ఆత్మసిద్ధి పొందగోరేవాడు దాని టక్కులకు మోసపోరాదు.

(సశేషము)



---

* *Having stimulated the risible faculty at the theatre, you are betraying unconsciously to yourself into playing the comic part at home.*

Republic, Chapt. 10.

వర్షారాధిక

శ్రీ వేదాల తిరువేంగళాచార్యులు

చవులూరుఁ నవనీలనీరదవిభాసంపత్తి; శంపాలతాం
గవిలాసంబులు చూడ ముచ్చటగు; పంకేజాతజీవాతువౌ
రవి వీచాయల గానరాడు - మన మారాటమ్ము తీరమ్యె! మా
ధవుజాడల్ తెలియంగ నో చెలియ! లేదా ఏ యుపాయం బికఁ ?

పవలును రేలునుం గలతబాఱెడు డెందము; చందమామ రా
నివిధము నేవిధిఁ దలతునే! తన మోమును జూడ జాడలే
యవి యగుపించు - ఇంచువిలునంచలముల్ గనిపించు - మంచిదా
నివి - హరివిల్లునందు; నవనీరదవారము తోరమయ్యెడుఁ !

తలపులు పూలుబూచె వినుదారుల మబ్బులజూచి, చూచుక
మ్ముల గిలిగింతల న్మనసుపోయెను; మున్మును వానచిన్కులఁ
వలిగొను తెమ్మెరల్ మెఱయు వైఖరి పోకిరిదాంగ పొంగులఁ
గులికెడు; చిత్త మెల్ల గలగుఁ మలగుఁ చెలి! భావసంపదల్.

నేనా - మా నవనీతచోరు నవేవానీరావనీయామునీ
యానూపాగ్రవనీవిలోలపదవీవ్యామోహముం జూడగా
నేనా - తానె సనాతనం బగునటుల్ వ్యాయామముం జేయు; నిం
తైనా మారదు వానదుర్మదము కొమ్మా! క్రమ్మెడుం గ్రమ్మఱఁ.

చినుకులు తోనతోన వడి జెల్లెడు వెల్లువ పిల్లు పైని వ్రా
లినవి; కిశోరు నంగులుల లీలలు దోలెడు వీణగాన మే
మని సవరించెనో మురళి యాలపనమ్మును మాని - ఏదివై
నను మన మేల పొంగెడినొ! నాథుని భావధునీవిశేషమే !!

చిక్కని నల్లమబ్బుల రుచించెడు నీదు తనూవిలాసమే
ఎక్కెడు నాదు డెందమున కీతుయి కౌగిలి చల్లతెమ్మెరల్
దిక్కున; కాని కొంకు మది దీరద - నీరదనీల! మబ్బు లో
మ్మెక్కిన శంప కొంపరగిలించెడు నీ చెడు గేడదో కదే!

నిను కనుఁగోదలంపు నవనీతశిశూ! జనియించె - మబ్బుక్ర
మ్మిన దగుగాక, చీకటులు మించి యలంచెడుగాక, ఘోరయా
మిని యగుగాక, కంటకసమృద్ధసమిద్ధభుజంగదుర్గవ
ర్తని యగుగాక, యామున పదంబగుగాక - విడంగ శక్యమే!

నల్లని మబ్బులన్ రణగుణధ్వనులున్ గజతుండమండితో
ద్వేల్లితవర్షధారలును వీనులు సూడెడు; నేడ నుంటివో
నల్లని సామి! ఇట్టి కఠినంబగు రాతిరి నిన్ను గానరా
కుల్లము వెల్లిగొల్పెడు - అయోమయమా స్థితి దుఃఖవార్ధినై!

మెఱపు తళుక్కున న్మెఱసి మించుల చంచలలోచనాంచలం
బు రవళి సూడి చీకటుల ముంచెడు మున్నటికన్న మిన్నగా;
దరియును దోవయున్ గనగదా! యది దాయది యయ్యె నాకు నీ;
దరికిని జేర రానటు సదా యొనరించెడు దాయచేతలన్.

యమునానాదము నాదు డెందమున నాహ్వానంబుగా దోచు; దో
చము నాఁడేమియు దోడురాదు; దరిదాపై వర్షధారానినా
దము లోలో దమునస్సునావడరు - రాధానాథ! ధానాధరం
బె మరే మీ కిడినానొ! నా నొసట లేదే మీదయాలేఖమున్!!



ఎదురుగుమ్మాలు

[కథానిక]

శ్రీ పిలకా గణపతిశాస్త్రి

ప్రాతఃకాలంనీరెండ ఆ భవంతిముందు వేళ్లాడగట్టిన కొత్త వరివెన్నుల గుత్తులమీద పడి, క్రమంగా పసిరిపచ్చికమీద పాకిపోతూంది. ఆ నీరెండలో వరివెన్నులకోసం వచ్చే పిచ్చుకలుతళతళా మెరిసిపోతూ, వెన్నులతో తిరిగి పోతున్నాయి. రంగు రంగుల సీతాకోకచిలుకలు పచ్చికమీదనించి బంతి పూలమీదా, ఎర్రగోరింటలమీదా పచార్లు ప్రారంభించాయి. ఇరుగుపొరుగు చిన్నపిల్లలంతా ఆ భవంతిసమ్ముఖం ముందు ఆడుకుంటున్నారు.

పదిపన్నెండేళ్ల పిల్లలు చెమ్మచెక్క ఆడుతున్నారు. మరీ చిన్నపిల్లలు లక్కపిడతలతో బువ్వాలాట లాడుతున్నారు. ఆ వేళ అక్కడ అంతమంది చిన్నపిల్లలు చేరడానికి కారణం లేకపోలేదు. ఆ సంవత్సరం ఆయింట్లో బొమ్మలుపెట్టారు. బొమ్మల పూజ కనివచ్చిన ముత్తైదువలతో పిల్లలు కూడా వెంటపడి అక్కడ చేరుకున్నారు.

క్రమంగా ముత్తైదువలు కొంతమంది బొమ్మలకు పెంద్రాళే నైవేద్యాలు పెట్టి తీయని సన్నకంఠాలతో మంగళహారతులు పాడుతున్నారు. కొంతమంది పెళపెళలాడే చీరలతోను, గలగలలాడే నగలతోను ఒయ్యారంగా నడుస్తూ, పిల్లల్ని వెంటబెట్టుకుని నైవేద్యాల పళ్లాలతో తిరిగిపోతున్నారు.

క్రమంగా నీరెండ బంతిపూలరంగుల్లో కలిసి పోతూంది. కలకల నవ్వే పరిహాసకంఠాలలో ఒక ముగ్ధబాలిక 'చేమంతి పువ్వంటి చెల్లెలినియ్యాలే, బంతి పువ్వంటి బావ నియ్యాలే, మొగలిపువ్వంటి మొగుణ్ణి నియ్యాలే.' అని కులాసాగా పాడుతూ తిరుగుతూంది. మిగిలిన పిల్లలు ఆమెతో తిరుగుతూ, ఆఖరి చరణం కలిసి పాడేటప్పుడు చిరునిగ్గులతో తలలు వంచుకుని మెల్లిగా మెల్లిగా గిరగిరా తిరుగుతున్నారు. వారి కంఠాలలోనించి వెలువడే ఆ పాటసవ్వడి ఆ పరిసరం అంతా ఒక చిత్రమైన కలగా మార్చేసింది.

ఇంతలో అక్కడ ఆడుకునే పిల్లల్లో ఒక పసి గొంతుబారుమని ఏడ్చింది. దాంతో ఆ మట్టూ పాటలూ, పరిహాసాలూ క్రమంగా తగ్గుతూ ఆగిపోయాయి.

నగల భారంతో నడవలేక తూలుతూన్న ఒక ముత్తైదువు లోపలినించి తటాలున అక్కడికి వచ్చి 'ఎవరే ఆ ఏడుపు?' అంది. 'అమ్మగోరండీ, మరేమో నండి— మాట్టరుగోరమ్మాయి— మనబ్బాయిగార్ని గిల్లేసుంటుంది' అంది, ఆ పిల్లాణ్ణి ఆడించే తూర్పుపిల్ల. తల్లి కంగారుపడుతూ 'చూశావా అమ్మా, పిల్లాడి బుగ్గ ఎల్లా చీరుకుపోయిందో. అయ్యో, అయ్యో, పిల్లాడు గుక్క తిప్పుకో లేకపోతున్నాడే, ఎంత పని జరిగిందే ఈ వేళ. ఏమే! అమ్మణ్ణీ! ఇలాగేనా పిల్లాణ్ణి రక్తాలొచ్చేట్లు గిల్లెయ్యడం.' అని గదమాయించింది.

అంతవరకూ బిక్కమొహంతో తెల్లబోయి చూస్తూన్న అమ్మణ్ణి 'నేనుకాదు...వాళ్ల చిట్టి...' అని పెద్దగా భయపడుతూ చెప్పింది. ఇంకా ఏదో చెప్పబోయి, ఆమాట పూర్తిచెయ్యకుండానే గోలుగోలున ఏడవడం మొదలుపెట్టింది.

ఆ చిట్టి ఎంత చూచినా ఆ పరిసరాల్లో ఎక్కడా కనబడలేదు. ఏమయిందో మరి. ఆపిల్లవాడి బుగ్గమీద మాత్రం గోరుదిగినంతమేరా రక్తపుచార కనబడుతూంది. వాడు తల్లిని చూచి మరీ బిగ్గరగా ఏడవడం మొదలు పెట్టాడు.

'చూడు, పిల్లాణ్ణి రక్కసి అమ్మోరిత్తిలా ఎల్లా రాగాలు పెడుతూందో. గొంతుకుంటే సరి' అని గద్దించింది పిల్లవాడి తల్లి.

ఇంతలో అమ్మణ్ణితల్లి కనకమ్మ అంగలు వేసుకుంటూ అక్కడికి వచ్చి, రుసరుసలాడుతూ—

'నరసమ్మగారూ, మీ సుబ్బుల్ని మాపిల్ల కాదుటమ్మా గిల్లుతా! వాళ్ల చిట్టిట.' అంది.

నరసమ్మ అందుకుంది—

'అదేమిటమ్మా అలా అంటావు? వాళ్ల చిట్టి ఇక్కడ లేందే. సత్తీ, ఎవరే గిల్లుతా?'

'అమ్మణ్ణిగోరండి.'

'ఆ, నువ్వు చూశావుటే భడవా!' అని రొక్కాయించింది కనకమ్మ.

'నాను సూశానండి, నిజమేనండి, అమ్మగోరు.' అంది సత్తి భయపడుతూ.

కనకమ్మరొక్కాయింపుతో నరసమ్మకు కోపమూ, ఉడుకుబోతుతనమూ ఒక్కసారిగా కళ్లకెక్కాయి. ఆమె ఉక్రోషం అపలేక సత్తికేసి తిరిగి, 'పిల్లాణ్ణి కనిపెట్టుకుని ఉండవే అంటే, నువ్వేం చేస్తున్నావే' అని చేతికొద్దీ బుగ్గలు మెలిపెట్టింది. 'సూత్తానే ఉన్నానండి, అమ్మగోరూ' అని ఏడుస్తూ సత్తి సమాధానం చెప్పింది. అయితేనేం సత్తిపీపుమీద మణుగంత అణుపు పడింది. ఆ అణుపుతో సత్తి ముందుకు తూలిపోవలసిందే. అయినా అది ఎల్లాగో కాళ్లు నిలదొక్కుకుని ఏడుస్తూన్న పిల్లాణ్ణి ఎత్తుకుని తనుకూడా ఏడుస్తూ నిలబడింది.

'అయ్యగారు రానీ నీ పని పట్టిస్తా' అని మళ్లీ బుగ్గలు నులుమ బోయింది నరసమ్మ. సత్తి దిక్కు లేని దానిలా బొరుమని ఏడుపు మొదలెట్టింది. నరసమ్మ సత్తిమీదకు వచ్చి 'నోరు మూస్తావా ముయ్యవా.' అని కళ్లెర్రజేసింది. సత్తి నోరుమూసుకుని లోలోపలే కుమిలిపోయింది. సుబ్బులు ఈ కేకలతో మరింత గట్టిగా భోరుమన్నాడు.

కనకమ్మ మళ్లీ అందుకుని 'అదేమిటమ్మా, అనవసరంగా దాన్ని కొట్టుకుంటారు. వాళ్ల చిట్టి గిల్లేసి పారిపోయిందిలా ఉంది.' అంది. నరసమ్మ దీనితో సగ్గిలం వేసిన అగ్గిలా అయిపోయి—

'మా పిల్ల నేమీ అనలేదమ్మోయ్ నేను. మధ్యన అనవసరంగా మీరు కలగజేసుకోకండి.' అంది కనకమ్మ. 'కలగజేసుకోడానికేముందమ్మా ఇందులోను? మా పిల్ల కాదమ్మా గిల్లింది, వాళ్ల చిట్టి అన్నాను. ఇంతేనా. ఇందులో తప్పేముంది? మీ రల్లా మొహం చెండుకోడానికి!' అంది.

నరసమ్మకి ఆ కోపంలో స్మారకం తప్పిపోయింది. ఆమె కనకమ్మమీదికి మీదికి వెడుతూ 'మా తప్పేమీ లేదమ్మోయ్. తప్పంతా మాదే. ఈ తంపిలన్నీ పడలేకే నేను మా అత్తగారితో 'ఈ యేడు మన ఇంట్లో ఈ బొమ్మలు పెట్టించవద్దండీ మహారాజా' అని వెయ్యివిధాల పోరాను. నా మాట చెవినిపెట్టిందా ఆవిడ? అసలు ఒకప్పుడు చెవిపెట్టిందా ఏమిటి? ఎప్పుడూ నా బతుకిల్లాగే వెళ్లింది' అని ఇంకా ఏవేవో సణుగుతుంది.

దానిమీద కనకమ్మ 'మీ కంత కష్టమెందుకమ్మా. ఈసారితో బాగా బుద్ధి వచ్చింది. ఇంక మీ యింట్లో అడుగుపెట్టం లెండి' అని గిరుక్కున వెనక్కి తిరిగింది. కాని అమ్మణ్ణి అక్కడ కనబడలేదు. ఆమె కూతుర్ని పిలుస్తూ 'ఓఅమ్మణ్ణోయ్. ఎక్కడ అణగారిపోయావే? నీతో పడలేకుండా ఉన్నానే మామ్మా... నేను ఎక్కడికి వెడితే అక్కడికి నాతో దిగమారిపోవాలిగదా...అబ్బబ్బా! నే నీ పిల్లలతో పడలేకుండా ఉన్నానమ్మా...అయినా ఒక్కనిమిషం పిల్లల్ని చూడండి అంటే తమర్ని కానట్టు మాట్లాడ కూరుకుంటారు. కాస్త శనివారాదివారాలు వచ్చాయంటే పొద్దస్తమానం పేకాటతో సరి. ఎన్నేళ్లు వస్తేనేం! మనుషులకి కాస్త జ్ఞానమంటూ ఉండాలిగాని' అని తనకి అలవాటయిన ధోరణిలో పడింది.

ఇంతలో పొరుగింటి పెద్దముత్తైదువ ఒకావిడ అక్కడికి వచ్చి 'ఊరుకోండమ్మా ఊరుకోండి. ఇంతకీ ఏముందని ఈ తగాదా? పిల్లలూ పిల్లలూ ఆడుకునే

టప్పుడు కొట్టుకోనూ కొట్టుకుంటారు, తిట్టుకోనూ తిట్టుకుంటారు. ఇంతమాత్రానికే ఇదయిపోతే ఎలాగ? మీకేమయినా పరాయివాళ్లా ఏమన్నానా. కొద్దో గొప్పో కావలసినవాళ్లే ఆయిరి. అదీగాక తెల్లారిలేస్తే ఎదురుగుమ్మాలు. వారింటికి వీరూ రావాలి, వీరింటికి వారూ వెళ్లాలి. తప్పమ్మా. నోములు మానుకోకండి' అంది.

ఈ హడావిడి అంతా అంచీలమీద లోలోపలి తులసికోటదగ్గర పూజచేసుకుంటూన్న వరసమ్మఅత్తగారికి తెలిసిపోయింది. ఇంటికంతా ఆమే పెత్తనదారిణి ఆయిరి. ఆమె ఊరుకుంటుందా? జారిపోతూన్న బట్ట చెవులమీదికి సవరించుకుంటూ గబగబా అక్కడికివచ్చి కనకమ్మని బతిమాలుకుంటూ—

'ఏమిటోనమ్మా, మా కోడలు అనే మాటలకి లెక్కేమిటి? నువ్వేమీ అనుకోకమ్మా. కోపం వస్తే అపలది నన్నే తీసేస్తుంది. దాని ధోరణే అంత. ఇంతకీ—ఇంటికి పెద్దదాన్ని నేనా? అదా? తెలిసీ తెలియనిదాని మాటలు పట్టుకుని తప్పట్టుకుంటే ఎలాగ...ఏడాదీ రెండేళ్లూ కాదమ్మా ఇది, తొమ్మిదేళ్ల నోము. కనిపెంచీదానవు. ఇల్లాగ మధ్యన మానేస్తే ఎప్పటికి ఉద్యాపనకాను. నా మాట వినమ్మా. మీ అమ్మ ఓటి చేనోటికాదు. నోము మానకోకమ్మా. కాస్త ఈవేళకు ఎల్లాగో అల్లాగ కాలక్షేపం చేసుకో అమ్మా! నైవేద్యం పెట్టిపో. ఈ కాస్సేపూ కళ్లు మూసుకుంటే సాయంత్రం వాల్లాడింపే ఆయిరి' అంది.

దానిమీద కనకమ్మ కొంచెం శాంతించింది. కాని లోలోపలి ఉక్రోషం అంతా వెళ్లబోస్తూ—'వర్ధనమ్మత్తా, అసలు సంగతంతా విని, నావల్ల తప్పుంటే నన్నేమన్నా అను, పడతాను. ఇంతకీ మా పిల్ల కాదమ్మా కొట్టింది, వాళ్ల పిల్లమ్మ అన్నాను. అంతేనా అంతకంటే ఏమన్నా అన్నానా. అంత మాత్రానికే ఇంత రంధి చెయ్యాలా? భాగ్యభోగ్యాలుంటే చెయ్యి మలగా జార్రుకుంటారు. ఒకళ్లకి పెట్టేదీ పోసేదీ ఏముంది? మేమేమీ గడివక ఇక్కడికి రాలేదుగదా. మాకు భగవంతుడిచ్చినదానితో—కలో గంజో తాగి బతుకుతాము. అంతేగాని చచ్చిపోం గదా' అంది.

వర్ధనమ్మ—'తప్పు తప్పమ్మా. శుభమల్లే పండుగ రోజుల్లో అశేం మాటలు? నాకు తెలియక అడుగుతాను గాని, ఇందులో నేను మీకు పెట్టేదీ పోసేదీ ఏముందే? నలుగురూ నాలుగు బొమ్మలు తెచ్చుకుని ఒకచోట పెట్టుకున్నారు. వాళ్ల వాళ్ల పూజలూ పునస్కారాలూ వాళ్లు చేసుకున్నారు. అంతేనా? కాస్త ఇంటికి దగ్గరగా ఉంటిగదా అని ఈరేడు బొమ్మలు ఇక్కడే పెట్టుకున్నావు. ఇదేమన్నా మాయింట్లో పెళ్లికే పత్రదానా. నామాటలు విని ఈకాస్సేపూ ఎల్లాగో అల్లాగ కాలక్షేపం చేసుకోఅమ్మా'! అంది.

దానికి కనకమ్మ ఏమీ సమాధానం చెప్పలేదు. కాని పేరంటాళ్లలోంచి వరసమ్మ కళ్లమ్మట నీళ్లతో అత్తగారికి ఎదురుగుండా వచ్చి నిలబడి, 'అసలు ఈ రంధి అంతా నన్ను యాగీచెయ్యడంకోసమే వచ్చింది. నేను మిమ్మల్ని ఎప్పుడైనా పల్లెత్తుమాటన్నానా? నన్నెందుకిల్లాగ నలుగురినోళ్లలోనూ పడేస్తారు' అని బుడిబుడిదీర్ఘాలు తియ్యడం మొదలుపెట్టింది.

అత్తగారు కోడలుచెయ్యి పట్టుకుని బలవంతంగా లోపలికి లాక్కుపోతూ, చాల్చాలులే నేర్చావు. గుమ్మంలోకి ఇరుగూ పొరుగూ వస్తే ఇలాగేనా మర్యాద చెయ్యడం? నడు నడు. లోపలి కీపాటికి.' అని కేక లేసింది. అత్తాకోడళ్లిద్దరూ అక్కడినించి వెళ్లిపోవడంతో ఆ గాలిదుమారం ఆసమయానికి శాంతించింది. ఇరుగూపొరుగూ ఎవరికితోచినవి వారు అనుకుంటూ తమతమ ఇళ్లకి వెళ్లిపోయారు.

అతరవాత ఆ తల్లులిద్దరిమధ్యా ఉండే ఎడం ఎక్కువైనది గాని తగ్గలేదు. కనకమ్మ ఇక వరసమ్మగారి గుమ్మం తొక్కనని పట్టుపట్టుకుని కూర్చుంది. కాని వరసమ్మఅత్తగారు వచ్చి కాదుకూడదని బతిమాలడంవల్లా, తన అత్తగారిచేత చెప్పించడంవల్లా విధిలేక సాయంత్రం వాల్లాడింపుకి వెళ్లడానికి అంగీకరించింది. అందుచేత అంటీఅంటనట్టు బొమ్మలకు పూజచేసి నైవేద్యంపెట్టి వెళ్లిపోయింది. అమ్మణ్ణి కూడా మళ్లీ వెంటబడింది కాని రానివ్వలేదు.

సాయంత్రం అయేసరికి బొమ్మల వాల్లాడింపులోకని అంతా తయారయ్యారు. అమ్మణ్ణి కొత్త పరికిణీ, కొత్త చొక్కా తొడుక్కుని వాల్లాడింపుకి వస్తానని ఏడ్చింది. తల్లి మొదట ససేమిరా వల్లకాదంటే వల్లకాదంది. కాని వాల్లాడింపంటే పిల్లలందరికీ పెద్ద సరదా. వాళ్లు మానమంటే మానతారు కనకనా. చివరికి అత్తగారి బలవంతంవల్ల అమ్మణ్ణిని తీసుకువెళ్లడం తప్పలేదు. తల్లి అమ్మణ్ణితో 'ఈసారి వాళ్ల సుబ్బులతో ఆడి చూడు నిన్నేం చేస్తానో' అని బెదిరించింది. అమ్మణ్ణి

ఉలుక్కుండా పలుక్కుండా తల్లివెనకాలే వాల్లాడింపులోకి వెళ్లింది.

బాజాభజంత్రీలతో బొమ్మల ఊరేగింపు బయలుదేరింది. పేరంటాళ్లంతా ఒకళ్లొకళ్ల మీద బుక్కాలు జల్లుకుంటూ పెద్దకాలవ్వయిపు నడిచి పోతున్నారు. సాయంకాలం నీరెండలో బుక్కా రంగు ఎర్రమతాబావెలుగులా కనబడింది. పిల్లవాణ్ణి ఎత్తుకున్న సత్తి, నరసమ్మకూడా ఊరేగింపులో ఉన్నారు. నరసమ్మ కనకమ్మ ఒకరొకర్ని చూసుకుని ఎడమొహాలూ, పెడమొహాలూ పెట్టుకుంటూ నడిచి వెళ్లారు.

కనకమ్మ నరసమ్మకేసి కన్నెత్తి చూడలేక పోయింది. అసలా ఊరేగింపులో ఆమెతో కలిసి నడవడమే తనకొక చిన్నతనంలా కనబడింది. అయితే తప్పనిసరి అవడంవల్ల నరసమ్మకి దూరదూరంగా నడిచి వెళ్లింది. ఇప్పుడిక ఏమనుకుంటే ఏం లాభం !

ఉత్సవం పిల్లలతోను, పెద్దలతోను, మెల్లిగా ఊరికి దగ్గరగా ఉన్న పెద్దకాలవగట్టుకి చేరుకుంది. అప్పుడే సూర్యాస్తమానం కాబోతూఉంది. నిశ్చలంగా ప్రవహిస్తూన్న కాలవలో చిన్నచేపలు ఎగిరి పడ్డప్పుడల్లా సూర్యకిరణాలు తళతళా ప్రతిఫలిస్తున్నాయి. కాలవలో చెట్లనీడల్లో పడవ ఒకటి తెరచాపతో నీళ్లు తాకుతూ తాబేలులా తేలిపోతూంది. పశువులు అవతలి వొడ్డునించి మెల్లిగా ఈదుకుంటూ వస్తున్నాయి. ముత్తయిదువలు పూజచేసిన బొమ్మలు కాలవ నీళ్లలో కలుపుతున్నారు. బొమ్మలు కలిసిన నీళ్లల్లో పసుపు కుంకుమలు చిత్రమైన రంగులుగా చెదిరిపోతున్నాయి. దొన్నెల్లో ఉంచిన దీపాలు సంధ్యానక్షత్రాలలా నీళ్లలో తేలిపడుతున్నాయి.

కొందరు ముత్తయిదువలు పోకదొన్నెలతో అక్కడ ఉన్న పిల్లలకీ, పెద్దలకీ ప్రసాదాలు పంచిపెడుతున్నారు. లోలోపల ఉక్రోషాలవల్ల తల్లులిద్దరూ ఒకరికొకరికి ప్రసాదాలు పంచిపెట్టుకోలేదు. ప్రసాదాలు పంచిపెట్టినతరువాత తల్లులు తమ పిల్లల్ని వెంటబెట్టుకుని ఇళ్లకి వెళ్లిపోతున్నారు. కనకమ్మ అమ్మణ్ణికోసం చూసింది. కనబడలేదు. తన కనుకప్పి అప్పుడే ఎక్కడికి వెళ్లిందో అని ఆమె ఆశ్చర్యపోయింది. మళ్లీ ఇంతలోనే అది ఏంతగాదాలు తెస్తుందో అని ఆమెకు కంగారు పుట్టింది.

కాని అమ్మణ్ణీ, సుబ్బులూ, సత్తీ ఒకచోట కూర్చోడం చూస్తే ఆమెకే ఆశ్చర్యం వేసింది. తొందరగా వెళ్లి అమ్మణ్ణిని తీసుకురావాలని చూసిందిగాని, వాళ్ల ధోరణి చూస్తే ఆమెకే ఒక నిమిషం ఉండి ఏం జరుగుతుందో చూద్దామనిపించింది. పిల్లవాడిపక్కనే సత్తి కూర్చొని వాడడిగిన ప్రశ్నలకేవో సమాధానాలు చెబుతూంది. అమ్మణ్ణి ప్రసాదం తినగా ఖాళీఅయిన ఒకటిరెండు పోకదొన్నెలు కాలవనీళ్లల్లో పడవల్లా కదులుతూంది. పిల్లవాడు కళ్లు రెప్పలు వెయ్యకుండా అల్లాగే పోకదొన్నెలకేసి చూస్తున్నాడు. వాడికా పోకదొన్నెలు బామ్మచెప్పిన కథలలోని రత్నాల ఓడలు ! అవి రంగురంగుల రత్నాలతో సముద్రంమధ్యనున్న రాజకుమార్తెకోసం ప్రయాణమై వెళ్లుతున్నాయి. అని ఆ పసిహృదయంలో ఇంకా చిత్రమైన ఆకృతులు ధరిస్తున్నాయి. ఇంతలో నరసమ్మ తన పని ముగించుకుని సత్తితో ‘రండర్రా వెడదాము’ అంది. సుబ్బులు ఆమాటే వినిపించుకోలేదు. చివరి కామె సత్తిచేతుల్లోనించి వాణ్ణి తీసుకోబోతూ ‘రా నాయనా వెడదాము’ అంది.

‘ఉన్నవే నేను లానే.’

‘ఏమిరా, ఏమొచ్చిందీ, రా !’ .

‘అమ్మణ్ణక్కా, నేనూ పడవెక్కాలి.’ ఈ మాటలు విని నరసమ్మకూడా ఎంతో ఆశ్చర్యపడుతూ ‘ఎందుకురా ?’ అంది.

‘తాతగాలింటి కెళ్లాలే’

‘ఆఁ ! మరి పడవేదిరా ?’

‘అదిగో’ అని అప్పుడే బయలుదేరబోతూన్న రెండో పోకదొన్నె చూపించాడు వాడు. ఆమె కళ్లెత్తి ఆ పడవకేసి చూస్తూ ‘మీరిద్దరూ ఎక్కితే అది ములిగిపోతుందమ్మా. రా. యింటికెడదాం రా’ అంది.

‘ములిగిపోతే, నేను రానే’ అంటూనే ఆ పిల్లవాడు అక్కా తనూ ప్రయాణం చేదామనుకున్న ఆ ఓడకేసి రెప్పవాల్చకుండా చూశాడు. నరసమ్మ ఇక చీకటి పడుతోందని సత్తిచేతుల్లోంచి పిల్లవాణ్ణి తీసుకుంది. ఆసమయంలో హఠాత్తుగా అమ్మణ్ణికోసం వచ్చిన కనకమ్మ కళ్లూ ఆమెకళ్లూ కలిశాయి. ఆ కళ్లల్లో అంతరాంతరాలల్లో చిన్ని చిరునవ్వులు మెరిశాయి !

గాడ్సే జాతకములో 'తమాషాలు'

శ్రీ రాళ్లపల్లి గోపాలకృష్ణమాచార్యులు

మహాత్మునియొక్కయు, నాథూరాం వినాయక గాడ్సేయొక్కయు జాతకములను చర్చించుచు, గ్రహసహామాదిసర్కములు, దశాఫలపరిపాకము, దైనిక కేంద్రముల శక్తి, పర్వకాలప్రభావము, ఇతరేతరజాతక గ్రహసంయోగము ఇత్యాదివిషయములనుగూర్చి గడచిన 'భారతి' సంచికలలో నేను మనవిచేసిన అభిప్రాయములను కటాక్షించినవారిలో కొందరు మహనీయులు "ఇదంతా తమాషా" అని సెలవిచ్చిరట! ఎగతాళిధోరణిలో చెప్పినను, వారు వాస్తవమునే నిర్వచించినారు. ఈజగత్తు అంతయు 'తమాషా' కాదని ఎవ్వరనగలరు? ప్రపంచపు సృష్టి, స్థితి, లయములు ఆ సృష్టికర్తయొక్క లీలావిభూతి యని తత్త్వశాస్త్రవేత్తలనుచున్నారు. అనగా, 'తమాషా' అనుట కాక వేరేమి?

"ఆశ్చర్యవ త్పశ్యతి కశ్చి దేన;
మాశ్చర్యవ ద్వదతి తథైవ చాన్యః;
ఆశ్చర్యవ చ్చైన మన్య శ్శృణోతి;
శ్రుత్వాప్యేనం వేద నచైవ కశ్చిత్."

అను భగవద్గీతావాక్యములో ఇట్టి అర్థమే ఇమిడియుండలేదా? ఈ సృష్టిధర్మపు 'తమాషా'లలో గ్రహసంచారపద్ధతి యొకటి. దానినిగూర్చి వచించునదే ఈ జ్యోతిషశాస్త్రము.

కాని, శాస్త్రదృష్టి గల విద్యావంతులకు దీనిలో హృదయాహ్లాద మున్నది. సృష్టిధర్మములపై విశ్వాసముగలవారికి దీనివలన లౌకికప్రయోజన మున్నది. ఆస్తికధర్మముపై అభిమానము గలవారికి దీనినుండి కర్తవ్యవిషయమున ఉపదేశము లభించగలదు. ప్రారబ్ధమును నమ్మునట్టి కర్మవాదులకు దీని మూలమున మనశ్శాంతి చేకూరును. ఇట్లెన్నియో చెప్పవచ్చును. కాని, 'జ్యోతిషాలయము'లకు ఒకటో, రెండో రూపాయలు ముందుగ సమర్పించుకొని జాతకఫలములను తప్పాలుద్వారా తెప్పించుకొనుటచే తృప్తిపడగోరు యథాలాభసంతుష్టుల పాలికిమాత్రము ఇట్టి చర్చలు వాస్తవముగా 'తమాషా'లే. అనాగరకులలో కాక, ఆధునికవిద్యావంతులలోనే ఇట్టివారనేకు లుండుట నేటికాలపు లక్షణము.

పోనిత్తము. గాడ్సేజాతకమునకు సంబంధించిన మరికొన్ని 'తమాషా' లను పరిశీలింతముగాక!

తాజక (అనగా, యవన) మతములో 'వర్షజాతకము' అనబడు దశాసంప్రదాయ మొకటి కలదు. పాశ్చాత్యులు ఈపద్ధతిని "రవిపునరాగమనము" (Solar Return) అని వ్యవహరించెదరు. జన్మకాలమునందు రవి ఏరాశిలో, ఏభాగలో, ఏ కలలో, ఏ వికలలో నుండెనో, అదే స్థానమునకు నికరముగా ఏ పేట, ఏ దినమున, ఎంతకాలమునకు రవి వచ్చునో, అది కనిపెట్టి, ఆ క్షణమునకు స్పష్టగ్రహభావాదులను గుణించినచో, అది వర్షజాతక మనబడును. భూమియొక్క పరిభ్రమణారంభక్షణములో సూర్యకుటుంబమునకు మధ్యవర్తి యగు రవితో ఇతరగ్రహాదులకు రాగల నూతనసంబంధములననుసరించి ఆ సంవత్సరమున జాతకులకు శుభాశుభఫలములు అనుభవమునకు వచ్చుననుటే ఈపద్ధతి మూలసూత్రము. యవనులు తమ భాషలో వ్రాసియుంచిన గ్రంథములనుండి మన దేశపు ప్రాచీనపండితులు ఈసంప్రదాయము నభ్యసించి, అనుభవమునకు తెచ్చుకొని దానినిగూర్చి సంస్కృతభాషలో అనేక గ్రంథములను వ్రాసియున్నారు. వానికి ఆంధ్ర దేశములో తగిన వ్యాప్తి రాకుండుట విచారహేతువు.

దేవమానదశలో, ౧౯౪౭-౮ సంవత్సరమునకు, గాడ్సేజాతకమున ప్రారబ్ధ మెంత దోషభూయిష్ఠముగా

నుండెనో, గతవ్యాసములలో కొంత విపులముగనే పరిశీలించితిమి. అదే సంవత్సరమునకు 'వర్ష జాతకము' ఏమి సాక్ష్య మిచ్చుచున్నదో, పరికించుటకు చదువరులు కుతూహలపడకపోరు. జన్మకాలమునకు స్పష్టపరచినచో, రవి వృషభరాశిలో ౨౭ భాగలు, ౧౭ కలలు, ౧౮ వికలలలో నుండగలడు. జాతకుని ౩౮ వ సంవత్సరారంభమున—అనగా, ౧౯౪౭ వ సంవత్సరమున, మే నెల, ౧౯ వ తేదీనాడు—స్వస్థానమునకు రవి వచ్చుకాలము ఉదయము ౭ గంటలు, ౮ నిమిషములు, ౫౯ సెకండ్లు *A. M.* (*L. M. T*) అగును. అప్పటికి గుణించిన వర్ష జాతకకుండలి ఇది :—

X ౧౧-౪౬	శు ౨౮-౨౮ కు ౨౮-౪౯	చ ౭-౧౯ ర ౨౭- ౧౭-౧౮	బు ౧-౧౦ బుద్ధి(స)౧-౪౮ పుణ్య(స)౨-౨౩ రా ౨-౫౦ వ ౨౦-౨౬ I ౨౨-౨౧
	గాడ్సే గారి ౩౮ వ సంవత్సరపు వర్ష జాతకము		
	——— సాయనము		శ ౩-౪౪
కే ౨-౫౦	గు ౨౨-౫ (వ)	ఇ ౮-౧౭ (వ)	హత్య (స) ౬-౨౬

వర్ష ప్రవేశలగ్నాధిపతి బుధుడు మిథునరాశిలో ప్రబలుడై యున్నాడు. బుద్ధిసహమము బుధుని అంటి చేరుకొన్నది. ప్రబలమైన బుద్ధిశక్తితో వర్షారంభమైనట్లు. కాని, ఈ యోగము రాహువుయొక్క ముఖద్వారమందే సంభవించుట శోచనీయము. రాహువుముఖమునుండి వెడలు విషవాయుప్రవాహమునకు బుధుడును, బుద్ధియు చిక్కియున్నారు. లగ్నమో, వరుణునియొద్ద నున్నది. అనగా, బుద్ధి విపత్త్వము నాశ్రయించి పెడతల పట్టినది. జన్మకాలమందలి మాయావి ఇంద్రునినుండి అర్ధకేంద్రస్థానము నందే ఈ రాహు వుండుట! ఇట్టి రాహువు బుద్ధికి హింసాతత్త్వమును నేర్పించుట వింతకాదు. వర్ష జాతకమందలి హత్యాసహమము జన్మబుధునితో నిండు కేంద్రస్థితిలో నున్నది. ఈ హత్యాసహమమునకు వర్ష లగ్నాధిపతియగు బుధుడే అధికారి. అగుటచే, ఈ సంవత్సరమున జాతకుని బుద్ధి ఏమార్గమున ప్రవర్తించునో, పై సామగ్రి ఢంకాకొట్టి దండోరా వేయుచున్నది. మరియు, బుధుడు, బుద్ధి, రాహువు-ఈ మూడును జన్మచంద్రునికి (అనగా, లగ్నాధిపతికి) ప్రత్యక్షమిత్రదృష్టిస్థానమందే చేరియుండుట. మనస్సు, బుద్ధి, అహంకారములు—ఈమూడును జట్టుకట్టుకొని పరస్పరసహకారమునకు బద్ధకంకణములై నిలుచుట కదా యిది! ఈ మూర్తిత్రయములో బుధుడే జన్మకాలవ్యయస్థానాధిపతి. దీనికే తాత్కాలికముగా ఇపుడు వర్షలగ్నాధిపత్యము లభించుట. వర్ష జాతకములో ఈ మూర్తిత్రయము వ్యయస్థానము—అనగా, మోక్షస్థానము—నందే విజృంభించినది. బుద్ధి, ఆలోచన, సంకల్పము, వాగ్ధోరణి, కార్యకుశలత- ఇవన్నియు మోక్షవిచారమున పనిచేయవలదా! సందేహమేమి? కాని, ఇది బంధమోక్షమా, లేక కపాల మోక్షమా?

పురాణములలోని కథ నించుక స్మరింతము. మాయదారితన ముపయోగించి, చూచువారి కనుబ్రామి, చోరవలో అమృతమును సంపాదించిన వ్యక్తి ఈ రాహువు! తత్ఫలముగా, అతడు సాధించినది కపాల మోక్షమే కదా? రాహువునకు వచ్చిన, నచ్చిన, విద్య ఇది. వేరువిద్యను అతడెట్లు ఉపదేశించ గలడు?

జీవమానదశలో చలితశనికుజులకు క్రూరమైన పరస్పరకేంద్రస్థితి ఏర్పడియుండుటయు, వారిలో చలితకుజుడు మహాత్ముని జన్మరాహువుపై ఆవాహన మగుటయు, చలితశని మహాత్ముని జన్మలగ్నమును ప్రత్యక్షశత్రుదృష్టిచే వేధించుటయు చదువరులకు జ్ఞప్తిలో నున్న దనుకొందును. ఇట్టి సందర్భములలో, వర్ష జాతకమందలి శని గాడ్సే చలితకుజ

స్థానమునే చేరుకొనుట విశేషము కాదా ? జన్మకాలములో శని మృత్యుస్థానాధిపతి; కుజుడు ఉద్యోగస్థానాధికారి. "సెమ్మ వేళ వచ్చినది" అని మృత్యువు ఉద్యోగకర్తని తట్టి, లేపి, మంతన మాడి, హెచ్చరిక ఇచ్చినట్లు చూపట్టుచుండలేదా ? కుజుడు, ఇక, తన సన్నాహము తాను చేయకతప్పినది కాదు. ఇతనికి కార్యనిర్వాహకుడు శుక్రుడనుట మనము మరవరాదు. వర్ష జాతకమున వీరిరువురు ఒకచోట (మేషరాశి ౨౯ వ భాగలో) చేరుకొని మంత్రాలోచన చేయుచుండుట గమనింపదగినది. మేషరాశి ౨౯ వ భాగ ద్రోహమును (*Treachery*) సూచించు స్వభావము కలదని పాశ్చాత్యుల మతము. ఈ ప్రదేశములోనే అధికారి (కుజుడు) కర్తవ్యమును బోధించినాడు. అతని ఆజ్ఞను శిరసావహించి కార్యనిర్వాహకుడు (శుక్రుడు) ముందంజవేసినట్లు చూపట్టుచుండలేదా ?

వర్ష జాతకమున పుణ్యసహమము దుష్టుడైన బుధుని ఏలుబడిలో నున్నది. మహారాహువు దానిని తన అంకపీఠముచేర్చి ఆలింగన మొనర్చుకొని ఆనందించుచున్నాడు. ప్రారబ్ధము పెడదారిపట్టినది. క్రూరకార్యమునకు కలయు సంస్కారము సిద్ధమగుట ఏమియరుదు? గాడ్సేజాతకమందలి 'తంటాకోరు' ఇంద్రుని అర్ధకేంద్రవేధకు లోబడినది ఈ పుణ్యసహమము. ఇది చాలదా ?

జన్మలగ్నాధిపతి చంద్రుడు. వర్ష జాతకమున ఈ చంద్రుడు వార్షికహత్యాసహమమునకు పరమమిత్రుడైనాడు. శని మహాత్ముని జన్మలగ్నమునకు పూర్ణకేంద్రవేధాస్థానమును చేరుకొన్నాడు.

దేహమానదశలో ఉద్బోధితములైన ఫలములను వర్ష జాతకము మెరుగుపెట్టుచున్నదని పాఠకమహాశయులు గమనించగలరు.

వర్ష జాతకపద్ధతిలో, సంవత్సరమునందలి ౩౬౫ దినములను గ్రహములకు (రాశిసంచారములో ఆయా గ్రహము సంపాదించుకొన్న భాగ కలల కనుగుణముగా) పంచిపెట్టు దశావిభాగక్రమము వాడుకలో నున్నది. ప్రకృతములో నున్న సంవత్సరములో (౧౯-౫-౧౯౪౭ నుండి ౧౮-౫-౧౯౪౮) వర్ష జాతక దశావిభాగ మీ క్రింద చూడవగును :—

వర్షారంభము		౧౯-౫-౧౯౪౭	
బుధదశ	(౧౪.౮ దిన)	౨.౮-౬-౧౯౪౭	వరకు
శనిదశ	(౩౨.౫ ,,)	౫.౩-౭-౧౯౪౭	,,
చంద్రదశ	(౪౫.౪ ,,)	౧౯.౭-౮-౧౯౪౭	,,
ఇంద్రదశ	(౧౨.౩ ,,)	౧.౦-౯-౧౯౪౭	,,
వరుణదశ	(౧౫౩.౮ ,,)	౧.౮-౨-౧౯౪౮	,,
గురుదశ	(౨౦.౯ ,,)	౨౨.౭.౨.౧౯౪౮	,,
రవిదశ	(౬౫.౮ ,,)	౨౮.౫-౪-౧౯౪౮	,,
కుజదశ	(౧౫.౦ ,,)	౧౩.౫-౫-౧౯౪౮	,,
శుక్రదశ	(౪.౫ ,,)	౧౮-౫-౧౯౪౮	,,
మొత్తము	౩౬౫ ,,		

జన్మకాలమున స్వార్థత్యాగ (*Self-sacrifice*) సూచకమైన భచక్రప్రదేశములోనున్న గ్రహము వరుణు డనియు, చలితజాతకమునందు చలితసుక్ర, చలితహత్యాసహమములకు నిండు త్రికోణసంబంధమును సంపాదించుకొన్న గ్రహ మీవరుణుడే అనియు చదువరులు స్ఫురణకు తెచ్చుకొనిరేని, ఆ వరుణుని దశలోనే మహాత్ముడు హత్యకావింపబడుటకు కారణము మనకు బోధపడగలదు. సాహసమును (*Adventure*) సూచించు మిథునరాశి ౨౧ వ భాగలో వర్ష జాతకమున వరుణు డుండుట ! లగ్నములో నుండుటచే, ప్రధాన కార్యనిర్వాహకత్వ మిప్పుడు వరుణుని పాలికి వచ్చినది. మహాత్ముని చలితశనికి సమసప్తకశత్రుదృష్టిస్థానమందే ఈ వరుణుడు నిలిచియుండుట! మహాత్ముని హత్యకై గాడ్సే సాహసమున కొడికట్టుటకు వరుణుని దశ ఎంతో తగియున్నదికదా?

వర్ష జాతకసంప్రదాయములో మహాత్ముని హత్యాదినమును సూచించు మార్గ మేదైన కలదా ? అను సందేహము రావచ్చును. దైనికజాతకసంప్రదాయములో కేంద్రములకు గ్రహవేధ వచ్చిన దినమున ఫలప్రాప్తి కల్గుననుట పాఠకమహాశయులకు చిరపరిచితమయిన సూత్రముకదా ? వర్ష జాతకవిషయములో నయితము పై ధర్మములను మన మేల ఉపయోగించరాదు ? కాని, గమనించదగిన చిన్న విశేష మొకటి

కలదు. దైనికజాతకపద్ధతిలో సంవత్సరకాలమున దశమకేంద్రము భచక్రపు ౩౬౦ భాగలను పూర్తిచేసి యథాస్థానము చేరుకొనగలదు. వర్ష జాతకపద్ధతిలో దశమకేంద్రగతి వేరు. ఏ లందురా ? రవి స్వస్థానము చేరుకొనుటకు ౩౬౫ దినములు, ౫ గంటలు, ౪౯ నిమిషముల కాలము పట్టును. అనుటచే, వర్షారంభకాలపు దశమకేంద్రము ఆ వర్షాంతకాలమునకు ౩౬౫ పరివర్తనములు పూర్తిచేసి, పైగా సరాసరి ౦·౯౮౬ భాగల దూరము ముందునకు జరిగియుండగలదు. ఫల మేమనగా, వర్షారంభదశమకేంద్రము వర్షాంతమునకు (దైనిక కేంద్రమువలె) స్వస్థానమునం దుండక, ౦·౯౮౬ భాగల పట్టు (కొంచెము తక్కువగా చక్రపాదము) ముందుకు పోయియుండగల దనుట. ఈ మానము ననుసరించి చలింపజేసినచో, ఇష్టదినమున చలితవార్షికకేంద్రస్థానము మనకు లభించగలదు. ఇతరదశాపాకర్యము ననుసరించి, ఏ ఫలముల నుద్బోధించుటకు గ్రహములు సిద్ధములై యున్నవో, వానికి చలితకేంద్రముల సంబంధము వచ్చిన దినములు ఫలము నీయవలయుకదా ?

నాదృష్టికి వచ్చినంతలో, ఈ కేంద్రచలనపద్ధతి జాతకగ్రంథములలో, ఎచటకాని, చెప్పబడియుండలేదు. ఆ కారణమువలననే, దీనిని నిరాకరించుట భావ్యము కా దని నా మనవి. పైన సూచించిన ఉపపత్తిని గమనించినచో, దీనికి సయితము కొంత విలువయుండుట న్యాయ మని చదువరులు సులభముగా నూహించగలరు. విద్యార్థుల ఉపయోగమునకై, ౩౦-౧-౧౯౪౮ నాటికి వార్షికకేంద్రముల చలితస్థానములను సాధించు ప్రయోగము ఈ క్రిందచూపబడినది:—

౩౦-౧-౧౯౪౮ వ తేదీన తుపాకిప్రేల్చినప్పటికి (౫-౫ P. M. I. S. T.) గం ని సెక స్థానిక నాక్షత్రకాలభుక్తి.	౨౦-౩౩-౪౧
వర్షారంభకాలమునకు (౧౯-౫-౧౯౪౭ వ తేదీన ౨-౧౩ A. M. గ్రీనిచి మధ్యమకాలమునకు) స్థానిక నాక్షత్రకాలభుక్తి.	౩-౪౨-౫౦
వర్షారంభమునుండి హత్యాకాలమునకు సంపాదించిన నాక్షత్రకాలము.	౧౬-౫౦-౫౧
వార్షికకేంద్రగతికి రావలసిన ధన సంస్కారము. (౧౬-౫౦-౫౧ గ. ౨౪ ౨౪. =	౪-౫-౪
వార్షికకేంద్రము సంపాదించిన మొత్తపు నాక్షత్రకాలము.	౨౦-౫౫-౫౫
వర్షారంభ లగ్నమునకు సరి అగు నాక్షత్రకాలమును చేర్చగా.	౨౨-౫౨-౪౦
హత్యాకాలమునకు సరిఅయిన నాక్షత్రకాలము.	౧౯-౪౮-౩౫

ఈ కాలమునకు సరియగు కేంద్రస్థానము లివి:—

	భా క	
చలితవార్షికలగ్నము	౩-౪౪	వృషభము.
చలితవార్షికదశమము	౨౫-౧౧	మకరము

ప్రశంసలో నున్న వర్షారంభకాలపు లగ్నము హత్యాసమయమునకు వృషభరాశిలో ౩ భా, ౪౪ కలలలో నున్న దని కనుగొన్నచో, పాఠకమహాశయులు ఆశ్చర్యచకితులు కాక మానరు. గాడ్సే చలితశనిస్థానమదే. అతని చలితకుజునికి, మహాత్ముని జన్మరాహువునకు, వార్షికశనికిని పూర్ణకేంద్రవేధాస్థానమదే! గాడ్సేగారి చలితకార్యసిద్ధిసహమప్రదేశమదే! పర్యవేక్షవలన చెలరేగి మహాత్ముని జన్మలగ్నమునకు ప్రళయమును సంపాదించి ఇచ్చిన భచక్రభాగ మదే!!

ఇక, చలితవార్షికదశమకేంద్ర మే మయినదో, చూడుడు. గాడ్సేగారి జన్మవరుణస్థానమునే ఇది చేరుకోవలయునా ? ఈవరుణగ్రహపు విలువ ఎట్టిది ? జన్మకాలమున స్వార్థత్యాగబుద్ధిని పోషించు ప్రదేశము నాశ్రయించినాడు; చలితజాతకమున చలితశుక్రునికి, చలితహత్యాసహమమునకు సహాయమైనాడు; వర్ష జాతకములో సాహసమును సూచించు భాగను చేరుకొన్నాడు; వర్ష లగ్నములో నుండి కార్యనిర్వాహకత్వమునకు పూనుకొన్నాడు; మహాత్ముని చలితశని కెదురు నిలిచినాడు; హత్యాకాలమునకు వర్ష దశను తానే నడుపుచున్నాడు! ఇట్టి వరుణుని జన్మకాలికస్థానము

చలితవార్షికదశయుమునకు ఆనాడు తగినది కాదని చెప్పుట సాహసమనుకొందును.

దశలలో ఫలప్రదములుగా ఏర్పడిన గ్రహస్థానములతో హాత్యాకాలమునకు చలితవార్షికకేంద్రములు ఎంత హృదయంగమముగా సన్నిహితసంబంధమును సంపాదించుకొన్నవో చదువరులు గమనించియుందురు. ఇంతకన్న 'తమాషా' కావలయునా?


వర్షజాతకముయొక్కయు, వార్షికకేంద్రచలనపద్ధతియొక్కయు విలువ ఏపాటిదో, ఈ ఉదాహరణము కన్నులకు కట్టినట్లు చూపుచున్నది. మామూలుగా వింశోత్తరి మున్నగు దశాపద్ధతులవలన సాధించగల ఫలములు తృప్తికరముగా నుండని కారణముననే, యవనసంప్రదాయమునుండి వర్షజాతకపద్ధతిని ప్రాచీనశాస్త్రజ్ఞులు గ్రహించి వాడుకకు తెచ్చుకొనవలసివచ్చె నని, క్రీ. శ. ౧౬౪౯ (A D.)లో బలభద్రుడను సుప్రసిద్ధశాస్త్రవేత్త తన 'హాయనరత్న' గ్రంథములో గంట వాయించి చెప్పినాడు. శాస్త్రాభ్యుదయమే ప్రధానలక్ష్యముగా గల విద్యార్థికులు ఈ దేవమాన, సూక్ష్మమాన, వర్ష దశాపద్ధతులతో దైనికజాతకప్రక్రియను సమితము చేసుకొని ఉపయోగింతురని నా ఆశ.

సాధారణముగా ఆధునిక కార్తాంతికులలో అనేకులకు ఇట్టి పద్ధతులు రుచించనే రుచించవు. పైగా వానిపై ద్వేషముకూడ. అనగా జాతకఫలాదేశమే జీవనాధారవృత్తిగా ఏర్పరచుకొన్నవారి కనుట. ఇంచుక ఆలోచించితిమేని, కారణము దురూహ్యము కాదు. విశేషకాలయాపన మవసరమైన ఈ పద్ధతులను వారు వాడుకచేసినచో, ఇప్పటి ఆర్థికపరిస్థితులలో, వారికి గిట్టుబాటు కాదనుట సుప్రసిద్ధవిషయము. అక్కరమాలిన ప్రశ్నలు వేసి, అర్థములేని జవాబులు, రూపాయకు మూడువంతున, తెప్పించుకొని ఆనందించుటకలవాటుపడిన ఇప్పటి నవనాగరకతలో, సూక్ష్మమానదశలో, వర్షజాతకములో గుణించుచు కాలక్షేపము చేయజొచ్చిరేని, కార్తాంతికుల ఆలుబిడ్డల ముఖములలో క్షామదేవత తాండవమాడుచుండవలసినదే. కావుననే, ఇవే కాదు, మరి ఏ సూక్ష్మగణితపద్ధతులయినా వారి అభిమానమునకు పాత్రముకాజాలవు. ఇంతేకాక, ఈ పద్ధతులు నిష్ప్రయోజనము లనియు, ఇట్టి గరడీసాములతో పనిలేకయే, సర్వసులభమయిన గుప్తపద్ధతులతో, అపూర్వముగా ఫలములను చిటికెలో చెప్పగలమనియు దండోరా వేయనిదే వారికి తాత్కాలికముగా నయినా, ప్రతిష్ఠ రాదు. ప్రకృతపు పరిస్థితు లిట్లుండుటచే, వారిని మనము తప్పనలేము. కాన, శాస్త్రాభివృద్ధికి వీరు తోడుపడజాలరు. ఇతరవిధజీవనోపాయము కల్గి పరిశోధనదృష్టి యలవడిన విద్యార్థికులు సాధారణముగా ఈ కాలములో అరుదు. ఉన్నవారిలో పలువురికి ఇది యొక శాస్త్రమను భావము రాలేదు. ఇక, రాజకీయాభిమానము గల విశ్వవిద్యాలయముల దృష్టి వేరు. ఏమి కాలవైపరీత్యమో కాని, ఏశాస్త్రమునైనా ఆదరించు విశ్వవిద్యాలయములు జాతకశాస్త్రమును కడగంటనైనా చూడకున్నవి. ఆర్థికాభివృద్ధికి పనికివచ్చు పదార్థవిజ్ఞానశాస్త్రము, రసాయనశాస్త్రము, భూగర్భశాస్త్రము మున్నగు విద్యలను హెచ్చుగా ఆదరించుట సాధువే. కాని, ఇంకా పురిటింటిలో కన్నులు తెరవని స్థితిలో నున్న మన తత్త్వశాస్త్రముపై ఈ విద్యాసంస్థలు చూపుచున్న భక్తివిశ్వాసములలో శతాంశమైనా ఈ ప్రాచీనవైదికవిద్యపట్ల చూపరాదా? పోనిండు. తత్త్వశాస్త్రమును కళాశాలలలో నేర్పుచున్నారే! విద్యార్థులయొక్క కాని, దేశముయొక్క కాని ఆర్థికాభివృద్ధికొరకేనా? దీని తత్త్వ మా పరమేశ్వరునకే ఎరుక! మరియొక వింత చూడుడు. జనసామాన్యముయొక్క విజ్ఞానాభివృద్ధికిని, కళాభివృద్ధికిని పనిబూని నడుముకట్టి నిలిచినది అఖిలభారత రేడియో సంస్థ. పిల్లల ప్రోగ్రాములు మొదలు ముదుసళ్ల మూల్గులదాక నానావిధవిజ్ఞానములపై అభిమానము చూపుచున్న ఈ సంస్థకు జాతకముహూర్తముల ప్రశంస, పాపము, నేటిదాక స్ఫురించినదే కాదు. శ్రోతలకు రుచించ దనియో, లేక అర్థము కా దనియో వీరి అభిప్రాయ ముండునా? కవిత్వములో రీతులు, అలంకారములలో ధ్వని, పాత్రపోషణములో ఉపజ్ఞ, వేదములలో గానకళ ఇత్యాదివిషయములపై పండితులచే వీరిప్పించు ఉపన్యాసములు ఎందరు శ్రోతలు అర్థముచేసుకొనగలిగిరో? గ్రహములతో మనకు గల

సంబంధము, ఆరోగ్యవిషయమున గ్రహచారపు ఫలము, వ్యవసాయమునకు ఋతుధర్మముల సాహాయ్యము, ముహూర్తముల ఆవశ్యకత ఇత్యాదిసర్వజనోపయుక్తములగు విషయములనుగూర్చిన ఉపన్యాసములు శ్రోతలకు రుచించవా, విజ్ఞానాభివృద్ధికి తోడ్పడవా? జనసామాన్యమున కింకను గ్రహనక్షత్రాదులపై విశ్వాసము పోలేదు. వారపత్రికలు, మాసపత్రికలు, సర్వసాధారణముగా, గోచారనక్షత్రరాశిఫలములను ప్రకటించుటే దీనికి సాక్షి.

పోనిండు. "జీవన్ భద్రాణి పశ్యతి." అని వేచియుందము. ప్రకృతమునకు మరికొన్ని తమాషాలు చూచి ఆనందింతముగాక.


మహాత్ముని నిధనకాలపు కుండలి ఇది :—



నిధనకాలచంద్రుని దేవమానదశలో చలింపజేసినచో, ఫల మేమి వచ్చునో చూతుము.

ఈచంద్రుడు తులారాశి ౨౨ వ భాగకు వచ్చేసేని వ్యయభావమందలి వరుణునితో త్రికోణదృష్టియు, గాడ్సే జన్మబుధునినుండి సార్ధకేంద్రవేధయు సంపాదించునుకదా? ౧౯౪౯ ఫిబ్రవరి నెలకు చలితచంద్రుడిచటికి రాగలడు. హాస్యాభియోగములో న్యాయాధిపతి తీర్పు అప్పుడే! ౧౯౪౯ ఆగస్టు నెలలో ఈ చలితచంద్రుడు వృశ్చికరాశిని ప్రవేశించుట. ఈ అభియోగము హిందూదేశమందలి న్యాయస్థానముల వదలి ఖండాంతరమువారి 'పంచాయతీ' నపేక్షించినది. ఈ నవంబరుమాసాంతమునకు చలితచంద్రుడు వృశ్చికరాశిలో ౩౪ భాగకు పోగలడు. నిధనదివసునాటి శుక్రుకు చలనవశమున అప్పటికి మీనరాశిలో ౧౩ వ భాగలో నుండును. అగుటచే చలితచంద్రుడు ఈ శుక్రుని సార్ధకేంద్రదృష్టిని స్వీకరించి గాడ్సేగారి చలితభుజచలితశనుల పూర్ణవేధాస్థానమును చేరుకోగల డనుట! ఈనాటకమునకు భరతవాక్య మది కాబోలు!

అది యట్లుండె. న్యాయాధిపతి తీర్పు చెప్పుట ౧౯౪౯ ఫిబ్రవరి నెల ౧౦ వ తేదీనాడు ఉదయము ౧౧-౩౦ *A. M.* (*I. S. T.*) గంటలకు అప్పటి గ్రహసంపత్తి యిది :—



హంతకునికి శిక్ష విధించుటే ఈ తీర్మానపు ఫలము. ఈకథలో హంతకగ్రహము శుక్రుడని చదువరు లెరుగుదురు. ఈ తీర్మానపు ఫలము వానికి చెందవలసినది! కనుకనే ఈ కుండలిలో లగ్నాధిపత్యము శుక్రుడు వహించుట ఎంతో రమ్యముగా నున్నది. ఈ నిందితుడు దశమకేంద్రమధ్యమందే నిలిచినాడు. అనగా, న్యాయస్థానములో ననుట. అచటనే, ఈ శుక్రుడు బుధుని చేరుకొన్నాడు. నిందితుడు తీర్మానమును విన్నాడని యర్థము. ఈకుండలిలో మృత్యుస్థానాధిపతి

(బృహస్పతి) ధర్మస్థానములోనుండుట. హత్యాభి యోగము కోర్టుకెక్కనదికదా! విశేష మేమనగా, ఈ బృహస్పతియొక్క పరిపూర్ణకటాక్షము తీర్మానపు లగ్నముపై నున్నది. ఇం కెం దుండగలదు? రాజ్య స్థానాధిపతియగు శని (న్యాయాధికారి) ఇతరసంబంధ ములను మానుకొని వివిక్తస్థలములో, మంచి వివేచనా శక్తి నిచ్చు కన్యారాశిలో, చక్కని మంత్రాలోచన తెలుపు పంచమభావములో ఉన్నాడు. దయాదాక్షి ణ్యములకు లోనుగాక, జంకుకొంకులు లేక, న్యాయ మును పరిపాలించుటకు ఇట్టి శనియే ఎంతయు తగినవా డనుట నిర్వివాదము.

హంతకుడు 'ఫలానా' వ్యక్తి యని నిర్ధరించుచే ఈ తీర్మానమునకు ఫలముకదా? ఈ కుండలిలో 'ఫల ప్రాప్తి సహమ' మను బిందువు ఎచ్చట నున్నదో గమ నించినచో పాఠకమహాశయు లాశ్చర్యపడకమానరు. కర్కాటకరాశిలో ౧౧ వ భాగలో నున్న ఈ సహమ మునకు అంతరార్థ మేమో ఊహ మాలోచింపుడు! గాడ్సేజాతకములో ఉద్యోగస్థానాధిపతియగు కుజు డున్న భాగ అదేకదా? తీర్మానపు ఫల మెచట వ్రాలి నదో కాలపురుషుడు చూపుచున్నాడనుట కాక వేరేమి?

హత్యకాలమున ఉద్యోగాధిపతి శుక్రుడు మీనరాశిలో ౧౫ భా. ౧౦ కలలలో నుండెనుగదా? తీర్మానపు కాలమునకు ఈ శుక్రుడు చలనవశమున ౧౬ భా. ౨౦ కలలకు వచ్చినాడు. తీర్మానపు కుండ లిలో 'కార్యసిద్ధి' సహమము నికరముగా ఆ చలిత శుక్రునిపైననే ఆవాహనమైనదనుట చిత్రము కాదా? తీర్మానమునకు సాఫల్యము హంతకుడు న్యాయశాస్త్ర మునకు చిక్కుటే!

తీర్మానము నాటికి గాడ్సేదైనికజాతకము లోని విశేషము లివి:—


		భా. కల	
దైనికలగ్నము	...	౨ - ౦	మేషము.
దైనికదశమము	...	౧-౩౦	మకరము.
దైనికహత్యాసహమము	...	౧౮-౦	వృషభము.
దైనికమృత్యుసహమము	...	౨౫-౩౦	కటకము.

గాడ్సేగారి లగ్నాధిపతియగు జన్మచంద్రునికి నికరముగా సమసప్తకవేధకే నాటి దైనికలగ్నము రావలయునా? దైనికహత్యాసహమము తీర్మాన కాలపు లగ్నమునే ఆశ్రయించవలెనా? దైనికమృ త్యుసహమము జన్మవరుణుని సమసప్తకవేధకే గురికా వలయునని విధియా! జన్మకాలమున అవసానసహ మము మేషరాశి ౨౫త్త భాగ; తీర్మానపు కుండలిలో మృత్యుసహమము తులారాశి ౨౬ వ భాగ; దైనికమృత్యు సహమము కర్కాటకరాశిలో ౨౬ వ భాగ! జన్మవరు ణునకు ఈ మూడును మూడు కేంద్రములలో నిలుచుట వింతలలో వింత! రోగి కోరినదే వైద్యుడు పథ్య ముగా నిర్ధరించిన ట్లయినది. తీర్మానపు వ్యాజమున కాలపురుషుడు చరమశ్లోకము సిద్ధముచేయుటకదా యిది! ఇంతకన్న 'తమాషా' కావలయునా!

దేవమానదశాపద్ధతిని తీర్మానకాలపు కుండలిని సయితము ఉపయోగించిమాతము. రాగల నవంబరు మాసాంతమునకు చలితచంద్రుడు బృహస్పతితో పరి పూర్ణసమసప్తకవేధపాలు కాగల డని చదువరులు గమనించగలరు. ఈ బృహస్పతి అష్టమాధిపతి! పైగా నీచుడు, ధర్మస్థానములో నుండుట! అసాధారణపరి స్థితు లేవయినా అడ్డమురానిచో, తీర్మానపు ఫలము కార్యరూపమునకు రావచ్చునని సూచన ఏల కారాదు?

సరేకాని, దశాసౌకర్యము రావలదా? అను శంక కల్గుట సహజము. దానినిసయితము పరిశీలింతము గాక. ఈప్రక్క నున్నదే చలితజాతకకుండలి.

జాతకమున గురువు ధర్మస్థానాధిపతి. న్యాయ సహమముసయితము ఇతని అధికారములోనిదే. ఈగురు వునకే చలిత జాతకములో అష్టమాధిపత్యము వచ్చినది. ఇట్టి గురువుతో చలితరవికి (చలితలగ్నాధిపతికి) పూర్ణ కేంద్రదృష్టివేధ! జన్మగురువుతో, జన్మలగ్నాధిపతి చంద్రునితో, కేంద్రమందున్న కారాగృహసహ మము చలించి, ప్రాప్తిసహమమును చేరుకొని, జన్మ యముని (ప్లూటో)తో అర్ధకేంద్రవేధపా లయినది. ప్రకృతపరిస్థితులకు దేవమానదశ అర్థముచెప్పుచున్న ట్లుండలేదా?



చలితలగ్నము చలితరవిగురువుల మధ్యమునకు పోయి చేరినది. చలితచంద్రుడు ఇంద్రునితో పార్శ్వ కేంద్రవిషమదృష్టిని నవంబరు నెలకు సంపాదించుకొనుచున్నాడు. ఇది విషమకాలము!

న్యాయసహమము చలితకుండలిలో ఇంద్రకుజుల మధ్యబిందువున కెదురుగా నిలచుట ఈ గ్రహముల సమష్టి కార్యమునకు న్యాయశాస్త్ర మిపుడు ప్రతికూలించిన దనుటకాక మరియేమి? ఆత్మసహమ మేమనుచున్నదో, తిలకింపుడు. మృత్యుస్థానాధిపతియగు జన్మశని త న్నాకర్షించుచున్నాడని చాటుచున్న దికదా?

వృశ్చికరాశిలో మృత్యుసహమము ఆక్రమించిన భాగ రాజ్యాంగతంత్రము (*Politics*) నకు సంబంధించినదని మారిస్ జెమిన్ పండితుని మతము. ఈ సహమము ఇప్పటికే మకరప్రవేశము చేయుటచే, మృత్యుస్థానాధిపతి(శని)ని చేరుకొన్న ఆత్మసహమముతో మైత్రిని అభిలషించుచున్నది. రాజకీయకారణముల మూలముగా రానున్న అవసానమును సూచించుటకదా యిది?

అది యట్లుండె. ౧౯౪౯ వ సంవత్సరమున 'వర్ష జాతక' మెట్లున్నదో? ౧౮-౫-౧౯౪౯ నాడు ౨-౧౨-౫౯ **P. M. (G. M. T)** కాలములో వర్ష ప్రవేశమైనది. అప్పటి కుండలి ఇదిగో ప్రక్కపుటలోనున్నది.

జన్మలగ్నాధిపతి చంద్రుడు జన్మాష్టమభావమును చేరుకొన్నాడు. వర్షజాతకములో అష్టమాధిపత్యమే ఈ చంద్రుడు సంపాదించుకొనుట. దీనికి కుజునితో

	రా ౨౪-౯	శు ౧౩-౪౫ ర ౨౭- ౧౭-౧౮	కు ౫-౩౯ బు ౧౬-౨౫ వ ౨౮-౪౪
చ ౧౩-౩౫ గు ౨-౧౦ (వ)	వర్షజాతకము ——— (౧౯౪౯) సాయనము		VIII ౮-౩౪
			యమ:౪- ౧౬ పుణ్య ౨౩-౧౮ శ ౨౯-౩౪
I ౭-౦		ఇ ౧౨-౪౪ కే ౨౪-౯	X ౧౧-౫౬

కేంద్రవేధ, వరుణునితో సార్ధకేంద్రవేధ, యమునితో సమసప్తకవేధ, పాపము—ఇన్ని దాపురించినవి. హంతకగ్రహమగు శుక్రుని గతి చూచితిరా ! జన్మ శుక్రునికి సమసప్తకదృష్టిని, చలితరవిశుక్రులకు సార్ధ కేంద్రదృష్టిని ఈయగలచోటికి ఇంద్రుడు చేరుకొన్నాడు. వర్షజాతకపద్ధతిలో ఈ ఇంద్రుని దశయే ౭-౭-౧౯౪౯ నుండి ౧౦-౧౨-౪౯ దాక జరుగవలసి యుండుట.

జన్మమృత్యుసహమమునకు నిండుకేంద్రములో, వార్షికమృత్యుభావమునకు అర్ధకేంద్రములో పుణ్య సహమము తటపటలాడుచున్నది.

దశాఫలములతో సమన్వయపరచినచో, వర్ష జాతకమునయితము దుష్టఫలమునే చూపుచున్నదను కొనవచ్చును. ఈ సామగ్రి ఇట్లుండగా పర్వము లేమైనా గాడ్సేజాతకమును పరామర్శించునేమో, పరిశీలించుట అప్రస్తుతము కాదు. ౧౯౪౯ జనవరి ౧౪ వ తేదీన వచ్చిన పూర్ణిమ గాడ్సే చలితవరుణునిపైన బడి, ఆత్మసహమమును అర్ధకేంద్రవేధతో పొడిచినది. చరమశ్లోకరచన జరుగుచుండిన కాలమదే. మేనెలలో ౨౭ వ తేదీనాడు జన్మబుధునిపైననే అమావాస్య వచ్చినది. తరువాతనే అప్పీలు పరిష్కారమగుట! జూలై ౧౦ వ తేదీనాడు కర్కాటకరాశి ౧౮ వ భాగలలో ఇంద్రునిపైననే పూర్ణిమ వచ్చినది. సకాలమున చరమశ్లోకపఠనము జరుగకుండునట్లుగా, ఇంద్రుడు తన మాయమంత్రముల నుపయోగించినాడు. ప్రీవీకౌన్సిలుకు అప్పీలు చేయు వ్యాజమున కాలయాపనమునకు అవకాశము వచ్చినది. ఇక, నవంబరు నెల ౨౦ వ తేదీన రాగల అమావాస్య జన్మకేతువుపైన పడగలదు. ఆనాడు మధ్యాహ్నము ౦-౨౪-౫౯ *P. M.* (*I. S. T*) గంటలకు ఈ పర్వము వచ్చుట. అప్పటి గ్రహస్థితి ఇది :—

	రా౧౪-౧౯		
I ౨౮-౫౫	"పర్వము" (౨౦-౧౧-౧౯౪౯) (సాయనము)		వ ౪-౨౦ (వ)
కు ౧౪-౫౦			యమ ౧౮-౧౧
X ౬-౫౧	బు ౨౬-౪౪ ర ౨౭-౩౯ చ ౨౭-౩౯	కే ౧౪-౧౯ ఇ ౧౬-౨౫	శు ౧౩-౧౬ శ ౧౮-౧

అపరిహార్యప్రారబ్ధమును (*Inevitable fate*) సూచించు ప్రదేశములలో, గాడ్సేజన్మరవి—చలితశుక్రసంయోగస్థానమునకు ౧౮౦ భాగలలో, ఈ పర్వము వచ్చుచున్నది. గండసంధిలో నున్న జన్మకేతువు, జన్మహిల్లాజము—ఇది చెలరేగవచ్చును. చలిత హిల్లాజము మకరరాశి ౪ భాగలలో నున్నది. పర్వకాలపు వరుణుడు జన్మకాలపు కారాగారసహమమును చేరుకొని చలితహిల్లాజమును సమసప్తకదృష్టితో ఆకర్షించుచున్నాడు. పర్వవేళలో అష్టమాధిపత్యము గలవాడు శుక్రుడు. ఈ శుక్రుడు జన్మలగ్నమునకు ఎదురుగా నిలువగా, వీకకాలమందే, ఈ రెండింటిని, పర్వకాలపు రాహుకేతువులు కేంద్రవేధపాలు చేసినారు. జన్మకాలికరాహుకేతువుల నడుమ చిక్కి పర్వలగ్నము నలిగిపోయినది. పర్వకాలపు శని చలితమండలిలోని అష్టమభావమును వేధించుట (సమసప్తకవేధ) చూడగలము. జన్మకాలమున మృత్యుస్థానాధిపతికదా శని!

పర్వకాలమునకు గాడ్సే దైనికలగ్నము మకరరాశి ౨ వ భాగలో నుండును. వరుణుని సమసప్తకమున కిది మూడురోజులలో ప్రయాణము చేయగలదు. అప్పటికి పర్వలగ్నము చలితచంద్రుని చేరుకొనుచున్నది. అనగా, పర్వశక్తి లగ్నాధిపతికి చెందుననుట! తరువాత అనుదినములకు పర్వలగ్నము అత్మసహస్థానమునకు పోయి జన్మవరుణుని అర్ధకేంద్రవేధను పొందును. కుజశనులు సంయోగము నొంది చలితమృత్యుభావమున కెదురువత్తురు. దైనికలగ్నము జన్మకుజుని కెదురగును. వర్షలగ్నమప్పటికే యముని సంయోగము నందగలదు. ప్రబలగ్రహవైషమ్యకాలమిది యని భావించుట తప్పుగాదు.

ఇంత చాలును. గాడ్సేజాతకమునకు భావిఫలముల చెప్పబూని ఈ చర్చ నారంభించితి ననుకొనుట పొరబాటు. అట్టి కాలక్షేపమునైన నాకు అభిరుచి లేదు! కుతూహలముసయితము లేదుకూడ. అతని భావిఫలము, లోకవ్యవహారరీత్యా, ఇండియారాజ్యాంగమువారి చేతులలో నున్నది. వారే మునుముందుగా ఫలాదేశము చేయగలరు. అనగా, వారిలో ముఖ్యవ్యక్తుల జాతకగ్రహసామగ్రి ఇది నిర్ధరించునని యర్థము. ఇచట ఒక చిన్న 'తమాషా'! శ్రీ 'చక్రవర్తి' రాజగోపాలాచార్యులవారి జన్మగురువునకు (లగ్నాధిపతికి) నికరముగా సమసప్తకస్థానమునే గాడ్సేచలితకుజుడు ఇపుడు ఆక్రమించుట! ఈ సమస్యలో కడపటిమాట వారిదే కాబోలు! మహాప్రధాని శ్రీ నెహ్రూపండితుని జన్మచంద్రస్థానమందే గాడ్సేచలితకుజుడు నిలిచియున్నాడు. ఉపప్రధాని శ్రీ పటేలుగారి జన్మకుజునికి నికరముగా సమసప్తకస్థానమదే. గాడ్సేచలితలగ్నము ఉపప్రధానిగారి జన్మవరుణుని సంయోగమును పొంది వారి జన్మశనినుండి సమసప్తకవేధ నభిలషించుచున్నది!

ఈ యోగములకు వ్యాఖ్యానము చేయబూనుట అధికప్రసంగ మగును. కాక, ఇన్నింటిని సమన్వయము చేయు సామర్థ్యముగల ప్రతిభ యొకటి కావలసియున్నది. మనబోటి సామాన్యవిద్యార్థుల కది అందరాని పండు. శాస్త్రీయములగు పద్ధతుల విలువను జూపి, జ్యోతిషవిద్యార్థులకు గల శాస్త్రాభిమానము, వ్యాసంగకుతూహలము, పరిశోధనదృష్టి-కిని నుత్తేజనము నిచ్చుటే నా సంకల్పము. ఆధునిక విద్యాధికులకు ఈ విషయమందు అభిరుచి కలిగనేని అచిరకాలమందే ఈ ప్రాచీనపవిత్రవిద్యకు అభ్యుదయము రాగలదని నా విశ్వాసము.

"కాలక్రమేణ జగతః పరివర్తమానా
చక్రారపంక్తిరివ గచ్ఛతి భాగ్యపంక్తిః" (భాసుడు)



భవభూతికవి-ఆయనచిత్రచరిత్ర

శ్రీ వేదము వెంకటరాయశాస్త్రి

'ఏమండోయి జాతూకర్ణమ్మగారూ, మీ అల్లుడు గారికి ఒక కన్ను లేదే !'

'లేకపోతే నేమమ్మా, మహాపండితుడు, పని వాడైనా'

'పండితుడే. కాని మీ అమ్మాయి ఒప్పుతుందా'

'భేషుగ్గా; వరించి చేసుకుంది మా శ్రీదేవి'

'అలాగా !'

'బావేగా. పైగా పాపం, ఆ కన్ను ఈ నడమే పోయింది. మునుపు బాగుండేది. చూడు ఎంత ఎలుపు! ఆ ముక్కు, మొహం, పొడుగు, తేజస్సు! ఆజాను బాహువు మనిషి. సాముద్రికంలో చెప్పే మహాపురుష లక్షణా లన్నీ ఉన్నాయి.'

'సరే, కలిసివచ్చిన సంబంధం గావును. పైగా బావ. అంచేత చిన్నప్పటి సహవాసం ప్రేమగా మారి కన్నొకటి పోయినా మీ అమ్మాయి కోరి పెళ్లి చేసుకుంది.'

'మా అమ్మాయి కావ్యశాస్త్రాలు కాస్త చదువుకుంది. అంచేత చదివిన బావంటే దానికి అంత గురుత్వం' అన్నది తల్లి జాతూకర్ణీదేవి.

ఈమె భర్త నీలకంఠుడు. మహావిద్వాంసుడైన భట్టశ్రీ నీలకంఠుడని వ్యవహారము. దక్షిణాపథమున విదర్భదేశమున పద్మపురమున (నేటి బేరారు) ఉదుంబరు లను తెగ బ్రాహ్మణులు, తైత్తిరీయులు, చరణగురువులు, పంక్తిపావనులు, ధృతవ్రతులు, సోమయాజులు ఉండిరి. ఆ తెగలో కాశ్యపగోత్రమునందు కృష్ణయజుశ్శాఖాధ్యాయి, మహాకవి యను పేరివాడు వాజపేయయాజి యుండెను. అతని మనుమడు భట్టగోపాలుడు చాల ప్రసిద్ధి నందియుండెను. ఈతని కుమారుడే పై నీలకంఠుడు. ఈతడు పండితుడై జాతూకర్ణి యను నామెను వివాహమాడెను. వీరికి శ్రీదేవి యను కొమార్తెయు, శ్రీకంఠుడను కుమారుడును జనించిరి. ఈ శ్రీదేవికే నేడు వివాహము.

అల్లుని పేరు కుమారిలస్వామి. ఆంధ్రదేశమునకును ఉత్కళమునకును నడుమ మహానదీతీరమున జయమంగల మను గ్రామము కలదు. అందు తైత్తిరీయ శాఖకు చెందినవాడు యోగీశ్వరభట్టనువా డుండెను. ఆయన భార్య చంద్రగుణ. వీరికి చిరకాలము లేకలేక కుమారస్వామివరమున నీతడు జనించినందున కుమారిలస్వామి యని నామకరణ మొనరించిరి. చంద్రగుణ నీలకంఠునికి అక్కవరుస. బాల్యమునుండియు రాకపోకలవలన శ్రీదేవికి కుమారిలస్వామి యనిన చాల ప్రియము. సౌందర్యమున మన్మథుడే.

కుమారిలుడు బాల్యమునుండియు మేధావంతుడు. వేదవేదాంగములను నేర్చినంతట ఇతనికి జైనమతముపై నీర్ష్య జనించినది. దానిని ఖండించి వైదికమతమును దేశమందు పునరుద్ధరింపవలయు నను నభిలాష కలిగినది. కాని జైనులు తమ మతరహస్యములను ఇతరులకు చెప్పరు, గ్రంథములను చూపరు. వానిని గ్రహించిన గాని ఖండించుట సాధ్యపడదు. జిజ్ఞాసువు, అభిమాని కుమారిలుడు కౌమారముననే ఇల్లు వదలెను. విద్యాగ్రహణార్థము సంచారము మొదలిడెను. జైనమతమును నిర్మూలించువఱకును అతని యాత్మకు శాంతి యేది ?

శ్రీదేవి కీ విషయము తెలిసినది. కుమారిలస్వామి మహాప్రతిభావంతు డని యెఱుగును. తలిదండ్రులు వివాహప్రయత్నములు చేయగా నివారించెను. తన స్వామి కుమారిలస్వామియే యనెను. ఆతడో దేశాంతర మేగినాడు. కాని వచ్చువఱకును ఉండవలసినదే యని పట్టుపట్టెను.

కుమారిలుడు దేశసంచార మారంభించెను. నాడు దేశమున మతకలహములకు లెక్కలేదు. అవైదికమతము వైదికకాలమునుండియు కలదు. దేహాత్మవాద మనునది యొకటి ఉపనిషత్తులలోనే కనబడుచున్నది. ఈ వాదము క్రమముగా ప్రబలినది. ఈమతమువారిని తీర్థంకరులనియు, జైనులనియు వ్యవహరింపసాగిరి. ఈపరంపరలో ఇరువదినలుగురు తీర్థంకరులు వెలసిరి. కడపటివాడగు మహావీరజైనుడు క్రీ. పూ. ఆఱవ శతాబ్దమువాడు, బుద్ధుని సమకాలికుడు. ఈతని మతము సామాన్యజనులకు అనుకూలముగా నుండినందున చాల త్వరగా బీహారుదేశమందును, అటనుండి కళింగాంధ్రములకును వ్యాపించినది. చంద్రగుప్తచక్రవర్తి కాలముననే మైసూరువఱకును వ్యాపించినది. తమిళదేశమున సంఘకాలమున, అనగా క్రీ. పూ. ౩౦౦ లప్పుడు ప్రాధాన్యము నందినది. కుమారిలస్వామికాలమునకు జైనమతము ఆంధ్రద్రావిడకర్ణాటకదేశములలో మహోన్నతస్థితియం దుండెను. ఆంధ్రకళింగదేశములలో బౌద్ధజైనవిహారములు చిరకాలముగా నిర్మితము లగుచుండినవి. వైదికమతము నామమాత్రావశిష్టమై యుండెను. వైదికమతానుయాయులు నిక్షేపములవలె ఎచ్చటెచ్చటనో దాగియుండిరి. అట్టివానినుండి, నివురుగప్పిన నిప్పు, కుమారిలుడు ఎనిమిదవశతాబ్దప్రారంభకాలమున బయలుదేరెను.

ఆతడు జైనబ్రహ్మచారివేషము ధరించెను. జైనగురువులకడకు పోయెను. వారి రహస్యముల నెన్నింటినో గ్రహించెను. తుదకు జైనవిద్యాపారంగతుడాయెను. కాని ఈతని తోడివిద్యార్థి యొకడు మొదటినుండియు ఈతనిపై గంటువహించియుండెను. ఒకదినము కుమారిలుడుండగా నలుగురయెదుట వైదికమతమును చాల నిరసించెను. ఓర్వరాని కటువాక్యములను ప్రయోగించెను. సముద్రమువలె గంభీరుడు, భూదేవివలె క్షమావంతుడు, చాణక్యునికన్న నయతంత్రజ్ఞుడు కుమారిలుడు; కాని ఓర్వలేకపోయెను. పొంగివచ్చు దుఃఖాతిరేకమున నాతని నేత్రములనుండి బాష్పములు అతని వశములేకయే బొటబొట రాలినవి. తక్షణమే ఆ విద్యార్థి కుమారిలుని రహస్యమును బైట పెట్టెను. జీవకారుణ్యమే పరమావధియైన జైనమతమును బోధించు నా విద్యార్థియు, తదితరజైనులును నాలుగంతస్తుల మేడమీదినుండి కుమారిలుని క్రిందికి త్రోసిరి. పడుటలో కుమారిలునికి మంచిదెబ్బలే తగిలినవి; కన్నొకటి పూర్తిగా పోయినది.

ఎవరో తీసికొనిపోయి కాపాడిరి. ఇకను విద్యాభ్యాసము పూర్తియైన దని యాతడు తండ్రికడకు పోయెను. తండ్రి పరమానందమును జెందెను. తల్లి ఆ కంటిని తాకితాకి దుఃఖించెను. 'నాయనా, నీకోసం పాపం, ఆ శ్రీదేవి కాచుకొనియున్నదిరా' అనెను. కుమారిలునికి ఆశ్చర్యసంతోషములు కలిగినవి. వెంటనే తల్లిదండ్రులతో పద్మపురమునకు బయలుదేరెను. పరమానందభరితులై జాతూకర్ణీ నీలకంఠులు వారిని ఆహ్వానించిరి. కుమారిలుడు మునుపటి కుమారిలుడేగాని ఒక కన్నుమాత్రము లేదు. అందులకు అందఱును చింతించిరి. శ్రీదేవియు చింతించినదిగాని ఆతడు మరల వచ్చినదే చాలు నని సంతోషించినది. ఇంకనేమి, బావ జైనులను పచ్చడిచేయునని ఆమె నిశ్చయించుకొనెను. రాజసభాంతరములలో తన స్వామిదే విజయ మని ఆమె ఊహాసౌధములు నిర్మించుకొనసాగెను.

శుభస్య శీఘ్ర మని వివాహప్రయత్నములు జరిగినవి. పెద్దలు బహువైభవముగా వివాహమును జరిపించిరి. దానికి వచ్చిన పెద్దలందఱు ఆ దాంపత్యమునకు సంతోషించినను పెండ్లికొమారునికి కన్నొకటి పోయినదే యని చింతింపనివారు లేరు. అదియే నాటి మాట అందఱినోటను.

౨

కుమారిలస్వామి తల్లిదండ్రులతోను, భార్యతోను జయమంగలమునకు బయలుదేరిపోయెను. శ్రీదేవి పద్మమును వీడిపోవునట్లు ఈ శ్రీదేవి పద్మపురమును వీడిపోవుచుండగా అందఱు చింతించుట ఆశ్చర్యము గాదు గాని పసిబాలుడు శ్రీకంఠుడు చాల నేడ్చెను. వానికి అక్కపెండ్లిలో వడుగుచేసిరి. బాల్యమునుండి తనకు అక్కయే చదువుచెప్పినది. అటువంటి యక్క దేశాంతరమునకు పోవుచున్నది. ఎక్కడి పద్మపురము,

ఎక్కడి జయమంగళము! మరల అక్కను చూచుట ఎప్పుడో! ఏమయిన నేమి? శ్రీకంఠుడు అక్కమీదనే తన మన సుంచియుండెను. అతని యుపాధ్యాయుడు జ్ఞాననిధిమహోదయుడు ఓదార్చి, తన యింటికి కొనిపోయి వైదికవిద్యల నెల్లను అతిప్రీతితో నేర్పెను. క్రమముగ శ్రీకంఠుడు విద్యావంతుడై భట్టశ్రీకంఠుడాయెను.

శ్రీకంఠుని పెండ్లియీడు. విద్యాభ్యాసము పూర్తియైనంతట తండ్రి బంధువులలో నెదకి యుక్తవయస్కను, తుల్యగుణను, మహావిదుషిని, కుమారిలస్వామి పినతండ్రియైన విష్ణుభట్టాచార్యుని కొమారితను కొనివచ్చి శ్రీకంఠునికి వివాహమొనర్చెను. అమ్మాయిపేరు సరసవాణి. బాల్యమునుండి అలోకసామాన్యప్రతిభను ప్రకటించుచువచ్చినందున ఆమెను బంధువులెల్లరు భారతియవతార మని యనుచుండిరి. సంస్కృతప్రాకృతములందు కవయిత్రిగావున ఉభయభారతి యని యామెకు ప్రసిద్ధి యేర్పడెను. ఉభయభారతి యనునది క్రమముగా ఉంబగా సంగ్రహింపబడి పుట్టినింట నామెకు ఉంబ యనియే వ్యవహార మేర్పడెను. ఆమెకు ఎట్టి వరుడు దొరకునో యని చింతించుచుండిన తలిదండ్రులకును, బంధువులకును పరమానందకరముగ మహావిద్వాంసుడు శ్రీకంఠుడు దొరకెను. పెండ్లిపందిటిలోనే ఎల్లవారికిని ఆదంపతులలో ఎవరు విద్యాధికులో యను వివాద మేర్పడెను. ఆవిషయము దంపతులే నిర్ణయించుకొనదగినదని యందఱును వారికే వదలిరి. అనురాగముచే శ్రీకంఠుడును, భర్తృగౌరవముచే ఉంబయును బదులు చెప్పలేదు. ఇట్టి లోకోత్తరపాండిత్యమును, దాంపత్యమును అసాధారణములు.

శ్రీకంఠుని వివాహమునకు అతని యక్క శ్రీదేవి రాలేదు. ఆ దేశమునుండి యీ దేశమునకు వచ్చుట చాల ప్రయాసతో కూడిన పని. దారిలో దొంగలగుంపు. పైగా ఏవేవో అడ్డము లేర్పడినవి. సరిగా నప్పుడే శ్రీదేవి లేకలేక గర్భిణిగా నుండెను. పెక్కుకారణములచేత శ్రీదేవికుమారిలస్వాములు శ్రీకంఠుని వివాహమునకు రాలేకపోయిరి. అది వారికందఱకు తీరని కొఱతయే. కాని ప్రాప్తమునకు ఎవ రేమి చేయగలరు?

క్రమముగా ఉంబయు భర్తతోకూడ విద్యావ్యాసంగమున పండితులతో పాల్గొనసాగెను. శ్రీకంఠునికిని కాలక్రమమున నాతని పేరు మఱిగిపోయి ఉంబాభర్తగాన ఉంబేకాచార్యు డని వ్యవహార మేర్పడెను.

పద్మపురము నేటి బీరారు నందు కలదు. శ్రీకంఠుని కాలమునకు ఆ దేశము ఆంధ్రదేశమునందలిదే. నేటికిని తెలుగు మాటలాడువారు ఆ ప్రాంతమున గలరు. శాతవాహనులు పాలించిన దక్షిణాపథము వారి తర్వాత పెక్కు రాజవంశములవారిచే విభక్తమైనది. పశ్చిమమున కదంబులును, వారితర్వాత చాళుక్యులును, దక్షిణమున పల్లవులును, తూర్పున ఇక్ష్వాకుసాలంకాయనవిష్ణుకుండినులును పాలించిరి. శ్రీకంఠుని కాలమున బాదామిచాళుక్య లింకను గలరు. వేంగియందు చాళుక్యుల యాధిపత్యము ఏర్పడి దాదాపు వందసంవత్సరము లై యుండినది. బీరారువఱకు నేటి తెలంగాణము వీరి స్వాధీనమందే యుండె ననుటలో నతిశయోక్తి లేదు. దేశమందు సంస్కృతప్రాకృతములు పర్వియుండినవి. ప్రాకృతము పామరవ్యవహారమందే గాక కవిత్వమునకు నుపయోగపడుచుండెను. శైవవైదికజైనబౌద్ధమతములు చెలరేగి ఆయామతానుయాయులు దేశమందు వాదప్రతివాదము లొనర్చుకొనుచుండిరి. తెనుగున కవిత్వము ప్రారంభమైనదిగాని ఇంకను రాజసభల కెక్కలేదు. అందుచే ఆంధ్రుడైన శ్రీకంఠుడు సంస్కృతప్రాకృతములలో కవియాయెను.

శ్రీకంఠునికి దేశాటనరాజసభాప్రవేశములు చేయవలయు నను తలంపు కలిగినది. వైదికమార్గనిష్ఠుడైనను శైవమతమును అభిమానించెను. బౌద్ధు లనినను అతనికి ప్రియమే. ఆంధ్రదేశమందు నాడు శ్రీశైలము నేటివలెనే గొప్ప శైవక్షేత్రము. నేడు తగ్గిపోయినది గాని నాడు ఎచ్చటెచ్చటివారును అచ్చటికి చేరుచుండిరి. పండితప్రకాండుడు శ్రీకంఠుడు పత్నీసమేతుడై మల్లికార్జునస్వామిని దర్శించెను. అచ్చటి పండితులతోడి వాదములలో పాల్గొని క్రమముగా వారిచే

ప్రేరితుడై బ్రహ్మసూత్రములకు శ్రీకంఠభాష్య మను పేరి శైవభాష్యమును రచించెను. ఉంబ సాయము చేసెను. ఈ భాష్యమే శ్రీశైలవాసులకు, శ్రీకంఠు లనుపేరి శైవులకు మతగ్రంథ మాయెను. కాని కొంద రద్వైతులు శ్రీకంఠుని భాష్యము నాక్షేపింపసాగిరి.

అచటినుండి జయమంగలమున కేగి అక్కను, బావను చూడగోరి శ్రీకంఠుడు సన్నాహమున నుండగా కుమారిలస్వామి దేశాంతర మేగె ననియు, నాయూర వారి కుటుంబము లే దనియు తెలిసినది.

3

ఈలో జయమంగల మను గ్రామమున, శ్రీకంఠుని వివాహకాలమున గర్భిణిగా నుండిన శ్రీదేవికి జయమిత్రు డని యొక కుమారుడు శుభలగ్నమున జనించెను. అం దేమి శుభయోగాని పాప మాయమకు ప్రసవానంతరము వ్యాధి గల్గి మంచమే గతి యాయెను. కొంతకాల మట్లుండి ఆయమ గతించెను. కుమారిలుని జీవితమందు అ దొక తటిల్లత. అతని యందే అభిమానముంచి, కన్నొకటి పోయినను వివాహము చేసికొని, తమ్ముని వివాహమునకు సయితము పోక తనకడనే యుండి అసువులంబాసిన పత్నికై కుమారిలస్వామి క్రుంగిపోయెను. బాలుని కొంత కాలము తల్లిదండ్రుల సాయముతో పెంచెను. క్రమముగా నాతని తలిదండ్రులును గతించిరి. కుమారుడు ఏడేండ్లవా డైనంతట ఉపనయన మొనరించి తన వెంట దీసికొని బయలుదేరెను. కుమారిలుడు మరల వివాహ మాడలేదు. జయమంగలమునకు శ్రీకంఠుడు పోదలంచుటకు కొంతకాలముముందే ఇదెల్ల గడచెను. శ్రీదేవి మరణము శ్రీకంఠునికి తెలియదు.

ఇక కుమారిలుడు జైనమతమును నిర్మూలించుటకు కంకణము కట్టుకొనెను. వేదము స్వతస్సిద్ధ మనియు, తదుక్తకర్మమే ఇహపరసుఖప్రద మనియు, కావున వేదోక్త డీశ్వరుడు లేడనియు సిద్ధాంతీకరించెను. వెంటనే ప్రచార మారంభించెను. అప్పుడు మేదినీపురము రాజధానిగా నా దేశమును సుధన్వుడను రాజు పాలించుచుండెను. మేదినీపురమే నేటి మిడ్నాపూర్. ఇది ఒరిస్సా బెంగాలుల నడిమిఎల్లలో నున్నది. జైనులు పలువురు ఆ రాజుయొక్క ఆస్థానము చేరి రాజును జైనమతాభిమానిగామాత్రమే కాదు వైదిక మతద్వేషిగా నైతము చేసియుండిరి. వైదికకర్మలు దేశమున సన్నగిలియుండెను. రాజమహిషిమాత్రము వైదిక మతాభిమాని, విదుషి, భర్తతో వైదికమతప్రాశస్త్యమును గూర్చి వాదించుచుండును. భర్తయొక్క మొండిపట్టుదలకు చాల చింతించి అతనిం ద్రిప్పుటకు మార్గము వెదకుచుండెను.

ఒకనాడు కుమారిలస్వామి మేదినీపురమునకేగి మహారాణియొక్క మేడకు సమీపమున పోవుచుండెను. ఆసమయమున మహారాణి వైదికమతోద్ధరణ మెట్లు జరుగునా యని చింతించుచు నిట్లొక శ్లోకమును చదువ నారంభించెను.

‘కిం కరోమి, క్వ గచ్ఛామి, కో వేదా నుద్ధరిష్యతి’

(ఏమి చేయుదును, ఎట కేగుదును, వేదముల నుద్ధరించువా రెవరు?)

ఆ వాక్యములు వినుచుండిన కుమారిలస్వామి వెంటనే సంతోషముతో గగుర్పాటునొంది—

‘మా నిషీద వరారోహే, భట్టాచార్యోస్మి భూతలే’

(చింతింపకుము తల్లీ, నేనున్నాను భట్టాచార్యుడను.)

ఆ వాక్యములు విని రాణి ఆశ్చర్యపడి కుమారిలుని వెంటనే సౌధమునకు పిలిపించెను. ఆమె యడుగగా నాతడు తన వృత్తాంతమునెల్ల పూర్తిగా వచించెను. అతడు తప్పక జైనుల నోడింపగల డని యామె తలంచి ఆతనికి సకలోపచారములును జరుగునట్లు ఏర్పాటులు చేయించి రాజున కెఱింగించెను.

కుమారిలభట్టాచార్యునకు రాజదర్శన మాయెను. అదిమొదలు రాజసభకు వచ్చుచు పోవుచు అతడు వాదార్థము సమయ మెదురుచూచుచుండెను. ఒకప్పుడు రాజసభలో నాత డుండగా కోయిల దూరమున ‘కుహూ’ అనినది. వెంటనే కుమారిలుడు కోయిల మీది నెపమున నీ శ్లోకమును చదివెను:

"మలినై శ్ఛిన్నసంగ స్తైర్నీచైః కాకకులైః పిక
ప్రతిరూపకనిర్హ్రాదైః శ్లాఘనీయ స్తదా భవేః"

ఈ శ్లోకము రాజునకు అన్వయించెను. నీచులగు జైనులచే రాజు పరివృతుడని యాతని భావమని రాజు గ్రహించెను. అతడు మోము చిన్నబుచ్చుకొనెను. మంత్రులు ఉద్వేగము నందిరి. జైనపండితులకు కోపము వచ్చినది. సభాసదులు గుసగుస లారంభించిరి. అప్పు డొక వృద్ధజైనపండితుడు సభవారిని నివారించి రాజుం గాంచి "మహారాజా, జైనమతము దుష్టమనియు, వైదికమతము అత్యుత్తమమైనదనియు ఈ కుమారిలుడు తలంచి ఆ మాటలు పలికినాడు. అందుచే సభయంతయు కలవరము జెందియున్నది. కాబట్టి ఈ రెండు మతధర్మముల గుణావగుణములను వివాదముపై నిర్ణయింపవలసి నది." అని కోరెను. మహారాజు సుధన్వు డంగీకరించి ఒకనాడు వాదమున కేర్పాటు చేయించెను.

సభ సమావేశమైనది. ఎచ్చటెచ్చటివారును వచ్చి గుమిగూడిరి. ఉభయమతాభిమానులును వచ్చి చేరిరి. అంతవఱ కెచ్చట నుండిరోగాని వైదికమతస్థులు గుంపులుగుంపులుగా వచ్చిరి. తమకు మరల మంచి కాలము వచ్చినదని తలంచిరి కాబోలు. మహారాజు సింహాసనము నలంకరించెను; మహారాణియు వచ్చి చెంత గూర్చుండెను. పిమ్మట కుమారిలభట్టాచార్యుడును వచ్చి మధ్యవర్తుల నెన్నుకొని జైనులలో శ్రేష్ఠుడగు వానితో వాదమున కారంభించెను. "వేదమునందు చెప్పబడిన కర్మములే ఆచరణీయములు; తద్వ్యతిరేకములు త్యాజ్యములు" అని కుమారిలుడు ప్రతిపాదించి ఉపన్యసించెను. "వేదములు పౌరుషేయములు. అందు జెప్పబడు యజ్ఞాదికర్మలు హింసాత్మకములుకావున వేదకర్మములు ఆచరింపదగనివి. అహింసాత్మకములైన జైనధర్మములే ఆచరణీయములు" అని జైనాచార్యుడు ఖండనోపన్యాసము గావించెను.

అందుమీద వివిధశాస్త్రసంబంధములగు వాదములు ఖండనమండనములతో చెలరేగినవి. ఈవిధముగా కొన్ని దినములు వాదప్రతివాదములు జరుగుచునే యుండినవి. ఉభయపక్షములవారి యిండ్లలోకూడ చిన్నచిన్న సభలు జరుగుచు ఒకరి కొక రాలోచనలు చెప్పుకొనుచుండిరి. కుమారిలభట్టాచార్యుని యుక్తి ప్రత్యుక్తులకు ఎల్లవారును ఆశ్చర్యపడుచు జైనేతరు లెల్లను ఈతడు సాక్షాత్తు కుమారస్వామియవతారమే యని యనుచుండిరి. తుదకు జైనపండితులెల్ల ఓడిపోయి తమ పరాజయమును ఒప్పుకొనిరి. మధ్యవర్తులు కుమారిలునికే జయపత్రిక నొసగిరి. జైనులనేకు లాతనికి శిష్యులై వైదికమత మవలంబించిరి. సహింపలేనివారు దూరదేశములకు పోయిరి. సుధన్వమహారాజు వైదికమత మవలంబించి రాణిని సంతోషపరచెను. మహారాణి కుమారిలభట్టాచార్యుని విశేషముగా పూజించి సత్కరించెను. తర్వాత నాతడు జైమినిమహర్షి రచించిన పూర్వమీమాంసాసూత్రములకు ఉపవర్షుడు రచించిన వృత్తి ననుసరించి శబరస్వామి రచించిన ధర్మసూత్రభాష్యములను గ్రహించి తంత్రవార్తిక మను పూర్వమీమాంసాగ్రంథమును రచించెను. అతనికి ప్రభాకరభట్టు, పార్థసారథిమిశ్రుడు మొదలైనవారు శిష్యులై ప్రచారము మొదలిడిరి. దూరదేశముల కేగిన జైను లందఱును కుమారిలుడు గురుద్రోహి యని ప్రచారము మొదలిడిరి.

౪

అద్వైతుల బాధ శ్రీకంఠునకు ఎక్కువ యాయెను. ఇక శ్రీశైలముకడ నుండరా దని తలంచి యాతడు బయలుదేరెను. ఇంతలో జాతూకర్ణీనీలకంఠులు పరమపదించిరి. పద్మపురమునకు పోవనిచ్చగింపక ఉంబాశ్రీకంఠులు కృష్ణా తుంగభద్రాతీరములను వదలి గోదావరీ తీరముపై పు రెండెడ్లబండిలో నడక సాగించిరి. ఉద్యోగికి దూరదేశ మేది! వేములవాడలో నొక చాళుక్యశాఖ పరిపాలించుచుండెను. కాని వారు జైనులు. ఆ రాజుల యాస్థానమున తన కాశ్రయము లభింపదని తలంచి అట నిలువక అడవులు లోయలు కొండలు దాటి వారు బోధనమునకు పోయిరి. బోధనముకూడ వేములవాడ రాజ్యములోనిదే. అచట వారుండగా గోదావరీతీరమునందలి లక్ష్మణావతీనగరము రాజధానిగా ధర్ముడను రాజు పరిపాలించుచున్నా డనియు, అప్పుడు ఆరాజుసభలో బౌద్ధజైనులకు వాదప్రతివాద

ములు జరుగుచున్నవనియు తెలిసినది. వినోదార్థము శ్రీకంఠుడు సభార్యుడై అచ్చటికి పోయెను.

అప్పుడు అచ్చటి పరిస్థితి—బప్పభట్టి యని యొక పండితుడు మహావిద్వాంసుడు గ్వాలియరును పాలించుచుండిన ఆమరాజు నాస్థానమున నుండెను. అచ్చట అతృప్తి జనించి దానిని వదలి దక్షిణదేశమున లక్ష్మణావతికి అతడు వచ్చి ధర్మునికి విద్యాగురుడై అత్యంత ప్రియుడైయుండెను. బప్పభట్టిని మరల కొనిపోనెంచి ఆమరాజు ధర్మునిమీద కెత్తివచ్చి మోసముగా ప్రమాణము చేయించుకొని బప్పభట్టిని మరల కొని పోయెను. తన పండితుని వదలుట కిష్టము లేకపోయినను ధర్ముడు దుఃఖముతో బప్పభట్టిని ఆమునికడకు పంపివేసెను. పండితుడును తన హృదయమును లక్ష్మణావతియందే యుంచి శరీరముతో మాత్రము గ్వాలియరు కేగెను.

ధర్ముని హృదయమున ఆమరాజుమీద క్రోధము పోలేదు. ఇట్లుండగా నొకప్పుడు వర్ధమానకుంజరు డను నొక పండితుడు బౌద్ధుడు ధర్మునికడకు వచ్చెను. అతని బోధవలన ధర్ముడు బౌద్ధుడై తన శత్రువునకు ఆమరాజునకు జాబు వ్రాసెను. 'నీవు మాకు శత్రువర్గములోని వాడవు. నా పండితుని బప్పభట్టిని హరించినావు. ఇప్పుడు మన మిరువురమును యుద్ధమొనరించి జీవహాని చేయుటకన్న ధర్మమార్గమున పందెము వేయుదము. మాకడ నొక బౌద్ధపండితుడు కలడు. ఆయనతో సమానముగా వాదించువా డుండిన పంపుము. నీ పండితుడు ఓడిపోయిన నీ రాజ్యము నాది. నా పండితుడు ఓడిన నా రాజ్యము నీది.'

ఆమరాజు బప్పభట్టిని పిలుచుకొని లక్ష్మణావతికి వచ్చెను. ఆ పండితుల కిరువురకును వాక్కలహము ప్రారంభమాయెను. మధ్యవర్తిగా వారిరువురును వాక్పతిరాజును ఎన్నుకొనిరి. ఈతడు క్షత్రియుడు, పరమారవంశస్థుడు, మహాపండితుడు. ధర్మునికి సామంతుడు. వైదికమతస్థుడు. అట్టి సమయమున ఉంబయు, శ్రీకంఠుడును రాజసభాప్రవేశ మొనరించి వాదములను వినుచుండిరి.

వర్ధమానకుంజర బప్పభట్టిసూరులు ఒకరి కొకరు తీసిపోక ఆరు నెలలు వాదించిరి. వాదములు ఒకప్పటికి ముగియునట్లు లేదు. ఆమరాజు తన కార్యములకు భంగమగుచున్నదని బప్పభట్టిని హెచ్చరించెను. అతడు తన యుపాసనాదేవతయగు సరస్వతీదేవిని ప్రత్యక్షీకరించుకొని ప్రార్థించెను. ఆమె యిట్లనియె—'అబ్బాయీ, బౌద్ధుని నోట అక్షయవచనగుటిక యను యొకటి ఉన్నది. దానిప్రభావమున నతడు అంత వాగ్మిగానున్నాడు. దానిని అతనికి పూర్వము నేనే ఇచ్చితిని. నీ వాతని జయింపగోరిన నతని నోటిని కడిగించి వాదమునకు పిలువుము' అనెను.

రహస్యము గ్రహించి బప్పభట్టి తన పూర్వపరిచితునికి వాక్పతికి ఇట్లు చెప్పిపంపెను: 'పూర్వపరిచయము ననుసరించి నీవు నా కొక ఉపకారమును చేయవలయును. నీవును మునుపు వాగ్దాన మొనర్చియున్నావు. నేడు తరుణము వచ్చినది. రేపు వాదమునకు ప్రారంభించుటకుముందు మమ్మిరువురను నోళ్లను కడిగికొనుట కాజ్ఞాపింపుము.' వాక్పతిరాజు పూర్వము బప్పభట్టి అచ్చట నుండగా నట్టి వాగ్దాన మొనర్చియుండెను. కావున నొప్పుకొనెను. ఇందలి మర్మము నాతడు గ్రహింపలేదు. వాదార్థము వా రిరువురును కూర్చుండగానే, తాను మధ్యవర్తిగాన, నిరువురను పుక్కిలించిరండని వాక్పతిరాజు ఆజ్ఞాపించెను. వెంటనే వా రట్లు చేసిరి. బౌద్ధుని నోటి గుళిక రాలిపోయెను. నా డాతడు ఓడిపోయెను. ఒప్పుకొనిన ప్రకారము ధర్ముడు తన రాజ్యమును ఆమున కొసంగెను. బప్పభట్టియొక్క ప్రార్థనమీద ఆముడు మరల ఆ రాజ్యమును ధర్మునికే ఇచ్చివేసెను. తక్షణమే గ్వాలియరుకు వెడలిపోయెను.

ఈ సందర్భమున శ్రీకంఠునికి బౌద్ధాభిమానము దృఢపడెను. వాక్పతిరాజుతో నంత మిత్రుడై తర్వాత శిష్యుడాయెను. వాదమున నోడిపోయిన వర్ధమానకుంజరుడు ధర్మునితో వాక్పతి ద్రోహ మొనర్చెనని ఫిర్యాదు చేసెను. ధర్మునికి కోపము వచ్చినది. శ్రీకంఠుడు వాక్పతికి ఆ కిటుకు తెలియదనియు, నాతడొనర్చిన సేవచే క్షమింపదగుననియు రాజును ప్రార్థించి వాక్పతిరాజును క్షమింపించెను.

౨

తర్వాత కొన్నాళ్లకు కన్యాకుబ్జమునకు యశోవర్మ ప్రభువాయెను. ఎనిమిదవ శతాబ్దప్రారంభకాలమునకు రాజాధిరాజును, మహాకవియు, నాటకకర్తయునైన కవిబంధువు శ్రీహర్షదేవుడు గతించి దాదాపు అరువదిసంవత్సరములై యుండెను. బాణమయూరాది కవులు గతించి చాలకాలము కాలేదు. కన్యాకుబ్జము శ్రీహర్షునియనంతరము పలువురు సాహసికుల చేత బడి శ్రీకంఠుని కాలమునకు యశోవర్మపాలనమునకు వచ్చెను. కన్యాకుబ్జము గంగానదీతీరమున నేటి ఢిల్లీ నగరమునకు దాదాపు రెండువందలమైళ్లు ఉత్తరమున నున్నది. దానికి దక్షిణమున దాదాపు నూరుమైళ్ళ దూరమున యమునానదీదక్షిణతీరమున కాలప్రియమను సుప్రసిద్ధక్షేత్రము కలదు. ఈ క్షేత్రము నాడు మహోన్నతస్థితియం దుండెను. రాష్ట్రకూటరాజులును కొందఱు ఇచ్చట యుద్ధ మొనరించియున్నారు. యశోవర్మమహారాజు కన్యాకుబ్జమును వదలి కాలప్రియనాథ క్షేత్రమును తనకు రాజధానిగా చేసికొనెను. (ఈప్రదేశమే నేడు కాల్పియనబడుచున్నది.) ఇట్లు చేయుట చేత అతనికి పశ్చిమమునుండి దండెత్తివచ్చునట్టి కాశ్మీరప్రభువు లలితాదిత్యముక్తాపీడుని బాధ తప్పెను.

ఈ యశోవర్మ చంద్రవంశసంజాతుడని యొకరును, మౌర్యసామ్రాట్టు చంద్రగుప్తుని వంశజుడని జైనులును తెలుపుచున్నారు. యశోవర్మ మహాజేత. దేశాంతరములతో వాణిజ్యవిద్యాసంపర్కములు గలవాడు. దూరదేశమైనను చైనాకు రాయబారము పంపెను. బహుశః అతని యుద్దేశము తన సామ్రాజ్యమునకు, చైనాదేశమునకును నడుమ నుండు శత్రువులు తనపై నెత్తివచ్చినయెడల వారిని వెనుకనుండు చీనావారు కొట్టవలయునని యుండును. ఈ రాయబారము క్రీ. శ. ౭౩౧ లో జరిగినట్లు చైనీయుల గ్రంథములలో గలదు. కన్యాకుబ్జాధీశుడైన ఇ-ఛ-ఫ-మొ (యశోవర్మ) తన మంత్రియైన సెంగ్-పో-త (?) అనువానిని చీనాకు పంపియుండెను.

యశోవర్మ ఉత్తరదిక్కున నాపద రానీయక కాపాడుకొని దిగ్విజయ మారంభించెను. వర్షావిరామ సుభగమైన శరదృతువులో బయలుదేరెను. చల్లని మలయమారుతము వీవసాగెను. ఎచ్చటినుండియో పుష్పములవాన కురిసినది. పౌరాంగనలు మహారాజదర్శనోత్సుకలై కిటికీలకడకు వచ్చి చూడసాగిరి. కవులు వందులు సంగీతవిద్వాంసులును తమ కవిత్వస్తోత్రగానములచే రాజు నాశీర్వదించిరి. అతడు క్రమముగా తన రాష్ట్రమును వదలి పర్ణానదీతీరభూములకు వచ్చెను. ఇంతలో చలికాలము వచ్చెను. అటనుండి యాతడు వింధ్యారణ్యముం జొచ్చి వింధ్యవాసినిం గనెను. మహాదేవిని పూజించి బయలుదేరెను. వర్షాకాలము ప్రారంభమాయెను. వింధ్యవాసిన్యాలయము నేటి యు. పి. రాష్ట్రమున మిర్జాపురమున నున్నది. మగధాధిపుడు యశోవర్మయొక్క సేనాసమూహముం గని పారిపోదలంచెనుగాని ధైర్యము తెచ్చుకొని ఎదుర్కొనెను. అతని సామంతులును ఎదిరించిరి. మగధాధిపుడే గౌడుడని కొందఱు కవులు వ్రాసియున్నారు. మహాయుద్ధము సాగగా యశోవర్మ గౌడరాజును రణరంగమున తాకి నఱికెను. అటనుండి బయలుదేరి ఏలాసుగంధభూయిష్ఠంబగు సముద్రతీరభూములకు పోయెను. తర్వాత వంగదేశమునకు పోయి దానిని జయించి అటనుండి లెక్కలేని ఏనుగులను గ్రహించి తర్వాత దక్షిణమునందలి సహ్యపర్వతములకు వచ్చి అచ్చట నొక రాజును జయించెను. తర్వాత పారసీకులను జయించి కవేరులను జయించెను. అటనుండి బయలుదేరి గోదావరీతీరమునందలి రాజులను జయించుచు క్రమమున లక్ష్మణావతికి వచ్చి ధర్ముని జయించెను. ధర్ముని సేనాపతిగా వాక్పతిరాజు ఎదిరింపగా నతనిని పట్టి చెఱవైచెను. అటనుండి పశ్చిమమునకు మరలి పర్వతదుర్గము ప్రదేశములను జయించి నర్మదానదిని దాటి మరు (మార్వాడి) దేశము చొచ్చి శ్రీహర్షమహారాజుచే పావనమైన చరిత్రప్రసిద్ధ శ్రీకంఠదేశమునకు వచ్చెను. అచటినుండి హరిశ్చంద్రునిచే పవిత్రీకృతమైన అయోధ్యానగరమునకు వచ్చి, రాజుల కానుకలు గ్రహించి, దేవదారువృక్షముల రసములచే పరిమళవంతమైన హిమాలయభాగములను కూడ జయించి తన రాజధానికి మరలెను. తాను ముఖ్యముగా జయించిన మగధదేశమందు రణరంగమున యశోవర్మపుర మని యొక నగరమును నిర్మించెను.

(సశేషము)

మాయ ముత్యాలు

'శాస్త్రి'

అమూల్యమైన నవరత్నాలలోనూ ఒకటైన ముత్యము యొక్క జననరహస్యాన్ని గ్రహించి ప్రకృతిసిద్ధమైన ఈ అలంకారవస్తువుకు ఏమాత్రమూ తీసిపోని కృత్రిమముత్యాలను (మాయముత్యాలను) ప్రపంచమంతటా వెదజల్లినవాడు మికిమోటో.

ఇతడు జపానుదేశస్థుడు. చాలా బీదకుటుంబానికి చెందినవాడు. వీధుల్లో తిరిగి చేపలు అమ్ముకొంటూవుండేవాడు. తన 33 వ యేట ఒక సముద్రవస్తుప్రదర్శనం చూడడం తటస్థించింది. అక్కడ ఇతడు చాలా ఖరీదైన ఈ ముత్యాలనూ, అవి తయారగు విధానాన్నీ చూచాడు. సముద్రంలో వుండే ముత్యపుపురుగు (*Oyster*) దేహంలోకి ఒక ఇసుకకణంగాని, లేక ఒక ముత్యపుచిప్పకణంగాని ప్రమాదవశాత్తూ ప్రవేశించి దానికి బాధ కలుగజేస్తుంది. ఈ బాధానివారణకోసం ముత్యపుపురుగు కాల్షియం కార్బనేటు (*Calcium carbonate*)ను అనేకవేల పల్చని పొరలుగా, ఈ సూక్ష్మకణంచుట్టూ స్రవింపజేస్తుంది. ఈ పొరలు క్రమంగా ఘనీభవించి ముత్యము అవుతుంది. సృష్టివైచిత్ర్యం! ఒక చిన్న ముత్యపుపురుగు తన ఆవేదనను అత్యంతలావణ్యమైన ఒక ముత్యంగా మారుస్తుంది!

దైవికంగా జరిగే ఈ పరిణామంలో ముత్యపుపురుగుకు మానవుడు తోడ్పడితే లాభం ఎందుకు వుండకూడదని మికిమోటోకు తట్టింది. వెంటనే అతడు అగో అఖాతానికి వెళ్ళి తన పరిశోధనలను ప్రారంభించాడు. ఇక్కడ సముద్రం ఎక్కువలోతు లేక ప్రశాంతంగానూ, సొరచేప మొదలైన క్రూరసముద్రజంతువులు లేకుండానూ ఉంటుంది. సుమారు పదివేల ముత్యపుపురుగులను పట్టుకొని పురుగుకూ, పురుగుచిప్పకూ మధ్య ఒక్కొక్క ఇసుకరేణువును వుంచి వాటిని మళ్ళీ నీళ్ళలో వదలిపెట్టాడు. కొన్నినెలలతరువాత పరీక్షించి చూస్తే ముత్యాలు తయారయిన సూచన అతడికి ఏమాత్రమూ కనిపించలేదు.

మికిమోటో ఏమాత్రమూ నిరాశ చెందక తన పరిశోధనలు మళ్ళీ ప్రారంభించాడు. ఇసుకరేణువుకు బదులు చిన్నగాజుకణాలూ, ముత్యపుకణాలూ మొదలైనవి పురుగుశరీరంలోని అన్నిభాగాలలోనూ వుంచి, వివిధప్రమాణాల నీటిలోనూ, వివిధ శీతోష్ణపరిస్థితులలోనూ తన పరీక్షలు సాగించాడు.

రెండుమూడుసంవత్సరాలు ఈవిధంగా ఫలశూన్యంగా గడిచింది. ఈ ప్రయత్నాల ఫలితంగా అతడు అప్పులపాలయ్యాడు కాని అతడు ఏమాత్రమూ నిరుత్సాహపడలేదు. దీనికి తగ్గట్టు దురదృష్టవశాత్తు మూడవసంవత్సరంలో ఒక గుంపులోని పురుగులు తప్ప మిగిలినవన్నీ నశించాయి. నిరాశ చెంది ఈ మిగిలిన పురుగుల్ని మికిమోటో, అతని భార్య పరీక్షించారు. కాని ముత్యాలజాడ ఏమాత్రమూ కనుపించలేదు. ఆరుకోజాల తర్వాత ౧౮౯౩ జూలై ౧౧ న అతడి కష్టాలకు ఫలితం కనిపించింది. ఒక పురుగును చంపి చూడగానే దానిలో అర్ధగోళాకారమైన ఒక ముత్యం కనుపించింది. అప్పుడు ఆ భార్యాభర్తల ఆనందానికి మేరలేదు. వెంటనే మిగిలిన పురుగుల్నికూడ పరీక్షించి చూస్తే ఇంకొన్నాల్గు అసంపూర్ణంగా తయారైన ముత్యాలు కనుపించాయి.

వెంటనే మికిమోటో ముత్యాల తయారుపద్ధతి స్వంతహక్కు (*patent*) తీసికొన్నాడు. "టటోకూ" అనే ద్వీపంలో పెద్దలెక్కను నాల్గుసంవత్సరాలు తన పరీక్షలు కొనసాగించాడు. మొదటిసంవత్సరంలో ఫలితాలు అంత తృప్తికరంగా లేకపోయినా తరువాతి సంవత్సరాలలో పంట బాగానే వుంది. ౧౯౦౧ సంవత్సరంలో ఏడవ ఎడ్వర్డుచక్రవర్తి పట్టాభిషేకసందర్భంలో జపాను ప్రతినిధి ఆయనకు కొన్ని మికిమోటో ముత్యాలను బహూకరించి అందరికీ ఆశ్చర్యం కలుగజేశాడు. మికిమోటోకీర్తి నలుదిశలా ప్రాకింది. జపానుచక్రవర్తి ముత్యాలను పండించే ఈ క్రొత్తవిధానాన్ని అతడిద్వారా విని కుతూహలపడి అతనిని తనవద్దకు రావించి గౌరవించాడు.

అయితే మికిమోటో గోళాకారంగల ముత్యాలను పండించడంలో ఇంకా పూర్తిగా ఉత్తీర్ణుడు

కాలేకపోయాడు. ఇల్లా వుండగా ౧౯౦౫వ సంవత్సరంలో అదృష్టవశాత్తూ అయిదు ఉత్కృష్టమైన గుండ్రని ముత్యాలు లభించాయి. ప్రమాదవశంవల్ల ముత్యపుపురుగుమాంసంలో ఇసుకకణాలు ప్రవేశించడంవల్ల దానిచుట్టూ కాల్షియంకార్బనేటు ఘనీభవించి ఈ ముత్యాలు తయారయ్యాయని అతడు తెలిసికొన్నాడు. ఇంతవరకూ ఈ కణాలు పురుగుచిప్పకు మాంసానికి ఉంచడంవల్ల ఈ ద్రవం అన్నివైపులా సమానంగా పేరుకొనడానికి అవకాశం లేక ముత్యాలు అసంపూర్ణంగా అవుతూవచ్చాయి.

దీనితో మికీమోటోకు ముత్యాల రహస్యం పూర్తిగా తెలిసిపోయింది. వెంటనే ఇసుకకణాలు, ముత్యపుకణాలు పురుగుమాంసంలోనే వుంచి తన పరీక్షలు సాగించాడు. ఈ పనికి చాలా నైపుణ్యం కావాలి. కణం చాలా లోతుగా పోతే పురుగు చచ్చిపోతుంది. లేకపోతే కణం బయటికి ఊడిపోయే అవకాశం వుంది. ఈపనికి ప్రత్యేకనిపుణులు అవసరం. పరీక్షలో మొదటి నూరుపురుగులలో ఆరు అత్యంత సౌందర్యమైన ముత్యాలు దొరికాయి.

ముత్యాలను పెద్ద లెక్కను పండించడంలో కృతకృత్యుడు కాగానే, మికీమోటో, ముత్యపుపురుగులు క్రూరసముద్రజంతువుల బారి పడకుండా అనేక మార్గాలను అన్వేషించాడు. సముద్రంలో బ్రహ్మాండమైన తీగెపంజరాలను నిర్మించి వాటిలోనే పురుగులు జాగ్రత్తగా పెరగడానికీ, ముత్యాల పంటకీ ఏర్పాట్లు చేశాడు. పంట ఎక్కువ ఫలవంతంగా వుండే శీతోష్ణస్థితులు, జలప్రమాణాలు మొదలయినవాటిని నిర్ణయించుకొన్నాడు.

అసలు ముత్యాల ధరలో నాల్గవంతు ధరకు మాత్రమే తన ముత్యాలను యూరోపులో మికీమోటో అమ్మడం ప్రారంభించగానే పెద్ద సంచలనం బయలుదేరింది. అసలు ముత్యాలకూ, ఈ తక్కువఖరీదు గల ముత్యాలకూ గల తేడా తెలిసికోవడం చాలా కష్టమయినపని అయింది కొనేవారికి. ఈ తేడా తెలిసికోవడం ఒక్క X కిరణాల సహాయంతోనే వీలుపడుతుంది. అసలు ముత్యాల వర్తకులకు చాలా నష్టం వచ్చింది. వెంటనే వారంతా ఈ క్రొత్తముత్యాలను, వాటిని విక్రయించేవారిని వెలివేశారు. దానితో ఈ తగవు న్యాయస్థానానికి ఎక్కింది. అసలు ముత్యాల వర్తకులు ఈ క్రొత్తరకపు ముత్యాలు నాణ్యమైనవి కావని బుజువు చేయడానికి ప్రయత్నించారు. ప్రఖ్యాత శాస్త్రవేత్తలు చాలా గట్టిపరీక్షలు చేసి ఈ ముత్యాలు అన్నివిధాలా నాణ్యమైనవే నని నిర్ణయించారు. అసలు ముత్యానికీ, ఈ మికీమోటోముత్యానికీగల తేడా వొక్కటే. అసలు ముత్యంలో కేంద్రకణము (*central particle*) స్వాభావికంగా ముత్యపుపురుగుదేహంలో ప్రవేశిస్తుంది. మికీమోటోముత్యంలోని కేంద్రకణం శాస్త్రీయంగా కృత్రిమంగా వుంచబడుతుంది. అంతే. చివరకి మికీమోటోయే గెలుపొందాడు.

తరువాత అతడు ప్రపంచంలోని అన్నిముఖ్య నగరాలలోను తన ముత్యాలను విక్రయించే కేంద్రాలను నెలకొల్పాడు. ఒకానొక కాలంలో ప్రపంచంలో మొత్తం ముత్యాల పంటలో నూటికి ౭౫వంతులు మికీమోటో తన నూతనవిధానంప్రకారం పండించిన ముత్యాలే! ౧౯౩౧వ సంవత్సరంలో అతడు తీసికొన్న స్వంతహక్కుగడువు తీరిపోయింది. వెంటనే అనేకమంది పోటీదారులు ముత్యాలను పండించడం ప్రారంభించారు. వీరిలో చాలామంది అతడివద్ద తరిఫీదు పొందినవారు. కాని వారంతాకూడ చవకరకపు ముత్యాలను విక్రయించడం ప్రారంభించారు. దీనితో మికీమోటో వీరందరికీ పాఠం చెప్పడానికీ, తాను ఉత్తమరకపు ముత్యాలనే విక్రయిస్తానని లోకానికి తెలియజెప్పడానికీ, ౧౯౩౩ సంవత్సరం జూలై ౧వ తేదీన ౭౫౦,౦౦౦ రెండవరకపు ముత్యాలను ఒకగుట్టగా పోసి దగ్ధపటలం చేశాడు!

యుద్ధకాలంలో మికీమోటోవ్యాపారం నీరసించి ఇప్పుడిప్పుడే తేరుకుంటోంది. ఈతడికి ఇప్పుడు ౯౧ సంవత్సరాల వయస్సు. "ముత్యాలహారం ధరిస్తే వ్యాధి నివారణ అవుతుం దన్న నమ్మకం మాట ఎట్లా వున్నా, ఒక్క ముత్యాలహారం బహూకరింపబడడంతోనే స్త్రీకి అన్ని మూలుగులూ పోయి, ఆమె మందహాసవదన అవుతుంది" అంటాడు మికీమోటో!

రాజ జామాత

(గీతికా రూపకము)

శ్రీ శివశంకరశాస్త్రి

●

పాత్రలు:

ఖంఖుడు ...	కాశ్మీర ముఖ్యామాత్యుడు	కజ్జ ...	... అంతఃపురపాలిక
దుర్లభవర్ధనుడు ...	... రాజ జామాత	వసంతలేఖ ...	... ,, ,,
బలాదిత్యుడు ...	... కాశ్మీరమహారాజు	సుగంధ ...	... ,, ,,
అనంగ లేఖ ...	... రాజపుత్రిక	బింబాదేవి ...	... కాశ్మీరమహారాజ్ఞి

రంగములు: శ్రీనగరములోని రాజప్రాసాదమున; కాలపరిమితి ఇంచుమించుగా సప్తాహము. క్రీ. శ. సదవశతాబ్ది.

●

ప్రథమరంగము

(కాశ్మీరమహారాజు బలాదిత్యుని ప్రాసాదములో స్త్రీజనము వసించు భాగము. ద్వారముకడ ఖడ్గహస్తయైన కజ్జ కానబడును. ఇంతలో ఒకప్రక్కనుండి ఖంఖామాత్యుడు మెల్లగా ప్రవేశించి, యిటునటు చూచి, ద్వారము సమీపించును. ఖంఖుడు సంజ్ఞలు చేసి, నిష్ప్రయోజనమని యెంచి, ఉభయపార్శ్వములను పరీక్షించి, కజ్జబాహువు స్పృశించి, మందస్వరములో)—

ఖంఖుడు

కజ్జా, యేటికో కదలవు మెదలవు!
అన్యమనస్కగ నగపడె దేలనో!

నీపాదద్వయి నేలకు దృఢముగ
శంకుకీలితము చాడ్పున దోచును.

ఎప్పటియట్టుల నీవిభావరిని
ఉత్సాహముతో నుండవు కజ్జా!

కారణమ్ము నే గ్రహింపలేనే,
ఏమో తెలుపవ యింతటనైనను?

కజ్జ

దండమ్ము దండమ్ము దయయుంచి వెడలు డీ
సమయాన వేగమే! జామాత! జామాత!

ఖంఖుడు

చాలునులే! నీ చాతుర్యమ్మును
కట్టిపెట్టవలె కజ్జా, యిటుపై.

కజ్జ

భద్రమ్ముగా నేను పాలింపవలెగదా
అంతఃపురస్త్రీల నన్నివేళలయందు?
అసమయంబున మీర లరుదెంచినా రేల?
జాయకడ నుండవలె జామాత-జామాత

ఖంఖుడు

మోసగింపగా మొనయకు మోసీ!
బయలుపడెను నీ పాలననైపుణి!

ఏకడ జనిమెనో మెరుగుదులే: మన
ప్రభుజామాతను పలుకరించితిని.
మార్గమధ్యమున - మరలి రా డతడు
త్వరితముగా నిక ద్వారము తెరపుము.

కజ్జ

అది కాదు స్వామి, మీ రన్ని తెలిసినవారు:
అంతఃపురద్వార మట్టి తెరచుట యెట్లు?

ఖంఖుడు

ఊరక ద్వారం బున్మక్తం బగు
నని యెన్నడు నే ననుకొనలేదే.
పసిడికోలతో బద్ధద్వారము
అనువగు తెరచుట కశ్రమమ్మగనె.

(ముంజేతివలయము తీసి యిచ్చును)

కజ్జ

(నమస్కారపూర్వకముగా స్వీకరించి,ద్వారము తెరచి ప్రక్కకు నిలిచి)

క్షమియింపవలె మహాస్వామి, నరసోక్తులను!
దయతప్పనీయకుడు తమ దాసురాలిపై!

ఖంఖుడు

(ఖడ్గహస్తయైన వసంతలేఖను జూచి లోనికి నాలుగడుగులు వేసి, మృదువుగా)

వసంతలేఖా, వసంతలేఖా!

(ఆమె ముందరికి వచ్చును)

రయమ్మునం జని రాజకుమారికి
నివేదింపవలె నే వచ్చితినని.

వసంతలేఖ

స్వామీ, రాజకుమారిక -
సన్నిధియం దున్నవారో
జామాత,కనుంగొని నే
సత్వరమే మరలి వత్తు.

ఖంఖుడు

ఇదిగో వసంత! ఈ హారము నీ
కంఠమున కలంకారమగు జుమీ!

జామాత లేదు జాయసన్నిధిని,
వచ్చినటులు నే వైళమ తెలుపుము.

(హారము స్వీకరించి, తలుపు తెరచి యామె లోనికిబోవును. అతడు నిట్టూర్చి—)

అంతఃపురమున నడుగు పెట్టుటకు
అనుపదమ్మనను అంతరాయములె.

వసంతలేఖ

(మరలివచ్చి)

కుమారియానతి: కూరుచుండవలె
ఎందులకో, తమ రీస్థానముననె.

ఖంఖుడు

అనంగలేఖకు అనామయమ్మే?
నిజమ్ముగా నను నివారించినద?

వసంతలేఖ

ఆరోగ్యమ్మన ఆవంతేనియు
గోచరింప దేకొరత కుమారికి!

ఇంచుక వేచిన, నిచ్చటికే తా
రయమున వచ్చును రాజకుమారిక.

చూడుడు స్వామీ, సుఖాసీనులై
శిల్పసార మీచిత్రపటమ్మును.

(వసంతలేఖ వెడలిపోవును. ఖంఖుడు చంద్రశిలా వితర్దికమీది చిత్రపటమును రెండుచేతులతో బట్టుకొని ఎదుటి నిషణ్ణకముపై నుపవేశించి, విలోకించుచుండును. అనంతరము రాజపుత్రి అనంగలేఖ పాదధ్వని కానీయక వెనుకనుండి ప్రవేశించి, రెండుచేతులతో అతని కన్నులు మూయును.)

ఖంఖుడు

చెప్పకే చెప్పలే చివురుటాకుకరాలు
కశ్మీరదేశమే కాక యావద్భరత
ఖండసౌందర్యైకకమలాలయా దేవి
కాయమ్ముల ధరియించి కరుణతో నన్నేల
అక్షిగోచర కాక అరుగుదెంచిన దనియె!

(పటమును వితర్దికపై నుంచి, అతడు లేచును. రాజకుమారి అతనిని గాఢాలింగనము చేయును.)

అనంగలేఖ

సప్తాహము భుజబంధన
సౌఖ్యం బెరుగని యీ తను
వెటు కృశించిపోయినదో
యించుక పరిశీలింపుడు !

ఏటికైన నామీదను
ఈరసంబు మీ మనసున
జనియింపగ లేదుగదా ?
సత్యము వచియింపవలయు.

ఖంఖుడు

(మందహాసముతో)

లావణ్యదుగ్ధాబ్ధి లక్ష్మిపై కినుకయా !
నక్రకేతను జీవనాడిపై కోపమా !
రాజకార్యధురంధరత్వమే పలుమారు
నీకు నాకును నడుమ నిలుచుచుండు అనంగ !

అనంగలేఖ

శత్రుఘ్నమాళవుల్ సచివోత్తములు భవ
త్సోదరుల్ బహుకార్యశూరు లున్నారుగా!
వారలైనను కొంతవరకు మీ భారమ్ము
తొలగింపగా నేల తోడ్పాటు చేయరో ?

ఖంఖుడు

సకలవిధమ్ముల సాయము చేయుదు
రిరువురు సోదరు లెల్లకార్యముల.
అయినను క్లిష్టం బవాపనీతి
క్రమమ్ము: స్వయముగ కనుగొనవలయును.

అనంగలేఖ

(చిరునగవుతో)

అవాప మేటికి ? అంతఃపురమును
పరిపాలింపగ ప్రయత్నింపదగు!

ఖంఖుడు

కడు హర్షంబే ! కాని రేనిచే
ఈ యుద్యోగం బిప్పించెదవా ?

అనంగలేఖ

(అతని పెదవులు ముద్దుపెట్టుకొని)

అధికారము మీహస్తగతంబే,
ప్రభు వీవలెనా ప్రత్యేకముగా ?
కాశ్మీరము మీ కరచాలనమున -
నే కద నడచుట నిరుపద్రవముగ ?

ఖంఖుడు

అనుదినమ్మవలె అంతర్గృహమున
కరుగుదెమ్మనక ఆపితివే యిట ?
మోదముతో నీ మూడుయామములు
నీతో గడపగ నే నరుదెంచితి.

అనంగలేఖ

కడపవచ్చు - గడపవలయు :
కాని అంతరాయ మిపుడు
తల్లిరూపు దాల్చి రేయి
దాపురించె, నేమి చేతు !

ఎన్నడు నా మందిరమున
కిట్టివేళ రానియామె
పడిపోయినయట్లు వచ్చి
బయలుదేరకున్న దకట !

ఖంఖుడు

ప్రేమ కలది నీమీదను
బింబాదేవి శాంతమూర్తి
వార్ధకమ్మునందుగూడ
వరవర్ణినియే సుమ్మీ !
జనయిత్రికి నీమీదను
సంశయమ్ము లేదుకదా ?
అంతఃపురపరిచారిక
లామెతోడ జెప్పరుకద ?

అనంగలేఖ

అమ్మకు నామీద నెట్టి
యనుమానము లేనెలేదు,
అనుమానము కలుగుగాక,
అవంతయు భయము లేదు.
ప్రాణమ్ములమీది యాశ
పరిత్యజించికాని యిచటి
పరిచారిక యెవతె కూడ
పరులతోడ మాటాడదు.

శంఖుడు

కక్ష్య విడిచె నేమొ రాణి
కనుగొమ్మని యాజ్ఞయిమ్మ
హేతు వేమొ బింబాదేవి
యీ రాతిరి యరుదేరగ ?

అనంగలేఖ

మరి యే మున్నది - మాతృప్రేమము
ఊరక పొంగుచునుండు పాలవలె !

శంఖుడు

అనురాగము గల దగుటంజేసియె
అవరోధము లే కాటలు సాగుట.

(మృదువుగా చెక్కిలిపై తట్టును)

అనంగలేఖ

ఓసి సుగంధా, ఒకమా రిటురా !
జనని యున్నదో చన్నదో చూడుము.

(కరవాలము కటిబంధమున దాల్చియున్న సుగంధ ముందరికి వచ్చి, నమితయై, వెడలిపోవును. ఇరువురును ఏకనిషద్యపై గూరుచుందురు.)

శంఖుడు

(పటముతీసి)

అనంగ, చిత్రము కనంగ కనంగ
కనుంగవం గడు కనంబడుఁ గళ.
ఎవండు పటాన నవాద్భుతమ్ముగ
నజీవమూర్తిని సృజించినాడో !

అనంగలేఖ

వచ్చుచున్నది జన్మవాసరోత్సవ మింక
నాల్గునాళులలోన నాకొరకె జనయిత్రి
చిత్రకారునిచేత చేయించినది నిన్న.
శిల్పాణాభిఖ్యుండు చాల యోగ్యుడు, వర్ణ
చిత్రలేఖనమందు సిద్ధహస్తుం డంట
మూడురోజులలోన ముగియించినాడు నా
కట్టెదుటనే చిత్రకారుండు లేఖనము.

శంఖుడు

కూర్చుంటివా ప్రియా, కుదురుగా సుఖముగా
ఆతండు చిత్రించు నన్నిగడియలుకూడ ?

అనంగలేఖ

శ్రమము తోపగనీక చతురోక్తులం బల్కి
చల్లగా చిత్రించె చాటుకారుడు శిల్పి.

శంఖుడు

పంపగలవా ప్రియా, పటము మా భవనమున
కొకసారి భద్రముగ నుదయకాలమునందు ?
అస్మద్భవనసీమ కరుగుదెంచును శిల్పి
ప్రాతస్సమయమందె ప్రతిరూపము లిఖింప.

అనంగలేఖ

ప్రతిబింబమే నాకు పంపి, మీరలు దీని
గుప్తమ్ముగా నుంచికొనవచ్చు మీకడనె.

(వక్రముగా జూచి)

అయిన నే నిజముగా అందముగ నున్నాన?
తరిగిపోవుట లేద తపనీయవర్ణమ్ము?

శంఖుడు

(ఆమె సంకపాలిని శేర్చుకొని)

పదియారు వన్నియల పసిడివిగ్రహమేని
ఏనాటి కానాడె యెక్కించినను మెరుగు
క్రమముగా క్రమముగా కళలు గోల్పోవచ్చు
కాని తావకవపుర్గాంగేయదీప్తిలో
లవమైన తరుగునే లావణ్యదేవతా !

(అనోక్షవాక్యాలింగనము)

అనంగలేఖ

మెరుగెక్కెనో యేమొ మీ దీర్ఘదోర్దండ
కమణమ్ముచేత నా గాత్రచామీకరము.

(లజ్జాభినయము)

ఖుంఖుమ

గుప్తమ్ముగా నుంచుకొమ్మంటి వేళ నీ
చిత్తరువు మాయింట శృంగారదేవతా !
బహిరంగముగనె నా పడకటింటను పటము
తగిలింతు కుడ్యమున తల్పమున కెదురుగా.
కనులుమూసినభవత్కమనీయవిగ్రహము
గోచరించును తలచుకొన్నంతమాత్రాన.
అయిన నేత్రోత్సవం బగుగాక నిరతమ్ము
ప్రత్యక్షముగ చిత్రపటములో నీ రూపు.
సతత మొసగునుగాక సౌందర్యసముదాయ
సారదైవతమూర్తి సాంద్రప్రమోదమ్ము !

అనంగలేఖ

ఊరకే అన్నాను : ఉండనిం డెదురుగా
శయ్యాగృహమునందె సకియచిత్రపటమ్ము.

సుగంధ (ప్రవేశించి)

కూరుచున్నవారు దేవి
కునుకుపాట్లు పడుచు, నన్ను
అడిగినారు రాకుమారి
అరుగుదేర లే దేమని.

అనంగలేఖ

శీఘ్రముగా వత్తుననియె
చెప్పి మాతతోడ, నీవు
భద్రముగా తత్కవాట
పార్శ్వమ్మును గాచుచుండు.

(సుగంధ నతశిరస్కయై వెడలును)

నాకు చెప్పకుండ మీరు
జన్మవాసరోత్సవమ్ము
చూడగ నేతేరవలయు
శుద్ధాంతములోని కార్య !

ఖుంఖుమ

బహిరంగముగ నాకు బంపుచో నాహ్వాన
మెన్నికార్యములున్న నేతెంతు ధ్రువముగా.

అనంగలేఖ

ఆదరమ్ముతో నాహ్వానించును
జనపతి మిమ్ముల స్వయముగ శీఘ్రమె.
ఉత్సవమ్ము మీ రుండక యెట్లగు
శోభావంతము శుద్ధాంతములో ?

(మందహాసము చేసి, ఏదో వాసన పట్టి)

మాటలసందడి మరచితి - నెచటిది
మీ శరీరమున మృదుపరిమళము ?

ఖుంఖుమ

పంపినాడు సామంత
ప్రభు వొకండు; తావకీన
కంచుకమ్ము వాసించును
గాక రేపు యామవతిని.

(వక్షము నిమురును)

అనంగలేఖ

అపనయింపగా శ్రమమ్ము
ఆసవమును తెప్పింతున ?

(అతడు తల త్రిప్పును)

మరచినాను బ్రాహ్మణు లను
మాట ! నన్ను క్షమియింతుర ?

ఖుంఖుమ

అధరామృతమును మించిన
ఆసవమ్ము కలదె ప్రియా !

అనంగలేఖ

(లజ్జాహాసములతో)

కలదుగదా యెక్కించుక
కాలవిలంబము దానికి.

ఫలరసమ్ము, హిమఖండము,
పానీయము తెప్పింతువ ?

(మృదువుగా ఘంటారావము వినబడును)

అబ్బబ్బా ! ఏమికర్మ,
మనమయమ్మునందు వచ్చు
పానకమ్మునందు పుల్ల
పగిదిని జామాత యిటకు !

(ఇంచుక కోపముతో)

తెరవవలదు ద్వారసీమ
తెల్లవారువరకు నటనె
నిలువనిండు ! కాకున్నను
నిజకత్యకు బోవనిండు.

ఖంఖుడు

అన్యాయము! జామాతను
అంత బాధపెట్టవలదు.
నేన వెడలిపోదును లే—
నేటికి తప్పదు విఘ్నము !

అనంగలేఖ

వీలు లేదు స్వామి, వెడలి పోవరాదు.
నేడు మీర లిటనె నిద్రచేయవలయు
ఇచట నున్న మీర లెవ్వ రేమిచేతు,
రదియు చూడవలయుఅచిరముగనె స్వామి!

ఖంఖుడు

ఇపుడు నన్ను జామాత
యిచట వీక్షించునేని
సరసముగా నుండ దన్న
సంశయమ్ము ప్రియతమా !

అనంగలేఖ

ఇటు రా సుగంధ ! ఈ భవనములో
స్వామికి సపర్య సలుపుచుండవే.

(పార్శ్వద్వారము తెరచి, సుగంధ లోనికి పోవును; ఖంఖుడును లోపలికి జనగానే తలుపు మూయును. ఆవల అనంగలేఖ వేరొక ద్వారార్గళము తీసి, వచ్చి, నిషద్యపై పరధ్యానముగా నుపవేశించును. మూడుమారులు తలుపుతట్టి జామాత మెల్లగా ప్రవేశించును)

దుర్లభవర్ధనుడు

ఏకాంతముగ ప్రియా, ఇచట గూర్చున్నావు
ఏదో యాలోచించు చేకాగ్రదృష్టితో.

అనంగలేఖ

ఆకస్మికమ్ముగా నరుగుదెంచినవార
లెటనుండి ! ఆదిలో నెచటి కేగినవారో ?

దుర్లభవర్ధనుడు

(భార్యకెదురుగా గూరుచుండి)

ప్రాణప్రియా, రేయి పట్టనంబున గడప
బయలుదేరితి తొలుత: పథములో నీమీద
బుద్ధి మరలగ, నంతిపురమునకె వచ్చితిని.

అనంగలేఖ

(నిరుత్సాహముగా)

పురములోనికి మీరు పోవుటే సముచితము!
మార్గమధ్యములోన మరలె నాపై మనసు !
ప్రణయమూర్తులు గాన భార్య జ్ఞప్తికివచ్చె!

దుర్లభవర్ధనుడు

క్షమియింపుము ప్రాణేశ్వరి !
సత్యమె వచియించువాడ
గ్రహియింపగలేవు నాకు
గల యనురాగము నీయెడ.

ప్రొద్దుపోయెె ప్రాణప్రియ !
పోవుదమా యింకనైన
శయ్యాసదనములోనికి !
చాల ప్రొద్దుపోయినదే !

అనంగలేఖ

మనసు మరలినయపుడుమాత్రమే కావలయు
స్త్రీయ! ఎంతటి రసికశేఖరుల్ తమ రార్య!

అయిన నా కది యేల—అస్వస్థముగ నున్న
దిపుడు, నను బాధింప కేగవలయును వేగ!

దుర్లభవర్ధనుడు (సంభ్రమముతో)

అయ్యయ్యో, నీ శరీర
మస్వస్థముగా నున్నద ?
ఇటు తిరుగుము, చూడనిమ్ము,
ఏదీ యొకసారి ప్రియా !

(ఆమె దేహమును పరిశీలించును)

అనంగలేఖ

ఊరకున్న జాలు ! నాకు
ఉపచారము చేయవలదు.
తాము నన్ను బాధింపక
దయచేయుడు శీఘ్రముగా.

దుర్లభవర్ధనుడు
(పటము చూచి, చేత బట్టుకొని)

నీ ప్రతిమూర్తిని నిరతము కన్నుల
యెదుట నిలుపుకొననిత్తువ ప్రియతమ !

అనంగలేఖ

జనని ప్రేమతో జన్మవాసరపు
బహుమానముగా పటము నొసంగును.
అయినను, మీ రిది అనవరతమ్మును
వీక్షించెదునెడ విసువు జనించును.

(శిరము పట్టుకొని)

వేచుచునున్నది వేదన శిరసును !
పంపుడు పోవుచు పరిచారికలను.
శుభస్వప్నముల సుఖనిద్రం గని
ప్రొద్దెక్కగ మీ పునర్దర్శనము !

(దుర్లభవర్ధనుడు మందమందముగా వెడలి పోవును. అనంగలేఖ కొంచెముతడవు శాంతముగా నుండి, మృదువుగా ఘంటానాదము చేయును. సుగంధ ప్రవేశించును. మందస్వరముతో దానిని దగ్గరకు పిలిచి—)

అనంగలేఖ

జామాత చనినట్టి జాడలు చూచి
జాగరూకతతోడ జననిని గాంచి
శయ్యాగృహమ్మును సజ్జీకరించి
వచ్చి, నాతో జెప్పవలయు సుగంధ !

(సుగంధ నిష్క్రమించును. ఇంచుక తడవునకు పార్శ్వకక్ష్యనుండి మెల్లగా నీవలకు వచ్చి రాజకు మారిభుజములపై చేతులుంచి—)

ఖంఖుడు

మంచిమాటలతోడ మరలించినావె
జామాత నాత్మీయసదనమ్ము దెసకు ?

అనంగలేఖ

ఈయామవతియందు నింక నేలాటి
అంతరాయము లేక ఆనందమొదవు.

(ఉభయులు కూర్చుందురు)

ఖంఖుడు

దుర్లభవర్ధను దోషమ్ము లేదు:
యౌవనమ్ము బలమ్ము నందమ్ము కలవు,
అదికాక యోగ్యుడే - అంత విరక్తి
ఈతనిపై నీకు నేటి కనంగ ?

అనంగలేఖ

భరియించువాడైన భర్త కావలయు:
ఈతండు నను భరియించుచున్నాడె !
భర్తృభావమె నాకు బహుకంటకమ్ము—
ఓర్వజాల నిరోధ మొక్కింతయేని.
ఇంపుగా లేదు నా కీయనయభిధ !
యోగ్యుడైనంత నే ఒరిగిన దేమి!
తండ్రి యేలనో, రాజతనయుండు కాని
వానికి నన్నిచ్చి వంచించినాడు.

ఖంఖుడు (కౌతుకముతో)

నచ్చినదా ప్రియా, నా పేరు నీకు !
అతిమధురమ్మె ఈ యక్షరద్వయము ?

అనంగలేఖ

పెద్దలు పెట్టిన పేరు - మీరేమి
చేయుగలుగుదురు - మీ స్థితిగతుల్ వేరు.
కాశ్మీరభూమి మీ కరబదరంబు.
బహుశక్తిమంతులౌ బ్రాహ్మణోత్తములు.
నిండుహర్షమొసంగు నేను మీదాన
ననియెడి తలపు నా యంతరంగమున !

(గాఢాలింగనము)

(పరిసమాప్తము)

చివరి అంకం

[కథానిక]

శ్రీ పంతుల శ్రీరామశాస్త్రి

'సంప్రదాయం' అనే సరికొత్త సాంఘిక నాటకం; చివరి అంకం స్టేజిమీద జరుగుతూంది. రిజర్వుడు క్లాసులో కూర్చొని అంతసేపూ అతితన్మయత్వంతో చూస్తున్న సన్యాసిరావుకు నాటకంలోని పాత్రలు, సంఘటనలు వీటిమీద మనస్సు నిలవడం లేదు. తన గతజీవితమూ, ప్రస్తుత పరిస్థితీ, భావికార్యక్రమమూ ఇవన్నీ ఒకదానితో ఒకటి పెనగొని, కలతపెట్టడంవల్ల చివరికి ఎట్టఎదురుగా ఏమి చూస్తున్నాడో కూడా గమనించని స్థితిలోకి వచ్చేడు సన్యాసిరావు. తెరపడిపోవడం, నలుగురూ లేవడం, అంతతో తనూ లేచేడు. అంతేకాని, ఆరంభంలో అంత ఉత్సాహంతో, అభిమానంతో చూడడం ఆరంభించిన నాటకం ఏవిధంగా సాంతమయిందో సరిగా తెలియలేదు, సన్యాసిరావుకు. అయితే చివరి అంకంలో అంత రభసంగా అందరు కొత్తపాత్రలను ప్రవేశపెట్టి, అన్ని పరస్పరసంబంధంలేని సంఘటనలు కిట్టించడం నాటకరచనదృష్ట్యా గొప్ప పని అయితే కావచ్చును గాని, తనకుమటుకు అట్టే రుచించలేదనుకొని, ఈ మాటే నాటకకర్త, తన బాల్యమిత్రుడు సత్యనారాయణకు రాయాలనుకొన్నాడు, హాలులోంచి బైటికి వస్తూ. ఆమాత్రం ఈమాత్రం అశ్రద్ధగా ఉంటేమాత్రం నాటకకథ అందరికీ తెలియవద్దూ? ఇంతకూ నాటకం చూడడానికి వచ్చేవాళ్లు ఏదో నాటకం చూసి కులాసాగా కాలం గడుపుదామని వస్తారుగాని, లెక్కల తెలివితేటలూ, శుష్కతార్కికజ్ఞానమూ ఉపయోగించి బుఱ్ఱచించుకుందుకు రారుకదా! ఇవి అతని ఊహకు దాపుకఱ్ఱలు. ఇంతా తను అశ్రద్ధగా ఉన్నాడన్న విషయాన్ని ఒప్పుకొందుకు తన మనస్సుదగ్గర పడే మొగమాటం.

కాని నాటకంమాత్రం తన పనిని సన్యాసిరావుమీద అద్భుతంగా చేసిందనాలి. ఎంచేతంటే నాటకం చూడడం అన్నదే సన్యాసిరావు పద్ధతికి చాలా వ్యతిరేకమయిన సంగతి. ఈ పదేళ్లమధ్యనూ అతను నాటకాలకు అసలే వెళ్లలేదు. సినీమాలకుకూడా వెళ్లినది లెక్కగా ఏ అయిదారుమార్లో; అదీ ఇతరుల బలవంతం మూలంగానే. వాటిలో చూసినదిగాని, విన్నదిగాని అతనిని అట్టే ఆకర్షించలేదు. అటువంటి మనిషి ఈ నాటకంకోసం మూడునాలుగు రోజులు ముందుగా ప్రకటన చూసినప్పటినుండి, ఎదురుచూడసాగాడు. అయితే ఆ ఎదురుచూడడం నాటకం చూడాలన్న కుతూహలంచేతకంటె అది రాసినవాడు తన బాల్యమిత్రుడన్న కారణంచేత కావచ్చును. పైగా ఎవళ్లో అన్నారు—కవిగారుకూడా నాటకం ట్రూపుతో వచ్చి స్వయంగా డైరెక్టుచేస్తారని. బహుశః తానీఊళ్లో ఉన్నాడని వాడికి (కవికి) తెలియకపోవచ్చు. అయితే తాను నాటకం ట్రూపు బసదగ్గరకువెళ్లి, తీరా వాడు వచ్చేడో లేదో, ఊరికే తాపత్రయపడి, నలుగురినీ అడిగి, నేను ఫలానా అని చెప్పుకొని, అతనితో మాట్లాడవలసిఉందని చెప్పుకొనేకంటె, లక్షణంగావెళ్లి టిక్కట్టుతీసుకొని ముందువరసలో కూర్చొని నాటకం చూడడం మంచిది. ఈలోగా అతను వచ్చేడో లేదో తెలుస్తుంది. కాక, ఈలోపున అతనే తనను చూస్తే పలకరించడానికి సావకాశం కూడా కలగవచ్చు. లేకుంటే తను సామాన్యంగా నలుగురితోపాటు నాటకం చూసి వచ్చేస్తాడు. ఇది అతని ఏర్పాటు. చివరికి అదే మంచిదనిపించింది. నాటకారంభంలోనే ఎవరో నటకుడు వచ్చి చెప్పేడు—"సామాన్యంగా కవిగారు వచ్చి డైరెక్టుచేయగా ఆడడం మా పద్ధతిగాని, ప్రస్తుతం వారికి శరీరంలో అస్వస్థతగా ఉండడంవల్లనూ, అన్నవాటికి ఎన్ని అవాంతరాలువచ్చినా నాటకం ఆడితీరాలి అన్నది మా ప్రధాననియమం కావడంవల్లనూ మేము నాటకం ఆపుచేయకుండా ఆడుతున్నాం. ప్రశాంతంగా ఉండి, మధ్యమధ్యను పాతఅలవాటుచొప్పున వన్సుమోరులనకుండా ఉండవలసిందని మా ప్రార్థన."

ఇంటికి వస్తుంటే దారిలో నడక దానంతటదే తొందరయింది. మనస్సుకూడా ఒక్కమారు ఈపదేళ్ల అనుభవాల సీరసాన్నీ చిరిగిన కోటులా విడిచి, అతి ఉత్సాహవంతమై ఉద్రేకభరితమై పనిచేయసాగింది. ఆలోచనల్లోపలి ప్రవాహంతో సంబంధం లేని వెలుపలి మనస్సు, నాటకం రెండవ అంకం ఆరంభంలో నాయిక పాడిన 'మనసుకే కనుగప్పి, మధ్యపరచ ఫలిత మేమి?' అన్న పాటను ఈలపాట పాడిస్తూంది. ఆవిధంగా ఒక యాభైగజాలు నడిచేవరకూ తనవంటి తనుమనిషి అంత రాత్రిప్పుడు రోడ్డుమీద ఈలపాటపాడడం అసందర్భం అన్న విషయాన్ని గుర్తించలేకపోయింది అతని మొత్తం మనసు.

పాట మానిన దగ్గరనుంచీ అడుగులు మరీ తొందరగా పడసాగాయి.

ఇంకా తను రెండిళ్ల అవతల ఉండగానే పెంపుడు కుక్క 'మేరీ' లేచి, అట్టే గొడవ చెయ్యకుండా నెమ్మదయిన గొంతుతో పలకరించింది. ఇంతరాత్రిప్పుడు తను ఎక్కడికీ వెళ్లడం, రావడం దానికి అలవాటయిన సంగతి కాదు. అందువల్ల తను తిరిగివచ్చే పర్యంతమూ అది మేలుకొనే ఉంది కాబోలు.

మెట్లెక్కుతూ ఉంటే నౌఖరు సీతన్నకి తెలివి వచ్చింది. 'బాబొచ్చినారా?' అన్నాడు.

సామాన్యంగా వీధిలోంచి రాగానే మేరీతోనూ, సీతన్నతోనూ ఏవో కబుర్లుచెప్తూ కాలక్షేపం చెయ్యడం అదివరకు మామూలయినపద్ధతి. కాని నాడు మాత్రం చాలా రాత్రయిందని కారణం చెప్పుకొని, ఏమీ మాట్లాడకుండా బట్టలు మార్చుకొని, మంచినీళ్లు తాగి, డాబామీదికి వెళ్లిపోయేడు. బాబుగారికి బాగా నిద్రవస్తూన్నది కాబోలు, ఏమీ మాట్లాడలేదను కొన్నారు మేరీ, సీతన్నాను. కొద్దిసేపటిలో సీతన్న గుఱ్ఱుపెట్టసాగాడు. ఆ అలవాటయిన శబ్దపు లాలిపాటతో మేరీకి కూడా నిద్రవచ్చింది.

కాని సన్యాసిరావుకు మాత్రం నిద్రపట్టే సూచనలేమీ కనబడలేదు. ఏదయినా పుస్తకంతీసి చదివితే నిద్రవస్తుందేమో నని దీపం పెద్దది చేసేడు. కాని టేబిలుమీదనూ షెల్ఫులోనూ ఉన్న పుస్తకాలలో ఏదీ మనస్సును అరికట్టగలిగేది ఉన్నట్టు రూపించలేదు. మళ్లీ దీపం తగ్గించి, గట్టిగా కళ్లుమూసుకొని, తనను నిద్రకు దూరం చేస్తున్న ఆలోచనలను అరికట్టాలని, ఒకటి రెండు మూడు నాలుగు అని లెక్కపెట్ట సాగాడు. కాని నలభైఅయిదుప్రాంతంలో సూత్రం తెగిపోయి, నాటకం నాలుగవ అంకంలోని సంఘటనలలో తానయితే ఏవిధంగా వ్యవహరించేవాడు అన్న ఆలోచనలోకి దూకింది మనస్సు. కొంతసేపటికి, ఇప్పుడీ గొడవ ఎందుకు, అనవసరం, నిద్రపోవడం మంచిదని, మళ్ళీ తన అంకెల లెక్క మొదలుపెట్టేడు. కాని, ఫలితం ఎప్పటిదే. సగంలో వరస తెగిపోవడమూ, ఏదో రావ ద్దనుకొన్న ఆలోచన మనఃప్రతిబింబమీద ప్రతిఫలించడమున్నూ. నిద్రకోసమని చేసే ఈవిధమయిన నిష్ఫలప్రయత్నాలతో అటూ ఇటూ మంచంమీద దొర్లుతూ సుమారు ఒకగంట గడిచిన తరవాత, తనలోని నాటకాన్ని గూర్చిన ఒక క్రమాన్ని అనుసరించని అభిప్రాయాలే ఈ యావదశాంతికీ కారణ మని, లేచి, వెంటనే తన అభిప్రాయాలు మిత్రుడు సత్యనారాయణకు తెలియజేస్తే కాస్త తృప్తిగా ఉంటుందని మళ్లా దీపం పెద్దదిచేసి, కాగితం కలం తీసి ఆరంభించేడు.

ఒకప్పుడు విద్యార్థిదశలో నాలుగుసంవత్సరాలు జన్మజన్మాలకూ విడదు మన స్నేహం అన్నట్టుగా ఉండి, తరవాత సుమారు ఒక పుష్కరంకాలం కలుసుకోకుండా, ఉత్తరాలయినా రాసుకోకుండా ఉన్న మిత్రులలో, హఠాత్తుగా ఒకరు రెండవవారికి ఉత్తరం రాయాలంటే ఎన్నెన్నో అనుమానాలు వస్తాయి ఎంతటివారికయినా. ఏది రాసినా ఎంతో పేలవంగానూ, అతి సామాన్యవ్యావహారికపద్ధతికి అనుగుణంగానూ మాత్రమే రూపిస్తుంది. కాని, రాయా లనుకొన్న తరవాత మాత్రం ఊరుకోందుకు మనస్కరించదు. నాలుగయిదు కాగితాలమీద కొద్దికొద్దిగా రాసి, అసలు ఆరంభమే ఇష్టపడక చిత్తుకాగితాల డొక్కులో పడేసి, ఇక నిది కాదని, ముందు, నిష్పాక్షికంగా, ఏమీ సంబంధంలేని విమర్శకుడు రాసినట్లుగా 'సంప్రదాయం' నాటకం మీది తన అభిప్రాయాల్ని రాసి, అందుతో కలిపి, సత్యనారాయణను ప్రశంసిస్తూ, పూర్వమైత్రిని జ్ఞాపకం చేస్తూ ఒక చిన్న ఉత్తరం రాయాలనుకొని, విమర్శన ఆరంభించేడు.

సన్యాసిరావు ఉత్తరం రాయడం అంటే, అలా కొంతసేపు విసుగుకోకుండా రాస్తే సాంతంచేసే వాడేమోగాని, విమర్శన రాయడం ఆరంభించడంతో

మరీ చిక్కయిపోయింది. ఒక చిన్న సంగతి చెప్పాలని ఒక వాక్యం రాసేసరికల్లా, అందుకు ప్రతికూలంగా ఎన్నెన్నో ఉద్దేశాలు అహమహమికాభావంతో పొడుచుకొని రాసాగాయి. తనకు లోలోపల అనుమానానికి తావు లేకుండా నిశ్చయంగా ఉంటున్నట్టు అదివరకు తోచిన విషయాలే, కాగితంమీదికి వచ్చేసరికల్లా ఏమిటో తనకు తెలియని, తన ఇష్టంతో అట్టే సహకరించని కొత్త సంగతులలాగే కనిపించసాగేయి.

కావాలని ప్రయత్నం చేసినంతసేపూ రాక పోయినా, అతని విమర్శనా, ఉత్తరమూ పూర్తి కాకుండానే నిద్ర వచ్చింది. ఎలా కుర్చీలోంచి లేచి వెళ్లి మంచంమీద పడుకొన్నాడో అతని కేమీ తెలీదు.

రోజూ ఉదయం సీతన్న వేణ్ణీళ్లు కాగబెట్టి, లేపేపర్యంతం లేవడం అలవాటు లేని సన్యాసిరావు ఆ రోజున, అందులోనూ తొలినాటిరాత్రి సరిగా నిద్ర లేకపోయికూడా అంత వేగంగా లేచి ఉండడం సీతన్నకు ఆశ్చర్యం కలిగించింది.

అతిత్వరగా స్నానం ముగించేసుకొని, సీతన్న కాఫీ తెచ్చేలోపున, కలవర్జీ రాసేసి, "సీతన్నా, తక్కిన పనులు తరవాత చేద్దువుగానిలే, ముందిది పట్టుకొనివెళ్లి రంగనాథం (ఆఫీసరు)గారి కిచ్చేసిరా" అన్నాడు.

కొన్ని సంవత్సరాలుగా ఏడాదికి రెండుమార్లు తద్దినాలకు తప్ప సెలవుపెట్టని సన్యాసిరావు సెలవు పెట్టడం సీతన్నకు ఏమీ బోధపడలేదు. ఆరోజు ఏమీ తద్దినంరోజు కాదే. రెండు తద్దినాలూ చైత్రమాసంలో వారంరోజుల వ్యత్యాసంతో వస్తాయి. వాటికి ముందు చాలా ప్రయత్నం చేస్తారు బాబుగారు. వంట బ్రాహ్మణ్ణి తెప్పించడం, బజారుసామాన్లు తేవడం మొదలయిన తంతు చాలా ఉంది. కాక, కాఫీ తాగేసేరు కూడా. ఏమో ఒంట్లో బాగుండడంలేదేమో! మామూలుగా ఉన్నట్టే ఉన్నారే......ఆ యీ అనుమానా లన్నీ ఆ ఒక్క క్షణంలోనూ సీతన్న మొగంలో ద్యోతకమయేయి.

"మరేం చికాకు లేదు సీతన్నా. వెళ్లి అది ఇచ్చేసిరా. ఇవాళ ఏమిటో ఆఫీసుకు వెళ్లా లని లేదు. కాక, వేరే కొంత చెయ్యవలసిన పని ఉందిలే. దార్లో వస్తున్నప్పుడు హోటలులో భోజనం మామూలుగా తొమ్మిదిగంటలకు కాకుండా పదకొండుగంటలకు పంప మని చెప్పడం, ఒక నాలుగు ఇడ్డెన్లు, ఒకదోసె, రెండు కిల్లీలు తీసుకొనిరావడం చెయ్యాలి. ఇందు, రూపాయి. ఆఁ, దారిలో పోస్టాఫీసులో ఒక రెండు కవర్లు కూడా తీసుకొనిరా, వెళ్లు" అని, అదివరకే తను టేబిలుమీద తీసిఉంచిన ఫైల్సు తిరగవెయ్యడంలో పడ్డాడు.

ఉత్తరాలన్నీ ఒక గుత్తం (ఫైలు); మనియార్డరురసీదులన్నీ ఇంకొక ఫైలు. తన జాగ్రత్తకు తనకే ఆశ్చర్యం వేసింది సన్యాసిరావుకు. మొదట్లో సత్యవతి ఒక ఆరు నెలలు మనియార్డర్లు తీసుకోలేదు. అవన్నీ తిరిగివస్తే తానే సంతకంచేసి తీసుకొన్నాడు. అదే ఇంకొక వెధవయినా అయితేనా ఆ కారణం చెప్పుకొని తరవాత డబ్బు పంపడం మానివేసి ఉండును. తాను కాబట్టి...తరవాత ఒకపది సత్యవతిసంతకాలతోనే ఉన్నాయి. అక్కడనుండీ, ఆమె తనతరఫున తీసుకోవచ్చని చెప్పింది కాబోలు, బావమరది వెంకట్రావు సంతకాలతోనే ఉన్నాయి తక్కిన రసీదులన్నీని. అలా కొంతసేపు కొత్తగా అక్షరాలు చదవడం నేర్చుకొన్న కుఱ్ఱవాడు ఎదురుగా కనిపించినవన్నీ చదవడానికి ప్రయత్నించినట్లుగా చదవసాగేడు పోస్టుముద్రలనూ, తను రాసిన విలాసాలనూ. ఇన్ని సంవత్సరాలు నెలకొకటిచొప్పున రాసిన కాగితాలలో కూడా తన దస్తూరీగాని, ఉపయోగించిన సిరాగాని ఏమీ మారకపోవడాన్ని గమనించి గమనించి, ఇకమరి ఆలస్యం చెయ్యడం లాభంలేదని ఉత్తరాల ఫైలు తీసేడు. మొదట్లో అతని ఉద్దేశం సీతన్న తిరిగివచ్చే పర్యంతమూ ఏదో కాలక్షేపం చేసి, అప్పుడు టిఫిను తిని, స్థిమితంగా మధ్యాహ్నం భోజనంవేళ అయేవరకూ ఉత్తరాలు చదువుకొంటూ కూర్చోవాలని. కాని, అంతసేపు ఆగలేకపోయేడు.

ఒకమారు ఉత్తరాలు చదవడం ఆరంభం అయినతరవాత, అతనికి మరి తనచుట్టూ ఉన్న ప్రపంచంతో సంబంధం లేకపోయింది.

ఒక గంటసేపు టేబిలుమీద టిఫిను పడి ఉన్న తర వాత, సీతన్న మళ్లీ మళ్లీ జ్ఞాపకం చెయ్యగా, విసుక్కొంటూ, ఎడంచేత్తో ఉత్తరం పట్టుకొని చదువుతూనే, కొద్దిగా తిని అయిందనిపించుకొని, కిల్లీలు

రెండూ ఒక్కమారే వేసుకొని, మళ్లీ తనలోకంలో పడ్డాడు.

మధ్యాహ్నం భోజనం సంగతీ అంతే. పది కొండుగంటలకు తెచ్చిపెట్టినది ఒంటిగంటవరకూ ముట్టుకోలేదు. అప్పుడయినా సీతన్న తొందర చేయడం వల్లనే. మేరీకూడా ఇంతవరకు ఆకలితో ఉండి పోయిందే అనుకొంటూ, అప్పుడు ఏదో కూర్చొని, కొద్దిగా తిని, ఆ చల్లారిన మెతుకులు సహించలేదనీ, అసలు వంటకాలు ఏమీ బాగా లేవనీ లేచిపోయి వెంటనే బాగా స్ట్రాంగు కాఫీ పెట్టమన్నాడు సీతన్నను. అతనివైఖరి ఒక్క సీతన్నకే కాదు, మేరీకి కూడా వింతగానే కనిపించసాగింది. రోజూ ఉదయం లేచినదగ్గరనుంచి ఆఫీసువేళ పర్యంతమూ తనతోనే కాలక్షేపం చేసే యజమాని, ఈ రోజున తనవంక చూడనయినా లేదు. పైగా తను అమాత్రం ఈమాత్రం దగ్గరకు వెళ్లి, నెమ్మదిగా తన రాకను తెలియజేసినా ఏమీ పరికించడం లేదు. చూసి చూసి, ఏమిటిదంతా, నీకేమయినా తెలుసునా అన్నట్లు మొగంపెట్టి, సీతన్న దగ్గరికి వెళ్లి, వాడివెనకాతల కొంతసేపు తిరిగి, వాడు కొంతసేపటికి ఏమీ తోచక కూర్చొని, చుట్ట తరవాత చుట్టచొప్పున కాలుస్తూ ఉంటే, తానూ ఆ పొగ చూస్తూ వాడి కాళ్లదగ్గర మెదలకుండా కూర్చుంది. వాడుగాని లేచి బాబుగారి గది దగ్గరకు వెళ్తే, తానూ వాడి వెనకాతలే వెళ్లేది. బాబు గారు చూస్తున్న కాగితాలలో ఏముందో, ఎందుకు ఆయన మధ్యమధ్యను లేచి కాగితాలు చేత్తో పట్టుకొని అటూ ఇటూ పచారు చేస్తున్నారో, ఒక్కొక్కప్పుడు కదలకుండా నిలబడి గట్టిగా కళ్లుమూసుకొంటున్నారో సీతన్నకే దురవగాహంగా ఉంది. వాణ్ణి ఆశ్రయించుకొని ఉన్న మేరీకి ఎంత తెలుసునో ఊహించడం కష్టమే; కాని మొత్తంమీద, బాబుగారి అశాంతి కేవలం తమమీద కోపం కాదనీ, వేరే ఏదో కారణంవల్ల పుట్టినదనీ ఇద్దరికీ స్వభావసిద్ధమయిన విశ్వాసం ఉంది.

అలా కొంతసేపు చదవగా చదవగా సన్యాసిరావుకు ఒక కొత్తవిషయం స్ఫురించింది. ఇన్ని ఉత్తరాలలోనూ ఒకదానిమీదా రాసిన ఊరిపేరుగాని, తేదీగాని లేదు. తానయితే వచ్చిన ఉత్తరాలన్నీ, అప్పటి ఉద్రేకాన్నిబట్టి చదివినా చదవకపోయినా, ఒకవరసను ఫైలుచేసేడు. ఇటీవల, అంటే ఏమిటి, సుమారు నాలుగేళ్లయింది ఇవి రావడం మానేసేయి. రాసి రాసి నిరాశ చేసుకొని రాయడం మానేసింది కాబోలు. తానూ, నెలజీతం తీసుకోగానే, అలవాటు చొప్పున మనియార్డరుచేయడం తప్పిస్తే, ఉత్తరాలు రావడం ఆగిపోయి ఇంత కాలం అయిందని ఇన్నాళ్లూ స్మరించనేలేదు. తన ప్రస్తుత జీవితంలో ఆఫీసువ్యవహారాలకు సంబంధించిన ఎక్కువ పని ఉండే రోజులూ తక్కువపని ఉండే రోజులూ అనితప్ప, వ్యక్తిగతంగా తనకు అన్నిరోజులూ ఒక్కటే. నెలలూ సంవత్సరాలూ గడిచినా అణుమాత్రం భేదంలేని దయిపోయింది తన జీవితం!

ఇప్పుడీ ఉత్తరాలన్నీ తేదీలు లేకుండా ఉన్నాయికదా, ఈ వరుస తప్పించేసి కలగాపులగం చేస్తే, మళ్లీ తాను సక్రమంగా పేర్చగలడా? ఏమో, ప్రయత్నించి చూడవలసిందే. ఎవరూ తోడు లేని మనిషి, పేకముక్కలు ముందు పడేసుకొని తాత్కాలికంగా ఏదో ఒక కొత్త ఆటను సృష్టించుకొన్నట్లు, అతను ఉత్తరాలన్నీ ఫైలులోనుండి తీసి రాశిగా టేబిలుమీద పడేశాడు. ఇదివరకు చదవడం కేవలం చదవడమే. ఇప్పుడలాగ కాదు. చదివిన ప్రతిఉత్తరం సుమారు ఏ సంవత్సరములో వచ్చిందో ముందు నిర్ణయించాలి. తరవాత దేనితరవాత ఏది వచ్చిందో తేల్చుకోవాలి.

అందుకు ఉపక్రమణికగా గుడ్డివాడు కంటితో చూసి ఆనందించలేని డబ్బును చేతితో తడిమి చూసుకొని తృప్తిపడినట్లుగా, అన్ని ఉత్తరాలూ ఒక్కమారు అటూ ఇటూ కలిపి, గట్టిగా కళ్లు మూసుకొని, కుర్చీలో వెనక్కి చేరగిలబడ్డాడు.

కొంతసేపు అలా కూర్చున్న తరవాత కళ్లు విప్పి, ఏమీ ఎంపిక చెయ్యకుండా, చేతికి ఏది వస్తే అది అన్నట్లుగా ఒక ఉత్తరం తీసి, చదివిన ఉత్తరాలన్నీ సక్రమంగా పెట్టడానికి టేబిలుమీది ముందుభాగం అంతా ఖాళీచేసి చదవడం మొదలుపెట్టేడు.

"ప్రియమయిన రావుగారికి, మీ సత్యవతి అనేక నమస్కారములు చేసి వ్రాయునది :—

క్రిందటిమారు నేను రాసిన ఉత్తరానికైనా జవాబు ఇస్తారనుకొన్నాను. కాని, ఆతరవాత ఇప్పటికప్పుడే పోస్టుమేన్ ఈ ఊరు వారానికి రెండుమార్లు చొప్పున ఏడుమార్లు వచ్చేడు. అంటే దాదాపు నెల అయిందన్నమాట. మీకు నాయెడల దయకలిగివుంటే

ఈసరికే ప్రత్యుత్తరం రాసివుందురు. లేకపోయినా మళ్లీ ఉత్తరం రాసి శ్రమకలిగిస్తున్నందుకు మరింత కోపం రాకుండాఉంటేచాలును.

క్రిందటిమారు పోస్ట్ మేన్ వచ్చినప్పుడే మళ్లీ మనియార్డరు పట్టుకొని వచ్చేడు. ఆ మూలంగానయినా నన్ను జ్ఞాపకం ఉంచుకొన్నందుకు సంతోషమే. అయితే, ఎప్పటిలాగే తిరగగొట్టడం జరిగింది.

మీకు నేనంటే అంత అసహ్యంగా ఉండి, కనీసం ఒక ఉత్తరం రాయడానికయినా ఇష్టం లేకుండా ఉన్నప్పుడు నాకు డబ్బుమాత్రం ఎందుకు పంపాలి? ఇదొక్కటే మీ విధి అంటారా? అదేమో నాకు అర్థం కాదు.

నేను ఎలాగా పుచ్చుకోకపోయేదానికి నెల నెలా మీకు పంపడంశ్రమ ఎందుకు? అయితే ఒకటి – అతనిలో ఏమీ లేదు, ఇదే తెలివి తక్కువది, మొగుణ్ణి విడిచి వచ్చేసింది; అయినా అతను – ఆ ధర్మరాజు ప్రతి నెలా డబ్బు పంపిస్తున్నా డనిపించుకోవాలంటే, పంపించండి. అందువలన నాకా ఉపయోగం లేదు. మీకా శ్రమ. ఇలా పంపేకంటె, మీకంటే నామీద దయ లేదుగాని, నాకు మీరుతప్ప నిజంగా నా అనేవా రెవరున్నారు చెప్పండి? ఎప్పుడయినా అవసరంవస్తే నేనే రాస్తాను. అప్పుడు పంపవచ్చు.

ఎప్పటికయినా మీకు మళ్లీ నామీద దయ వస్తుందేమో నన్న ఆశతో బ్రతికేఉంటున్నాను.

ఇట్లు

మీ సత్యవతి"

చివరి వాక్యమూ, 'నాకు మీరుతప్ప నిజంగా నా అనే వా రెవరున్నారు చెప్పండి' అనే వాక్యమూ చదువుతూఉంటే, సన్యాసిరావుకు కళ్లలో నీళ్లు కమ్మేయి. బైటికి చదవకపోయినా గొంతు డగ్గుత్తికపడినట్లయింది. అప్పుడు ఆ ఉత్తరంఅందినవెంటనే తనలో కలిగిన భావాలన్నీ మళ్లీ ఒక్కమారుగా మెరిసేయి మనోయవనికమీద. వెనక ఒంటరిజీవితం తనకుమాత్రం ఏమి బాగుందిగనక. మళ్లీ తన సత్యవతిని తాను తెచ్చేసుకొంటాడు. గుడ్డిలోకం ఏమనుకొంటే అనుకోనీ, తన కేం లక్ష్యం? ఎట్టఎదురుగా తనకు కనిపించే సౌభాగ్యాన్ని విడిచిపెట్టుకొని, ఎక్కడో ఎవళ్లో తన వెనకాతల మాట లనుకొంటారని తా నెందుకు భయపడాలి?.........అనుకున్నా డేగాని, తన మనస్సును, సౌభాగ్యన్ని తానే నమ్మలేకపోయేడు. అప్పట్లో, పైగా, తక్కిన లోకమే కాదు, సత్యవతే తనను ఓడిపోయినవాడికింద లెక్కకడుతుందేమో నని అప్పటి రోజుల్లో తన భయం.

ఆ భయమే ఇంత చేసింది. తను ఒకింత ఓడిపోయినట్లు ఒప్పుకొన్నంతలో తనకు శాశ్వతంగా జరగబోయే దేముంది? ఆమె ఒకమాటు కాదు, ఇన్ని మాట్లు ఇంత విస్పష్టంగా ఒప్పుకొంటున్న దే తన ఓటమిని, పొరపాటును! అయినా తాను క్షమించలేక పోయేడు. కాని, ఇది క్షమించడానికి వీలైన పొరపాటా! ఏమి, ఎందువల్ల కాకూడదు? కొంతకాలం సంసారం చేసి, వైధవ్యం పొందిన స్త్రీలు మళ్లీ వివాహం చేసుకోవడం సభ్యమయిన ఈరోజుల్లో ఒక్కమారు పొరపాటుపడిన మనిషి, చిత్తస్ఫూర్తిగా ఇంతగా పరితపిస్తూఉంటే, తిరుగా పరిగ్రహించడంలో ఉన్న దోష మేమిటి?

మరి ఆలోచన వేడిని భరించలేక, "అయితే ఇది మొట్టమొదటి ఆరునెలల్లోనూ చివ్వరిమారు డబ్బు పంపవద్దని రాసిన ఉత్తరంఅన్నమాట" అనుకొని టేబిలు మీద ఒకచివరనుంచి కొంత స్థలం విడిచిపెట్టి, ఆ ఉత్తరం పెట్టి, ఏదో తప్పనిసరివిధి అన్నట్లు ఇంకొకటి తీసేడు.

"ప్రియమయిన రావుగారికి, సత్యవతి అనేక నమస్కారములు చేసి వ్రాయునది:—

ఈవాళకి సరిగా మన పెళ్లి అయి ఆరేళ్లవుతున్నది. కాని, ఇంకా నాకుమాత్రం నిన్ననో మొన్ననో అన్నంత స్పష్టంగా అన్ని సంగతులూ జ్ఞాపకం ఉన్నాయి. నిజంగా అలాగే అయిఉంటే ఏ గొప్పమార్పువల్లనో ఈ ఆరేళ్లూ ఆకేవి మధ్యను లేకుండాపోతే! కొత్తగా ఒకరినొకరం పిల్చుకొందుకే కాదు, బాగా తేరిపారచూసుకొందుకుకూడా మొగమాటపడడమూ, ఏ ఒకమాటఅంటే అవతలివారికి ఎల్లా ఉంటుందో అన్నట్లు సంకోచిస్తూ ప్రతిఒకపనీ రెండవవారి తృప్తికోసంమాత్రమే చేస్తూ, మధ్యమధ్యను వచ్చే కొద్దిగంటలఎడబాటునూ ఎన్నోయుగాలన్నట్లుగా బాధపడుతూ గడిపిన ఆరోజులు ఎంత తియ్యటివి?

ఇన్ని అంతులేని సంవత్సరాలు బ్రతకవలసిన మన జీవితాలలో అటువంటి తియ్యని హాయనిపించే రోజులు అంత కొద్దిగామాత్రమే ఎందుకున్నాయో. నన్నుబట్టే లోకం అంతా నాలాగే ఉందనుకొంటున్నాను. అందరూ నావంటి దురదృష్టవంతు లెందుకవుతారు? అందరి బ్రతుకులూ హాయిగానే ఉండవచ్చును. నేను ఒక్కతెనే నోచి పుట్టలేదు.

ఇదివరకల్లా కొంత ఆశ ఉండేది—అభిమానం వచ్చో, కోపం తెచ్చుకునో, ఉత్తరం రాస్తా రని. ఇప్పుడు ఆ ఆశ అంతరించిపోయింది. ఎందుకు నేను ఇంకా బ్రతికి ఉంటున్నానో, ఎన్నాళ్ళీవిధంగా బ్రతికిఉండగలనో నాకే తెలీదు.

మామూలురోజుల్లోనయినా పుణ్యస్మరణ మంచిదంటారు. అందులో, ఈరోజు సరిగ్గా ఆరేళ్ళక్రిందట మన పెళ్ళిఅయిన పర్వదినము. అందుకని, రాత్రి పడుకోబోయేముందు మిమ్మల్నీ భగవంతుణ్ణీ స్మరించుకొంటున్నాను. ఇది నా తెలివితక్కువ అని మీరు నవ్వినా సరే, నిజమే.

అకస్మాత్తుగా మీకు నామీద దయ కలిగినట్లుగా ఇప్పటికీ వెఱ్ఱికలలు కనడం మానలేని,

మీ సత్యవతి"

ఇది చదివినతరవాత ఇందాకటి ఉత్తరం చదివినవెనక చేయగలిగినపాటి ఆలోచన కూడా అతని మనస్సు చేయలేకపోయింది. ఉత్తరం ఎప్పటి దయి ఉంటుందో ఊహించకమునుపే దుర్బలంగా టేబిలు మీద పడిపోయింది.

అప్రయత్నంగా అతని చేయి ఉత్తరాల రాశిలోనించి ఇంకొకటి తీసింది. మొదట కొన్ని పంక్తులు చదివేవరకూ అతనికి ఏమి చదువుతున్నదీ అర్థం కాలేదు.

"మీకు అంతగా కోపం ఉంటే, నన్ను శిక్షించడమే మీ ఆనందమయితే, ఇలా నలుగురికీ తెలిసే, ఈవిధంగా ఎందుకు హింసించడం? మీదగ్గరే ఉంచుకొని, పైవాళ్లకు తెలియకుండా శిక్షించండి. చిన్నప్పుడు కథలలో విన్నట్లుగా, కావాలంటే రోజు కిన్ని దెబ్బలు అని కొట్టండి, కిక్కురుమనకుండా భరిస్తాను. అంతేకాని ఈ అవమానం భరించలేను. మీకు నామీద మరి ఎన్నటికీ క్షమించబడని ఆగ్రహం ఉంటే, ఈ విధంగా నన్ను దూరంగా ఉంచి ప్రతినెలా నా కక్కర్లేకపోయినా మనియార్డరు చేస్తూఉండడమూ ఇదంతా ఎందుకు? నన్ను మీదగ్గరకు పిలిపించుకొని, విషం పుచ్చుకోమన్నా సంతోషంతో, నా అంతట నేనే పుచ్చుకొన్నానని ఉత్తరం రాసి మరీ పుచ్చుకోగలను.

లేదా, నా ఆఖరి కోరిక! మీరు నన్ను పూర్తిగా క్షమించేరనీ, మనం ఇద్దరం మళ్లీ ఒక్క రోజయినా కలిసి ఉన్నామనీ తృప్తి లేకుండానే చచ్చిపోవాలి.

నా ఈ ఒక్క కోరికా తీర్చరూ?

మీ సత్యవతి"

ఉత్తరం చదివీచదవడంతో యంత్రంలాగ ఇంకొకటి తీసేడు. తీయడంతోనే రెండవ పేజీ వచ్చింది. కలం లేదు కాబోలు; కాగితాలూ బాగా లేవు. చిన్నపిల్లల పుస్తకాలకు అట్టలుగా ఉపయోగించే కాగితంమీద కాపీయింగుపెన్సిలుతో రాయబడి ఉంది. ఇది ఒకటే కాదు, ఇటువంటివే తక్కిన ఉత్తరాలు కూడా చాలాభాగం.

"నాకు మరి ఎలాగూ ఆశ లేదు. ఇంతే. ఈ బ్రతుకిలా వెళ్లమారవలసిందే.

కాని, మీ కెందుకనవసరపు ఒంటరితనం! నాకు మొన్నటి వరలక్ష్మీవ్రతంనాటికి ఇరవై ఆరేళ్లు నిండేయి. అంటే మీకు ఇరవైతొమ్మిదివెళ్లి ముప్ఫై వస్తుంది మరొక నెల్లాళ్లలో. అంటే ఇప్పటికాలంలో కొందరు మొట్టమొదటి పెళ్లి చేసుకునే వయస్సే. మీరు మళ్లీ పెళ్లి ఎందుకు చేసుకోకూడదు?"

అలా చదువుతూండగా జ్ఞాపకం వచ్చింది. ఆవేళ తను హెడ్క్లర్కు అయిన రోజు. ఉత్తరం చదివి, ఆఫీసు అవగానే అలాగే బయలుదేరి వెళ్లిపోవాలనుకొన్నాడు సత్యవతిని తీసుకొనిరావడానికి. కాని,

హుం, వెధవగుండె నిబ్బరం చాలింది కాదు. తీరా స్టేషనకు వెళ్లి కూడా ఏవో పత్రికలూ పుస్తకాలూ కొనుక్కొని తిరిగివచ్చేడు తన ఎడారిఇంటికి. ఛ, ఈమనస్సుకు తనలో తనకే తగని మొగమాటమూ, అనుమానమున్నూ.

ఆతరవాత మరి రెండో మూడో ఉత్తరాలు వచ్చేయి. అవి, ఏవో రాయకతప్పదని రాసినట్లుగా ఉన్నాయి. అవును పాపం, తనదగ్గరనుండి ముచ్చటకయినా సమాధానం లేకుండా సంవత్సరాలతరబడిని ఎంతకని ఆమె రాయగలదు! తానే మూర్ఖుడు. ఆమెను గూర్చిన సానుభూతి లేకపోవడమే కాదు, తన సుఖాన్ని కూడా తాను తెలుసుకోలేకపోయేడు. ఊరికేనే ఉద్రేకంలో తనను భగవానుడు శ్రీరాముడితో పోల్చుకోగానే సరా? తన కేమీ ప్రజాభిప్రాయాన్ని మన్నించితీరా లన్న నిర్బంధం లేదే. కాక తాను ఆదర్శపురుషుడు కాడే. హుం, అంతే, ఒకళ్ల వని లాభం లేదు. ఎవళ్ల కష్టసుఖాలకు వాళ్లే చాలావరకు బాధ్యులు.

ఆవేళే గాని వెళ్లి సత్యవతిని తెచ్చుకొనిఉంటే, ఇవాళ్టికి నాలుగేళ్లుపైనయింది, ఈసరికి అదృష్టం ఉండిఉంటే, ఇద్దరు పిల్లలు కలిగిఉందురు. తన ఇల్లు ఈవిధమయిన నిర్జీవపువాసన కొడుతూ కాక, పిల్లల కేరింతాలతో, ఆటలతో నిండుగా కలకలలాడుతూ ఉండిఉండేది.........సత్యవతే కాదు, తానూ అసలు దురదృష్టవంతుడు. ఆమెకు తన అన్నదమ్ముల పిల్లల నయినా చేరదీసి పెంచే అదృష్టం లభించింది. తనకు ఉన్నవల్లా ఆఫీసుకుర్చీ, టేబిలూ, ఫైల్సూ, మేరీ మాత్రమే. సీతన్నకయినా ఒక ఇల్లంటూ ఉంది. పెళ్లాం పోయినా కూతు రుంది. ఆమె పిల్ల లున్నారు, ఇంటికి వెళ్లేసరికి తాతా తాతా అంటూ చుట్టుముట్టడానికి. తనకు సజీవమయిన అటువంటి ఆస్తి ఏమీలేదు. ఆఫీసులోని పుస్తకాలూ అంకెలూమాత్రమే తనకు సంబంధించినవి. ఇంట్లోని పుస్తకాలన్నీ ఎక్కడెక్కడి యథార్థమానవులకో, ఊహాకల్పితవ్యక్తులకో సంబంధించినవే—అవే తనకు తోడునీడలు. ఒకప్పుడు నిత్యజీవితంలో కనిపించే మనుష్యులకంటె, సాహిత్యజగత్తులోని వ్యక్తులే ఎక్కువగా స్నేహపాత్రు లని అతడు మనసా విశ్వసించకపోలేదు. కాని, ప్రస్తుతపు నిరుత్సాహప్రవాహజలంలో ఆ పూర్వపు విశ్వాసాశ్రయం సమూలం కొట్టుకొనిపోయింది.

మరి ఉత్తరాలు తియ్యడానికి కష్ట మనిపించింది. సగం కళ్లుమూసుకొనే వెళ్లి మంచంమీద పడుకొన్నాడు. అట్టే ప్రయత్నం అక్కరలేకుండానే బాగా నిద్రపట్టింది సాయంకాలం నాలుగుగంటల ప్రాంతంలో. ఆ పడుకోవడం రాత్రి ఎనిమిదిన్నరప్పుడు లేపితే ఏమంటారో అని బిక్కుబిక్కుమంటూ సీతన్న లేపేపర్యంతమూ తెలివి రాలేదు. లేచి, భోంచేసి వెంటనే మళ్లీ పడుకొన్నాడు.

సీతన్నకూ, మేరీకీ ప్రాణాలు కుదుటపడ్డాయి—బాబుగారికి మరేమీ పెద్ద చికాకు లేదు, మళ్లీ మామూలుగానే అవుతున్నారని.

(సశేషము)

మారకం ప్రమాణముల మార్పు

౧

శ్రీ పండితారాధ్యుల నాగేశ్వరరావు

నాలుగుసంవత్సరాలక్రితం హిరోషిమాపై మొట్ట మొదటి ఏటంబాంబు ప్రయోగంతరువాత స్టెర్లింగ్ విలువను తగ్గించుతూ ఈ సెప్టెంబరు 18 వ తేదీన బ్రిటిష్ ఖజానామంత్రి సర్ స్టాఫర్డ్ క్రిప్స్ చేసిన ప్రకటనఅంతగా మరి ఏ ఇతర సంఘటనా ప్రపంచాన్ని కలవర పెట్టలేదు. తరువాత వారంరోజులకు రష్యా ఏటంరహస్యాన్ని తెలుసుకున్న దని అమెరికా అధ్యక్షుడు చేసిన ప్రకటన కూడా ప్రజల దృష్టిని మారకంమార్కెట్ నుంచి మరల్పలేకపోయింది. రష్యా ఏటంబాంబును ప్రయోగించితేనేగాని, మాస్కోకు ఏటంబాంబునిర్మాణరహస్యం తెలియడం వల్ల ప్రాప్తించగల ప్రమాదాలు అవగాహనకావు: ఫలితాలు అనుభవానికి రావు. వివిధదేశాల నాణెముల మారకపురేటులో మార్పు రావడం ప్రజల నిత్యజీవితంలో అనుక్షణం అనుభవానికి వస్తుంది. అందుచేతనే ఆర్థికశాస్త్రవేత్తలు పౌనువిలువతగ్గింపుకు కారణమైన పరిస్థితులను పరిశీలిస్తూ, అలాంటి మార్పును నివారించడం సాధ్యమా, కాదా అనే సాంకేతిక విషయాలతో, వివాదాలతో సతమతం అవుతూఉంటే సామాన్యప్రజలు ఈ మారకంరేటుమార్పువల్ల తమ కొనుగోలుశక్తిగతి ఏ మవుతుందా అని ఆందోళన చెందుతూ ఉన్నారు. ప్రపంచవిక్రయశాలలతో సామాన్యప్రజలకు ప్రత్యక్షసంబంధం లేకపోయినా, వీరి కొనుగోలు ఉత్పత్తి శక్తులపైననే ప్రపంచవిక్రయశాలలలో వస్తువుల ధరహెచ్చుతగ్గులు ఆధారపడి ఉంటవి. కాబట్టే ప్రజల ఆర్థికస్థితి అన్నింటికన్నా చాలా ప్రధానమైన విషయం అయింది. సెప్టెంబరుమాసాంతంలో జరిగిన ప్రపంచవ్యాప్తమారకపురేట్ల మార్పు ప్రజల ఆర్థిక స్థితిని అభివృద్ధిచేయడానికి ఉపయోగపడుతుందా? లేకపోతే ఈ మార్పులవల్ల వారి స్థితి ఇంకా అధ్వాన్న మౌతుందా ?

ఈప్రశ్నల సమాధానం మారకపురేట్లమార్పుబాగోగులను, అవసరానవసరములను నిర్ధారణ చేస్తుంది. అయితే ఈ ప్రశ్నల సమాధానాన్ని అన్వేషించడానికి పూర్వం మారకపు రేటు అంటే ఏమిటో, ఒకసారి నిర్ణయమైన రేటు మారవలసిన పరిస్థితి, అవసరం ఎందుకు, ఏవిధంగా ఏర్పడుతుందో విచారించాలి.

ప్రపంచంలో ఏ దేశమూ వ్యావసాయికంగానూ, పారిశ్రామికంగానూ స్వయంసమృద్ధంగా, స్వయంపోషకంగా లేదు. ఏ దేశమూ తన ప్రజ కవసరమైన ఆహారపదార్థాలనూ, తన పరిశ్రమల కవసరమైన ముడిపదార్థాలనూ, ప్రజల కవసరమైన పారిశ్రామికవస్తువులనూ తయారుచేయలేదు. కొన్ని పదార్థాలు, వస్తువులు దేశావసరాలకు మించీ, మరి కొన్ని సమానంగానూ, ఇంకా కొన్ని తక్కువగానూ తయారవుతూఉంటవి. ప్రజావసరములకు తగినంతగానే ఉత్పత్తిఅయ్యే సరుకు విషయంలో ఉత్పత్తిదారులకుగాని, కొనుగోలుదారులకుగాని ఏ సమస్యా లేదు. తయారయ్యే సరకుకు విక్రయశాల సిద్ధంగాఉంటుంది. అలాగే విక్రయశాలలకు కావాల్సిన సరుకు తయారుగా ఉంటుంది. ఎటువచ్చీ అవసరాలకు మించీ, తగ్గీ ఉండే వస్తువుల విషయంలోనే ఇబ్బంది వస్తుంది. ఎక్కువగా తయారయ్యే వస్తువులను, ఆ వస్తువుల అవసరం ఉన్న దేశాలకు పంపి విక్రయపు ఏర్పాట్లు చేసుకోవాలి. తక్కువగా తయారయ్యే వస్తువులను, అదేప్రకారం ఆ వస్తువులు అధికంగా ఉన్న దేశాలనుండి తెప్పించుకోవాలి. ఈ క్రయవిక్రయలావాదేవీలు సాధారణంగా, సహజంగా రెండు దేశాలకే పరిమితం అయిఉండవు. మన దేశంలో ఎక్కువగా పండే సరుకును కొనగల దేశమే మనకు తక్కువైన సరుకు సప్లయిచేస్తే వస్తుమారకంద్వారానే వ్యాపారం అంతా సాగిపోతుంది. ఇపుడు భారతదేశం అలాంటి వస్తుమారకంఏర్పాటులను, ఒడంబడికలను రష్యా మొదలైన దేశాలతో కుదుర్చుకొన్నది. కాని ప్రస్తుతం వివిధదేశాలు అనుసరించుచూఉన్న ఆర్థిక, వ్యాపారవిధానాలవల్ల అట్టి ఏర్పాటు సాధ్యం గాదు. ప్రపంచరాజ్యాలు అన్నీ ఈ విధానాన్ని - వస్తుమారకం విధానం - అనుసరించితే ప్రభుత్వనాణెముల విలువ వస్తువుల ధరలను నిర్ణయించక, వస్తువుల విలువే నాణెముల ధరలను నిర్ణయించగలదు. ఉత్పత్తి, అవసరముల ప్రమాణం (రేషియో) స్థిరముగా ఉన్నంతకాలం ప్రభుత్వద్రవ్యవిలువ స్థిరంగా, నిలకడగా ఉంటుంది.

ప్రస్తుతం ప్రపంచదేశాలన్నీ కూడా తమ మిగులు సరుకును ఎక్కువధరలు రాగల ఇతరదేశాలలోనే అమ్మడం, తమకు కావాల్సిన సరుకు ఏదేశంలో తక్కువ ఖరీదుకు లభించగలదో ఆ దేశంలోనే కొనడం చేస్తున్నవి. అంటే ప్రతిదేశమూ వ్యాపారలావాదేవీలు తమకు అనుకూలంగా అంటే ఎగుమతులు ఎక్కువ, దిగుమతులు తక్కువ-సాగించడానికి ప్రయత్నిస్తున్నది. అమెరికాతప్ప, ప్రపంచంలోని ఇతర దేశములు అన్నీ తమ ఆర్థికవ్యవస్థపతనాన్ని నివారించడానికి ఈ వ్యాపారవిధానాన్నే అనుసరించవలసిఉంది. ఒక్క అమెరికామాత్రమే, అవిరెల్ హారిమన్ వివరించినట్లు తన ఆర్థికస్థితిని సుస్థిరం చేసుకొనడానికి, ఆర్థిక మాంద్యం, నిరుద్యోగం తిరిగి దేశంలో తలఎత్తకుండా చేయడానికి ఎక్కువగా దిగుమతులు చేసుకోవలసిఉంది. అంటే ప్రపంచదేశాలన్నింటిలోనూ ఒక్క అమెరికాయే విక్రయదారుల మార్కెట్టుగా ఉంది. ప్రథమప్రపంచ సంగ్రామానంతరం బ్రిటన్ స్టెర్లింగ్ ప్రాంతం ఏ స్థితిలో ఉన్నదో, ద్వితీయప్రపంచసంగ్రామానంతరం అమెరికా ఆ స్థితిలో ఉంది. ప్రపంచవ్యాపారానికి అప్పుడు బ్రిటన్ కేంద్రంగా ఉంటే, ఇప్పుడు అమెరికా కేంద్రం అయింది. కనుకనే 1931వ సంవత్సరములో 'పౌనుస్టెర్లింగ్' మారకపు ప్రమాణాన్ని నిర్ణయించితే ఇపుడు అమెరికనుడాలరు ఆ పని చేయగలుగుతున్నది. 1931వ సంవత్సరంలో బ్రిటన్ బంగారపు ప్రమాణాన్ని పరిత్యజించగలిగితే ఇపుడు అమెరికా పరోక్షంగా ఆ ప్రమాణాన్ని తిరిగి ప్రవేశపెట్టగలుగుతున్నది. అంతర్జాతీయ గోధుమఒడంబడికలో గోధుమ ధర బంగారం ధరనుబట్టి నిర్ణయం అయింది. కనుకనే బ్రిటన్‌లో పౌనువిలువ తగ్గింపువల్ల బంగారం విలువ పెరగ్గా గోధుమధరకూడా పెరిగింది. ఈనాడు ప్రపంచంలోని మొత్తము బంగారంనిలవలో ఒక్క అమెరికాలోనే నాల్గింట మూడువంతులు ఉన్నట్లు అమెరికా ప్రభుత్వ అధికారులే అంగీకరించారు. అమెరికాసరుకులను ఇతర దేశాలు సంపాదించాలిఅంటే, ఆ సరుకు కిమ్మత్తును డాలరుల రూపంగా అయినా చెల్లించాలి; లేకపోతే డాలరులఖరీదు కట్టి అంత బంగారాన్ని అయినా చెల్లించవలసి ఉంటుంది. ప్రపంచంలోని ఇతరదేశాలకు రెండూ తక్కువగానే ఉన్నవి. ఒక్క దక్షిణాఫ్రికాకుమాత్రం బంగారం అవసరాలకు మించి ఉన్నది.

ఒక్క దక్షిణఆఫ్రికాను మినహాయించితే స్టెర్లింగ్ ప్రాంతంలోని ' అన్నిదేశాలూ డాలర్లను సంపాదించడానికి అమెరికాపరిశ్రమలకు కావాల్సిన ముడిపదార్థాలనైనా ఎగుమతిచెయ్యాలి; లేదా అమెరికాలో తయారుకాని, తయారై ప్రజల అవసరాలకు చాలకుండా ఉన్న పారిశ్రామికవస్తువులను ఎగుమతి చేయాలి. అయితే ఈ సందర్భంలో సహజంగా ఒక ప్రశ్న వస్తుంది. స్టెర్లింగ్ ప్రాంతదేశాలకు డాలర్లు ఎందుకు? డాలరుదేశాలకు స్టెర్లింగ్ ఎందుకు? ప్రపంచంలోని వివిధదేశాల నాణెముల పరస్పరమార్పు స్వేచ్ఛగా జరిగే అవకాశం లేనంతవరకూ, వివిధదేశాల ఆర్థికలావాదేవీలు ప్రస్తుతం జరిగినట్లే జరక్క తప్పదు. ఈమార్పు ప్రపంచవ్యాపారములో ఒక నూతనపథము తూలనము ఏర్పడేవరకూ సాధ్యం గాదు. భారతదేశం అమెరికానుండి కీలకయంత్రాలూ, ఆహారధాన్యాలూ దిగుమతి చేసుకోవాలంటే వాటి కిమ్మత్తును బంగారంలో గాని, డాలర్లలో గాని చెల్లించవలసిఉంటుంది. బ్రిటనూ, ఇతరస్టెర్లింగ్ దేశాలుకూడా ఇదేవిధంగా అమెరికా నుండి సరుకులు దిగుమతిచేసుకోవాలి. ప్రభుత్వనాణెములలోనూ, నోట్లలోనూ ప్రజలవిశ్వాసం తగ్గిపోకుండా ఉండాలీ అంటే నిర్ణీతప్రమాణంలో బంగారం నిలవలు ఉండాలి. ఎగుమతి, దిగుమతి వ్యాపారాలకంటేకూడా ప్రభుత్వ 'కరెన్సీ'లో ప్రజల విశ్వాసం నిలిచిఉండేటట్లు చూడటం చాలా ముఖ్యం. అందుచేత ఏదేశమూ, యుద్ధకాలంలోమాదిరి తాను ఇతరత్రా కొనే వస్తువులకు బంగారం చెల్లించలేదు. దక్షిణాఫ్రికామాత్రం బ్రిటన్‌నుండి తాను దిగుమతిచేసుకునే వస్తువులకు బంగారం చెల్లించడానికి సిద్ధమైంది.

బంగారం లేనప్పుడు, డాలర్లతోనే అమెరికా నుండి సరుకు తెప్పించుకోవలసిఉంటుంది. అమెరికా అప్పుపెడితేగాని, లేకపోతే ధర్మార్థంగా సహాయం చేస్తేగాని, అదీగాకపోతే, ఆయాదేశాలసరుకును దిగుమతిచేసుకుంటేగాని స్టెర్లింగ్ ప్రాంతాలకు డాలర్లు లభింపవు. రెండవ ప్రపంచసంగ్రామం పరిసమాప్తం కాగానే, గతసంగ్రామానంతర ఆర్థికసంక్షోభాన్ని నివారించేందుకు అమెరికా బ్రిటనుకు అప్పుపెట్టి, బ్రిటన్ ఎగుమతివ్యాపారంవల్ల ప్రాప్తించే డాలర్లను ఇతరస్టెర్లింగ్ దేశాలకు పంపకం చేయడానికి అవకాశం కల్పించింది. ఆ అప్పుమొత్తం హరించిపోబోయే సమయానికి మార్షల్ పథకంక్రింద యూరపియనురాజ్యాలకు డాలర్లు అందేటట్లు చేసింది. 1952వ సంవత్సరంలో ఈ ఏర్పాటూ ముగిసిపోతుంది. అమెరికా

ఎంతోకాలం తన ఆర్థికస్థితిని భద్రపరుచుకోవడానికి ఈవిధంగా దానధర్మాలు చేస్తూ ఉండలేదు. అందుచేత ఏదోవిధంగా ఈదేశాలు అన్నీ తమకు అవసరమైన డాలర్లు సంపాదించుకోగలిగేటట్లు చేయాలి. తాను విరివిగా ఇతరదేశాల సరుకును దిగుమతిచేసుకోవడం ద్వారానే ఇది సాధ్యం. ఈ సమస్యను పరిష్కరించడానికే క్రిందటినెల వాషింగ్‌టన్‌లో బ్రిటన్, అమెరికా, కెనడా ఆర్థిక, విదేశాంగమంత్రులు సమావేశమైనారు. స్టెర్లింగ్ ప్రాంతంలో ఏర్పడిన డాలరుకొరతను తీర్చడానికి మార్గాలను అన్వేషించడమే ఈ త్రైపక్ష సంప్రతింపుల ప్రధాన లక్ష్యం. యుద్ధం ముగిసి నాలుగు సంవత్సరాలు అయిందిగదా; ఇన్నాళ్లనుంచీ లేని డాలరుకొరత ఇప్పుడు ఎందుకు ఏర్పడింది? అందుకు బాధ్యులు ఎవరు? అనే ప్రశ్నలకు ముందు సమాధానం తెలుసుకుంటేగాని వాషింగ్‌టనుఒడంబడిక అవసరం, ప్రయోజనం వ్యక్తం గాదు. 1949 జూన్ వరకూ కూడా స్టెర్లింగ్ ప్రాంతానికి నాయకత్వం వహించిన బ్రిటన్ డాలరుస్థితి తృప్తికరంగానే ఉంది. తన ఎగుమతులవల్లా, మార్షల్ పథకంవల్లా, కెనడా అప్పువల్లా లభించే డాలర్లతో తన అవసరాలను, తాను బాకీఉన్న దేశాల అవసరాలను కొంతవరకూ తీర్చగలిగింది. అందుకు అమెరికా దిగుమతివిధానం చాలావరకు తోడ్పడింది. కాని ఈసంవత్సరం ప్రారంభములో అమెరికాలో ఆర్థికమాంద్యం ఏర్పడే సూచనలు గోచరింపనారంభించినవి. ఉత్పత్తి తగ్గడం, నిరుద్యోగుల సంఖ్య క్రమంగా ఎక్కువకావడం సంభవించింది. వ్యవసాయిక ఉత్పత్తిమాత్రం తగ్గిపోకుండా పంటకు కనిష్ఠధర ముట్టేటట్లు ప్రభుత్వం ఏర్పాటుచేసింది. అయితే ఆ ధరలను ఏ ప్రభుత్వం అయినా ఎంతోకాలం సబ్సిడీలు ఇచ్చి నిలబెట్టలేదు. ప్రజల కొనుగోలుశక్తే ధరలను ఒక ప్రమాణంలో నిలబెట్టగలదు. కొనుగోలుశక్తి తగ్గిపోవడంవల్ల ధరలు పడిపోక తప్పదు. ఆ పరిస్థితుల్లో ఆర్థికమాంద్యం అనివార్యమౌతుంది. ఈప్రమాదాన్ని వాషింగ్‌టను ఒడంబడికా, తత్ఫలితంగా జరిగిన పౌనుమారకం విలువ తగ్గింపూ తాత్కాలికంగా నివారించినవని చెప్పవచ్చు. ఆర్థికమాంద్యం శాశ్వతంగా నివారణం కావాలంటే ఉత్పత్తి అధికం కావాలి. ప్రజల కొనుగోలుశక్తి వృద్ధి కావాలి. మారకంరేటు మార్పువల్లనే ఇవి సాధ్యం కావు. క్రిందటి పదిమాసాలుగా అమెరికా ఈ సమస్యలనే ఎదుర్కొంటూ ఉంది. వాటిని సాధ్యమైనంత త్వరలో పరిష్కరించడం అవసరం.

ప్రపంచవ్యాపారం ఆర్థికమాంద్యాన్ని నివారింపగల ప్రమాణంలో నిలబడిఉండాలంటే అమెరికా తన దిగుమతివ్యాపారాన్ని బాగా వృద్ధిచేసుకోవాలి. గతసంవత్సరము అంతా అమెరికా దిగుమతివ్యాపారం ఇంచుమించు నిలకడగా ఉన్నది. డాలరేతరప్రాంతాల నుండి సాలుకు 700 కోట్ల డాలరుల విలువగల వస్తువులను అమెరికా దిగుమతిచేసుకుంటూ ఉంది. యుద్ధానికి పూర్వం అమెరికాదిగుమతులు ఈ మొత్తంలో మూడోవంతుమాత్రమే ఉండేవి. అలాగని ఇప్పుడు అమెరికా యుద్ధానికిపూర్వం దిగుమతిచేసుకున్న సరుకుకు మూడురెట్లు దిగుమతి చేసుకుంటున్నదని అనుకోరాదు. కేవలం సరుకునుబట్టే అయితే అమెరికా దిగుమతివ్యాపారంలో యుద్ధానికి పూర్వంకంటే ఇప్పుడు అయిదోవంతే పెరుగుదల కన్పిస్తుంది. మొదటి, రెండవ ప్రపంచసంగ్రామములమధ్య అమెరికాపారిశ్రామిక ఉత్పత్తి, దిగుమతులు ఇంచుమించు సరిసమానంగా ఉంటూవచ్చినవి. ఇప్పుడు అమెరికా పారిశ్రామికఉత్పత్తి యుద్ధానికి పూర్వపు ఉత్పత్తికి దాదాపు రెట్టింపు అయింది. ఆ లెఖ్ఖలప్రకారం అమెరికా 11,000,000,000 డాలర్ల కిమ్మత్తు (ప్రస్తుత ధరలనుబట్టి)గల సరుకును దిగుమతి చేసుకోవలసి ఉంటుంది. అంటే అమెరికా ఇంకా నాలుగువందల కోట్ల కిమ్మత్తుగల సరుకును దిగుమతిచేసుకోగలదు. అమెరికా ఈ ప్రమాణాన్ని చేరకపోవడానికి వాణిజ్యశాఖ, అంతర్జాతీయవ్యాపారకార్యాలయండైరెక్టరు బ్లెయిస్ డెల్ ఈక్రింది కారణాలను పేర్కొంటున్నారు: "పశ్చిమార్ధగోళందేశాలు అమెరికా ఉత్పత్తి అభివృద్ధికి తగినట్లుగా తమ ఎగుమతులను వృద్ధిచేసుకున్నది. కాని యూరపు, ఆసియాదేశాలు యుద్ధానికి పూర్వమున్న ఎగుమతివ్యాపారప్రమాణాన్ని అయినా అందుకోలేకుండా ఉన్నవి. ఈదేశాల్లో ఇప్పటికీ పారిశ్రామికఉత్పత్తి, అమెరికాఅవసరాలకు చాలా కొరవడిఉన్నది." కనుకనే యూరపు, ఆసియాదేశాలే డాలరుకొరతఇబ్బందులను ఎక్కువగా అనుభవింపవలసి వచ్చింది.

అమెరికా, తన ఆర్థికవ్యవస్థవిస్తరణ, జనాభా పెరుగుదలకు (1940 ఏప్రిల్ 1 నుండి 1948 జనవరి 1 వ తేదీలోపున అమెరికాజనాభా 18,700,000 పెరిగింది.) తగ్గట్టుగా ఇతరదేశాలనుండి సరుకులను దిగుమతిచేసుకోనకతప్పదు. కాని దిగుమతిఅయ్యే సరుకు ధరలు ఇప్పుడు అమెరికాకు గిట్టుబాటుగా ఉండలేదు.

1948 లో కంటె 1949 లో ఉత్పత్తి తగ్గడం, నిరుద్యోగుల సంఖ్య పెరగడం, ధరలు తగ్గడం జరిగింది. ఇది ముఖ్యంగా ఈమార్చిమాసంనుండీ ఎక్కువగా కన్పిస్తున్నది. ఇందువల్ల ఇతర దేశాలనుండి దిగుమతిఅయ్యే సరుకుధర లాయికీగా లేదు. ప్రజల కొనుగోలు శక్తి పరిమితం కావడంవల్ల ధరలు తగ్గడం తప్పనిసరి అయింది. పంటధరలు నిర్ణయమైనా, పారిశ్రామిక వస్తువుల ధరలు తగ్గితే ఈ ధరలూ తగ్గవలసిఉంటుంది. తగ్గక తప్పదు. కాని ప్రభుత్వం ఆ ధరల ప్రమాణాన్ని నిలబెట్టడానికి పూనుకుంది. ఈ బాధ్యతను నిర్వహించడానికి పారిశ్రామికఉత్పత్తిని వృద్ధిచేసి నిరుద్యోగ సమస్యను నిర్మూలించవలసివుంటుంది. పరిశ్రమాలయాలు నిరంతరం పనిచేస్తూఉంటేగాని ఇది సాధ్యం గాదు. అమెరికను పరిశ్రమలకు అవసరమైన ముడిపదార్థాలు గిట్టుబాటుగాఉండే ధరలకు లభించితేగాని పారిశ్రామికులు ఉత్పత్తిని వృద్ధిచేయలేరు. వాడుకదారులు ఇతరదేశాలనుండి వచ్చే పారిశ్రామికసరుకు తమ కొనుగోలుశక్తికి అందుబాటులో ఉంటేతప్ప వాటిని కొనుక్కోలేరు. అమెరికా ప్రపంచవ్యాపారకేంద్రం అయిందిగనుక వ్యాపారలావాదేవీలు ఆ దేశపరిస్థితులకు లోబడే జరగాలి. అంటే అమెరికాకు ఇతరదేశాల నుండి ఎగుమతిఅయ్యే సరుకు, ముడిపదార్థాల ధరలు తగ్గవలసిఉంటుంది. ధరలను తగ్గించడం అంటే ఆర్థిక మాంద్యానికి దారిచేసినట్లే!

ప్రస్తుతవ్యాపారసరళిని తీక్ష్ణంగాపరిశీలించి, అంతర్జాతీయబ్యాంకుఅధ్యక్షుడు బ్లాక్ ఈసమస్యా పరిష్కారానికి సెప్టెంబరు 18వ తేదీన—అనగా మారకంరేటుమార్పుకు వారంరోజులు పూర్వం—చాలా ముఖ్యమైనసూచనలు చేశారు.

"యూరపుదేశాలు తమ ఎగుమతిధరలను డాలరు దేశాలకు సాధ్యమైనంత ఆకర్షణీయంగా ఉండేటట్లు చేయాలి. ఈ లక్ష్యాలను సాధించడానికి అనేక మార్గాలు ఉన్నవి. డాలరుకొరతను అనుభవిస్తూఉన్న దేశాలు ప్రపంచవిక్రయశాలలలో పోటీకి నిలబడడానికి వీలుగా మారకంవిధానాన్ని నిర్ణయించడం. ఈవిధంగా మారకంరేట్లు మార్పుచెందితే ఏదేశపు ద్రవ్యం సులభంగా లభిస్తుందో ఆ దేశాలనుండే దిగుమతులు చేసుకొనవలసిన దేశాలు తమ సరుకును దిగుమతిచేసుకోగలవు. అట్టి చర్య తీసుకోవడంలో గల సాధకబాధకాలనుగానీ, అట్టి చర్యవల్ల కలిగే ఫలితాలనుగానీ నేను తక్కువచేయడం లేదు. కాని అట్టి చర్య ఎలా నివార్యమౌతుందో నేను గ్రహింపలేకుండా ఉన్నాను."

యథార్థానికి ప్రపంచంలోని అన్ని దేశాల ద్రవ్య ప్రమాణంవిలువ కృత్రిమంగా ఒక స్థాయిలో నిలబెట్టబడిఉంది. తగిన హామీలేకుండా నోట్లను అచ్చువేసి దేశంపై వెదజల్లారు. అందువల్ల దేశంలోనే ప్రభుత్వనాణెముల విలువ తగ్గిపోయింది. ధరలను, కరెన్సీని, ఎగుమతి, దిగుమతి వ్యాపారాలను కంట్రోలు చేయడంవల్లనే ఇది సాధ్యమైంది. స్వేచ్ఛా వ్యాపారానికి ఈ ఏర్పాట్లు అన్నీ ప్రతిబంధకమే. స్వేచ్ఛావ్యాపారాన్ని అభిలషించి, అందుకు రెండు సంగ్రామాలనుసైతం నిర్వహించిన అమెరికా సాధ్యమైతే వీటిని ఒక్క క్షణంకూడా సహించదు. బ్రిటన్ అప్పు అడిగినప్పుడు సామ్రాజ్యాభిమానానికి స్వస్తిచెప్పించినది. ఇపుడు తిరిగి తన ఎగుమతివ్యాపారాన్ని వృద్ధిచేసుకొనగోరితే, బ్రిటనులో తయారయ్యే వస్తువులకు తానే ధరకట్టడానికి ప్రయత్నించింది. అయితే ఇది సాధ్యం కావడానికి మళ్లీ బ్రిటన్ సామ్రాజ్యాభిమానవిధానాన్ని అనుసరించడానికి అమెరికా సమ్మతించింది. వాషింగ్‌టన్ ఒడంబడిక దీన్ని ధ్రువపరచింది.

బ్రిటన్ ఖజానామంత్రి సర్ స్టాఫర్డ్ క్రిప్సు ఎంత పట్టుబట్టినా పౌనువిలువను తగ్గించడం తప్పనిసరి అయింది. బ్రిటన్ ఆర్థికవ్యవస్థ తారుమారు కాకుండా ఉండాలంటే విశేషంగా ఎగుమతిచేసుకోవాలి. పౌను విలువ ఎలా ఉన్నా, బ్రిటన్ ప్రపంచవ్యాపారంలో తిరిగి తన అగ్రస్థానాన్ని పొందాలి. మరొకదేశం తనతో పోటీచేయలేని స్థితిని బ్రిటన్ పొందాలి. అది సాధ్యమైనపుడు పౌనువిలువ 1931 లో మాదిరే సరియైన ప్రమాణాన్ని పొంది నిలబడిపోతుంది. మారకంరేటు మార్పు తప్పనిసరి అయినప్పుడు ఆ మార్పువల్ల సాధ్యమైనంత ఎక్కువ ప్రయోజనాన్ని పొందడమే వివేకమైన పని. సర్ స్టాఫర్డ్ క్రిప్సు ప్రతిభావంతుడు, విజ్ఞుడు. కనుకనే పౌనువిలువను దాదాపు మూడో వంతుకు తగ్గించివేశారు. ఇందువల్ల అమెరికా ప్రజలకు స్టెర్లింగ్ ప్రాంతపు సరుకులు 'కారుచవుక' అవుతవి. 1946 లో నిర్ణయమైన మారకపురేటుప్రకారం ఒక పౌనువిలువ గల బ్రిటిష్‌సరుకును కొనాలి అంటే అమెరికా 4 డాలర్ల 3 సెంట్లు చెల్లించవలసి ఉండేది. ఇప్పుడు అదే కిమ్మత్తుగల బ్రిటిష్‌సరుకును కొనేందుకు 2 డాలర్ల 80 సెంట్లు మాత్రమే అమె

రీకా చెల్లించవలసి ఉంటుంది. ఈ తగ్గింపు నూటికి 30.5 గా కన్పించినా 1946 లో బ్రిటిష్ వస్తువుల ధరల ప్రమాణాన్నీ, 1949 లో బ్రిటిష్‌వస్తువుల ధరల ప్రమాణాన్నీ పరిపోల్చిచూస్తే, ఈ తగ్గింపు నూటికి 20 కంటే ఎక్కువ గాదు. బ్రిటనులో ఉత్పత్తిధరలు, కార్మిక వేతనాలు క్రమంగా పెరుగుతూ వచ్చినవి. ప్రభుత్వం తనఖర్చును విపరీతంగా తగ్గించుకోగలిగితేనేగాని పన్నులను తగ్గించి, వేతనాలు అంతగా తగ్గించక, వస్తువుల ఉత్పత్తిఖరీదును తగ్గించడం సాధ్యం గాదు. బ్రిటిష్‌ప్రభుత్వంగాని, మరి ఏ ఇతరప్రభుత్వం గాని ప్రజల జీవితప్రమాణాన్ని తగ్గించక, పునరుద్ధరణ పథకములపై చేసే ఖర్చును తగ్గించలేదు. రూపాయి విలువ తగ్గింపును సమర్థిస్తూ భారతప్రధానమంత్రీ, పౌనువిలువతగ్గింపును సమర్థిస్తూ బ్రిటిష్‌ఖజానామంత్రీ సర్ స్టాఫర్డ్ క్రిప్సూ చేసిన ప్రసంగాలు ఈవిషయాన్నే ప్రకటించినవి. అయితే వారు చెప్పినట్లు మారకపురేటుమార్పువల్ల దేశంలోని వస్తువుల ధరలు నిలకడగా లేవు. ఈ క్రొత్తద్రవ్యవిధానంఫలితాలు అనభవానికి రావడానికి మరికొంతకాలం పడుతుంది.

ఈ ఫలితాలు ఎలా ఉంటయో విచారించడానికి పూర్వం "మారకంరేటు" "ద్రవ్యవిలువతగ్గింపు" అంటే ఏమిటో విచారించడం అవసరం.

భారతదేశం బ్రిటనుకు ఎగుమతిచేసే సరకులకు స్టెర్లింగును పొందుతుంది. అమెరికా భారతదేశంనుండి దిగుమతిచేసుకునే సరకులకు డాలర్లు చెల్లించుతుంది. అలాగే ఏదేశానికి తన సరకు ఎగుమతిచేస్తే, ఆ దేశం నాణెములరూపంలో వాటి ఖరీదును పొందుతూ ఉంటుంది. అయితే భారతదేశంలో తయారయ్యే సరకుధర డాలర్లు, పౌన్లు, ఫ్రాంకులు, రూబుల్సు మొదలైన వివిధదేశాల ద్రవ్యప్రమాణంలో గాక రూపాయిల్లోనే నిర్ణయం అవుతుంది. భారతదేశంలో కొనుబడిచేసే విదేశాలు సరకుధరను రూపాయిల్లో చెల్లించలేవు. ఆ దేశాలు భారతదేశానికి తమ సరకును విక్రయించితే, తద్వారా లభించే రూపాయిలతో తమ దిగుమతుల ఖరీదును చెల్లించగలవు. అయితే ఒక దేశం వరొకదేశంనుండి దిగుమతిచేసుకునే సరకుకిమ్మత్తూ, ఆ దేశానికి ఎగుమతిచేసే సరకుకిమ్మత్తూ సమానంగా ఉండడం చాలా అరుదు. అలా లేనప్పుడు, ఆ వ్యత్యాసాన్ని, బాకీఉన్న దేశానికి, ఆ దేశం కోరిన రూపంలో చెల్లించవలసిఉంటుంది. బ్రిటన్ చాలా కాలంవరకూ తన దిగుమతులకు స్టెర్లింగులోనే చెల్లించుతూ, తన ఎగుమతులద్వారా తీర్చగా శేషించిన మొత్తాన్ని స్టెర్లింగులోనే చెల్లించుతూ, ఆ మొత్తాన్ని ఏ నాణెములలోనైనాసరే అడిగినప్పుడు చెల్లించగలనని బాకీపడిన దేశాలకు హామీఇస్తూవచ్చింది. తాను మొత్తంగా వివిధదేశాలనుంచి దిగుమతిచేసుకునే సరుకువిలువకంటే తాను మొత్తంగా వివిధదేశాలకు ఎగుమతిచేసే సరుకు విలువ ఎక్కువగా ఉన్నప్పుడు, ఏదేశానికైనా అలాంటి పరపతి, వ్యాపారరంగంలో అలాంటి స్థానం ఏర్పడుతుంది. ద్వితీయ ప్రపంచసంగ్రామానంతరం, సంగ్రామం సాగుతూ ఉండగానూ బ్రిటనుకు, క్రమంగా, పూర్వం ఉండిన స్థానం పోయింది. కనుకనే పౌనుమారకం శక్తి తగ్గిపోయింది. పౌనుకు "మారకం మార్కెట్"లో ఉండిన గిరాకీ ఇప్పుడు లేదు. గిరాకీ లేకపోయేసరికి విలువ తగ్గడం సహజం. ఎగుమతివ్యాపారంకంటే దిగుమతివ్యాపారమే ఎక్కువగా ఉన్న ప్రతిదేశంనాణెం విలువా అదేవిధంగా తగ్గిపోతుంది. భారతదేశం అదే స్థితిలో ఉంది. ఎగుమతివ్యాపారం క్రమంగా తగ్గుతూ, దిగుమతివ్యాపారం క్రమంగా పెరిగిపోయింది. అంటే ఇతరదేశాలకు వాటికి అవసరమైన రూపాయిలకంటే ఎక్కువ రూపాయిలున్నవన్నమాట. కనుకనే రూపాయిమారకంవిలువ తగ్గిపోవడం అనివార్యమైంది.

ప్రతిదేశమూ ఇతరదేశాల నాణెములతో తన నాణెమువిలువను శాసనరీత్యా నిర్ధారణచేస్తుంది. మన రూపాయికి 18 షిల్లింగులని 20 సంవత్సరాలక్రితం నిర్ణయమైంది. అంటే బ్రిటను మనదేశంలో ఒక రూపాయికిమ్మత్తు గల వస్తువు కొనాలంటే 18 పెన్నీలు చెల్లించాలి. ఈ సందర్భంలో ఒక్క విషయం గుర్తుకు తెచ్చుకుంటే గతమాసాంతం జరిగిన "మారకంరేటు మార్పు" ప్రాధాన్యం సులభంగా తెలిసిపోతుంది. రూపాయి—పౌనువిలువను నిర్ణయించవలసివచ్చినప్పుడు బ్రిటిష్‌ప్రభుత్వప్రతినిధులు రూపాయికి 18 పెన్నీలు అని సూచించితే, భారతీయులు 16 పెన్నీలే ఉండాలని ఆందోళన చేశారు. సామాన్య ప్రజలు రూపాయికి 18 పెన్నీలు ఇస్తామని బ్రిటన్ అంటూఉంటే 16 పెన్నీలే చాలు అని మనవాళ్లే ఆందోళన చేస్తారేమిటి అని ఆశ్చర్యపోయారు. ఈ మారకంరేటునిర్ణయంఅవుతున్న రోజులలో, మన పారిశ్రామికులు తమ పరిశ్రమలను వృద్ధిచేసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. రక్షణసుంకాలు విధించి దేశీయపరిశ్రమలను ప్రోత్సహిద్దామనే ఉద్దేశం

అప్పటి ప్రభుత్వానికి ఉండడం అసహజం. అందుచేతనే మన నాయకులు 16 పెన్నీల విలువ నిర్ణయించమని కోరారు. ఇందువల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటి ?

భారతదేశం బ్రిటనులో ఒక పౌనువిలువ గల వస్తువును కొనాలంటే 16 పెన్నీల మారకంరేటు ప్రకారం 15 రూపాయలు చెల్లించాలి. అలాగాక రూపాయికి 18 పెన్నీలైతే 13-5-4 మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. అంటే మనకు బ్రిటిష్‌వస్తువులు చవుకగా లభిస్తవి. అందుచేత ఎక్కువగా దిగుమతి చేసుకోవడం జరుగుతుంది. బ్రిటనకు మాత్రం మన వస్తువులు గిరాకీ అవుతవి. ఒక రూపాయివస్తువుకు 16 పెన్నీలు గాక 18 పెన్నీలు చెల్లించవలసి వచ్చేసరికి బ్రిటన్ భారతదేశంనుంచి ఎంతో అవసరమైన సరుకును తప్ప దిగుమతి చేసుకోదు. మన రూపాయి విలువ ఎక్కువగా ఉన్నకొద్దీ ఎగుమతులు ఎక్కువ కావడం జరుగుతుంది. ఇప్పుడు బ్రిటన్ పౌనువిలువనూ, భారతదేశం రూపాయివిలువనూ తగ్గించడానికి ప్రధానకారణం ఇదే.

అయితే ఈ సందర్భంలో ఒక్క సందేహం వస్తుంది. ఇదివరకు ఒక డాలరుకు 3.33 రూపాయిలు అని ఒకసారి నిర్ధారణ అయిందిగదా ! ఇప్పుడు డాలర్ల ప్రమాణంలో రూపాయివిలువ (ఇపుడు రూపాయి విలువ 21 సెంట్లు మాత్రమే) తగ్గడానికి కారణం ఏమిటి ?

మొదటి ప్రపంచయుద్ధంతరువాత మారకపు లావాదేవీలస్థితికీ, రెండవ ప్రపంచయుద్ధంతరువాత ఇప్పటున్న స్థితికీ వ్యత్యాసం ఏమీ లేదు. కాగా అప్పట్లో ప్రపంచరాజకీయవేత్తలకు సరియైన ద్రవ్యవిధానం నిర్ణయించుకోవడానికి ప్రపంచపరివ్యాప్తమైన ఆర్థికమాంద్యం అవసరమైంది. ఇప్పుడు ఆ ప్రమాద సూచనలే ఆ పని చేయగల్గినవి. 1919 వ సంవత్సరంలో వివిధదేశాల పరపతిని గురించి వ్రాసిన ఉద్గ్రంథంలో షికాగో విశ్వవిద్యాలయాచార్యుడు డాక్టర్ లారెన్స్‌లాప్లిన్ మారకపు ప్రమాణపరిణామానికి అయిదు కారణాలను పేర్కొన్నారు.

The Balance in the movement of goods and securities.

The flow of interest on force in investments, payment for freights, expenses of travellers.

Creation of credits abroad.

Gold shipments.

The depreciation of the currency in the country on whom the bill is drawn and in which the bill will be paid.

ఈ అయిదు కారణాల్లోనూ ప్రస్తుతస్థితికి మొదటిది, ఆఖరుది కారణం అని చెప్పవచ్చు. డాక్టర్ లారెన్స్ ప్రకటించినట్లు మారకంప్రమాణం విధిగా ద్రవ్యవిలువను అనుసరిస్తుంది. నోట్లవిలువ తగ్గిపోయినప్పుడు మారకంప్రమాణం, అదేకారణంగా వస్తువుల ధర పెరగడం తప్పనిసరి. ఈ పెరుగు తరుగులను గమనించి ప్రభుత్వాలు కొత్తమారకపు ప్రమాణాలను నిర్ణయించకపోతే వర్తకవ్యాపారాలు క్రమబద్ధంగా జరగవు. ప్రతిదీ ఒక పథకం, ఒక ప్రణాళిక ప్రకారం జరుగుతూఉన్న రోజుల్లో జాతికి ప్రధానమైన ఎగుమతి, దిగుమతి వ్యాపారాలు దారీ, తెన్నూ లేకుండా సాగడానికి వీల్లేదు.

బ్రిటన్ తన పౌనువిలువను తగ్గించడానికి పూర్వం అమెరికను 'స్టాక్' ఎక్స్ఛేంజిలో పౌను విలువ ఎలా దిగజారిపోయిందో గమనిస్తే బ్రిటిష్ ఖజానామంత్రినిర్ణయం సమయోచితమైందనీ, బ్రిటన్ ఎగుమతివ్యాపారాన్ని రక్షించుకొనడానికి తీసుకున్న అవసరచర్య అనీ ధ్రువపడుతుంది. ప్రభుత్వాలు ఏమారకంరేటు నిర్ణయించుకున్నా వ్యవహారంలో ఆ రేటును స్థిరపరచవలసింది ఈ "స్టాక్ ఎక్స్ఛేంజే". ఒక బ్రిటిష్‌వ్యాపారస్థుడు ఒక అమెరిక నువాణిజ్యకంపెనీకి సరుకు అమ్మితే ఆ సరుకుఖరీదును అమెరికను కంపెనీ డాలర్లలోనే చెల్లిస్తుంది. అయితే ఆ బ్రిటిష్‌వ్యాపారస్థుడు ఈ డాలర్లను బ్రిటన్‌లో వినియోగించుకోలేడు. తిరిగి అమెరికాలో ఏమైనా కొంటేనే ఇవి ఉపయోగపడతవి. అతనికి అలాంటి అవసరం ఉండక, మరొకరికి అమెరికానుండి సరుకు తెప్పించుకోవలసిన అవసరం ఉన్నప్పుడు, అతను పౌనులను చెల్లించి డాలర్లను పొందాల్సి ఉంటుంది. ఈ సదుపాయాన్ని లండన్ స్టాక్‌ఎక్స్ఛేంజి కలిగిస్తుంది. అదేవిధంగా అమెరికాలో ఉన్న వ్యాపారస్థులకు లండనులో సరుకు విక్రయించడంవల్ల లభించే స్టెర్లింగుకు అమెరికను స్టాక్ ఎక్స్ఛేంజి డాలర్లను సంపాదించిపెడుతుంది. స్టెర్లింగ్ కావలసిన అమెరికను వ్యాపారస్థులు తక్కువైనకొద్దీ, మార్చవలసిన స్టెర్లింగు మొత్తాలు ఎక్కువైనకొద్దీ స్టాక్ ఎక్స్ఛేంజివారు

వాటి విలువను తగ్గించి ముందుగా డాలర్లను చెల్లిస్తారు. తరువాత, వీలువెంట అవసరాన్ని బట్టి స్టాక్ ఎక్స్ఛేంజి వ్యాపారస్థులు ఈ స్టెర్లింగ్ సెక్యూరిటీలను వినియోగించుకుంటారు. ఈ లావాదేవీల్లో అమెరికాలో పౌను విలువ తగ్గడం, లండనులో డాలరువిలువ పెరగడం జరిగింది.

స్టాక్ ఎక్స్ఛేంజిలో ఏర్పడిన ఈ మార్పులను గమనించి ప్రభుత్వాలు తమ నాణెముల యథార్థమైన విలువను తిరిగి ఏర్పాటు చేయవలసివుంటుంది. లేకపోతే మారకపురేట్లు ఒక ప్రమాణానికి కట్టుబడి ఉండవు. సెప్టెంబరులో బ్రిటనుతోబాటు మరి 24 దేశాలు ఈపనే చేసినవి. మారకంరేటును పునర్నిర్ణయం చేయకపోతే వస్తువుల ధరలను తగ్గించవలసి ఉంటేది. ధరలను తగ్గించడం అంటే దేశంలో ప్రభుత్వ నాణెంవిలువను పెంచడం అవుతుంది. అట్టి విధానం ఉత్పత్తి తగ్గిపోవడానికీ, తద్వారా నిరుద్యోగుల సంఖ్య పెరిగిపోవడానికీ, ఆ కారణంగా ప్రజల కొనుగోలుశక్తి తగ్గి ఆర్థికమాంద్యం ఏర్పడడానికీ దారితీస్తుంది. జనాభా పెరుగుతూ ఉన్నప్పుడు, ప్రజల అవసరాలు నానాటికీ ఎక్కువ అవుతూవున్నప్పుడు, ప్రజల జీవనప్రమాణం వృద్ధికావలసిఉన్నప్పుడు డబ్బు గిరాకీచేయడం సరియైనపద్ధతి గాదు. చలామణిలోఉన్న ద్రవ్యాన్ని తగ్గింపక, ఉత్పత్తిని అధికం చేయడంద్వారానే ప్రజల జీవితప్రమాణాన్ని వృద్ధిచేయడం సాధ్యం. పౌనువిలువ తగ్గింపును వెల్లడిస్తూ బ్రిటిష్‌ఖజానామంత్రి సర్ స్టాఫర్డ్ క్రిప్స్ ఈ విషయాన్నే వివరించారు. "మనం ఇంకా ఎక్కువ డాలర్లనైనా సంపాదించాలి; లేదా మన ఖర్చులనైనా తగ్గించుకోవాలి. మన డాలరుసంపాదనను వృద్ధి చేసుకోవడానికి ఏమీ చేయక కేవలం మన ఖర్చులను తగ్గించుకోవడంద్వారా మన లోటును పూర్తిచేసుకోవడం అనే విధానం నిస్పృహ నిరాశజనితం. ఆ విధానాన్ని మనం అనుసరింపలేము. ఆ విధానాన్ని అవలంబించితే మనకు అత్యంతావసరమైన ఆహారపదార్థాలు, పరిశ్రమలకవసరమైన ముడిపదార్థాలు తగ్గి, తత్ఫలితంగా జీవనప్రమాణం విపరీతంగా తగ్గిపోతుంది."

కనుకనే నూరుఆరైనా ఆరునూరైనా తాను ఖజానాశాఖఅధ్యక్షుడుగా ఉన్నంతకాలం పౌనువిలువ తగ్గించడం అనేది లేదని,ఉండదని ప్రజ్ఞలు పలికిన సర్ స్టాఫర్డ్ క్రిప్సు, చివరికి చర్చిల్ అన్నట్లు "పిల్లి మొగ్గ" వేయవలసివచ్చింది. ప్రజల ఆర్థికజీవితం, దేశఎగుమతి దిగుమతి వ్యాపారాలు పరస్పరాశ్రితములు. కనుక పౌను మారకంవిలువ తగ్గటంవల్ల, ప్రజల ఆర్థికస్థితిలోనూ తప్పనిసరిగా మార్పువస్తుంది. ధరలు ఇంకా పెరిగిపోతవి. పౌనువిలువతగ్గి మూడువారాలు కావస్తున్నది. అప్పుడే బ్రిటన్‌లో గోధుమధర, తత్కారణంగా రొట్టెధర పెరిగింది. అయినా కార్మికుల వేతనాలను ఇంకా పెంచడం అనేది ఉండదని సర్ స్టాఫర్డ్ క్రిప్స్ స్పష్టంచేశాడు. ఈ పెరుగుదల, ధరలు అటూ, ఇటూ కావడం తాత్కాలికమేననీ, క్రమంగా ప్రపంచార్థికవ్యవస్థ కుదటబడి స్థిరపడి పోగలదనీ 1931 వ సంవత్సరములో బ్రిటన్ బంగారంప్రమాణాన్ని పరిత్యజించిన అనంతరం ప్రపంచ ఆర్థిక, వ్యాపారలావాదేవీలలో కలిగిన మార్పులను గుర్తించినవారు వాదిస్తున్నారు. 1931 సెప్టెంబరులో బ్రిటన్ సాహసించి బంగారంప్రమాణాన్ని పరిత్యజించినది కనుకనే ప్రపంచం ఆర్థికమాంద్యంనుండి తెప్పరిల్లుకోగలిగినదని వీరి అభిప్రాయం. అయితే ఒక ముఖ్యవిషయంలో మాత్రం అప్పటి పరిస్థితులకు,ఇప్పటి పరిస్థితులకూ తేడా ఉంది. అప్పుడు పడిపోయిన ధరలను పెంచి స్థిరపరచవలసి యుండెను. ఇప్పుడు పెరిగిపోతున్న ధరలను ఒక ప్రమాణానికి తగ్గించి ఆ ప్రమాణం నిలకడగా స్థిరంగా ఉండేటట్లు చేయవలసి ఉంది.

1931 వ సంవత్సరంలో కూడా మారకంరేట్లు మార్చడానికిముందు ధరలు స్థిరపరచడానికి ప్రయత్నాలు జరిగినవి. అయితే అప్పట్లో స్థిరపడవలసినది వస్తువుల ధరలా ? లేక విదేశనాణెముల మారకపు రేట్లా? అనే విషయంలో అభిప్రాయభేదాలు ఏర్పడినవి. అమెరికా ధరలే స్థిరపడాలన్నది. ఫ్రాన్సు ఏమైనా బంగారంప్రమాణాన్ని వదలడానికి వీల్లేదు అన్నది. కాని బ్రిటన్ రెంటినీ త్రోసిరాజన్నది. బ్రిటన్ అలాంటి విధానాన్ని అనుసరించడానికిగల కారణాలను 1933 జులై 27 వ తేదీన, ప్రపంచార్థిక సభలో పాల్గొన్న బ్రిటిష్‌సామ్రాజ్య ప్రతినిధివర్గం ఈవిధంగా పేర్కొన్నది: "మారకపురేట్ల స్థిరీకరణ ధరల స్థిరీకరణపైననే ఆధారపడియుండును. ధరల స్థిరీకరణవిషయములో ఏకవిధానమును అనుసరించే దేశాలతోనే మారకపురేట్ల స్థిరీకరణ సాధ్యం" ఆర్థికమాంద్యం ఏర్పడేసరికి ఏ దేశానికి ఆ దేశం స్వతంత్రంగా వ్యవహరించడంవల్ల ధరల స్థిరీకరణకాని, మారకపురేట్ల స్థిరీకరణగాని సాధ్యం గాలేదు.

ఇప్పుడు అలాంటి ప్రమాదం లేదు. ప్రతిదేశమూ

తనఅభివృద్ధి ఇతరదేశాల సహాయసహకారములపై ఆధారపడిఉన్నదని గ్రహించింది. కనుకనే బ్రిటన్ తన పౌనువిలువను తగ్గించేసరికి మరి 24 దేశాలు ఉత్తరక్షణంలో తదనుగుణంగా తమనాణెముల విలువను తగ్గించుకున్నవి. అలా తగ్గించుకున్న దేశాలలో భారతదేశం ఒకటి. పాకిస్తాన్ మాత్రం భిన్నమార్గాన్ని అనుసరించి తన రూపాయివిలువను యథాప్రకారంగానే నిలుపుకున్నది. చాలామంది పాకిస్తాన్ మంచి పనిచేసిందనీ, భారతదేశం తొందరపడిందనీ అన్నారు. పాకిస్తాన్ శ్రేయస్సునుమాత్రమే పాటించి ఇలాచేయడమైందనీ, ఏ ఒక్కదేశాన్ని సాధించడానికీ తాము ఇలా చేయలేదనీ పాకిస్తాన్ రిజర్వు బ్యాంకు గవర్నరు ప్రకటించినా, భారతదేశంతో ఉన్నలావాదేవీలతో ఎక్కువ ప్రయోజనాన్ని పొందాలనే కరాచీఅధికారులు ఇలా చేశారనడం నిర్వివాదం. అయితే ఆప్రయోజనం తాత్కాలికం. పాకిస్తాన్ ఏమాత్రమూ దూరదృష్టితో వ్యవహరించలేదనడానికి తూర్పుపాకిస్తాన్‌లో జనపనార మార్కెట్‌లో ఏర్పడిన ప్రతిష్టంభనే నిదర్శనం. దిగుమతిసుంకాలను తగ్గించినంతమాత్రానా, ఎగుమతిసుంకాలను రద్దుచేసినంతమాత్రానా ప్రయోజనం ఉండదు. ఆవిషయం క్రమంగా స్పష్టమౌతూనే ఉంది.

ఇంక భారతదేశం తొందరపడిందా అంటే ప్రస్తుతపరిస్థితుల్లో మన ప్రభుత్వానికి మార్గాంతరం లేదు. భారతదేశం పూర్వంలాగే డాలరుకు 3 3 రూపాయి లని భీష్మించుకు కూర్చుంటే ఆప్రకారం స్టెర్లింగ్ ప్రాంతదేశాలన్నింటి నాణెములతో మారకపు రేటు ఆవిధంగానే మార్చుకోవాల్సి ఉంటుంది. (స్టెర్లింగ్ ప్రాంతదేశాల నాణెముల పరస్పర మారకపు రేట్లలో మాత్రం ఏమీ మార్పు లేదన్నది గమనించాలి) భారతదేశంఎగుమతివ్యాపారం ఎక్కువగా బ్రిటన్‌తోనే గనుక, రూపాయిమారకం విలువ పెరిగినప్పుడు బ్రిటన్ పూర్వంవలెనే దిగుమతులను చేసుకోగలదని భావించడానికి వీల్లేదు. పైగా స్టెర్లింగ్ ప్రాంతపు డాలరుకొరతను తీర్చుటకు వాషింగ్‌టను ఒడంబడిక స్టెర్లింగ్ ప్రాంతదేశాలు పరస్పరవ్యాపారాన్ని వృద్ధిచేసుకోవాలని నిర్దేశించింది. స్టెర్లింగ్ దేశాలన్నీ తమ నాణెముల విలువను మార్చుకొన్నప్పుడు భారతదేశం తన రూపాయివిలువను తగ్గించకుండా ఉంటే స్టెర్లింగ్ ప్రాంతంనుండి ఉపసంహరించుకున్నట్లే అవుతుంది. ప్రభుత్వనాణెము విలువతగ్గింపువలన ఎగుమతి వ్యాపారాభివృద్ధికి ఏవిధంగా దోహదం అవుతుందో గమనించాం కనుక రూపాయి విలువతగ్గింపువల్ల దేశం మొత్తానికి ఎక్కువ ప్రయోజనమే ఉంటుందని అంగీకరించాలి.

పోతే రూపాయివిలువ తగ్గింపువల్ల కొంతనష్టం, కొన్ని ప్రమాదాలు కూడా ఉన్నవి. రూపాయిడాలరు విలువలో నూటికి 30.5 తగ్గిందిగనుక మన ఎగుమతులు ఆప్రమాణంలో పెరిగితేగాని, ఇప్పుడు లభిస్తున్న డాలర్లు అయినా లభించవు. అమెరికా హామీ ఇచ్చినందువల్ల, మనం దిగుమతిచేసుకొనే డాలరువస్తువుల ధరలు కొంత తగ్గడానికీ, సుంకములవిధానాన్ని దిగుమతి వ్యాపారానికి అనుకూలంగా సవరింప అంగీకరించినందువల్ల స్టెర్లింగ్ దేశాలు ఎగుమతిచేసే సరుకును అమెరికన్లు ఎక్కువగా కొనడానికీ అవకాశం ఉంది. దేశంలో వస్తువుల ధరలుమాత్రం నిలకడగా ఉండేటట్లు ప్రభుత్వంచేయకపోతే రూపాయివిలువ తగ్గింపువల్ల కలిగే ప్రయోజనాలకంటే ఇబ్బందులే అధికమౌతవి.

మారకంరేట్లు క్రొత్తప్రమాణాన్ని పొంది స్థిరపడిపోయినవి గనుక, వస్తువులధరలూ ఒక ప్రమాణాన్ని చేరి నిలబడిపోగలవు. ఆవిధంగా . రూపాయి మారకం విలువమార్పు ప్రజలకు మేలు చేయవచ్చు.



విమర్శనము

కాలచక్రము

రచయిత: కవిశేఖర భోగరాజు నారాయణ మూర్తిగారు. ప్రకాశకులు: వాణీగ్రంథమండలి, రాజమహేంద్రవరము. వెల రూ. ౨-౮-౦.

కాలప్రభావమువల్ల ఓడలు బండ్లగుచున్నవి; బండ్లు ఓడ లగుచున్నవి. నిన్న దరిద్రులుగా నున్న వారు నేడు దైవవశమున అతిసంపన్నులగుటయు, లక్షాధికారులు కన్నుమిన్నుగానక దుర్వ్యయము చేయుటవల్ల భిక్షాధికారులగుటయు తటస్థించుచున్నది. కాలప్రభావముచేతనే మన సంఘములో గూడ అనేక పరివర్తనలు జరుగుచున్నవి. శాఖాంతరవివాహములు జరుగుచున్నవి. వితంతూద్వాహములు పరిపాటి రైనవి. అచ్చటచ్చట వర్ణాంతరవివాహములు, జాత్యంతరవివాహములుగూడ జరుగుచున్నవి.

కాలమహిమవల్ల మన సంఘములో జరుగుచున్న వివిధమార్పులు ఈగ్రంథములో చిత్రింపబడియున్నవి. గ్రంథకర్త వితంతూద్వాహములను, బ్రాహ్మణులలో శాఖాంతరవివాహములను అభిమానించుచున్నారు. వర్ణాంతరవివాహములను, భర్తయుండగా భార్య మరియొక వివాహము చేసికొనుటను గర్హించుచున్నారు. గ్రంథకర్తఖద్దరుఅభిమానము, దేశభక్తి సర్వత్ర గోచరించుచున్నది. ఖద్దరునే వీరు భార్యాభర్తలకు సంధానసాధనము గావించియున్నారు. మానవుల చిత్తవృత్తులను మార్చు మహిమ ఖద్దరులో నుండనోపు. వీరి యభిప్రాయములు నాతితీవ్రమైన వగుటచేత అందరికి సమ్మతముగానే యుండవచ్చును. ఈకాలములో బ్రాహ్మణులలో శాఖాంతరవివాహములు వాంఛనీయములుమాత్రమేగాక ఆవశ్యకములనిగూడ తోచుచున్నది. బాలవితంతూద్వాహముల విషయమై అభిప్రాయభేదమే లేదు.

గ్రంథకర్త కథను గ్రాంథికభాషలోను, సంభాషణలను విశాఖపట్నం 'యాస'లోను నడిపియున్నారు. నవలలోని పాత్రలన్నియు సజీవమైనవిగాను, వ్యక్తిత్వముకలవిగాను ఉన్నవి. ఈ నవల 'విమలాదేవి'యంత రమ్యముగా లేనప్పటికి అత్యంతపాఠయోగ్యముగా నున్నది.

శాస్త్రి.

అహల్యాగౌతమము

చిన్న పద్యకావ్యము. రచయిత: ఆలూరు వెంకటేశ్వర్లుగారు, రామారావుపేట, కాకినాడ. వెల ౨ రూ.

ఆంధ్రసారస్వతప్రపంచంలో మార్పులురావాలి. నిత్యనూతనంగా రచనలు బయలుదేరాలి. ఉత్తరోత్తరం రసవత్తరంగా ఉండాలి. కాని, ప్రాచీనపంథాలో ఉన్న ఆకంఠత విస్మరించడంమాత్రం భావ్యం కాదు. ఈ విచారాన్ని తీర్చడానికి ఈ అహల్యాగౌతమం ఒక నిదర్శనమై వెలుస్తున్నది. కథనకళాపాటవం ఈకవిలో కనిపిస్తున్నది. ప్రాచీనధర్మాలు, సదాచారాలు అడుగడుగునా వెల్లివిరియకనే వీరి యీకృతి ఒక విధంగా అసాధారణమైనదిగానే భాసిస్తున్నది.

ప్రాచీనులు గోసేవ అమూల్యమన్నారు. ఈ తత్త్వ మీకావ్యంలో ప్రస్ఫుటంగా గోచరమవుతుంది. అహల్యాగౌతముల సంసారజీవితాన్ని వర్ణించే ఘట్టం హృదయానికి ప్రశాంతి కలుగజేస్తుంది. మొత్తం మీద ఎన్నో ఆశ్రమధర్మాలు ప్రబోధించే ఆదరణీయ గ్రంథంగా దీన్ని పరిగణింపవచ్చు.

నీతిధర్మప్రవృత్తులనూ, కవితా కమనీయతనూ సమ్మిళితంచేసి వెంకటేశ్వర్లుగారు ఈగ్రంథాన్ని ఆదరణపాత్రం గావించారు.

మూర్తి.

మదవిదళనము

రచయిత : విద్వాన్ టి. ఆరుముగంపిళ్లెగారు, ప్రధాన తెలుగుపండితులు, ముత్యాలపేట హైస్కూలు, మద్రాసు.

క్షేమేంద్రుని 'దర్పదళనము' నీతిప్రబోధకమైన ఒక సుప్రసిద్ధగ్రంథము. మానవప్రవృత్తిలోని అనేక విధములైన దర్పములను, లేదా మదములను నిజస్వరూప ప్రదర్శనముతో చూపెట్టి, అందలి చెడుగులను, వానిని పోగొట్టుకోవలసిన ఆవశ్యకతను, అందుకుతగినఉపాయములను విశదముగా నిరూపించుచున్నది. సంస్కృతములో మంచి గంభీరవచనమునందున్న ఆ కృతికి ఈ మదవిదళనము మూలానుసారియైన చక్కని తెలుగుసేత. గ్రంథకర్త ఉభయభాషాపాండిత్యమునకు ఇది మంచి నిదర్శనమై యున్నది. విషయగౌరవముచేతనే కాక సరళ గంభీరమైన ఉత్తమ వచనశైలిని చేర్పజాలియుండుట చేత గూడ విద్యార్థులకును, తత్ప్రియులైన ఇతరులకును ఇది అవశ్యపఠనీయమై యున్నది.

నవభారతం (౧౯౪౭-౪౮)

రచయిత : సీతంరాజు సుబ్రహ్మణ్యశర్మగారు. ప్రకాశకులు : సుదర్శన పబ్లిషర్సు, ౧౦/3 తంబు చెట్టివీథి, మద్రాసు. వెల రూపాయిన్నర.

నవభారతదేశంలో ౧౯౪౭-౪౮ లో జరిగిన యావత్తు రాజకీయ సంఘటనల సింహావలోకన మీ పుస్తకం. నేటి దేశరాజకీయాల పోకళ్లను పూర్ణంగా తెలియగోరువారికి ఇది చాలా ఉపయోగపడుతుంది. ఒక్క సింహావలోకనమే కాదు, అందలి మంచిచెడ్డల సమీక్షకూడ ఇందులో మిళితమయ్యే వుంది. పుస్తక ముఖ చిత్రంకూడా భావస్ఫోరకమై యున్నది.

గ్రంథస్వీకారము

గౌతమబుద్ధ

అయిదంకముల నాటకము. రచయిత : కొండముది గోపాలరాయశర్మగారు. ప్రాప్తిస్థానము : సాహిత్యమండలి, ఏలూరు. వెల ౧ రూ.

శ్రీమద్రామాయణము

పద్యకావ్యము. బాలకాండలో శ్రీరామజనన ఘట్టము. కవి : కోపల్లె శివకామేశ్వరరావుగారు, పి. ఆర్. కాలేజి, కాకినాడ. వెల ౨ రూ.

భక్తమందారము

శ్రీరామచంద్రునిగూర్చిన శతకము, రచయిత : నారాయణం వెంకటాచార్యులుగారు, రాయకుదురు. వెల ౪ అణాలు.

శిథిలాలయం-బూట్సు

రెండు నాటకాల సంపుటం. రచయిత : ముప్పనచిన అంకయ్యగారు. ప్రకాశకులు : కళాకేళీప్రచురణాలయం, సామర్లకోట. వెల ౧ రూపాయి.

Printed and Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, No. 7, Thambu Chetty St., G. T., Madras. Editor— S. Sambhu Prasad.